www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 21
సంచిక (Issue) : 299

శనివారం | 27-1-2024

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: విదియ తె. 3.38 తదుపరి తదియ; నక్షత్రం: ఆశ్లేష మ. 1.02 తదుపరి మఖ; వర్జ్యం: రా.2.28-4.15; దుర్ముహూర్తం: ఉ.6.53-8.22; అమృతఘడియలు: ఉ.11.15-1.02; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 6.04

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో అలరించిన తెలంగాణ శకటం



అహంకారం.. నియంతృత్వం చెల్లవ్

అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ సమాజం ఇచ్చిన తీర్పు ఇదే

పేదల కన్నీళ్లు తుడిచే నాథుడే లేని పాలన గతంలో చూశాం

పాలకుల్ని నియంత్రించే శక్తిని ప్రజలకు రాజ్యాంగం ఇచ్చింది

కొత్త ప్రభుత్వంలో అంబేడ్కర్ స్ఫూర్తితో అన్నివర్గాలకూ మేలు

స్వేచ్ఛ, సమాన అవకాశాలు దక్కాలనే లక్ష్యంతో పనిచేస్తోంది

75వ గణతంత్ర దినోత్సవాల్లో గవర్నర్ డాక్టర్ తమిళిసై

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఏ ప్రభుత్వమైనా రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పాలన సాగించినప్పుడే ప్రజాస్వామ్య, సంక్షేమ, అభివృద్ధి ఫలాలు ప్రతి పేదవాడికీ అందుతాయని గవర్నర్ డాక్టర్ తమిళిసై అన్నారు. అలా కాకుండా.. గడిచిన పదేళ్లలో పాలకులు నియంతృత్వ ధోరణితో వ్యవహరించడాన్ని సహించని తెలంగాణ సమాజం అసెంబ్లీ ఎన్నికల్లో తమ తీర్పు ద్వారా ఆ ధోరణికి చరమగీతం పాడి ప్రజాప్రభుత్వాన్ని

మిగతా 13వ పేజీలో...

ఎట్ హోమ్‌లో నవ్వులే నవ్వులు

హాజరైన సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు

వేడుకకు దూరంగా బీఆర్ఎస్, బీజేపీ



ఎట్ హోంలో గవర్నర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

గణతంత్ర వేడుకల్లో నారీశక్తి

దేశ చరిత్రలో తొలిసారి త్రివిధ దళాలకు చెందిన పూర్తిస్థాయి మహిళా కంటింజెంట్ మార్చ్‌పాస్ట్

రాకెట్ వ్యవస్థల ప్రదర్శన.. బైక్ విన్యాసాలతో సత్తా

మహిళా శక్తిని చాటేలా.. వివిధ రాష్ట్రాల శకటాలు

'వందేభారతం-నారీశక్తి' పేరిట నృత్య ప్రదర్శనలతో సంస్కృతిని చాటిన 1500 మంది డాన్సర్లు

ముఖ్య అతిథిగా హాజరైన ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్


నలభై ఏళ్ల తర్వాత వేడుకల్లో మళ్లీ గుర్రపు బగ్గీ

మేక్రాన్‌తో కలిసి కర్తవ్యపథ్‌కు రాష్ట్రపతి ముర్ము

2

ఆకట్టుకున్న తెలంగాణ శకటం

గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో మూడేళ్ల తర్వాత తెలంగాణ శకటానికి చోటు దక్కింది. జయజయ హే తెలంగాణ పేరిట రూపొందించిన ఈ శకటాన్ని కొమరం భీమ్, రాంజీ గోండు, చాకలి ఐలమ్మ తదితర పోరాటయోధుల స్ఫూర్తి తెలియజేసేలా తీర్చిదిద్దారు. అయోధ్య రామమందిరం ప్రాణప్రతిష్ఠను తెలియజెప్పేలా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం శకటాన్ని ప్రదర్శించడం విశేషం.



కాళేశ్వరంపై చెరో దారి

ప్రాజెక్టుపై సమగ్ర విచారణకు సీఎం ఆదేశం.. మేడిగడ్డకే పరిమితం కావాలంటున్న మంత్రి


లోతైన విచారణతోనే అన్ని ఆరోపణలపై వాస్తవాలు వెల్లడవుతాయని భావిస్తున్న ముఖ్యమంత్రి

20 రోజుల్లోనే నివేదిక ఇవ్వాలంటున్న మంత్రి!.. ఎటూ తేల్చుకోలేని విచారణాధికారులు

చివరకు ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశాల అమలుకే నిర్ణయం!

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యత లోపాలు, అతిక్రమణలు, ఉల్లంఘనలు, అవినీతి ఆరోపణలపై విచారణ విషయంలో ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రి ఏకాభిప్రాయంతో లేరా? దీనిపై సమగ్రంగా, లోతుగా విచారణ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తుంటే.. మంత్రి మాత్రం కుంగిపోయిన మేడిగడ్డ బ్యారేజీ వరకే విచారణను పరిమితం చేయాలని అంటున్నారా? అంటే అవుననే తెలుస్తోంది. ఏకంగా విచారణ అధికారులకు కూడా సీఎం, మంత్రి ఎవరి ఆలోచనకు తగ్గట్లుగా వారు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో మేడిగడ్డ బ్యారేజీ ఒక భాగం మాత్రమేనన్నది తెలిసిందే. దీంతో ఈ బ్యారేజీ కుంగుబాటుకు సంబంధించి మాత్రమే విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి రావనేది సీఎం భావనగా తెలుస్తోంది. మొత్తం ప్రాజెక్టుపై లోతుగా విచారణ జరిగితేనే వ్యవహారాలన్నీ బయటకు వస్తాయని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన లోపాలన్నింటినీ బహిర్గతం చేసే వీలు కలుగుతుందని ముఖ్యమంత్రి భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. అయితే కుంగిపోయిన మేడిగడ్డ బ్యారేజీ వరకే విచారణను పరిమితం చేయాలని మంత్రి నిర్దేశించినట్లు సమాచారం. దీంతో విచారణ చేస్తున్న విజిలెన్స్ అధికారుల పరిస్థితి ఎటూ పాలుపోకుండా తయారైందని అంటున్నారు. చివరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలను పాటించాలనే నిర్ణయానికే విజిలెన్స్ అధికారులు వచ్చినట్లు తెలుస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకాన్ని.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత కాళేశ్వరం ప్రాజెక్టుగా మార్చిన విషయం విదితమే. 180 టీఎంసీల నీటిని తరలించి, 16.40 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే లక్ష్యంతో ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకాన్ని రూ.38,500 కోట్లతో

మిగతా 12వ పేజీలో...



కనకపు సింహాసనమున శునకము



తెలంగాణ భవన్‌లో గణతంత్ర వేడుకల్లో కేటీఆర్

మంచి పదవిలోకి వచ్చినా నీచ మానవుల బుద్ధి మారదు

అధికారం చేపట్టి 45 రోజులైనా మమ్మల్నే తిట్టిపోస్తున్నారు

అలాంటివారి గురించి మాట్లాడి నోరు పాడు చేసుకోను

45 రోజులైనా గత ప్రభుత్వాన్ని ఆడిపోసుకోవడమేనా?

కాంగ్రెస్ పార్టీని బీజేపీ జాకీ పెట్టి లేపుతోంది

గవర్నర్‌కు కోదండరాం రాజకీయ నేపథ్యం కనిపించలేదా?

రేవంత్‌రెడ్డికి కాదు.. రాష్ట్ర ప్రజలకు బాధ్యులుగా ఉండండి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు

హైదరాబాద్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): "కనకపు సింహాసనమున శునకము గూర్చుండబెట్టి.. శుభలగ్నమునందొనరగ బట్టము గట్టిన.. వెనుకటి గుణమేల మాను? వినరా సుమతీ..!" అని సుమతీ శతకాన్ని ప్రస్తావిస్తూ పరోక్షంగా సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. సుమతీ శతకానికి అర్థం చెబుతూ.. "మంచి ముహూర్తం చూసి శునకాన్ని తీసుకొచ్చి మంచి పదవిలో కూర్చోబెట్టినా నీచ మానవులు వారి వెనుకటి గుణాన్ని వదలరు" అని వ్యాఖ్యానించారు. ఇలాంటివారి గురించి మాట్లాడి తన నోరు పాడు

మిగతా 12వ పేజీలో...

12



త్వరలో ప్రజల్లోకి

క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ బలంగా ఉంది

లోక్‌సభ ఎన్నికల్లో గట్టిగా పోరాడాలి

ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకిస్తే నష్టమే

దీన్ని ఉభయ సభల్లో ఖండించండి

ఎంపీలతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

మిమ్మల్ని చవటలు, వెధవలు అనగలం



డిక్షనరీలు వెతికి మరీ తిట్టగలం

మీవి విలువలు లేని రాజకీయాలు

బీజేపీ, బీఆర్ఎస్‌ది ఫెవికాల్ బంధం

కోదండరాంను మేం గౌరవించాం

కేటీఆర్, హరీశ్‌రావుపై జగ్గారెడ్డి ఫైర్



మేళ్లచెర్వు సర్పంచ్ నుంచి 1.99 కోట్లు

రికవరీ చేయండి

సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఆదేశం

14

సర్పంచ్ అవినీతిపై వార్డు సభ్యుల ఫిర్యాదు

అక్రమాలు జరిగినట్లు డీఎల్‌పీవో నిర్ధారణ

అధికారుల సూచన మేరకే ఖర్చు: సర్పంచ్



మోదీ భేష్

2

జాతి వ్యతిరేక నిర్ణయాలు తీసుకొనేలా

ఆయనను ఎవరూ ఒత్తిడి చేయలేరు

భారత్‌ది స్వతంత్ర విదేశాంగ విధానం

ఆ దేశంపై మనం ఆధారపడొచ్చు

మేక్ ఇన్ ఇండియా గొప్ప నినాదం

రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రశంసల వర్షం

అంతులేని అక్రమబద్ధీకరణ!

పెద్దఎత్తున జీవో 59 ఉల్లంఘనలు.. రూ.వేల కోట్ల భూముల ఆక్రమణలు

ఎన్నికల సమయంలోనే రెగ్యులరైజేషన్

ఉమ్మడి రంగారెడ్డిలో అనేక ప్రాంతాల్లో భారీగా ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ

అబ్దుల్లాపూర్‌మెట్‌లో లక్ష గజాల భూమి క్రమబద్ధీకరణకు తహసీల్దార్ సంతకం

జిల్లా కలెక్టర్ జోక్యంతో నిలిచిన ప్రక్రియ

అక్రమాలను తవ్వితీస్తున్న కొత్త ప్రభుత్వం

బాధ్యులపై చర్యలకూ రంగం సిద్ధం!

సామాన్యులు ప్రభుత్వ భూమిలో ఇల్లు కట్టుకుంటే దానిని క్రమబద్ధీకరించేందుకు వీలుగా గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 59.. బడాబాబుల భూ దందాకు వరంగా మారింది. ఈ జీవోను అడ్డుపెట్టుకొని రూ.వేల కోట్ల విలువ చేసే భూములను కొందరు వారి పేరుమీదికి మార్చుకున్నారు. అదికూడా.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో.. అందరూ హడావిడిలో ఉండగా.. కోడ్ అమల్లో ఉండగా అక్రమాలకు పాల్పడ్డారు. ఎన్నికల సమయంలో బదిలీ అయిన తహసీల్దార్లతో.. ట్రాన్స్‌ఫర్‌కు ముందే వాటిని ఆమోదింపజేసుకున్నారు. అప్పటి ప్రభుత్వంలోని పెద్దలు, అధికారులు కలిసి నగర శివార్లలో ఇలా పెద్ద ఎత్తున భూములు కొల్లగొట్టినట్లు తాజాగా వెలుగులోకి వస్తోంది. జీవోలోని నిబంధనల్ని కూడా లెక్కచేయకుండా జరిపిన ఈ భూ దందాలను కొత్త ప్రభుత్వం ఒక్కొక్కటిగా వెలికితీస్తోంది. బాధ్యులపై చర్యలకూ రంగం సిద్ధం చేస్తోంది.



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

గండిపేట మండలం నానక్‌రాంగూడ, గోపన్‌పల్లిలోని రూ.వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను ఎలాంటి నిబంధనలు పాటించకుండా క్రమబద్ధీకరించిన వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' ఇటీవలే బట్టబయలు చేసిన సంగతి తెలిసిందే. దీంతో ప్రభుత్వం ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. ఇదిలా ఉండగా.. ఎన్నికల సమయంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని అనేక ప్రాంతాల్లో రూ.వేల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను అడ్డగోలుగా క్రమబద్ధీకరించారు. ఎన్నికల కోడ్‌కు ముందు మొదలైన ఈ అక్రమాల పర్వం ఎన్నికలు ముగిసేవరకు కొనసాగింది. కొన్ని మండలాల్లో ఎన్నికల కోడ్ అమలుకు ముందు దీర్ఘకాలికంగా పనిచేస్తున్న తహసీల్దార్లను బదిలీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఆ సమయంలో బదిలీ కానున్న

మిగతా 14వ పేజీలో...



'జ్ఞానవాపి'లో శివలింగం, వినాయకుడు

ఏఎస్ఐ సర్వేలో బయటపడ్డాయ్

ఇంగ్లిష్ మీడియాలో ఫొటోలు

జ్ఞానవాపిని హిందువులకివ్వండి

కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్, హిందూ మహాసభ డిమాండ్

ఆలయాన్ని కూల్చి మసీదు కట్టారు

అక్కడ దేవతల విగ్రహాలు, తెలుగులో శాసనాలు ఉన్నాయి

ఏఎస్ఐ పేర్కొంది: న్యాయవాది జైన్

నివేదికపై మసీదు కమిటీ సందేహాలు

2

బీజేపీతో నితీశ్ జట్టు?

కాషాయ పార్టీతో కలిసి రేపు కొత్త ప్రభుత్వం?

బిహార్‌లో జోరందుకున్న ఊహాగానాలు

2

రాజ్‌భవన్ కార్యక్రమానికి తేజస్వీ గైర్హాజరు

వదంతులపై స్పష్టతనివ్వాలని ఆర్జేడీ విజ్ఞప్తి

ఇండియాలోనే కొనసాగుతున్నాం: జేడీయూ

సొంతంగా సర్కారు ఏర్పాటుపై లాలూ కసరత్తు!

స్పీకర్ తమ పార్టీ నేతే కావటంతో ధీమా





ఆకట్టుకున్న ఇస్రో శకటం

» చంద్రయాన్, ఆదిత్య ఎల్-1 ప్రాముఖ్యత తెలిసేలా తయారీ

న్యూఢిల్లీ, జనవరి 26: గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో తెలుగు రాష్ట్రాలకు చెందిన శకటాలు ఆకట్టుకున్నాయి. మూడేళ్ల తర్వాత తొలిసారి రిపబ్లిక్ డే పరేడ్‌లో తెలంగాణ శకటానికి చోటు దక్కింది. జయజయ హే తెలంగాణ పేరిట రూపొందించిన ఈ శకటాన్ని కొమరం భీమ్, రాంజీ గోండు, చాకలి ఐలమ్మ తదితర పోరాటయోధుల స్ఫూర్తి ప్రపంచానికి తెలియజేసేలా తీర్చిదిద్దారు. ఇక, విద్యా వ్యవస్థలో తమ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలను వివరించేలా రూపొందించిన శకటాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రదర్శించింది. అయోధ్య రామమందిరంలో జరిగిన బాలరాముడి ప్రాణప్రతిష్ఠను తెలియజెప్పేలా రూపొందించిన శకటాన్ని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రదర్శించింది. ఇక, చంద్రయాన్-3, ఆదిత్య ఎల్-1 అంతరిక్ష నౌకల నమూనాలతో ఆయా ప్రయోగాల ప్రాముఖ్యత వివరించేలా ఇస్రో ప్రదర్శించిన శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఫ్రాన్స్ సైనిక విన్యాసాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఫ్రెంచ్ వాయుసేనకు చెందిన రెండు రఫేల్ ఫైటర్ జెట్లు, ఫీనెక్స్ అనే మరో ఎయిర్ క్రాఫ్ట్ ఢిల్లీ గగనతలంలో దూసుకెళ్లాయి. ఫ్రెంచ్ సైన్యం భారత గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం ఇది రెండో సారి. రిపబ్లిక్ డే పరేడ్ ముగిసిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ కర్తవ్యపథ్‌లో కాలినడకన తిరిగారు. గ్యాలరీల వద్దకు వెళ్లి చెయ్యి ఊపుతూ సందర్శకులకు అభివాదం చేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకల పరేడ్‌ను 13వేల మంది ప్రత్యేక అతిథులు ప్రత్యక్షంగా వీక్షించారు. కర్తవ్యపథ్‌లో 'అనంత్ సూత్ర' పేరిట ఏర్పాటు చేసిన 1,900 చీరల ప్రదర్శన ఆకట్టుకుంది.

మోదీ నాయకత్వం భేష్



న్యూఢిల్లీ, జనవరి 26 : ప్రధాన మోదీపై రష్యా అధ్యక్షుడు పుతిన్ మరోసారి ప్రశంసల వర్షం కురిపించారు. భారత్ అనుసరిస్తున్న స్వతంత్ర విదేశాంగ విధానం నేటి ప్రపంచంలో కష్ట సాధ్యమైనది అన్నారు. భారత్ సాధిస్తున్న ఆర్థికాభివృద్ధి, ప్రగతి ప్రధాని మోదీ నాయకత్వం వల్లనే సాధ్యమయ్యాయని ప్రశంసించారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఆర్థికాభివృద్ధి, ప్రగతి సాధిస్తున్న దేశం భారత్ అని పేర్కొన్నారు. కేవలం ప్రధాని మోదీ నాయకత్వం వల్లనే ఈ దశకు చేరగలిగిందని చెప్పారు. కాలినిన్‌గ్రాడ్ ప్రాంతంలోని ఓ యూనివర్సిటీ విద్యార్థులతో మాట్లాడుతూ ఈమేరకు వివరించారు. మాస్కో... న్యూఢిల్లీ, భారత నాయకత్వంపై ఆధారపడవచ్చని స్పష్టం చేశారు. ఎందుకంటే భారత్ అంతర్జాతీయంగా రష్యాకు వ్యతిరేకంగా వ్యవహరించదన్నారు. 150 కోట్ల జనాభా గల భారత్‌కు స్వతంత్ర విదేశాంగ విధానం హక్కని వ్యాఖ్యానించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోనే ఈ హక్కును గుర్తించారని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో అభివృద్ధిలో భారత్ ఎంతో ముందంజ వేసిందని, భారత్ "మేక్ ఇన్ ఇండియా" కార్యక్రమాన్ని ప్రపంచ దేశాలతో పాటు రష్యా కూడా గుర్తించిందని చెప్పారు. భారత్‌లో అతిపెద్ద విదేశీ పెట్టుబడి రష్యా నుంచే ఉన్నట్లు వివరిస్తూ... రష్యాకు చెందిన రోజ్‌నెఫ్ట్ కంపెనీ ఒక ఆయిల్ రిఫైనరీ, గ్యాస్ స్టేషన్లు, ఓడరేవు తదితర వాటిలో 23 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టిందని వెల్లడించారు. రష్యాలో భారత సినిమాలకున్న ఆదరణను ప్రస్తావిస్తూ.. భారతీయ సినిమాలను జాతీయ టీవీ ఛానల్‌లో ప్రసారం చేసే అతి కొద్ది దేశాల్లో రష్యా ఒకటని పుతిన్ అన్నారు.

గణతంత్ర వేడుకల్లో

నారీ శక్తి



దేశ చరిత్రలో తొలిసారి త్రివిధ దళాలకు చెందిన పూర్తిస్థాయి మహిళా కంటింజెంట్ మార్చ్ పాస్ట్

బైక్‌లపై విన్యాసాలతో సత్తా.. మహిళా శక్తి చాటేలా శకటాలు

వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్

40 ఏళ్ల తర్వాత వేడుకల్లో మళ్లీ గుర్రపు బగ్గీ





న్యూఢిల్లీ, జనవరి 26: దేశ రాజధాని ఢిల్లీలో ఘనంగా జరిగిన 75వ గణతంత్ర దినోత్సవాల్లో నారీ శక్తి సత్తా చాటింది. 'ఆకాశంలోనే కాదు.. సైన్యంలోనూ సగం' అన్న చందంగా ఇటీవలికాలంలో సైన్యంలో పెరుగుతున్న మహిళా శక్తిని చాటేలా.. త్రివిధ దళాలకు చెందిన మహిళా కంటింజెంట్ చరిత్రలో తొలిసారి ఈ వేడుకల్లో మార్చ్ పాస్ట్ చేసింది. ఆర్మీ మిలటరీ పోలీస్‌కు చెందిన కెప్టెన్ సంధ్య మహ్లా నేతృత్వంలో.. సబ్ లెఫ్టినెంట్ అను యాదవ్ (నౌకా దళం), ఫ్లైట్ లెఫ్టినెంట్ సృష్టి వర్మ (వైమానిక దళం), కెప్టెన్ శరణ్యరావ్, త్రివిధ దళాలకూ చెందిన అగ్నివీర్‌లతో కూడిన పూర్తిస్థాయి మహిళా సేన ఈ పరేడ్ నిర్వహించగా.. త్రివిధ దళాలకు సుప్రీం కమాండర్‌గా తొలి మహిళా రాష్ట్రపతి అయిన ద్రౌపది ముర్ము వారి గౌరవ వందనాన్ని స్వీకరించడం అసలు హైలైట్. ఈ వేడుకల్లో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారతదేశం నిర్వహించే గణతంత్ర దినోత్సవానికి ఫ్రాన్స్ దేశ అధ్యక్షుడు పాల్గొనడం ఇది ఆరోసారి. మరే దేశాధినేతా ఇన్నిసార్లు గణతంత్ర దినోత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరు కాలేదు. 'వికసిత్ భారత్', 'భారత్ లోక్‌తంత్ర్ కీ మాతృక' అనే థీమ్‌లతో నిర్వహించిన ఈ వేడుకల్లో భాగంగా తొలుత 112 మంది మహిళలతో కూడిన బృందం శంఖ నాదం చేస్తూ ముందుకు సాగింది. కంటి శస్త్రచికిత్స నిపుణురాలు, పారాట్రూపర్ అయిన మేజర్ సృష్టి ఖుల్లా నేతృత్వంలోని పూర్తిస్థాయి మహిళా సాయుధ దళాల వైద్య సేవల కవాతు దళం వారి వెంట నడిచింది. బాంబే శాపర్స్ దళం రెండు దశాబ్దాల తర్వాత ఈ వేడుకల్లో పాల్గొంది. ఆ దళానికి మేజర్ దివ్య త్యాగి అనే మహిళా అధికారి నేతృత్వం వహించడం విశేషం. ఇంకా.. అడిషనల్ డీసీపీ (ఢిల్లీ నార్త్ డిస్ట్రిక్ట్), ఐపీఎస్ అధికారి శ్వేత కె.సుగతన్ నేతృత్వంలో 194 మంది మహిళా కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లతో కూడిన ఢిల్లీ పోలీసు దళం ఈ పరేడ్‌లో పాల్గొంది. 144 మంది పురుష, మహిళా అగ్నివీర్‌లతో కూడిన నౌకా దళ సేనకు కమాండర్‌గా లెఫ్టినెంట్ ప్రజ్వల్ నేతృత్వం వహించారు. ఫ్రాన్స్‌కు చెందిన సైనిక బృందం కూడా కర్తవ్యపథ్‌లో పరేడ్ నిర్వహించింది.



గుర్రపు బగ్గీ నుంచి దిగుతున్న ముర్ము, మేక్రాన్

నౌకాదళ శకటమూ..

ఈసారి నౌకాదళ శకటం థీమ్‌లో నారీ శక్తి కూడా ఒక భాగంగా ఉంది. శకటంలో తొలి భాగాన్ని.. భారత నౌకాదళంలో అన్ని ర్యాంకుల్లో, అన్ని కొలువుల్లో మహిళలు ఎలా సత్తా చాటుతున్నారో తెలిపేలా, రెండో భాగాన్ని ఆత్మనిర్భరత థీమ్‌తో రూపొందించారు. ఇక.. 144 మంది ఎయిర్‌మెన్. నలుగురు అధికారులతో కూడిన వాయు సేన దళాన్ని స్క్వాడ్రన్ లీడర్ రష్మీ ఠాకూర్ ముందుండి నడిపించారు. అలాగే.. భారత తీర రక్షక దళ (ఐసీజీ) సేనకు అసిస్టెంట్ కమాండెంట్ చునౌతి శర్మ నాయకత్వం వహించారు. బీఎస్ఎఫ్ దళానికి అసిస్టెంట్ కమాండెంట్ మోనికా లక్రా, సీఐఎస్ఎఫ్ దళానికి తన్మయీ మొహంతీ, సీఆర్పీఎఫ్ దళానికి అసిస్టెంట్ కమాండెంట్ మేఘ నాయర్, ఐటీబీపీ దళానికి అసిస్టెంట్ కమాండెంట్ మోనియా శర్మ, సహస్త్ర సీమా బల్ దళానికి డిప్యూటీ కమాండెంట్ నాన్సీ నేతృత్వం వహించారు. 148 మంది ఎన్‌సీసీ క్యాడెట్లతో కూడిన పూర్తిస్థాయి బాలికల దళానికి యూపీ డైరెక్టరేట్‌కు చెందిన సీనియర్ అండర్ ఆఫీసర్ తేవటియా నేతృత్వం వహించారు.

రక్షణలో సగం..

ఆత్మనిర్భరతను ప్రతిబింబించేలా రూపొందించిన డీఆర్‌డీవో శకటానికి గైడెడ్ క్షిపణుల నిపుణురాలైన శాస్త్రవేత్త సునీతా జెనా నాయకత్వం వహించారు. యాంటి శాటిలైట్ క్షిపణుల నుంచి మూడో తరం యాంటీ ట్యాంక్ గైడెడ్ మిసైళ్ల దాకా డీఆర్‌డీవోలో మహిళల భాగస్వామ్యాన్ని ఈ శకటంలో కళ్లకు కట్టారు. వివిధ రాష్ట్రాలకు చెందిన శకటాలను సైతం మహిళా శక్తిని చాటేలా రూపొందించడం ఈసారి విశేషం. అలాగే.. 265 మంది మహిళలు మోటార్‌సైకిళ్లపై విన్యాసాలు చేశారు. సబ్-ఇన్‌స్పెక్టర్ శ్వేతా సింగ్ నేతృత్వంలో బీఎస్ఎఫ్ మహిళా బ్రాస్ బ్యాండ్ పరేడ్‌లో పాల్గొనగా.. వందే భారతం-నారీశక్తి బ్యానర్ కింద 1500 మంది నృత్యకళాకారులు కూచిపూడి, కథక్, భరతనాట్యం సహా 30 రకాల నృత్యాలను ప్రదర్శించారు. కాగా.. దాదాపు 40 ఏళ్ల తర్వాత గణతంత్ర వేడుకల్లో గుర్రపు బగ్గీ కనిపించడం విశేషం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌తో కలిసి గుర్రపు బగ్గీలో కర్తవ్యపథ్‌కు చేరుకున్నారు.

లోకం తీరు



ఫ్రాన్స్‌తో మరింత

రక్షణ బంధం

న్యూఢిల్లీ, జనవరి 26: ఇండియా, ఫ్రాన్స్ దేశాల మధ్య రక్షణ బంధం మరింత పటిష్ఠమవుతోంది. గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ రెండు రోజుల భారత పర్యటనకు వచ్చిన విషయం తెలిసిందే. గురువారం జైపూర్‌లో ఆయన పర్యటన మొదలైంది. ఇదేరోజు రాత్రి జైపూర్‌లో ప్రధాని మోదీ, మేక్రాన్‌ల మధ్య కీలకమైన చర్చలు జరిగాయి. వీటికి సంబంధించిన వివరాలను శుక్రవారం విదేశాంగ కార్యదర్శి వినయ్ క్వాత్రా మీడియాకు వెల్లడించారు. హెచ్125 చాపర్ల ఉత్పత్తికి సంబంధించి టాటాలు, ఎయిర్‌బస్ హెలికాప్టర్స్ భాగస్వామ్యం కుదుర్చుకున్నట్టు ఆయన చెప్పారు. రోబోటిక్స్, అటానమస్ వాహనాలు, సైబర్ రక్షణ వంటి రంగాల్లో సహకారానికి ఇండియా-ఫ్రాన్స్ రక్షణ పారిశ్రామిక రోడ్‌మ్యాప్ దోహదపడుతుందని చెప్పారు. అలాగే ఉపగ్రహాల ప్రయోగానికి సంబంధించిన సహకారం కోసం న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్, ఫ్రాన్స్‌కు చెందిన ఏరియాన్ స్పేస్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని ఆయన తెలిపారు. ఇజ్రాయెల్, హమాస్ యుద్ధంపైనా చర్చ జరిగిందన్నారు. కాగా, మేక్రాన్ గౌరవార్థం రాష్ట్రపతి ముర్ము రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం విందు ఏర్పాటు చేశారు.



నైట్రోజన్ గ్యాస్‌తో మరణ శిక్ష!

» అమెరికాలో తొలిసారి అమలు

ఎట్మోర్, జనవరి 26: అమెరికాలో ఓ ఖైదీకి నైట్రోజన్ గ్యాస్ వాడి మరణ శిక్షను అమలు చేశారు. ఇలా మరణశిక్ష అమలు చేయడం ఇదే తొలిసారి. దీనిపై ప్రపంచ వ్యాప్తంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓ మత బోధకుడి భార్యను చంపిన కేసులో కెన్నెత్ స్మిత్ (58)కు ఫేస్ మాస్క్ అమర్చి స్వచ్ఛమైన నైట్రోజన్‌ను వదలడంతో దాన్ని పీల్చి మరణించినట్లు గురువారం అలబామా జైలు అధికారులు ప్రకటించారు. 7 నిమిషాల్లో మరణశిక్ష అమలైనట్లు తెలిపారు. స్మిత్ మరణాన్ని అలబామా గవర్నర్ కే ఐవీ ధ్రువీకరించారు. వ్యవస్థలో లోపాలను అడ్డుపెట్టుకొని 30ఏళ్లపాటు స్మిత్ తప్పించుకున్నాడని.. చివరకు బాధ్యత వహించక తప్పలేదన్నారు. ప్రయోగాత్మక మరణ శిక్ష పద్ధతులకు తనను పావుగా వాడుకుంటున్నారని స్మిత్ అక్కడి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. అయినా ప్రయోజనం లేకపోయింది. అలబామాకు చెందిన పాస్టర్ చార్లెస్ సెన్నెట్ భారీగా అప్పులు చేశాడు. తన భార్య చనిపోతే ఆమె పేరిట ఉన్న బీమా సొమ్ము వస్తుందని భావించాడు. గ్రే విలియమ్స్‌ను కలిసి తన భార్యను చంపేందుకు సెన్నెట్ ఒప్పందం చేసుకున్నాడు. విలియమ్స్ కొంత సుపారీ ఇచ్చి తన స్నేహితులైన కెన్నెత్ స్మిత్, జాన్ ఫ్రాస్ట్ పార్కర్‌లకు పని అప్పగించాడు. వారు 1988 మార్చిలో సెన్నెట్ భార్యను కత్తితో దాడి చేసి చంపారు. ఈ ఘటన తర్వాత సెన్నెట్‌ను అనుమానించి అధికారులు విచారించారు. దొరికిపోతాననే మోనని భావించిన సెన్నెట్ ఆత్మహత్య చేసుకున్నాడు. కేసులోని గ్రేవిలియమ్స్‌కు జీవిత ఖైదు విధించగా జైల్లోనే మరణించాడు. జాన్ ఫ్రాస్ట్‌కు 2010లో మరణశిక్షను అమలు చేశారు. మరో నిందితుడు స్మిత్ తనకు హత్యలో ఏ ప్రమేయం లేదంటూ న్యాయపోరాటానికి దిగాడు. సాక్ష్యాధారాలన్నీ పక్కాగా ఉండటంతో దోషిగా తేలాడు. 2022లోనే విషపూరిత ఇంజెక్షన్‌ను ఇచ్చి స్మిత్‌కు మరణ శిక్ష అమలు చేయాలని కోర్టు తీర్పునిచ్చింది. అయితే ఆ ఇంజెక్షన్ తయారీలో జాప్యం జరిగింది. డెత్ వారెంట్ కూడా ముగిసింది. మరేదైనా విధానంలో మరణశిక్షను అమలు చేయాలని న్యాయమూర్తి ఆదేశించగా చివరకు నైట్రోజన్‌గ్యాస్‌తో మరణ శిక్షను అమలుచేశారు. ఇలా మరణశిక్ష అమలు చేయడంపై యూరోపియన్ యూనియన్, ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కార్యాలయం విచారం వ్యక్తం చేశాయి.

బీజేపీతో మళ్లీ నితీశ్ జట్టు?

రేపు సీఎంగా ప్రమాణం?.. డిప్యూటీ సీఎంగా సుశీల్ మోదీ.. బిహార్‌లో ఊహాగానాలు

» అంతా దుష్ప్రచారం.. ఇండియా కూటమిలోనే కొనసాగుతున్నాం: జేడీయూ

పట్నా, లఖ్‌నవూ, జనవరి 26: జేడీయూ అధినేత నితీశ్‌కుమార్ ఆర్జేడీతో పొత్తును వదిలిపెట్టి బీజేపీతో మళ్లీ చేతులు కలిపి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారని, ఆదివారం సీఎంగా ప్రమాణం చేస్తారని బిహార్‌లో జోరుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీనికి తగినట్లుగానే గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీఎం నితీశ్ హాజరైనప్పటికీ, ఆర్జేడీ నేత, ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, ఆ పార్టీకే చెందిన అసెంబ్లీ స్పీకర్ అవధ్ బిహారీ చౌదరి, ఇతర నేతలు గైర్హాజరయ్యారు. దీనిపై సీఎంను విలేకర్లు ప్రశ్నించగా.. హాజరుకాని వారినే అడగండి అని ముక్తసరిగా బదులిచ్చారు. అయితే రాజ్‌భవన్ కార్యక్రమానికి ఆర్జేడీ తరఫున ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ మంత్రి అలోక్ కుమార్ మెహతా హాజరయ్యారు. కాగా, నితీశ్ తిరిగి బీజేపీతో చేతులు కలుపుతారా అన్న విలేకర్ల ప్రశ్నపై బీజేపీ సీనియర్ నేత సుశీల్‌కుమార్ మోదీ స్పందిస్తూ.. 'రాజకీయాల్లో శాశ్వతంగా తలుపులు మూసుకుపోవటం అంటూ ఉండదు. సమయం వచ్చినప్పుడు తలుపులు తెర్చుకుంటాయి. తలుపులు తెరవాలా?వద్దా? అన్నది మా పార్టీ కేంద్ర నాయకత్వం నిర్ణయిస్తుంది' అని చెప్పారు. నితీశ్ బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే సుశీల్‌కుమార్ మోదీ ఉప ముఖ్యమంత్రి పదవిని చేపడతారని వార్తలు వెలువడ్డాయి. అయితే పలువురు బీజేపీ నేతలు నితీశ్‌తో తిరిగి చేతులు కలపటంపై విముఖతను వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రజానీకంలో నితీశ్ ప్రతిష్ఠ గణనీయంగా పడిపోయిందని, ఆయనతో పొత్తు కుదుర్చుకుంటే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ నష్టపోతుందని, ఆర్జేడీ-కాంగ్రెస్-లెఫ్ట్ కూటమి స్వీప్ చేస్తుందని ఓ బీజేపీ నేత పేర్కొన్నారు. గురువారం పార్టీ కీలక నేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను ఢిల్లీలో కలిసి తిరిగి బిహార్‌కు వచ్చిన రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సామ్రాట్ చౌదరి స్పందిస్తూ.. 'ఢిల్లీలో చర్చలు లోక్‌సభ ఎన్నికల గురించే జరిగాయి. అమిత్ షా, నడ్డా.. (నితీశ్‌కు) తలుపులు మూసుకుపోయాయని గతంలో ప్రకటించారు. పార్టీ కార్యకర్తగా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటా. నితీశ్ దుస్తులను మార్చినట్లుగా స్నేహితులను మార్చే రాజకీయ నాయకుడు' అని విమర్శించారు.



బిహార్‌లో ఎవరికి ఎన్ని?

243 సీట్ల బిహార్ అసెంబ్లీలో కనీస మెజారిటీకి 122మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ప్రస్తుతం ఆర్జేడీకి 79, బీజేపీకి 78, జేడీయూకి 45, కాంగ్రెస్‌కు 19, వామపక్షాలకు 16, హెచ్ఏఎం(ఎస్)కు నలుగురు ఎమ్మెల్యేలు, ఎంఐఎంకు ఒక్కరు, ఒక స్వతంత్ర ఎమ్మెల్యే ఉన్నారు. కాంగ్రెస్, వామపక్షాలు ఆర్జేడీతో కలిసి ఉన్నాయి. ఈ 3 పార్టీల బలం 114. అంటే మెజారిటీకి మరో 8 మంది ఎమ్మెల్యేలు అవసరం. జేడీయూ-బీజేపీ చేతులు కలిపితే 123మందితో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలుగుతాయి.

నితీశ్ స్వయంగా స్పష్టతనివ్వాలి: ఆర్జేడీ

ఎన్‌డీఏలో తిరిగి చేరతారని జరుగుతున్న ప్రచారంపై సీఎం నితీశ్ స్పష్టతివ్వాలని ఆర్జేడీ ఎంపీ మనోజ్‌కుమార్ ఝా విజ్ఞప్తి చేశారు. 'బీజేపీని ఓడించి మనం చేతులు కలిపి ప్రభుతాన్ని ఏర్పాటు చేశాం. ప్రస్తుత గందరగోళం ప్రజాజీవితాన్ని ప్రభావితం చేస్తోంది. సీఎం స్వయంగా శుక్రవారం సాయంత్రం వరకు ఒక ప్రకటన చేయాలి' అన్నారు. కాగా, నితీశ్ తమకు మొండిచేయి చూపితే ఏం చేయాలనేదానిపై ఆర్జేడీ కసరత్తు జరుపుతోంది. లాలూ నివాసంలో ఈ మేరకు తీవ్ర చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. 'కొన్నేళ్ల కిందటిలాగా నితీశ్ మళ్లీ మాకు నష్టం చేయకుండా అవసరమైన ప్రణాళికలు మావద్ద ఉన్నాయి. ఆర్జేడీ-కాంగ్రెస్-లెఫ్ట్ పార్టీల కూటమికి మెజారిటీకి అవసరమైన దానికన్నా 20సీట్లు తక్కువ ఉన్నాయి. అయితే, స్పీకర్ మా పార్టీకి చెందిన వ్యక్తే కాబట్టి, మేం సంఖ్యాబలాన్ని కూడగట్టుకోగలం' అని ఓ ఆర్జేడీ నేత అన్నారు. కాగా ఎన్‌డీఏలోకి తిరిగి వెళ్తామంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, ఇదంతా కొందరు కావాలని చేస్తున్న దుష్ప్రచారమని జేడీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఉమేశ్ సింగ్ కుశ్వాహా స్పష్టం చేశారు. తాను సీఎంను గురు, శుక్రవారాల్లో కలిశానని, వదంతులన్నీ అబద్ధాలేనని, పార్టీ ఎమ్మెల్యేలను పట్నాకు పిలిపించామన్నదీ వాస్తవం కాదన్నారు.

ఈ పాపం కాంగ్రెస్‌దే: అఖిలేశ్

నితీశ్‌కుమార్ తిరిగి బీజేపీ చెంతకు చేరతారన్న వార్తలపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ స్పందిస్తూ.. ఈ పరిణామాలకు కాంగ్రెసే కారణమని మండిపడ్డారు. నితీశ్ 'ఇండియా' కూటమిలో కొనసాగితే ప్రధాని పదవి చేపట్టే అవకాశం ఉందని, విపక్షాలను ఒకేతాటిపైకి తెచ్చేందుకు చొరవ చూపింది నితీశేనని గుర్తుచేశారు. ఆయన ఇబ్బందులేంటో కాంగ్రెస్ పార్టీ గుర్తించి చర్చించి ఉంటే పరిష్కారం లభించేదన్నారు.

● రానున్న ఎన్నికల్లో 96 కోట్ల మంది ఓటర్లు

న్యూఢిల్లీ, జనవరి 26: రానున్న 18వ లోక్‌సభ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా తొలుత పలు రకాల గణాంకాలను ఎన్నికల కమిషన్ వెల్లడి చేసింది. దీని ప్రకారం దేశంలోని మొత్తం ఓటర్ల సంఖ్య 96 కోట్లకుపైగా ఉంది. ఇందులో మహిళలు 47కోట్ల మంది. వీరి కోసం 12 లక్షలకుపైగా పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేస్తారు. 1.5 కోట్ల మంది పోలింగ్ సిబ్బందిని నియమిస్తారు. మొత్తం ఓటర్లలో 18-19 ఏళ్ల వయసువారు 1.73 కోట్ల మంది ఉన్నారు. 80.1 లక్షల మంది దివ్యాంగులు, 1.75 కోట్ల మంది 80 ఏళ్లకుపైబడ్డవారు, సుమారు 2లక్షల మంది శతాధిక వృద్ధులున్నారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్నికల కమిషన్ ఈ వివరాలను వెల్లడించింది.

● ప్రజల హక్కులు హరిస్తున్న బీజేపీ: ఖర్గే

న్యూఢిల్లీ, జనవరి 26: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల హక్కులను హరిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విమర్శించారు. వాస్తవాలను దాచేందుకు, ప్రజలను ఏమార్చేందుకు భావోద్వేగాలను రెచ్చగొట్టి ఆడుకుంటోందని దుయ్యబట్టారు. 75వ గణతంత్ర వేడుకల సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆయన సందేశం ఇచ్చారు. ప్రాథమిక హక్కులకు, సామాజిక న్యాయానికి, రాజకీయ హక్కులకు రాజ్యాంగం హామీ ఇస్తోందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం వీటిపై దాడి చేస్తోందని విమర్శించారు. ఇదిలా ఉండగా.. "దేశంలోని ప్రతి ఒక్కరూ తమకు 'అత్యంత విధేయులు'గా ఉన్నారని నిర్ధారించుకునేందుకు ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తోంది. దీనికి సమాధానం ప్రతిఘటనే" అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. కాగా జోడో న్యాయ్ యాత్రకు పశ్చిమ బెంగాల్‌లోనూ అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆ రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ అధిర్ రంజన్ చౌధరి తెలిపారు.

● హాలో కక్ష్యలోకి మాగ్నెటోమీటర్ బూమ్

బెంగళూరు, జనవరి 26: సూర్యుడిపై పరిశోధనలకు ఇస్రో చేపట్టిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ఆదిత్య-ఎల్1లో మరో కీలక ముందడుగు పడింది. అంతరిక్షంలో తక్కువ తీవ్రత కలిగిన గ్రహాంతర అయస్కాంత క్షేత్రాల్ని కొలిచేందుకు ఆదిత్య-ఎల్1 ఉపగ్రహంలోని మాగ్నెటోమీటర్ బూమ్‌ను ఈనెల 11న లాగ్రేంజ్ పాయింట్ ఎల్1 వద్ద హాలో కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టినట్టు ఇస్రో తెలిపింది.

● గల్ఫ్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు


(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

గణతంత్ర వేడుకలను గల్ఫ్ దేశాల్లోని భారతీయులు శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. భారత రాయబార కార్యాలయాల ఆధ్వర్యంలో జరిగిన పతాకావిష్కరణ కార్యక్రమాల్లో రాయబారులు జెండా ఎగురవేశారు.యూఏఈలోని భారత రాయబారి సంజయ్ సుధీర్ అబుదాబిలోని భారత ఎంబసీలో పతాకావిష్కరణ చేశారు. వచ్చే నెల 13న ప్రధాని మోదీ యూఏఈ వస్తున్న సందర్భంగా జరిగే 'అహ్లన్ మోదీ' కార్యక్రమానికి రావాల్సిందిగా ప్రవాస భారతీయులను కోరారు. దుబాయిలో శుక్రవారం భారత కాన్సుల్ జనరల్ పతాకావిష్కరణ చేసి ప్రసంగించారు. ఫిబ్రవరిలో ప్రధాని మోదీ స్వాగత కార్యక్రమానికి రావాల్సిందిగా కోరారు.

'జ్ఞానవాపి' స్థలాన్ని హిందువులకు అప్పగించండి

గిరిరాజ్ సింగ్, హిందూ మహాసభ డిమాండ్.. జ్ఞానవాపి వద్ద భద్రత కట్టుదిట్టం

న్యూఢిల్లీ, జనవరి 26: ఉత్తరప్రదేశ్‌లో వారణాసిలోని జ్ఞానవాపి మసీదు సముదాయంలో గతంలో పెద్ద హిందూ దేవాలయం ఉండేదని ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(ఏఎస్ఐ) నివేదిక వెల్లడించిన నేపథ్యంలో.. ముస్లింలు ఆ స్థలాన్ని హిందువులకు అప్పగించాలని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్, హిందూ మహాసభ అధ్యక్షుడు స్వామి చక్రపాణి మహారాజ్ డిమాండ్ చేశారు. 'జ్ఞానవాపిలో ఆలయం ఉన్నట్టు అన్ని ఆధారాలూ బయటపడ్డాయి. ఆ స్థలాన్ని హిందువులకు అప్పగించాలని ముస్లిం సోదరులను కోరుతున్నా. మత సామరస్యానికి విఘాతం కలిగించేలా ఎలాంటి ప్రకటనలు చేయరాదు' అని గిరిరాజ్ సింగ్ అన్నారు. ప్రస్తుత నిర్మాణానికి ముందు హిందూ దేవాలయం ఉండేదని ఏఎస్ఐ నివేదిక స్పష్టం చేస్తున్నందున ఆ స్థలంపై హక్కులను తిరిగి హిందువులకు అప్పగించి ఆదర్శంగా నిలవాలని హిందూ మహాసభ అధ్యక్షుడు స్వామి చక్రపాణి మహారాజ్ ముస్లిం వర్గానికి విజ్ఞప్తి చేశారు. మొఘలులు తప్పు చేసుంటే, ప్రస్తుతం ముస్లిం తరం దానిని సమర్థించరాదన్నారు. ఈ కేసులో హిందువుల తరఫున వాదిస్తున్న న్యాయవాది విష్ణుశంకర్ జైన్ మాట్లాడుతూ.. ఏఎస్ఐ నివేదిక ప్రకారం ఆలయాన్ని ధ్వంసం చేసి అక్కడ మసీదు నిర్మించారన్నారు. ఈ సముదాయంలో పశ్చిమాన ఉన్న గోడ దాదాపు 5000 సంవత్సరాల నాటిదని, హిందూ దేవాలయానికి సంబంధించినదని తెలిపారు. హిందూ దేవతల విగ్రహాలు ఉన్నాయని, తెలుగు, కన్నడ భాషల్లో శాసనాలు కూడా ఉన్నాయని వెల్లడించారు. కాగా జ్ఞానవాపి మసీదు మేనేజింగ్ కమిటీ... ఏఎస్ఐ నివేదికపై సందేహాలు లేవనెత్తింది. ఇది నివేదిక మాత్రమేనని, నిర్ణయం కాదని పేర్కొంది. 839 ప్రాంతాలను పరిశీలించి నివేదిక రూపొందించారని, దీన్ని అధ్యయనం చేసి విశ్లేషించడానికి సమయం పడుతుందని, నిపుణుల అభిప్రాయాలు తీసుకుని కోర్టుకు నివేదించాల్సి ఉందని తెలిపింది. తాజా పరిణామాలతో వివాదాస్పద జ్ఞానవాపి మసీదు వద్ద అధికారులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఈ మసీదులో ప్రతి శుక్రవారం జరిగే ముస్లింల ప్రార్థనలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా భద్రత పెంచారు. మీడియాను కూడా అనుమతించలేదు.





ఏఎస్ఐ సర్వేలో బయటపడినట్లుగా ఇండియా టుడే వార్తా సంస్థ బయటపెట్టిన చిత్రాలు

గాజాలో మరణాలను నియంత్రించండి

» ఇజ్రాయెల్‌కు అంతర్జాతీయ కోర్టు డిమాండ్

» దాడులు ఆపాలన్నట్టుగా రూలింగ్

» 'జాతి హననంపై' విచారణ కొనసాగింపు

ద హేగ్, జనవరి 26: గాజాపై సైనిక దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ వైఖరిని ఐక్యరాజ్యసమితిలో అంతర్భాగమైన అంతర్జాతీయ న్యాయస్థానం తీవ్రంగా తప్పుపట్టింది. కాల్పులను విరమించాలని స్పష్టంగా ఆదేశించకపోయినా దాదాపుగా అలాంటి తరహా రూలింగే ఇచ్చింది. మరణాలను, నష్టాలను అదుపు చేయాలని డిమాండు చేసింది. ఇజ్రాయెల్ చేస్తున్నది 'జాతి హననమే' అన్న ఆరోపణను కొట్టివేయడానికి నిరాకరించింది. ఈ అంశంపై విచారణ జరపనుంది. గాజాపై దాడులను నిలుపుదల చేసేలా ఇజ్రాయెల్‌ను ఆదేశించాలని కోరుతూ దక్షిణాఫ్రికా ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ (ఐసీజే)ను ఆశ్రయించింది. విచారణ జరిపిన 17 మంది న్యాయమూర్తుల బృందం శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కేసును పూర్తిగా పరిశీలించడానికి సంవత్సరాలు పట్టనుంది. అందువల్ల ప్రస్తుతం మధ్యంతర రూలింగ్ ఇస్తున్నట్టు కోర్టు అధ్యక్షుడు జోన్ ఈ డొనెహ్యూ తెలిపారు. "ఆ ప్రాంతంలో నెలకొన్న మానవ విషాదాన్ని కోర్టు గమనించింది. అక్కడ జరుగుతున్న మరణాలపై ఆందోళన చెందుతోంద"ని చెప్పారు. అక్టోబరు ఏడో తేదీన హమాస్ మిలిటెంట్లు ఇజ్రాయెల్‌పై రాకెట్ల దాడి చేసి 1,200 మంది మరణానికి కారకులయ్యారు. దాంతోపాటుగా 250 మందిని కిడ్నాప్ చేశారు. దానికి ప్రతిగా ఇజ్రాయెల్ గాజాపై జరుపుతున్న దాడుల్లో ఇంతవరకు 26వేల మంది పాలస్తీనియన్ల ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 9,000 మంది మాత్రమే హమాస్ ఉగ్రవాదులు. మిగిలినవారంతా సాధారణ పౌరులు. వీరిలో మూడింట రెండొంతుల మంది మహిళలు, పిల్లలే.

2 లీటర్ల నువ్వుల నూనె గటగటా!

» తాగేసిన తొడసం వంశ ఆడపడుచు
» నార్నూర్ ఖాందేవ్ జాతరలో ప్రత్యేకం



ఉట్నూర్, జనవరి 26: వంటనూనె ఓ చెంచాడు గొంతులో పడితేనే కడుపంతా వికారంగా అనిపిస్తోంది. 'ఆమె' మాత్రం ఏకంగా రెండు లీటర్ల వంట నూనె గటగటా తాగేసింది. ఔరా అనిపించే ఈ పరిణామం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఏజెన్సీలోని నార్నూర్ కామ్‌దేవ్ జాతర్లో చోటుచేసుకుంది. ఆదివాసీ గిరిజన సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే ఈ జాతర గురువారం రాత్రి తొడసం వంశీయుల ప్రత్యేక పూజలతో ప్రారంభమైంది. పూజల్లో భాగంగా శుక్రవారం తొడసం వంశీయుల ఆడపడచు అయిన మేస్రం నాగుబాయి చందు (52) రెండు లీటర్ల నాటు నువ్వుల నూనె తాగారు. జాతరలో భాగంగా ఇలా భారీ మోతాదులో నువ్వుల నూనె తాగడం తొడసం వంశీయులకు ఆచారంగా వస్తోంది. ఆడపడచు హోదాలో ముందుకొచ్చే మహిళ, వరుసగా మూడేళ్ల పాటు జాతర్లో ఇలా నువ్వుల నూనె తాగుతారు. మహారాష్ట్రలోని జవితా తాలూకా కొద్దెపూర్ గ్రామానికి చెందిన నాగుబాయి ఆడపడచు హోదాలో నువ్వుల నూనె తాగడం వరుసగా ఇది రెండోసారి. ఇలా నూనె తాగడం ద్వారా తొడసం వంశానికి చెందిన అందరికీ మేలు జరుగుతుందని ఆదివాసీలు విశ్వసిస్తారు.. గురువారం రాత్రి పూజల్లో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కూడా పాల్గొన్నారు. శుక్రవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ జాతరకు చేరుకుని కామ్‌దేవ్‌కు పూజలు నిర్వహించారు.

ఇదిగిదిగో.. భక్త రామదాసు!?

» నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లో
ఎప్పట్నుంచో రావిచెట్టు నీడన విగ్రహం



నేలకొండపల్లి, జనవరి 26: రామనామం మాదిరిగానే కంచర్ల గోపన్న కీర్తనలూ 'ఎంతో రుచి'! మరి.. ఆ రాములోరికి గొప్ప ఆలయాన్ని నిర్మించి, భక్త రామదాసుగా వినుతికెక్కిన ఆయన ఎలా ఉంటారు? శ్రీరామదాసు సినిమాలో చూపించినట్లుగానే ఉండేవారా? అంటే.. ఇదిగో ఈ విగ్రహం మాదిరిగనే ఉండేవారని చరిత్రకారులు చెబుతున్నారు. 16వ శతాబ్దకాలం నాటి ఈ విగ్రహం ఆయనదేనని స్పష్టం చేస్తున్నారు!! చెవులకు కుండలాలు, ముకుళిత హస్తాలతో ఉన్న ఈ విగ్రహం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లోని ఓ రావిచెట్టు కింద ఎప్పట్నుంచో ఉంది. ఇన్నాళ్లూ ఎవ్వరూ పట్టించుకోని ఆ విగ్రహాన్ని ఇటీవల ఓ వ్యక్తి ఉత్సుకత కొద్దీ ఫొటోతీసి 'కొత్త తెలంగాణా చరిత్ర' బృంద సభ్యులైన రామోజుహరగోపాల్, కట్టా శ్రీనివాస్‌కు పంపాడు. వారొచ్చి పరిశీలించి విగ్రహం భక్త రామదాసుదేనని చెబుతున్నారు. చక్కని మీసకట్టు, అప్పుడే స్నానం చేసినట్టు తల వెనుక జారుముడి వేసుకున్న గోష్పాద శిఖ, అంజలి ముద్ర, నడుము పక్కన కత్తి, కుడి.. ఎడమ భుజాల మీద శంఖు చక్ర ముద్రలతో కూడిన విగ్రహం వైష్ణవ భక్తుడిదని పేర్కొన్నారు. శిల్పం రాజోచిత ఆహార్యంతో లేనందున అక్కన్నదో లేదంటే మాదన్నదో అనుకునే అవకాశమే లేదన్నారు. వారి మేనల్లుడు, భద్రాచల రామాలయ నిర్మాత, నేలకొండపల్లి వాసి అయిన కంచర్ల గోపన్నది అవడానికే ఎక్కువ అవకాశాలున్నాయని చెప్పారు. ఈ పురాతన విగ్రహాన్ని శుక్రవారం రామదాసు ధ్యాన మందిరానికి తరలించారు. రామదాసు పదోతరం వారసుడైన కంచర్ల శ్రీనివాసరావు సమక్షంలో ఆ విగ్రహాన్ని ధ్యాన మందిరంలో ఉంచి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

గణతంత్ర వేడుకల్లో విషాదం

» కరెంట్ షాక్‌తో ఇద్దరి మృతి



విజయ్, అంజిత్ (ఫైల్)

ములుగు, జనవరి 26: గణతంత్ర వేడుకల సందర్భంగా ములుగులో విషాదం నెలకొంది. కరెంట్‌షాక్‌తో ఇద్దరు యువకులు మరణించారు. జిల్లా కేంద్రంలోని శివాలయం ఎదుట గణతంత్ర వేడుకలు జరిపేందుకు స్థానిక యువకులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం 9:20గంటల సమయంలో జాతీయ జెండా కట్టిన ఇనుప బొంగును గద్దెపై అమర్చే క్రమంలో అది పైనున్న 11కేవీ విద్యుత్ వైర్లకు తగిలింది. దీంతో ఆ బొంగును పట్టుకున్న ల్యాడ విజయ్, బోడ అంజిత్, బోడ కల్యాణ్ చక్రవర్తి షాక్‌కు గురయ్యారు. స్థానికులు వెంటనే వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అంజిత్(36) మృతిచెందగా ప్రాణాపాయ స్థితిలో ఉన్న విజయ్(25)ను వైద్యులు సీపీఆర్ చేసి కాపాడే ప్రయత్నం చేశారు. కొద్దిసేపటికే ఆయనా మృతిచెందారు. పోలీసులు కేసు నమోదు చేశారు. తీవ్రంగా గాయపడ్డ కల్యాణ్ చక్రవర్తికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం హనుమకొండకు తరలించారు. ఆస్పత్రికి వచ్చిన మంత్రి సీతక్క బాధిత కుటుంబాలను పరామర్శించారు. రూ.10వేల ఆర్థికసాయం, రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు నియామకాల్లో అక్రమాలపై విచారణకు డిమాండ్

హైదరాబాద్ సిటీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు సభ్యుల నియామకాల్లో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని తెలంగాణ 'ఏ' గ్రేడ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. విద్యుత్ శాఖ మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి అండతో కనీస అర్హత లేని వ్యక్తిని గతంలో సభ్యుడిగా నియమించారని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కందుకూరి శ్రీనివాస్, మద్దునూరి వెంకటేష్ ఆరోపించారు. ఈమేరకు బీ గ్రేడ్ లైసెన్సింగ్ బోర్డు సభ్యులతో కలిసి శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. గతంలో బోర్డు సభ్యుల నియామకంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా అక్రమాలకు సహకరించిన అధికారులను తప్పించాలని డిమాండ్ చేశారు. అక్రమాల వల్ల నష్టపోయిన వారికి న్యాయం చేయాలని కోరారు.

35 లక్షల టన్నులు.. 12 లాట్లు!

ఒక్కో లాట్‌కు 3 లక్షల టన్నుల ధాన్యం.. బిడ్డర్ వార్షిక టర్నోవర్ రూ.200 కోట్లు ఉండాల్సిందే

» 1,832 రైస్‌మిల్లుల్లో నిల్వ ఉన్న ధాన్యానికి టెండర్లు
» బిడ్డింగ్ దాఖలుకు వచ్చేనెల 7 తుది గడువు
» టెండర్ల వివరాలు వెల్లడించిన పౌరసరఫరాల సంస్థ



హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): నిరుడు యాసంగి సీజన్‌లో సేకరించిన ధాన్యాన్ని విక్రయించాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం... టెండర్ల విధివిధానాలను ఖరారుచేసింది. నిరుడు 67 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించగా అందులో ఇప్పటికే కొంత మిల్లింగ్ జరుగుతోంది. అయితే 35 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 28 జిల్లాల్లో 1,832 రైస్‌మిల్లుల్లో నిల్వచేసిన ఈ వడ్లను 12 లాట్లుగా విభజించి టెండర్లు పిలిచింది. ఒక్కో లాట్‌కు 3 లక్షల టన్నుల ధాన్యం కేటాయింపులుచేసి ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించటం గమనార్హం. బిడ్డర్ వార్షిక టర్నోవర్ రూ. 200 కోట్లుగా నిర్ణయించారు. ధాన్యాన్ని విక్రయించేందుకు జనవరి 25న ఉత్తర్వులు జారీ చేయగా ఆ తారీఖు నుంచే బిడ్డింగ్ దాఖలు చేయడానికి అవకాశం కల్పించారు. ఈ-టెండర్ ప్లాట్‌ఫామ్‌పై టెండరు బిడ్డింగులు దాఖలుచేయటానికి ఫిబ్రవరి ఏడో తేదీ సాయంత్రం 5 గంటల వరకు తుది గడువు ఇచ్చారు. ఈనెల 31న మధ్యాహ్నం 2 గంటలకు ఆసక్తి కలిగిన ట్రేడర్లతో ప్రీ బిడ్డింగ్ సమావేశాన్ని రాష్ట్ర పౌరసరఫరాల భవన్‌లో నిర్వహించాలని కమిషనర్ డీఎస్ చౌహాన్ నిర్ణయించారు. అనంతరం ఫిబ్రవరి ఎనిమిదో తేదీన ఉదయం 11 గంటలకు టెక్నికల్ బిడ్‌ను ఓపెన్ చేస్తారు. తొమ్మిదో తేదీన ఉదయం 11 గంటలకు ఫైనాన్షియల్ బిడ్‌ను ఓపెన్ చేస్తారు. అదేక్రమంలో స్టాక్ వెరిఫికేషన్‌కు కూడా అవకాశం కల్పించారు. రైస్‌మిల్లుల్లో ధాన్యం నిల్వలు స్వయంగా పరిశీలించాలనుకునే బిడ్డర్లు... ప్రభుత్వ పనిదినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వెరిఫికేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. 28 జిల్లాల్లో ఉన్న 1,832 రైస్‌మిల్లుల్లో... ఏ మిల్లులో ఎంత ధాన్యం వేలం వేస్తున్నారో తెలిపే వివరాలను కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. ఒక్కో మెట్రిక్ టన్నుకు రూ.585 చొప్పున 'ఈఎండీ'(ఎర్నెస్ట్ మనీ డిపాజిట్) చెల్లించాలని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ నిర్ణయించింది. అంటే ఒక్కో లాట్(3 లక్షల టన్నుల)కు రూ. 17.55 కోట్ల ఈఎండీ చెల్లించాల్సి ఉంటుంది. ఈలెక్కన 11 లాట్లకు కలిపి రూ. 193 కోట్ల డిపాజిట్ వస్తుంది. 12వ లాట్ ఈఎండీ రూ. 9.30 కోట్లు కలిపితే మొత్తం రూ. 202 కోట్ల పైచిలుకు ఈఎండీ వస్తుంది. టెండర్లు దక్కించుకున్న బిడ్డర్‌ను మినహాయించి... దక్కని బిడ్డర్లకు నెల వ్యవధిలో ఈఎండీని తిరిగి చెల్లిస్తామని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. టెండర్ దక్కించుకున్న బిడ్డర్... ధాన్యం విలువపైన 5 శాతం మొత్తాన్ని సెక్యూరిటీ డిపాజిట్ రూపంలో వారం రోజుల్లో చెల్లించాల్సి ఉంటుంది. టెండర్లు దాఖలుచేయటానికి బిడ్డర్ వార్షిక టర్నోవర్ రూ. 200 కోట్లు ఉండాలని షరతు విధించారు. కమోడిటీ ట్రేడింగ్‌లో గత మూడేళ్ల ఐటీ రిటర్నులు, జీఎస్టీ వివరాలు తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. టెండర్లు దక్కించుకున్న బిడ్డర్లే ధాన్యం రవాణా చార్జీలు భరించాల్సి ఉంటుంది. పే అండ్ లిఫ్ట్ పద్ధతిలో ధాన్యం తీసుకెళ్లాల్సి ఉంటుంది. మొత్తం లిఫ్టింగ్ ప్రక్రియను 90 రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే ధాన్యం టెండర్లకు విధివిధానాలు ఖరారుచేసిన రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ... బేస్ ప్రైస్‌ను మాత్రం నిర్ణయించలేదు.

ఎక్కువ ధర పలకటమే కీలకం

యాసంగి ధాన్యాన్ని విక్రయించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం కూడా ప్రయత్నాలు చేసింది. కానీ బిడ్డర్లు తక్కువ ధర (క్వింటాకు రూ. 1,732) కోట్ చేయటంతో టెండర్లు రద్దుచేయాల్సి వచ్చింది. ఇప్పుడు వేలంపాట వేస్తున్న ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి ఎమ్మెస్పీ ప్రకారం.. క్వింటాకు రూ. 2,040 నుంచి రూ. 2,060 చొప్పున కొనుగోలు చేసింది. ఈ ఎమ్మెస్పీకి మార్కెట్ ఫీజు, రవాణా చార్జీలు, కొనుగోలు కేంద్రాల కమీషన్, వడ్డీ చార్జీలు, మిల్లింగ్ చార్జీలు, అడ్మినిస్ట్రేటివ్ చార్జీలు కలిపితే క్వింటా ధాన్యం విలువ రూ. 2,270 అవుతుంది. ఇంతకంటే ఏమాత్రం తక్కువ ధర కోట్ చేసినా... కార్పొరేషన్‌కు నష్టం వస్తుంది. 2023-24 సంవత్సరానికి కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర సాధారణ రకానికి రూ. 2,183 ఉంది. గ్రేడ్- ఏ రకానికి రూ. 2,203 ఉంది. ప్రస్తుతం మార్కెట్లో కామన్ వెరైటీ ధాన్యం ధర క్వింటాకు రూ. 2,250 ఉంది. టెండర్లలో పాల్గొనే బిడ్డర్లు ఈ ధర కోట్ చేస్తారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బిడ్డర్లు రింగ్ కాకుండా చర్యలు తీసుకుంటే.. పోటీ పెరిగి ఎక్కువ ధర కోట్ చేసే అవకాశాలున్నాయి. అలా చేస్తే కార్పొరేషన్‌కు ఆదాయం పెరిగే అవకాశాలుంటాయి.



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేస్తున్న బీర్ల అయిలయ్య

వేతనంలో నెలకు రూ.9 చాలు

» మిగతా మొత్తం పేదల సంక్షేమానికే వెచ్చిస్తా
» ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

యాదాద్రి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యది ఎంత ఉదారత! ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా తనకు ప్రతినెలా దాదాపు రూ.4లక్షల జీతం వస్తుందదని, ఇందులో రూ.9 మాత్రమే తాను తీసుకుంటానని, మిగతా మొత్తం పేదల సంక్షేమానికే వచ్చిస్తానని ఐలయ్య ప్రకటించారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేగా, విప్‌గా తనకు ప్రభుత్వం అందించే వేతనాన్ని ప్రతినెలా పేదలకు ఆర్థిక సాయం రూపంలో అందించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆరు నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్‌లను పంపిణీచేశారు. ఇందుకు రూ.7.50 లక్షలు వెచ్చించినట్లు ఐలయ్య తెలిపారు. మరి.. జీతంలో ప్రత్యేకించి తొమ్మిది రూపాయలే ఎందుకు తీసుకుంటారు? అని అడిగినప్పుడు తొమ్మిది తన అదృష్ట సంఖ్య (లక్కీ నంబరు) అని ఐలయ్య చెప్పారు. ఆలేరు నియోజకవర్గంలోని అనాథలు, దివ్యాంగులు, ఆటో కార్మికులు, వృద్ధులను ఎంపిక చేసుకుని సాయం అందజేస్తానని పేర్కొన్నారు. ఈ సహాయ సహకారాలు తాను పదవిలో ఉన్నన్ని రోజులు కొనసాగిస్తానని ప్రకటించారు. ఐలయ్య నిర్ణయంపై ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.

జనగామ ఎమ్మెల్యే పల్లాపై కేసు నమోదు

» ఆధారాల్లేకుండా అక్రమ కేసులు : పల్లా రాజేశ్వర్‌రెడ్డి



హైదరాబాద్, ఘట్‌కేసర్ రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్లాట్ల కబ్జాకు పాల్పడిన జనగామ ఎమ్మెల్యే, అనురాగ్ యూనివర్సిటీ ఛైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు అతడి భార్య నీలిమ, మరో వ్యక్తి మధుకర్‌రెడ్డిలపై పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదు చేశారు. సీఐ బి.రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. పీర్జాదిగూడ కార్పొరేషన్, బుద్ధానగర్‌కు చెందిన ముచ్చర్ల రాధికతో పాటు మరో ఎనిమిది మందికి ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్ రెవెన్యూ పరిధి సర్వేనెంబరు 796లో 150 గజాల చొప్పున ప్లాట్లు ఉన్నాయి. జనగామ ఎమ్మెల్యే, అనురాగ్ యూనివర్సిటీ ఛైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు ఆయన భార్య నీలిమ, గాయత్రి ఎడ్యుకేషన్ సొసైటీ ప్రతినిధి మధుకర్‌రెడ్డిలు రాధిక ప్లాటుతో పాటు మరో ఎనిమిది మంది ప్లాట్లను కబ్జా చేసి ప్రహరీని నిర్మించినట్లు పోచారం ఐటీసీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎటువంటి ఆధారాలు లేకుండా తనతో పాటు తన భార్యపై అక్రమ కేసు బనాయించారని బీఆర్ఎస్ సీనియర్ నేత, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆరోపించారు. భూముల గురించి తాము ఎవరితో గొడవ పడలేదని, బెదిరించలేదని, ఆక్రమించలేదని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఘటన ఎక్కడ, ఎప్పుడు జరిగిందన్న ఆధారాలు లేకుండానే కేసు నమోదు చేశారన్నారు. భూమికి సంబంధించిన సమస్య అయితే సివిల్ కోర్టుకు వెళ్లాలన్నారు. ఎవరు ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, అన్ని రకాలుగా పోరాటం కొనసాగుతుందని పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు.

ప్రైవేట్ కాలేజీల్లోనే ఎక్కువ అడ్మిషన్లు

» కేంద్ర సర్వేలో వెల్లడి

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):తెలంగాణలో ప్రభుత్వ కాలేజీలతో పోలిస్తే.. ప్రైవేట్ కాలేజీల్లోనే విద్యార్థుల అడ్మిషన్ల సంఖ్య ఎక్కువగా నమోదు అవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన "ఆల్ ఇండియా సర్వే ఆన్ హైయ్యర్ ఎడ్యుకేషన్" 12వ ఎడిషన్ సర్వేలో ఈ విషయం స్పష్టమైంది. 2021-22వ ఏడాది డేటాను ఆధారం చేసుకుని ఈ సర్వేను నిర్వహించారు. రాష్ట్రంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల (18-23) సంఖ్య సుమారు 11,86,076 మంది ఉన్నట్లు తేలింది. అయితే... ఇందులో ప్రభుత్వ కాలేజీల్లో కంటే ప్రైవేట్ కాలేజీల్లోనే విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంది. ప్రైవేట్ కాలేజీల్లో 9,77,943 విద్యార్థులుండగా, ప్రభుత్వ కాలేజీల్లో 2,08,133 మంది విద్యార్థులు ఉన్నారు. అలాగే..ఒక జిల్లాలో అత్యధిక కాలేజీలు ఉన్న జాబితాలో హైదరాబాద్ మూడో స్థానంలో నిలిచింది.1106 కాలేజీలతో బెంగళూరు మొదటి స్థానంలో ఉండగా,703 కాలేజీలతో రెండవ స్థానంలో జైపూర్ ఉంది. ఎక్కువ కాలేజీలు ఉన్న రాష్ట్రాల జాబితాలో 8,375 కాలేజీలతో ఉత్తర ప్రదేశ ముందుండగా, 2083 కాలేజీలతో తెలంగాణ 9వ స్థానంలో ఉంది. రాష్ట్రంలో లక్ష మంది విద్యార్థులకు 52 కాలేజీలు ఉన్నాయి.

కలిసి మురిసిన పద్మవిభూషణులు

» ప్రతిష్ఠాత్మక పురస్కారం నేపథ్యంలో వెంకయ్య నాయుడు, చిరంజీవి భేటీ
» విద్యార్థి నేతగా వెంకయ్య పిలుపు ఇస్తే తరగతులు బహిష్కరించాం: చిరు
» తెలుగు సినీ పరిశ్రమకు మూడో కన్ను చిరంజీవి: వెంకయ్య నాయుడు



హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక పద్మవిభూషణ్ పురస్కారానికి ఎంపికైన నేపథ్యంలో మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మెగాస్టార్ చిరంజీవి శుక్రవారం సాయంత్రం కలుసుకున్నారు. తామిద్దరికీ ఈ పురస్కారం లభించడంపై పరస్పరం అభినందనలు తెలుపుకొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, జై ఆంధ్ర ఉద్యమం జరుగుతున్నప్పుడు తాను కాలేజీలో చదువుతున్నానని, నాడు విద్యార్థి నేతగా ఉన్న వెంకయ్యనాయుడు ఇచ్చిన పిలుపు మేరకు తరగతులను బహిష్కరించి ఉద్యమంలో పాల్గొన్నామని తెలిపారు. అప్పటి నుంచీ వెంకయ్య నాయుడు తనకు తెలుసని కాలేజీ రోజుల్ని గుర్తు చేసుకున్నారు. తర్వాత తాను సినిమాల్లోకి రాగా, ఆయన రాజకీయాల్లో ఇంతింతై వటుడింతై అన్నట్లు ఎదిగారని మెగాస్టార్ పేర్కొన్నారు. అనంతరకాలంలో తాను కూడా రాజకీయాల్లోకి ప్రవేశించిన సందర్భాన్ని ప్రస్తావిస్తూ.. 'మేమిద్దరం పార్లమెంట్‌లో కొలీగ్స్‌గా ఉన్నాం. అనేక విషయాలు ఆయనను అడిగి తెలుసుకొనేవాడిని. వెంకయ్యనాయుడు గారు స్వయంకృషితో ఎదిగిన వ్యక్తి. ఆయనను చూసి అందరూ నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. ఆయనతోపాటు నాకు కూడా పద్మవిభూషణ్ లభించటం నా సంతోషాన్ని ద్విగుణీకృతం చేసింది. ఇద్దరు తెలుగువాళ్లం. స్నేహితులం. మాకు ఒకేసారి ఒకే అవార్డు రావటం థ్రిల్లింగ్ అనిపించింది.' అని చిరంజీవి చెప్పారు.

'సో ప్రౌడ్ ఆఫ్ యూ మెగాస్టార్'

తెలుగు చిత్ర పరిశ్రమకు ఎన్టీ రామారావు, అక్కినేని నాగేశ్వరరావు రెండు కళ్లు అయితే చిరంజీవి మూడో కన్ను అని వెంకయ్య నాయుడు అభివర్ణించారు. 'మీరు కష్టపడి ఒక్కో అడుగు వేసుకుంటూ ఎవరూ ఊహించని ఎత్తుకు ఎదిగారు. పద్మవిభూషణ్ అవార్డు రావటానికి కావలసిన అన్ని అర్హతలు మీకు ఉన్నాయి. సో ప్రౌడ్ ఆఫ్ యూ మెగాస్టార్' అని చిరంజీవిని వెంకయ్యనాయుడు ప్రశంసించారు. సరైన సమయంలో ప్రభుత్వం సముచిత నిర్ణయం తీసుకుందన్నారు.

గడ్డం సమ్మయ్యకు ఘన సన్మానం



సమ్మయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి

దేవరుప్పుల, జనవరి 26: జనగామ జిల్లా దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లెకు చెందిన చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యకు పద్మశ్రీ పురస్కారం లభించిన సందర్భంగా ఆయన్ను ఎమ్మెల్యేలు, వివిధ పార్టీలకు చెందిన నేతలు ఘనంగా సన్మానించారు. స్వగ్రామమైన అప్పిరెడ్డిపల్లెలో శుక్రవారం గడ్డం సమ్మయ్య సన్మాన కార్యక్రమం జరిగింది. దీనికి జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, మామిడాల యశస్విని రెడ్డి హాజరై సమ్మయ్యను సన్మానించారు. కాంగ్రెస్ పాలకుర్తి ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు లేగ రామ్మోహన్‌రెడ్డి కూడా సమ్మయ్యను సన్మానించి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసే దిశలో సమ్మయ్య చేసిన కృషి అభినందనీయమని కడియం శ్రీహరి అన్నారు. గ్రామీణ ప్రాంత కళలను గౌరవించి సమ్మయ్యకు అవార్డు ఇవ్వడం అభినందనీయం అని పల్లా రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. పాలకుర్తి నియోజకవర్గానికి చెందిన చెందిన వ్యక్తి చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యకు పద్మశ్రీ అవార్డు దక్కడం ఆనందంగా ఉందని యశస్వినిరెడ్డి అన్నారు.

పద్మశ్రీ అవార్డు.. నా అదృష్టం

» శిల్పి డాక్టర్ వేలు ఆనందాచారి

సైదాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ అవార్డు రావడం తన అదృష్టమని, తన కళకు దక్కిన గౌరవంగా భావిస్తానని యాదగిరిగుట్ట లక్ష్మీ నర్సింహస్వామి దేవస్థానం స్థపతి, సలహాదారుడిగా పని చేసిన డాక్టర్ వేలు ఆనందాచారి తెలిపారు. ఏపీలోని చిత్తూరు జిల్లా వెన్నంపల్లి గ్రామానికి చెందిన వేలు ఆనందాచారి నగరంలోని మాదన్నపేట పూలతోటలో 70 గజాల చిన్న ఇంటిలో కుటుంబంతో నివాసముంటున్నారు. పద్మశ్రీ అవార్డు ఆనందాచారికి దక్కడంతో పూలతోట బస్తీ ఆనందంలో మునిగిపోయింది. బస్తీవాసులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

అమానుషం రాజ్యమేలుతోంది

» దేశంలో వాస్తవాలకన్నా భావోద్వేగాలకు విలువ ఎక్కువైంది
» ప్రముఖ రచయిత ఆకార్ పటేల్ ఆవేదన
» 14వ హైదరాబాద్ లిటరరీ ఫెస్టివెల్ ప్రారంభం

హైదరాబాద్ సిటీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అమానుషత్వం రాజ్యమేలుతోన్న కాలంలో మనమంతా బతుకుతున్నామని ప్రముఖ రచయిత, అమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియా మాజీ అధికారి ఆకార్ పటేల్ వ్యాఖ్యానించారు. దేశంలో నానాటికీ మత అసహనం పెరుగుతోందని, దానికి రాజ్యమే మద్దతుగా నిలవడం అత్యంత బాధాకరమని చెప్పారు. బీఫ్ తిన్నారని కొట్టి చంపటం వంటి అమానవీయ ఘటనలు మనదేశంలో తప్ప ప్రపంచంలో మరెక్కడా లేవని తెలిపారు. శుక్రవారం ప్రారంభమైన 14వ హైదరాబాద్ లిటరరీ ఫెస్టివెల్‌లో ఆకార్ పటేల్ రచించిన 'ఆఫ్టర్ మెస్సయ్య' పుస్తకంపై చర్చాగోష్ఠి జరిగింది. దీంట్లో ఆకార్ మాట్లాడుతూ.. వాస్తవాల కన్నా భావోద్వేగాలకే భారత్‌లో విలువ ఎక్కువైపోయిందని అన్నారు. జీడీపీలో మన దేశం కన్నా బంగ్లాదేశ్ ముందుంది అనే వాస్తవం చెబితే మనకు నచ్చదు, అదే మందిరం, మత భావనల గురించి మాట్లాడితే చాలా సులువుగా కనెక్టవుతాం, ఈ స్థితి మారాలి అని ఆకార్ పటేల్ ఆకాంక్షించారు. మన దేశానికి ఒక భాషా విధానమంటూ లేకపోవడంతోనే అనేక భారతీయ భాషలు ప్రమాదపు టంచులకు చేరుతున్నాయని పీపుల్స్ లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ గణేష్ నారాయణదాస్ దేవీ పేర్కొన్నారు. మాతృభాష పరిరక్షణ మీద జరిగిన చర్చాగోష్ఠిలో మాట్లాడుతూ, భాషలకు ప్రాధాన్యమిచ్చే విద్యా విధానం ఉండాలని చెప్పారు. సంతాలీ రచయిత్రి దమయంతి బెస్రా, ప్రముఖ నవలా రచయిత మధురాంతకం నరేంద్ర తదితరులు వేర్వేరు సదస్సుల్లో ప్రసంగించారు. కార్యక్రమ ప్రారంభోత్సవంలో తెలంగాణ ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్, లిటరరీ ఫెస్టివెల్ నిర్వాహకులు ప్రొఫెసర్ విజయ్‌కుమార్, అమితా దేశాయ్, కిన్నెర మూర్తి పాల్గొన్నారు.

జగనన్న నుంచీ ఏదీ ఆశించలేదు!

కాదని మా అమ్మతో చెప్పించగలరా.?

బీజేపీకి కట్టు బానిసలా వైసీపీ: షర్మిల



అమరావతి/విజయవాడ/గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): 'జగన్ నుంచి ఏమీ ఆశించకుండానే పాదయాత్ర చేశారా?' అంటూ వైసీపీ శిబిరం చేస్తున్న ప్రచారంపై ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల స్పందించారు. ఆస్తి కోసం, పదవి కోసం జగన్‌ను తాను బ్లాక్‌మెయిల్ చేస్తున్నానని వైసీపీ నేతలు చేసిన వ్యాఖ్యలపైనా ఆమె స్పందించారు. శుక్రవారం విజయవాడలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లా పార్టీ కార్యకర్తల భేటీలో షర్మిల ప్రసంగించారు. "నేను ఏదో ఆశించి పాదయాత్ర చేయలేదు. వాళ్లంతట వాళ్లు అడిగితేనే కుటుంబాన్ని వదిలి రాష్ట్రమంతా నడిచా. జగన్ సీఎం అయ్యాక తాడేపల్లికి రెండుసార్లు వెళ్లా.. ఒకసారి అమ్మతో కలిసి ప్రైవేటు కార్యక్రమానికి.. ఇటీవల కుమారుడి పెళ్లి కార్డు ఇచ్చేందుకు! జగన్‌ను ఏదీ అడిగిందీ లేదు. నా బిడ్డలపై ప్రమాణం చేస్తా.. దేవుడిపైనా చేస్తా. అక్రమంగా సంపాదించుకోవడానికి భర్తతో కలిసి జగన్ వద్దకు వెళ్లానని అభాండాలు వేస్తున్న మీరు ప్రమాణం చేస్తారా? లేక... కుటుంబ విషయాలన్నీ తెలిసిన మా అమ్మతో చెప్పించగలరా? అని అభాండాలు వేస్తే దేవుడున్నాడు జాగ్రత్త" అని షర్మిల హెచ్చరించారు. 'వైఎస్' ఇంటి పేరు, పేరు చివర 'రెడ్డి' అని ఎలా పెట్టుకుంటారంటూ వైసీపీ సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారాన్ని షర్మిల తిప్పికొట్టారు. పులి కడుపున పులే పుడుతుందని.. వైఎస్ కుమార్తెనైన తాను మాత్రం వైఎస్ షర్మిలారెడ్డినేనని స్పష్టం చేశారు. "జగన్ ఒక క్రైస్తవుడై ఉండి మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై దాడులు జరిగితే బీజేపీపై పల్లెత్తి మాట్లాడలేదు. కట్టుబానిస మాదిరిగా బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ఈ రాష్ట్ర ప్రజలను కూడా ఆ పార్టీకి బానిసలుగా మారుస్తున్నారు. క్రైస్తవులకు, ముస్లింలకు ఈ రాష్ట్రంలో భరోసా లేకుండా పోయింది" అని షర్మిల అన్నారు.

షర్మిలపై సోషల్ మీడియాలో దాడి

ప్రశ్నిస్తే.. వేధిస్తారు. నిలదీస్తే కేసులు పెడతారు. తప్పులు ఎత్తి చూపితే సహించలేరు. చివరికి సోషల్ మీడియాలో రకరకాల దూషణలు, నీచమైన వ్యాఖ్యలతో వ్యక్తిత్వ హననానికి పాల్పడతారు. ఇది.. వైసీపీ మార్కు 'సోషల్ మీడియా' అరాచకం. ఇప్పటిదాకా విపక్ష నేతలకు మాత్రమే ఎదురైన ఈ అనుభవం ఇప్పుడు స్వయంగా ఏపీ సీఎం జగన్ సోదరి షర్మిలకూ ఎదురవుతోంది. ఏపీసీసీ అధ్యక్షురాలి హోదాలో జగన్ సర్కారు లోపాలను ఎత్తిచూపడం మొదలుపెట్టగానే షర్మిలపై వైసీపీ సోషల్ మీడియా, ఆ పార్టీ మద్దతుదారుల దాడి మొదలైంది. వ్యక్తిగత జీవితాన్ని కూడా టార్గెట్ చేస్తున్నారు. చివరికి తన కుమారుడి వివాహానికి ప్రతిపక్ష నేతలను ఆహ్వానించడంపైనా నీచ వ్యాఖ్యలే. తనకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ఎవరైనా చిన్న పోస్టు పెడితే సీఐడీని ప్రయోగించి అరెస్టు చేయించిన జగన్.. ఇప్పుడు చెల్లెలిపై సోషల్ మీడియాలో దారుణమైన కామెంట్లు చేస్తున్నా స్పందించడం లేదు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సర్వేలు–సత్యాలు

ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో జ్ఞానవాపి మసీదు కింద ఆలయ అవశేషాలున్నాయని భారత పురావస్తుశాఖ నివేదిక తేల్చినట్టు హిందువుల తరఫు న్యాయవాది విష్ణుశంకర్ జైన్ గురువారం మీడియా ముందు ప్రకటించారు. ఆ ప్రాంగణంలో ము[illegible]లుగుభాషల్లో ఉన్న శాసనాల ఆనవాళ్ళు దొరికాయని, వాటిలో ముగ్గురు దేవుళ్ళ ప్రస్తావన ఉందని, ఆలయ అవశేషాలపైనే మసీదు నిర్మించినట్టు సర్వే నిర్ధారించిందనీ అన్నారు. 839 పేజీల నివేదిక చేతికి అందిన వెంటనే ఈ న్యాయవాది మీడియా సమావేశంలో చెప్పిన వివరాలతో విభేదిస్తూ, హిందూదేవాలయం ఉనికిని సర్వే నిర్ధారించలేదంటూ శుక్రవారం ముస్లిం పక్షం న్యాయవాది మరో ప్రకటన చేశారు. ఈ రెండు ప్రకటనల మధ్య ఏయే అంశాల్లో విభేదం ఉన్నదన్నది అటుంచితే, అయోధ్యలో రామమందిర ఆరంభం ఘనంగా జరిగిన రెండురోజులకే జ్ఞానవాపి పరిణామాలు జోరందుకోవడం విశేషం.

ఏఎస్ఐ తన నివేదికను గత ఏడాది డిసెంబరు 18న సీల్డుకవర్‌లో వారణాసి కోర్టుకు సమర్పించింది. ఈ నివేదికను బహిర్గతం చేయాలని హిందూపక్షం న్యాయవాదులు గతంలో కోరినప్పుడు న్యాయమూర్తి అంగీకరించలేదు. తమ అభ్యర్థనమేరకు కోర్టు సర్వేను ఆదేశించినందున అందులో ఏమున్నదో తెలుసుకొనే హక్కు తమకు ఉంటుందని వారు డిమాండ్ చేసినప్పటికీ, అసత్యాలకు తప్పుడు సమాచారానికి ఇది అవకాశం ఇస్తుందంటూ కోర్టు తిరస్కరించింది. ఆ తరువాత, జనవరి 24న ఏ నిర్ణయమూ చేయబోతున్నట్టు న్యాయమూర్తి ప్రకటించినప్పుడు, అలహాబాద్ హైకోర్టు డిసెంబరు 19న ఇచ్చిన తీర్పు నేపథ్యంలో సీల్డు కవర్ తెరిచే అంశాన్ని కనీసం ఒక నాలుగువారాలు వాయిదావేయాలని పురావస్తుశాఖ కూడా న్యాయస్థానాన్ని కోరింది. అత్యంత కీలకమైన ఈ నివేదిక బయటకువస్తే, అసత్యాలు, అర్ధసత్యాలు, దుష్ప్రచారాలు జరుగుతాయంటూ ఒకదశలో న్యాయస్థానం, పురావస్తుశాఖ అభిప్రాయపడిన ఈ నివేదిక ఉభయపక్షాలవారికీ వాదనలకు ఉపకరిస్తుందన్న పేరుతో అంతిమంగా బయటకు వచ్చింది. వందలపేజీల ఈ నివేదికలో ఏమున్నదన్నకంటే, అందుకున్న ఉభయపక్షాలు ఎదుటివారు తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ పరస్పరం ఖండించుకోవడం మాత్రం జరిగిపోతున్నది.

రథయాత్రలతో రామజన్మభూమి ఉద్యమం ఉధృతంగా ఉన్న కాలంలో ఒక పిటిషన్ ద్వారా ఈ వివాదం న్యాయస్థానంలోకి అడుగుపెట్టింది. ఏడేళ్ళ తరువాత 1991నాటి ప్రార్థనాస్థలాల చట్టం పరిధిలోకి ఈ పిటిషన్ వస్తుందంటూ కొట్టివేసిన ఇదే వారణాసి కోర్టు మరో పదమూడేళ్ళకు తిరిగి తెరిచింది. ఆ తరువాత ఏఎస్ఐ సర్వే కోరుతూ పిటిషన్ దాఖలు కావడం, మసీదు ప్రాంగణంలోని దేవతామూర్తుల ఆరాధనకు అనుమతినివ్వాలంటూ కొందరు మహిళలు అభ్యర్థనలు చేసుకోవడం, వారణాసి కోర్టునుంచి అలహాబాద్ హైకోర్టు మీదుగా సుప్రీంకోర్టు వరకూ ఈ వ్యవహారం నడిచి, సర్వే జరగడం తెలిసిందే. ప్రార్థనాస్థలాల చట్టం ఈ పిటిషన్‌కు వర్తించబోదని అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి రోహిత్ రంజన్ అగర్వాల్ డిసెంబరులో ప్రకటిస్తూ ఆలయ పునరుద్ధరణ అంశం దేశస్థాయిలో అత్యంత ప్రాధాన్యతగలదని, ఆర్నెల్లలో దానిని తేల్చాలని కూడా ప్రకటించారు.

వలసలు, చొరబాట్లు, మార్పిడులు ఉధృతంగా ఉన్న భారతదేశంలో చారిత్రక తప్పిదాలను సరిదిద్దేపేరిట మరిన్ని ఆలయ ఉద్యమాలు రేగి, సామాజిక అశాంతికి కారణమవుతాయన్న భయంతో, ముందు జాగ్రత్తతో 'రామజన్మభూమి'ని మినహాయిస్తూ ప్రార్థనాస్థలాల చట్టం పుట్టుకొచ్చింది. 2019లో రామమందిర నిర్మాణానికి వీలుకల్పించిన తీర్పులో సుప్రీంకోర్టు ఆ చట్టం స్ఫూర్తిని ప్రశంసించింది. దీనితో మరుసటి ఏడాది దాని రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ పిటిషన్లు దాఖలైతే, విస్తృత ధర్మాసనానికి నివేదిస్తామని కోర్టు ప్రకటించింది తప్ప ఈ విషయంలో అడుగుపడలేదు. చట్టాన్ని సమర్థించేది లేనిదీ కేంద్రప్రభుత్వం తేల్చలేదు. కానీ, దిగువకోర్టులు, హైకోర్టులు ఆ స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరిస్తూ పోతున్నాయి. జ్ఞానవాపి సహా ఇటువంటి కేసుల యోగ్యత విషయంలో నోరెత్తకుండా దిగువకోర్టుల నిర్ణయాలను కొద్దిసవరణలతో సుప్రీంకోర్టు ఆమోదిస్తున్నందున, ఇప్పుడు మధురలోనూ సర్వేకు అడుగులుపడి మరో కొత్త ఆలయ ఉద్యమానికి ఊతం వస్తున్నది. శివలింగాల అన్వేషణను పక్కనబెట్టాలని భాగవత్ ఒకపక్కన అంటున్నా, వరుసగా అదే జరగడం మతంమీద ప్రేమ ఉన్న సామాన్యులకు సైతం ఆశ్చర్యాన్ని కలిగించకమానదు.

'సమాఖ్య పాలన' ఏమయ్యేట్టు?

ఇండియా అనగా భారతదేశము. అది రాష్ట్రాల యూనియన్‌గా ఉండవలెను. ఇదొక తిరుగులేని రాజ్యాంగ సత్యం. ఎవరూ ఎట్టి పరిస్థితులలోనూ దీన్ని నిరాకరించలేరు. అవును రాష్ట్రాల కలయికే ఇండియా. భారత రాజ్యాంగం మొదటి షెడ్యూలులో 29 రాష్ట్రాల జాబితా, 7 కేంద్ర పాలిత ప్రాంతాల జాబితా ఉన్నది. బ్రిటిష్ పాలనలోని రాష్ట్రాలు, దేశీయ రాజుల పాలనలోని సంస్థానాలు ఇండియా యూనియన్‌లో చేరేందుకు స్వచ్ఛందంగా అంగీకరించడం భారత సమాఖ్య పాలనా విధానం విశిష్టత.

ఇండియన్ యూనియన్‌లో భాగమైన రాష్ట్రాలను భాషాప్రయుక్తత ప్రాతిపదికన పునర్వ్యవస్థీకరించారు. ఎందుకంటే ఒక రాష్ట్రం అంటే కేవలం పరిపాలనా ప్రాంతం మాత్రమే కాదు. దానికొక ప్రత్యేక భాషాపరమైన, సాంస్కృతిక, చారిత్రక, రాజకీయ అస్తిత్వమున్నది. ఆ అస్తిత్వం విలక్షణమైది. ఏ రాష్ట్ర విలక్షణత ఆ రాష్ట్రానికి మాత్రమే సొంతం.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

మనం ఎలా భారత సమాఖ్యలో భాగమో కూడా చూద్దాం. భారత రాజ్యాంగంలోని కొన్ని అధికరణలు ఆ సమాఖ్య వ్యక్తిత్వాన్ని మరింతగా విస్తృతపరిచాయి. మరికొన్ని అధికరణలు ఆ సమాఖ్య తత్వానికి పరిమితులు విధించాయి. అయితే భారత రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పుడు ఈ దేశం ఒక సమాఖ్య వ్యవస్థగా ఉండితీరాలని ఆ మౌలిక శాసనం నిర్దేశించింది. భారత రాజ్యాంగానికి పార్లమెంటు చేసే సవరణలను దేశంలోని సగం రాష్ట్రాల శాసనసభలు విధిగా ఆమోదించాలి. లేనిపక్షంలో ఆ సవరణకు చట్ట ప్రతిపత్తి లభించదని రాజ్యాంగ అధికరణ 368(2) స్పష్టం చేసింది. భారత్ స్పష్టంగా ఒక సమాఖ్య వ్యవస్థ అన్న నా వాదనకు ఆ అధికరణే ప్రధాన ప్రాతిపదిక.

కాగా రాజ్యాంగాన్ని సవరించడంలో పార్లమెంటుకు ఉన్న అధికారాలు వివాదాస్పదమైనవి. రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని మార్చే అధికారం ఏ వ్యక్తికీ, సంస్థకూ లేదని దేశ సర్వోన్నత న్యాయస్థానం కేశవానంద భారతి కేసు (1973) తీర్పులో స్పష్టం చేసింది. అదే విషయాన్ని మినర్వా మిల్స్ కేసు (1980) తీర్పులో పునరుద్ఘాటించింది. సమాఖ్య విధానం భారత రాజ్యంగ మౌలిక లక్షణమని కేశవానంద భారతి, ఎస్ఆర్ బొమె[illegible]దితర కేసులలో సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. అది సమాఖ్య విధానానికి ఒక తిరుగులేని విజయం.

అయినప్పటికీ మన సమాఖ్య విధానాన్ని బలహీనపరిచేందుకు కేంద్రం పలు విధాల ప్రయత్నిస్తోంది. ప్రతి రాష్ట్రానికి కార్యనిర్వాహక, శాసన, నిర్మాణ, ఆర్థిక అధికారాలు ఉన్నాయి. వీటిని నీరుగార్చడానికి కేంద్రం ఎలా ప్రయత్నిస్తోందో వివరంగా చూద్దాం.. తొలుత కార్యనిర్వాహక అధికారాలు. రాజ్యాంగ అధికరణలు 154, 162 కింద రాష్ట్రానికి కార్యనిర్వాహక అధికారాలు ఉన్నాయి. ఏ ఏ అంశాలలో రాష్ట్రాలకు ఈ అధికారాలు ఉన్నాయో ఆ అంశాలపై చట్టాలు చేసే అధికారం రాష్ట్ర శాసనసభలకు ఉన్నది. పోలీసు వ్యవస్థ రాష్ట్ర ప్రభుత్వ అధికార పరిధిలోనిది. శాంతి భద్రతల డీజీపీని రాష్ట్ర ప్రభుత్వమే నియమిస్తుంది. అయితే కేంద్రం ఈ అధికారాన్ని స్వాయత్తం చేసుకున్నది. ఆ ఉన్నత పోలీసధికారి పదవికి అర్హులైన ఐపీఎస్ అధికారుల జాబితాను యుపిఎస్‌సికి నివేదించాలని రాష్ట్రాలను ఆదేశించింది. ఆ జాబితా నుంచి యుపిఎస్‌సి ఎంపిక చేసిన ముగ్గురు ఐపీఎస్ అధికారులలో ఒకరిని శాంతిభద్రతల డీజీపీగా నియమించాలని కేంద్రం నిర్దేశించింది. అలాగే 'నీట్'ను ప్రవేశపెట్టడం రాష్ట్రాల అధికారాలను కేంద్రం హస్తగతం చేసుకోవడమే కాదూ? రాష్ట్ర ప్రభుత్వాలు నెలకొలిపి నిధులు సమకూరుస్తున్న వైద్యకళాశాలలతో సహా అన్ని వైద్యకళాశాలలలోనూ అడ్మిషన్లను కేంద్రం అఖిల భారత స్థాయిలో నిర్వహించే పరీక్షలో పొందిన మార్కులు, ర్యాంకు ఆధారంగా కల్పించాలని నిర్దేశించడం ఎలా న్యాయం? అలాగే కేంద్రం పాక్షికంగా సమకూర్చే సంక్షేమ పథకాలకు నిధులు మంజూరు చేసేందుకు ఏవో కొన్ని కుంటి సాకులతో కేంద్రం నిరాకరిస్తోంది. నిధుల వ్యయానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను సకాలంలో సమర్పించక పోవడం కూడా నిధుల మంజూరు నిరాకరణకు కారణమయితే ఎలా? కొత్త పాఠశాలలను ప్రారంభించలేదన్న కారణంగా కేరళకు నిధులు మంజూరు చేసేందుకు కేంద్రం సమ్మతించడం లేదు. జననాల రేటు తక్కువగా ఉన్న కారణంగా విద్యార్థులు తగు సంఖ్యలో లేనందున ఉన్న పాఠశాలలను మూసివేయాల్సి వస్తుందని వివరణ ఇచ్చినప్పటికీ కేంద్రం పట్టించుకోవడం లేదు!



ఆర్థిక అధికారాల విషయంలో బలహీనపడినంతగా మరే విషయంలోనూ మన సమాఖ్య పాలనా విధానం బలహీనపడలేదు. పన్నుల సంబంధిత ఆదాయాలలో రాష్ట్రాల వాటాను గణనీయంగా తగ్గించాలని 14వ ఆర్థిక సంఘాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఆదేశించినట్టు' తెలుస్తోంది. పర్యవసానంగా ఆ ఆదాయాలలో రాష్ట్రాలకు ప్రస్తుతమున్న 41 శాతం వాటా 31 శాతానికి తగ్గిపోయే అవకాశమున్నది.

శాసననిర్మాణ అధికారాల విషయాన్ని చూద్దాం. రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితాలో గల అంశాలపై చట్టాలు చేసే అధికారం అటు కేంద్రానికీ, ఇటు రాష్ట్రాలకూ ఉన్నది. అయితే కేంద్రం రాష్ట్రాల ఆమోదం లేకుండానే, కనీసం వాటిని సంప్రదించకుండానే ఆ అంశాలపై అనేక చట్టాలు తెచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఈ ఏకపక్ష ధోరణికి తాజా ఉదాహరణ ఇటీవల పార్లమెంటు ఆమోదం పొందిన నేర న్యాయ విచారణ చట్టాలు. ముసాయిదా బిల్లులపై కనీసం రాష్ట్రాలతో సంప్రతింపులు కూడా జరపలేదు. పైగా ఆ చట్టాలలోని పలు నిబంధనలు రాష్ట్రాల అధికార పరిధిలోని 'శాంతిభద్రతల నిర్వహణ— పోలీసు' అనే అంశం కిందకు వస్తాయి.

రాష్ట్రాల ఆర్థిక అధికారాలను కేంద్రం ఎలా స్వాయత్తం చేసుకుంటుందో చూద్దాం. ఆర్థిక అధికారాల విషయంలో బలహీనపడినంతగా మరే విషయంలోనూ మన సమాఖ్య పాలనా విధానం బలహీనపడలేదు. పన్నుల సంబంధిత ఆదాయాలలో రాష్ట్రాల వాటాను గణనీయంగా తగ్గించాలని 14వ ఆర్థిక సంఘాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఆదేశించినట్టు' తెలుస్తోంది పర్యవసానంగా పన్నుల రాబడిలో రాష్ట్రాలకు ప్రస్తుతమున్న 41 శాతం వాటా 31 శాతానికి తగ్గిపోయే అవకాశమున్నది. రాష్ట్రాలకు వాటా కల్పించడానికి ఆస్కారం లేని సెస్‌లు, సర్‌ఛార్జీలను విచక్షణారహితంగా విధిస్తున్నారు. కేంద్రం నుంచి రాష్ట్రాలు తీసుకునే రుణాలపై కూడా తీవ్ర పరిమితులు విధించారు. జీఎస్టీ చట్టాలు రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలను కుదేలుపరుస్తున్నాయని మరి చెప్పనవసరం లేదు. అలాగే ఆర్థిక సహాయం అందించడంలో అన్ని రాష్ట్రాలను సమదృష్టితో చూడడం లేదు. దీనివల్ల వివిధ రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. నిధులకోసం తాము కేంద్రాన్ని అడుక్కోవలసి వస్తోందని బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల ఆర్థిక మంత్రులు ఆక్రోశిస్తున్నారు. బీజేపీ రాష్ట్రాల ఆర్థిక మంత్రులు కూడా సంతోషంగా లేరన్నది ఒక బహిరంగ రహస్యమే.

రాష్ట్రాల అధికారాలను గణనీయంగా తగ్గించివేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదన్నది ఒకప్పుడు అధికార నడవాలలో ఒక వదంతిగా ఉండేది. ఇప్పుడది ఇంతెంత మాత్రం వదంతి కాదు. ఒక వాస్తవం. ఒక పథకం ప్రకారం రాష్ట్రాల అధికారాలను కేంద్రం హరించివేస్తోంది. ఆ పథకం సంపూర్ణంగా అమలయిననాడు రాష్ట్రాలు కేవలం పరిపాలనా విభాగాలుగా మాత్రమే మిగిలిపోతాయి. భారత్ అప్పుడు ఒక మునిసిపాలిటీల యూనియన్‌గా మాత్రమే మిగులుతుంది. భావి పరిస్థితులు అంతకంటే కూడా ఘోరంగా ఉన్నా ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

పాలస్తీనా: ప్రవహిస్తున్న విషాదం

'గతమంతా తడిసె రక్తమున/ కాకుంటే కన్నీళ్ళతో' అని మహాకవి ఒకరు వాపోయారు. గతమే కాదు, వర్తమానమూ ఇందుకు ఏ మాత్రం భిన్నంగా లేదనేందుకు పాలస్తీనాలో ఎడతెగని ఘర్షణలే ఒక తిరుగులేని తార్కాణం. ఇజ్రాయెల్ —హమాస్ యుద్ధాన్ని గురించిన వార్తలు కలచివేస్తుండగా ఇటీవల ఒక రోజున పాత పుస్తకాల దుకాణానికి వెళ్లాను. 'WHEN I LIVED IN MODERN TIMES'. అనే నవల ఒకటి నా కంటపడింది. రచయిత్రి లిండా గ్రాంట్. ఆమె గురించి నేను ఎప్పుడూ వినలేదు, చదవలేదు. ఇజ్రాయెల్ ఆవిర్భవించక ముందు, బ్రిటన్ నియంత్రణలో ఉన్న కాలంలోని పాలస్తీనాలో పరిస్థితుల గురించి రాసిన నవల కావడంతో ఆ పుస్తకంపై నా ఆసక్తి పెరిగింది. ఆ పుస్తకాన్ని కొనడానికి అంతకంటే మరేమి ప్రేరణ కావాలి? కొని ఇంటికి తీసుకువచ్చి చదివాను. దశాబ్దాల క్రితం పాలస్తీనా సమస్య ఆరంభమైన వైనానికి ఒక చక్కని చారిత్రక కల్పనే లిండా గ్రాంట్ నవల. అది నాకు ఎలాంటి ఆశాభంగం కలిగించలేదు. ఈవెలిన్ సెర్ట్ అనే రెండు పదుల వయసులో ఉన్న బ్రిటిష్ యూదు పౌరురాలు దృక్పథం నుంచి రాసిన నవల అది. ద్వితీయ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత, కొత్తగా ప్రభవించనున్న కొత్త యూదు రాజ్యం (ఇజ్రాయెల్)లో తాను చేయగలిగిందేమిటి? ఆ దేశ సమున్నతికి తాను చేయగలిగేదేమిటో తెలుసుకోవడానికి లిండా గ్రాంట్ పాలస్తీనాకు వెళ్లారు. ఒక కిబ్ బట్జ్ (సమష్టి వ్యవసాయ క్షేత్రం)లో ఆశ్రయం పొందారు. ఆ సమష్టి వ్యవసాయ క్షేత్రం అధికారి ఒక రష్యన్ యూదుడు. సోషలిస్ట్ విశ్వాసాలు ఉన్న వ్యక్తి. అరేబియా ఎడారిని సస్యశ్యామలం చేయాలని కలలు కంటున్న ఆదర్శవాది. అయితే అరబ్‌లు అంటే అతడికి సదభిప్రాయం లేదు. తన కంటే ఎన్నో శతాబ్దాల ముందు నుంచీ వారు పాలస్తీనాలో నివసిస్తున్నారన్న వాస్తవాన్ని విస్మరించిన యూదుడతడు. ఈవెలిన్‌తో ఒకసారి ఇలా అన్నాడు: 'బ్రిటిష్ వారు వెళ్లిపోయిన తరువాత మనం ఈ అరబ్‌లను దయాభావనతో పాలిస్తాం. మన భావాలు, ఆలోచనలు వారిని తప్పక ప్రభావితం చేస్తాయి, తెగల స్వాభావిక విధేయ మానసిక ధోరణి నుంచి వారు విముక్తులవుతారు. ఆధునిక చింతనాధోరణి వారిలో మొగ్గ తొడిగి వికసిస్తుంది. అప్పుడు ఈ అరబ్‌లు ఈ భూమి నుంచి కూడా వెళ్లిపోతారు. ఇరుగు పొరుగు దేశాలలో వారికి తప్పక ఆశ్రయం లభిస్తుంది. మనం వారికి ఎంతో డబ్బు ఇచ్చి ఈ భూములు కొనుక్కున్నాం. వారి పరోక్ష భూస్వాములు విక్రయించిన ఈ భూమిని మంచి ధర ఇచ్చి కొనుక్కున్నాం. మనం ఎలాంటి వంచనకు పాల్పడలేదు ఈ భూమి ఎప్పుడైనా సర్వనాశనమైతే అది అరబ్‌ల వల్లనే కాని, మన వల్ల కాబోదు. శతాబ్దాలుగా ఇక్కడ ఉన్నవారు ఏమీ చేయలేని దానిని మనం కేవలం ఇరవై సంవత్సరాలలో చేశాం. ఈ భూమిని ఎంతగానో అభివృద్ధిపరిచాం. ఎందుకు? మనం దేనిలోనైతే పరిపూర్ణ విశ్వాసముంచామో దాని కోసం కదా. మనం విశ్వసించింది భవిష్యత్తు. అవును భవిష్యత్తు మనదే'.



బ్రిటిష్ యూదు పౌరురాలు లిండా గ్రాంట్ 1990 దశకంలో రాసిన నవల 'WHEN I LIVED IN MODERN TIMES'లో ఇజ్రాయెల్–పాలస్తీనా ఘర్షణలు ఎప్పటికీ అపరిష్కృతంగా ఉండిపోవచ్చని అభిప్రాయపడ్డారు. అసలు ఆ ఘర్షణలకు బాధ్యత యూదులు, అరబ్‌ల కంటే అసలు ఆ సమస్యను సృష్టించిన దేశాలు–బ్రిటన్, జర్మనీ, అమెరికాలదే అన్నది ఒక నిష్ఠుర సత్యం. కనుక, పాలస్తీనాలో సుస్థిర శాంతి స్థాపనకు అమెరికా, యూరోపియన్ దేశాలు చొరవ తీసుకోవాలి.

ఈ మాటలు చదివిన వెంటనే ఇటువంటి అభిప్రాయాలనే వ్యక్తం చేస్తూ యూరోపియన్ యూదు తాత్వికుడు మార్టిన్ బూబెర్ (1879—1965) 1938లో మహాత్మాగాంధీకి రాసిన ఒక లేఖలోని విషయాలు జ్ఞాపకమొచ్చాయి. పిడివాది అయిన సమష్టి వ్యవసాయక్షేత్ర అధికారి వలే కాకుండా ఈ తాత్వికుడు అరబ్‌లు, యూదుల మధ్య సమన్వయాన్ని కాంక్షించాడు. ఈజిప్ట్, పాలస్తీనియన్ రైతులు చాలా వెనుకబడి ఉన్నారని అంటూ వారిని ఆధునిక వ్యవసాయ పద్ధతులకు తీసుకువచ్చేందుకు యూదుల తోడ్పాటు ఆవశ్యకత ఎంతైనా ఉందని బూబెర్ అన్నారు. 'పదమూడు శతాబ్దాలుగా అరబ్‌లు తనకు చేసిందేమిటని? పాలస్తీనా నేలను అడగండి. కేవలం యాభై సంవత్సరాల్లో మేము చేసింది ఏమిటి? ఆ నేల తల్లి సమాధానం ఈ భూమి ఎవరికి చెందుతుందనే న్యాయబద్ధమైన చర్చలో బలమైన సాక్ష్యం అవుతుందనడంలో సందేహం లేదు'. పాలస్తీనాలోని అరబ్‌లు... యూదుల కంటే తక్కువ స్థాయికి చెందినవారనేది బూబెర్ సునిశ్చిత అభిప్రాయం. 'పాలస్తీనా నేల మా విశిష్టతను గుర్తించింది' అని గాంధీకి రాసిన లేఖలో బూబెర్ స్పష్టంగా పేర్కొన్నారు. అరబ్‌లను మరింతగా ఆధునికులను చేయాలన్నదే యూదుల అభిమతమని బూబర్ పేర్కొన్నారు.

కిబ్ బట్జ్ జీవితంతో విసిగిపోయిన ఈవెలిన్ తన నివాసాన్ని టెల్ అవీవ్‌కు మారుస్తుంది. అక్కడ జర్మన్ వాస్తు శిల్పులు నిర్మించిన ఒక కాలనీలో ఉంటుంది. అందరూ యూదులే ఉన్న ఆ ప్రాంతంలో శ్రీమతి లింజ్ అనే నవీన నాగరిక మహిళ పరిచయమవుతుంది. బెర్లిన్ నుంచి వలసవచ్చిన విద్యాధికురాలు లింజ్. ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యావంతులయిన స్త్రీ పురుషులు ఈ కాలనీలో ఉన్నారని ఈవెలిన్‌కు ఆమె చెబుతుంది. 'శాస్త్రవేత్తలు, దార్శనికులు, డాక్టర్లు, ఇంజనీర్లు, చిత్రకారులు.. ఇలా ప్రతి మేధో, వృత్తి రంగం వారు ఇక్కడ ఉన్నారు' అని ఆమె ఎంతగానో గర్విస్తుంటుంది. కర్బూజాలు ఎలా అమ్మాలో మాత్రమే అరబ్‌లకు తెలుసు. అత్యంత ఆధునిక భావాల స్రష్టలు అయిన వారు తమకంటే విద్యా వ్యాసంగాలలో తక్కువ స్థాయికి చెందినవారు, పాలనానుభవం లేనివారి నియంత్రణలో ఉండడం సబబేనా అని శ్రీమతి లింజ్ ప్రశ్నిస్తుంది. పాలస్తీనాలో ఒక ఏడాది ఉన్న తరువాత బ్రిటన్‌కు తిరిగి వెడుతుంది.

టెల్ అవీవ్ నగరంలో ఒక యూదు తీవ్రవాదితో ఈవెలిన్ ప్రేమలో పడుతుంది. అతడు ఇర్గున్ అనే సాయుధ తీవ్రవాద బృందానికి చెందినవాడు. కింగ్ డేవిడ్ హోటల్‌పై బాంబు దాడిలో అతడు కూడా పాల్గొంటాడు. దాడికి లక్ష్యమైన బ్రిటిష్ అధికారులతో పాటు అమాయక యూదులు కూడా ఎంతోమంది ఆ దాడి మూలంగా చనిపోతారు. దీనిపై ఈవెలిన్ తన ప్రియుడిని తీవ్రంగా మందలిస్తుంది. అయితే అతడు తన చర్యను సమర్థించుకుంటాడు. సమూల మార్పుకు బాంబు ఒక సాధనమని ఈవెలిన్‌కు విపులంగా చెబుతాడు, పాత వ్యవస్థను బాంబు సర్వనాశనం చేయడమేకాదు, దాని పునర్నిర్మాణానికీ ఆస్కారం కల్పిస్తుంది అని అంటాడు. ఈవెలిన్ పాలస్తీనాలో ఒక ఏడాది ఉన్న తరువాత బ్రిటన్‌కు తిరిగి వెడుతుంది. ఒక యూదు సంగీతవేత్తను పెళ్ళి చేసుకుని ఇద్దరు పిల్లలకు తల్లి అవుతుంది. భర్త చనిపోయిన చాలా సంవత్సరాల తరువాత ఇంగ్లండ్ నుంచి పాలస్తీనాకు వస్తుంది. తన చివరి సంవత్సరాలు అక్కడే గడపాలని కోరుకుంటుంది. లింజ్ ఇంకా బతికే ఉంటుంది. అరబ్‌లపై ఇజ్రాయెల్ రాజ్యవ్యవస్థ దురాగతాలకు వ్యతిరేకంగా పోరాడే సంస్థలో ఆమె పని చేస్తుంటుంది. ఆ దురాగతాల గురించి లింజ్ చెప్పినప్పుడు ఎవరైనా, ముఖ్యంగా యూదులు అయినవారు అటువంటి దుర్మార్గాలకు ఎలా పాల్పడుతారో అని ఈవెలిన్ దిగ్భ్రాంతి చెందుతుంది.

లిండా గ్రాంట్ తన చారిత్రక నవల "వెన్ ఐ లివ్డ్ ఇన్ మోడరన్ టైమ్స్"ను 1990 దశకంలో రాశారు. ఓస్లో ఒప్పందాల వైఫల్యం స్పష్టంగా కనిపించడం, వెస్ట్ బ్యాంక్‌లో యూదుల నివాసాలు మరింతగా పెరిగిపోవడం, పాలస్తీనియన్ల తిరుగుబాటు ముమ్మరమయిన నేపథ్యంలో ఆమె ఈ నవలారచనకు ఉపక్రమించారు. 1940 దశకంలో యూదు—అరబ్‌ల ఘర్షణ మూలాలను చారిత్రక కల్పన ద్వారా వివరించేందుకు ఆమె ప్రయత్నించారు. చాలావరకు సఫలమయ్యారు. మున్నెన్నడూ లేని రీతిలో ఆ ఘర్షణ అత్యంత అమానుషంగా పరిణమించిన ప్రస్తుత సందర్భంలో ఆ నవలను చదవడం కరుణ భావంతో కదిలించివేసిన, తీవ్రంగా ఆలోచింపజేసిన అనుభవం అనడంలో సందేహం లేదు. అరబ్‌ల పట్ల సానుభూతి, ఇజ్రాయెలీ మితవాదులు తమ హింసాకాండను పూర్తిగా సమర్థించుకోవడం ఆ తొలి రోజుల్లో కూడా ఉన్నట్టు మనకు తెలుస్తుంది. అదే సమయంలో యూదుల వర్ణనాతీత యాతనలను రచయిత్రి మన దృష్టికి తీసుకువస్తారు. ఐరోపాలో యూదు మతస్థులపై తీవ్ర వ్యతిరేకత, హిట్లర్ మారణహోమాలు, ఇజ్రాయెల్ ఉనికిలోకి వచ్చిన తరువాత పశ్చిమాసియాలోని వివిధ దేశాలలో యూదులపై దాడులు, దురాగతాలు పెరిగిపోవడాన్ని లిండా గ్రాంట్ కళ్లకు కట్టించారు. నవలను పూర్తిగా చదివిన తరువాత 'లిండా గ్రాంట్' గురించి మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు గూగుల్‌లో శోధించాను. గాజాలో తాజా హింసాకాండ నేపథ్యంలో బ్రిటిష్ యూదు పౌరురాలుగా తన అనుభవాలు, ఆదుర్దాలను వివరిస్తూ లిండా గ్రాంట్ ప్రముఖ మ్యాగజైన్ 'ప్రాస్పెక్ట్' నవంబర్, 2023 సంచికలో రాసిన ఒక వ్యాసం కూడా కనపడింది. పాలస్తీనియన్లకు మద్దతునిస్తున్న బ్రిటిష్ రచయితలు, కళాకారులు ఇజ్రాయెలీ పౌరులను అమానుషంగా హతమార్చడాన్ని విస్పష్టంగా ఖండించడం లేదని ఆమె అభిప్రాయపడ్డారు. ఇజ్రాయెల్‌పై హమాస్ దాడులు, నెతన్యాహు ప్రభుత్వ ప్రతీకార చర్యలు రెండింటినీ ఆమె తీవ్రంగా ఖండించారు. ఇజ్రాయెల్—పాలస్తీనా సమస్యను పరిష్కరించేందుకు యూదులు—అరబ్‌ల మధ్య సమన్వయాన్ని సాధించగల రాజకీయ వ్యూహాన్ని సమకూర్చగల శక్తి సామర్థ్యాలు బ్రిటిష్ యూదులకు లేవని లిండా భావిస్తున్నారు. బహుశా ఆ సమస్య ఎప్పటికీ పరిష్కరించరానిదిగా ఉండిపోవచ్చని కూడా అభిప్రాయపడుతూ 'ప్రాస్పెక్ట్'లో తన వ్యాసాన్ని లిండా గ్రాంట్ ముగించారు. బహుశా, ఆమె అభిప్రాయం వాస్తవికమైనది కావచ్చు, కాకపోవచ్చు. ఇజ్రాయెల్—పాలస్తీనా సమస్య పరిష్కారానికి ఏదైనా అవకాశముంటే అందుకు చొరవ తీసుకోవల్సింది యూదులు, అరబ్‌లు కాదని, అసలు ఆ సమస్యను సృష్టించిన దేశాలే అందుకు పూనుకోవాలని నేను అభిప్రాయపడుతున్నాను. లిండా గ్రాంట్ ఒక బ్రిటిష్ సైనికాధికారి మాటలను తన వ్యాసంలో ఉటంకించారు: 'అరబ్‌ల సమస్యేమిటంటే వారికి సరైన నాయకత్వం కొరవడింది. సంస్థాగత దక్షత తక్కువ. ఈ రెండు అంశాలలో వారిపై యూదులదే పైచేయిగా ఉన్నది. ఏది ఏమైనా పాలస్తీనా అరబ్‌ల భూమి. అంతిమంగా అది వారికి వెళ్లాల్సిందే. యూదులు దురాక్రమణదారులు. అయితే అక్కడ యూరోపియన్లు ఉండడం వల్ల మన (యూరోపియన్) దేశాల ప్రయోజనాలు నెరవేరుతాయి'. యూదులకు పాలస్తీనా సొంత దేశాన్ని ఏర్పాటు చేస్తామన్న బాల్ఫర్ ప్రకటన (1917 ద్వారా) ఇజ్రాయెల్ ఆవిర్భావానికి బ్రిటిష్ వారు తొలి ప్రేరణనందించారు. అసలు యూదు మతస్థుల నందరినీ సంపూర్ణంగా నిర్మూలించేందుకు పూనుకోవడం ద్వారా జర్మన్లు ఇజ్రాయెల్ ఆవశ్యకతకు రెండో ప్రేరణ కల్పించారు. ఇజ్రాయెల్ ఉనికిలోకి వచ్చిన తరువాత, ముఖ్యంగా 1967 యుద్ధానంతరం పాలస్తీనియన్ల హక్కులు పూర్తిగా ఉల్లంఘించబడడం ప్రారంభమయింది. ఈ విషయంలో ఇజ్రాయెల్‌ను అమెరికా అన్ని విధాల ప్రోత్సహించింది. పాలస్తీనా భూభాగాలలో యూదుల విస్తరణను పూర్తిగా ఉపేక్షించింది. ఐక్యరాజ్యసమితిలో శాంతి ప్రతిపాదనలను వీటో చేసింది. పాలస్తీనాలో దశాబ్దాలుగా ఎడతెగని ఘర్షణలకు బాధ్యత యూదులు, అరబ్‌ల కంటే ఎక్కువగా బ్రిటన్, జర్మనీ, మరీ ముఖ్యంగా అమెరికాదేననడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ నిష్ఠుర సత్యాన్ని అంగీకరించి తీరాలి. కనుక, పాలస్తీనాలో సుస్థిర శాంతి స్థాపనకు చొరవ తీసుకోవల్సింది అమెరికా, యూరోపియన్ దేశాలే అని నేను సునిశ్చితంగా భావిస్తున్నాను.



■ రామచంద్ర గుహ

గతానుగతం

నిలువెత్తు నిరాడంబరతకు భారతరత్న

కేంద్ర ప్రభుత్వం కర్పూరి ఠాకూర్‌కు ఆలస్యంగా అయినా భారతరత్న అవార్డు ప్రకటించింది. పేద వర్గాలకు ఎనలేని సేవలందించిన బీహార్ మాజీ సీఎం దివంగత కర్పూరి ఠాకూర్‌ను ఆయన చనిపోయిన 35ఏళ్ళ తరువాత కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డుకు ఎంపిక చేయటం హర్షణీయం. అదేవిధంగా తెలుగుజాతికి ప్రపంచంలో గుర్తింపు తెచ్చిన ఎన్టీ రామారావుకు భారతరత్న ఇవ్వటం సముచితంగా ఉంటుంది.

కర్పూరి ఠాకూర్ సోషలిస్టు పార్టీ నాయకుడు. రామ్ మనోహర్ లోహియా శిష్యుడిగా రాజకీయాల్లో ప్రవేశించారు. భారతీయ క్రాంతిదళ్, స్వతంత్ర పార్టీ, హర్యానా విచార్ మంచ్, బిజూ పట్నాయక్ ప్రగతి పార్టీ, బలరాజ్ మధోక్ తదితర పార్టీలు 1974లో లోక్‌దళ్‌గా మారాయి. 1977 ఎన్నికల ముందు ఇది జనతా పార్టీగా రూపాంతరం చెందింది. 1977 జూన్ 24న కర్పూరి ఠాకూర్ రెండోసారి బీహార్ ముఖ్యమంత్రి అయ్యారు. అంతకుముందు 1970 డిసెంబర్ 22 నుంచి 1972 జూన్ 24 వరకు మొదటిసారి బీహార్ సీఎంగా పని చేశారు. లోక్‌దళ్, జనతాగా మారిన తరువాత ఠాకూర్ రెండోసారి ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. అప్పట్లో లోక్‌దళ్ వర్గీయులు జనతా హయాంలో బీసీలు ముగ్గురు కర్పూరి ఠాకూర్ (బిహార్), రామ్ నరేష్ యాదవ్ (ఉత్తరప్రదేశ్), దేవిలాల్ (హర్యానా) ముఖ్యమంత్రులయ్యారు. ఈ ముగ్గురినీ జనతా హయాంలో పదవుల నుంచి తొలగించారు. చరణ్ సింగ్ వర్గీయులుగా ముద్రవేసి వీరిని పదవుల నుంచి దించారు. ఇది చిలికి చిలికి గాలివానగా మారి కేంద్రంలో మొరార్జీ దేశాయ్ ప్రభుత్వం కూలిపోవటానికి దారితీసింది. బిహార్ సీఎంగా కర్పూరి ఠాకూర్ పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక సంస్కరణలు అమలు చేశారు. బీసీలకు రిజర్వేషన్లను పెంచారు. మద్యపాన నిషేధాన్ని ప్రవేశపెట్టారు. సామాజిక న్యాయం కోసం పరితపించారు.



పాట్నాలో జయప్రకాష్ నారాయణ జన్మదిన వేడుకలకు కర్పూరి ఠాకూర్ చింపిరిబట్టలతో హాజరయ్యారు. దీనిని గమనించిన చంద్రశేఖర్ 'వాడికి బట్టలు కొనడానికి చందాలివ్వండి' అంటూ వ్యాఖ్యానించారు. దీనిని స్ఫూర్తిగా తీసుకొని కర్పూరి ఠాకూర్ 'దాతలు చందాలివ్వండి' అంటూ జోలె పట్టారు. వచ్చిన డబ్బును అందరిముందూ సీఎం రిలీఫ్ ఫండ్‌కు జమ చేశారు.

కర్పూరి ఠాకూర్ కులరీత్యా నాయిబ్రాహ్మణులు. ఆయన తండ్రి 85 ఏళ్ళ వయసులో కుమారుడు సీఎంగా ఉండగానే ముతక బట్టలతో వృత్తిని కొనసాగించారు. మీరు ఇంకా ఈ వృత్తిలో కొనసాగటం ఏమిటని అనేక మంది ప్రశ్నించేవారు. కుమారుడు ఏ స్థాయిలో వున్నారో తెలియని తండ్రి 'వాడు జులాయ్‌గా తిరుగుతున్నాడు, మా పని మానుకొంటే ఎట్లా!' అని ప్రశ్నించేవారని మిత్రులు చెబుతుంటారు. బిహార్‌లోని సమస్తపూర్ జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలోని పీతాంజియ అనే గ్రామంలో కర్పూరి ఠాకూర్ జన్మించారు. కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా ఐఎయస్ అధికారిగా ఉన్న సమయంలో కర్పూరి ఠాకూర్ వద్ద కార్యదర్శిగా పని చేశారు. బీహార్ కాడర్‌కు చెందిన యశ్వంత్‌సిన్హా ఐఎయస్ అధికారిగా సొంత రాష్ట్రానికి వెళతానని దరఖాస్తు చేశారు. బిహార్ కేడర్‌లో ఉన్న యశ్వంత్‌సిన్హా 1977 లోక్‌సభ ఎన్నికల తరువాత కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేశారు. అప్పట్లో ముఖ్యమంత్రిగా వున్న జగన్నాధ మిశ్రా యశ్వంత్‌సిన్హాను బిహార్ పశుసంవర్ధక శాఖ కమిషనర్‌గా నియమించారు. జూన్ 1977 ఎన్నికల తరువాత కర్పూరి ఠాకూర్ అధికారంలోకి వచ్చారు. అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చరణ్‌సింగ్ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్‌కు యశ్వంత్ సిన్హాను కార్యదర్శిగా నియమించారు. యశ్వంత్ సిన్హా ఠాకూర్ స్వగ్రామం వెళితే అక్కడ పూరి గుడిసెలో కట్టెల పొయ్యి మీద టీ కాసి ఇచ్చారు. ముఖ్యమంత్రి సతీమణి పూరి గుడిసెలో ఉండటాన్ని చూసి సిన్హా కన్నీరు పెట్టారు. కర్పూరి ఠాకూర్ అంతటి నిరాడంబర జీవితాన్ని గడిపారు.

ఏపీ యువలోక్‌దళ్ బాధ్యతలు నిర్వహించిన నేను కర్పూరి ఠాకూర్‌తో కలిసి పనిచేశాను. జాతీయ స్థాయిలో లాలూ ప్రసాద్ యాదవ్, నితీష్‌కుమార్, రామ్‌విలాస్ పాశ్వాన్, ములాయంసింగ్ యాదవ్ వంటి అప్పటి యువనేతలు కర్పూరి ఠాకూర్ శిష్యులుగా తెరపైకొచ్చారు. ఓబీసీల ప్రయోజనాల కోసం ఠాకూర్ అప్పట్లో మంగీలాల్ కమిషన్‌ను నియమించారు. ఇది తరువాత మండల్ కమిషన్‌గా మారింది. ఢిల్లీలోని బిహార్ భవన్‌లో ఒకసారి జనతాపార్టీ ఉన్నతస్థాయి నేతల సమావేశం జరిగింది. సమావేశంలో ఏపీ నుంచి గౌతు లచ్చన్న, నేను హాజరయ్యాం. కర్పూరి ఠాకూర్ కింద పడుకొంటారు. దీంతో ఆ రాత్రి లచ్చన్న అక్కడ బస చేయటానికి మంచం లేక అతిథి గృహానికి వెళ్ళారు. అప్పట్లో జరిగిన జాతీయ భద్రతా మండలి సమావేశంలో బిహార్ ప్రజలు కష్టపడి పని చేయరని, కష్టపడి పనిచేసే రాష్ట్రాలు, ప్రజలతో సమానంగా బిహార్, పేదరాష్ట్రాలకు నిధులు ఇవ్వవద్దని కొంతమంది ఇతర రాష్ట్రాల అధికారులు కేంద్రం దృష్టికి తెచ్చారు. తొలిరోజు ఈ చర్చ జరిగిన తరువాత కర్పూరి ఠాకూర్ సమావేశం నుంచి అర్ధాంతరంగా మాయమయ్యారు. తరువాత బండెడు పుస్తకాలతో సమావేశానికి హాజరయ్యారు. 'బ్రిటీషు వారి హయాంలో వారితో సఖ్యతగా ఉండి కొన్ని రాష్ట్రాలలో నీటి ప్రాజెక్టులు, రైల్వే, ఇతర మౌలిక వసతులను మెరుగుపరచుకొన్నారు. దాంతో అక్కడ ప్రజలు కష్టపడే విధానం వచ్చింది. కొన్ని రాష్ట్రాలలో ఆ విధానం లేకపోవటంతో అభివృద్ధి చెందలేదు. దీంతో పేదరికం తొలగలేదు.' అంటూ దానికి సంబంధించిన డాక్యుమెంట్లను సమావేశంలో ప్రవేశపెట్టారు. సమావేశంలో మాట్లాడిన ఐఎయస్ అధికారులు వారి సొంత రాష్ట్రాల్లో పని చేస్తే వాస్తవాలు తెలుస్తాయంటూ కర్పూరి ఠాకూర్ వారి వాదనలను దీటుగా తిప్పికొట్టారు. పాట్నాలో జయప్రకాష్ నారాయణ జన్మదిన వేడుకలకు కర్పూరి ఠాకూర్ చింపిరిబట్టలతో హాజరయ్యారు. దీనిని గమనించిన చంద్రశేఖర్ 'అరె వాడికి బట్టలు కొంటానికి చందాలివ్వండి' అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. దీనిని స్ఫూర్తిగా తీసుకొని ఆయన 'దాతలు చందాలివ్వండి' అంటూ జోలె పట్టారు. వచ్చిన డబ్బును అందరిముందూ సీఎం రిలీఫ్ ఫండ్‌కు జమ చేశారు.

క్విట్ ఇండియా ఉద్యమం, స్వాతంత్ర్య ఉద్యమం, ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్న కర్పూరి ఠాకూర్ నీతివంతమైన రాజకీయాలతో కొనసాగారు. పేద, బలహీన వర్గాలకు చెందిన ఠాకూర్ కుటుంబానికి ఎటువంటి రాజకీయ నేపథ్యం లేదు. జాతీయ స్థాయిలో బీసీల సంక్షేమానికి, రిజర్వేషన్లకోసం అనేక పోరాటాలు చేసిన కర్పూరి ఠాకూర్ 1987లో చనిపోయారు. ఆయన చనిపోయిన 35 ఏళ్ళ తరువాత కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డును ప్రకటించటం హర్షణీయం.

• డాక్టర్ యలమంచిలి శివాజి

విరసం మహాసభలు

ఫాసిస్టు సందర్భంలో రాజ్యాంగ పరిరక్షణ ఒక ప్రజాస్వామిక ఆకాంక్షగా ముందుకు వచ్చింది. 'భారత ప్రజలమైన మేము' అని మొదలయ్యే రాజ్యాంగం ఆచరణలో ఆ ప్రజల జీవితాన్ని మార్చలేకపోయింది. ప్రజా ప్రాతినిధ్య రూపంలో పని చేసే భారత రాజ్యం మీద దళారీ బూర్జువావర్గం శాసన అధికారాన్ని నెలకొల్పుకోడానికి రాజ్యాంగం అవసరమైంది. అదే సమయంలో గత డెబ[illegible]ళ్లలో పీడిత ప్రజల జీవితం కొంత మెరుగుపడటంలో రాజ్యాంగం పాత్ర ఉన్నది. పాతికేళ్లుగా అన్ని స్థాయిల్లో రాజ్యాంగ ఆదర్శాలు దెబ్బతినిపోతున్న సందర్భంలోనే పీడిత కులాల్లో, మత మైనారిటీల్లో, ఆదివాసుల్లో రాజ్యాంగ చైతన్యం పెరిగింది. దానికి వ్యతిరేకంగా కూడా ఫాసిస్టు శక్తులు రాజ్యాంగ విధ్వంసానికి పాల్పడుతున్నాయి. దీన్ని వ్యతిరేకిస్తూ రాజ్యాంగ పరిరక్షణ ఒక బలమైన వ్యక్తీకరణగా మారింది. అదే సమయంలో ఈ రాజ్యాంగ పరిరక్షణ ఆకాంక్ష నుంచి రాజ్యాంగ సర్వస్వవాదం తలెత్తింది. రాజ్యాంగంలో నిరంకుశ పాలకవర్గ ప్రయోజనాలకు రక్షణ కవచంగా ఎన్నో అంశాలు ఉన్నాయనే వాస్తవిక దృష్టి అడుగంటిపోతున్నది. ఆధునికతా వికాసంలో భాగంగా చట్టబద్ధ పాలన అనే ప్రగతిశీల అంశం వచ్చిందని గుర్తించి, దాని అమలు కోసం కృషి చేస్తూనే రాజ్యాంగం మీద విమర్శనాత్మక వైఖరిని ప్రదర్శించాలి. ఇది ఎంత లోపిస్తే అంతగా రాజ్యాంగవాద భావజాలం ప్రబలుతుంది. ఈ దృష్ట్యా జనవరి 27, 28 తేదీల్లో విజయవాడలో జరగనున్న విప్లవ రచయితల సంఘం 29వ మహాసభలు 'ఫాసిస్టు సందర్భంలో రాజ్యాంగవాదం' అన్న ఇతివృత్తంతో సాగుతాయి. ఈ మహాసభల ప్రారంభోపన్యాసం— సిద్ధిఖీ కప్పన్ (ప్రముఖ పాత్రికేయుడు, కేరళ) చేస్తారు; ఆహ్వానోపన్యాసం— గుంటూరు లక్ష్మీనరసయ్య (ప్రముఖ సాహిత్య విమర్శకుడు) చేస్తారు; కీ నోట్— వరలక్ష్మి ఇస్తారు; ఇంకా అరసవిల్లి కృష్ణ, రివేరా, అల్లం రాజయ్య, ప్రొ. హరగోపాల్, కళ్యాణరావు, పాణి తదితరులు మాట్లాడతారు.

— విరసం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com



జెండా వందనం చేస్తున్న కలెక్టర్, సీపీ, అధికారులు



గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్, సీపీ



పోలీసుల కవాతు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం





- అర్హులందరికీ ప్రగతి ఫలాలు
- సర్వతోముఖంగా జిల్లా అభివృద్ధి
- విజయవంతంగా ప్రజాపాలన
- ఆరు గ్యారంటీల కింద 2.50 లక్షల దరఖాస్తులు
- కలెక్టర్ సిక్తాపట్నాయక్
- ఘనంగా గణతంత్ర వేడుకలు

హనుమకొండ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఉద్యమ ఆకాంక్షలు, ప్రజా సంక్షమమే ప్రభుత్వ ప్రాధాన్యతలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందించడం ప్రభుత్వం తన బాధ్యతగా భావిస్తోందన్నారు. హనుమకొండ జిల్లా అన్ని రంగాల్లో సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతోందన్నారు. భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం జెండా వందన కార్యక్రమం ఘనంగా జరిగింది. కలెక్టర్ సిక్తా పట్నాయక్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

ఆరు గ్యారంటీలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటి వరకు 43,39,704 మంది మహిళలు జీరో టికెట్ ద్వారా ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమం ద్వారా మిగతా పథకాలైన రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి చేయూత పథకాల కోసం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించి అర్హులైన ప్రజల నుంచి 2,50,367 దరఖాస్తులను స్వీకరించామని, వీటన్నిటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేయడం కూడా పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు.

వైద్య, ఆరోగ్యం

ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు రూపకల్పన చేసిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అర్హులైన వారందరికీ రూ.10లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. జిల్లాలో 5 ప్రభుత్వ ఆస్పత్రులు, 37 ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ పథ కం విజయవంతంగా కొనసాగుతోందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీలో భాగంగా ఇప్పటి వరకు 11,416 మంది రోగులకు రూ.24,11,91,679 వ్యయంతో నెట్ వర్క్ ఆస్పత్రుల్లో శస్త్ర చికిత్సలు చేసినట్టు తెలిపారు



వేడుకలకు హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

విద్య

6,885 మంది ఎస్సీల విద్యార్థులకు పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్పుల కింద రూ.32.22కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. 2022-23 సంవత్సరానికి బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా రూ.71.5కోట్లు, ఈబీసీ విద్యార్థులకు రూ.2.48కోట్లు విడుదల అయినట్టు తెలిపారు.

వ్యవసాయం

రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉం దని, ఇందులో భాగంగా రైతు భరోసా పథకం కింద చిన్న, సన్నకారు రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసిందని తెలిపారు. రూ.2. లక్ష రుణమాఫీ సంబంధించి బ్యాంకులతో సంప్రదింపులు జరుగుతున్నాయ ని తెలిపారు. ప్రతీ పంటకాలానికి ఎకరాకు రూ.5 వేల చొప్పున పంట పెట్టుబడిగా ఈ యాసంగిలో ఇప్పటివరకు 97,257 మంది రైతులకు రూ.45.40 కోట్ల పంట పెట్టుబడిని రైతులకు అందచేసిందని సిక్తాపట్నాయక్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

పౌరసరఫరాల శాఖ

ఈ ఆర్థిక సంవత్సరంలో వానాకాలం (ఖరీఫ్)కు సంబంధించి 152 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 77,380 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 16,834 మంది రైతుల నుంచి కొనుగోలు చేశామని, ఇందుకు రూ.59కోట్లు చెల్లించామని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సీసీఐ ద్వారా నాలుగు జిన్నింగ్ మిల్లులను ప్రారంభించి వీటి ద్వారా 9,403 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేశామని తెలిపారు.

డీఆర్‌డీఏ

ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద

మిగతా 8వ పేజీలో..



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

ఘనంగా గణతంత్ర దినోత్సవం

- ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు
- స్వాంతంత్ర్య సమరయోధులకు సత్కారం
- ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు

హనుమకొండ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం హనుమకొండ జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో రిపబ్లిక్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝాతో కలిసి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, ఆసాధించిన ప్రగతిపై ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయినిరాజేందర్ రెడ్డి, జీడబ్ల్యుఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ భాషా, అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, మహేందర్ జీ, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారీ, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు, పురప్రముఖులు కలెక్టర్‌ను కలిసి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వాతంత్ర్య సమరయోధులకు శాలువాలతో సన్మానించారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు కలెక్టర్ సిక్తాపట్నాయక్, పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, మహేందర్‌జీ ప్రశంసాపత్రాలు అందచేశారు.

సాంస్కృతిక ప్రదర్శనలు

రిపబ్లిక్‌డే వేడుకల సందర్భంగా చిన్నారుల ప్రదర్శనలు ఆహూతులను అలరింపచేశాయి. ఎదనిండా దేశభక్తి భావాన్ని నింపుకొని పలు గీతాలకు తమ ప్రదర్శనలతో గణతంత్ర దినోత్సవ వేడుకలకు వన్నెలద్దారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు అద్భుతంగా నృత్యాలను ప్రదర్శించి ఔరా అనిపించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ఏకరూప దుస్తులు ధరించి అమ అభినయంతో అలరింప చేశారు. ఈ సందర్భంగా చిన్నారులను కలెక్టర్‌తో పాటు ఇతర అతిథులు, జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ వేడుకల్లో అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు. అంతకుముందు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసిన అనంతరం త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.



పద్మశ్రీ అవార్డు గ్రహీత సమ్మయ్యను సన్మానిస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి

గడ్డం సమ్మయ్యకు అభినందనల వెల్లువ

దేవరుప్పుల, జనవరి 26: చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యను పద్మశ్రీ పురస్కారం వరించిన సందర్భంగా ఆయనను పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని అప్పిరెడ్డిపల్లెకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు లేగ రామ్మోహన్‌రెడ్డి తదితరులు వచ్చి సమ్మయ్యను సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనను అభినందించారు. ఆయన కళాసేవను కొనియాడారు.

రాజ్యాంగ విలువలు లేని గవర్నర్

- కనీస పరిజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారు..
- బీఆర్ఎస్‌పై నెపం నెట్టి కాంగ్రెస్ కాలయాపన
- బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ధ్వజం
- నాపై కేసులు పెట్టేందుకు కుట్ర: ఎమ్మెల్యే పల్లా



మీడియాతో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

జనగామ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ విలువలను కాపాడాలన్న విషయాన్ని మరిచిపోయి బీజేపీ ప్రతినిధిలా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మాట్లాడుతున్నారని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. జనగామ బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు గవర్నర్ తీరు, సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గురించి గవర్నర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని, ఇది సరికాదని కడియం అన్నారు.

గత ప్రభుత్వమైనా, ప్రస్తుత ప్రభుత్వమైనా ప్రభుత్వాధినేత గవర్నరే అన్న విషయాన్ని ఆమె మరిచిపోయి మాట్లాడుతున్నారన్నారు. ప్రభుత్వంలో తప్పు జరిగితే ఆ తప్పు గవర్నర్‌ది కూడా అవుతోందన్నారు. ప్రభుత్వాలు తప్పు చేస్తే సరిదిద్దాల్సిన, ఆదేశాలు ఇవ్వాల్సిన బాధ్యత గవర్నర్‌పై ఉంటుందన్నారు. గత ప్రభుత్వం తప్పు చేస్తే సరిదిద్దక పోవడం ఆమె బలహీనత కిందే లెక్క అని అన్నారు. రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉండి ఇలా మాట్లాడడం సరికాదన్నారు. తమిళిసై లాంటి గవర్నర్‌ను చూసిన తర్వాత గవర్నర్ వ్యవస్థను రద్దు చేయడమే సమంజసమనిపిస్తోందన్నారు.

గత ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను గవర్నర్ వెంటనే వెనక్కి తీసుకోవాలని కడియం డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ 50 రోజులు అవుతున్నా కేవలం రెండే హామీలను అమలు చేసిందని విమర్శించారు. ఇదే విషయాన్ని అడిగితే సీఎం, మంత్రులు ఎగిరెగిరి పడుతున్నారన్నారు.

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై కాంగ్రెస్ పార్టీ రోజుకో కేసు పెట్టాలని చూస్తోందని, కాంగ్రెస్ పార్టీ బెదిరింపులకు తాను గానీ, బీఆర్ఎస్ పార్టీ గానీ భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గవర్నర్ వ్యాఖ్యలు శోచనీయమని, ఆ వ్యాఖ్యలను ప్రజాస్వామ్యవాదులు, మేధావులు ఖండించాలని అన్నారు. ఎమ్మెల్సీగా కోదండరామ్‌ను అంగీకరించిన గవర్నర్... దాసోజు శ్రవణ్‌ను ఎందుకు అంగీకరించలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ద్వారా 50వేల ఎకరాలు కూడా పారడం లేదని ఓ మంత్రి మాట్లాడారని, కానీ అదే కాంగ్రెస్ పార్టీకి చెందిన కొండా సురేఖ రంగనాయకసాగర్ నుంచి నీటి విడుదల సందర్భంగా 1.25 లక్షల ఎకరాలకు విడుదల చేశామని చెప్పారన్నారు.

పోలీసులు, ఇంటెలిజెన్స్ విభాగం కలిసి తీన్మార్ మల్లన్న అనే చోటా నయీమ్‌ను తయారు చేశారని పల్లా విమర్శించారు. తీన్మార్ మల్లన్న ఘట్కేసర్, మేడ్చల్ ప్రాంతాల్లో గూండాలను పంపించి వసూళ్లకు పాల్పడ్డారని మండిపడ్డారు. గతంలో ఎమ్మెల్సీగా, ఆ తర్వాత హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో మల్లన్నను ఓడించానని ఇవన్నీ మనసులో పెట్టుకొని కేసులు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడే వ్యక్తిని కాదన్నారు.

గణతంత్ర వేడుకల్లో విషాదం

- ములుగులో విద్యుదాఘాతంతో ఇద్దరు యువకుల దుర్మరణం
- జెండా గద్దెపై పైపు అమర్చుతుండగా ప్రమాదం



అంజిత్(ఫైల్)



విజయ్(ఫైల్)

ములుగు, జనవరి 26: గణతంత్ర వేడుకల్లో ఊహించని విధంగా విద్యుదాఘాతానికి గురై ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ములుగు జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. వివరాలిలా ఉన్నాయి. జిల్లాకేంద్రంలోని శివాలయం(నగరేశ్వరస్వామి దేవాలయం) ఎదుట ప్రతీ ఏడులాగే గణతంత్ర వేడుకలు జరిపేందుకు స్థానిక యువకులు ఏర్పాట్లు చేశారు. పరిసరాలలో భారతదేశ చిత్రపటాన్ని వేశారు. చుట్టూ తోరణాలు కట్టారు. ఉదయం 9.20గంటల సమయంలో జాతీయ జెండా కట్టిన ఇనుప పైపును గద్దెపై అమర్చే క్రమంలో పైనున్న 11కేవీ విద్యుత్ వైర్లకు తగిలింది. దీంతో ఆ పైపును పట్టుకున్న ల్యాద విజయ్, బోడ అంజిత్, బోడ కల్యాణ్ చక్రవర్తి షాక్‌కు గురై కిందపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే వారిని స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికే అంజిత్(36) మృతిచెందగా ప్రాణాపాయ స్థితిలో ఉన్న విజయ్(25)కు సీపీఆర్ చేసిన వైద్యులు కాపాడే ప్రయత్నం చేశారు. కొద్దిసేపటికే ఆయన కూడా మృతిచెందాడు. తీవ్రంగా గాయపడ్డ కల్యాణ్ చక్రవర్తికి ప్రథమ చికిత్స చేయడంతో కోలుకున్నాడు. మెరుగైన వైద్యం కోసం అతడిని కుటుంబసభ్యులు హనుమకొండకు తరలించారు.

కాగా, మృతులిద్దరూ నిరుపేద దళిత కుటుంబానికి చెందినవారు. అంజిత్‌కు భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. గృహనిర్మాణ సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేసే అంజిత్ రోజువారి కూలీ డబ్బులతో భార్యా పిల్లలను పోషించుకుంటున్నాడు. అవివాహితుడైన విజయ్ స్థానికంగా ఓ కూల్‌డ్రింక్ డీలర్ వద్ద పనిచేస్తున్నారు. కొద్ది క్షణాల కిందటివరకు తమ కళ్లెదుటే ఉన్న వారు విగతజీవులుగా మారడంతో కుటుంబ సభ్యులు, కాలనీవాసులు బోరున విలపించారు. కుటుంబ పెద్ద మరణించడంతో తాను, ముగ్గురు పిల్లలం అనాథలయ్యామని అంజిత్ భార్య లావణ్య రోదించింది. వృద్ధాప్యంలో ఉన్న తమను చూసుకుంటున్న ఒక్కగానొక్క కొడుకు కానరాని లోకాలకు వెళ్లాడంటూ విజయ్ తల్లిదండ్రులు లక్ష్మి-శంకర్ కన్నీరు పెట్టుకున్నారు. కాగా, మంత్రి సీతక్క ఏరియా ఆస్పత్రికి వచ్చి మృతదేహాలను సందర్శించి కుటుంబసభ్యులను ఓదార్చారు. తక్షణ సాయంగా ప్రభుత్వం తరఫున రూ.10వేల చొప్పున ఆర్థికసాయం, రూ .5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందిస్తామని తెలిపారు.

మహా జాతరకు సకల ఏర్పాట్లు

- ఈ నెలాఖరులోగా పనులు పూర్తవుతాయి
- మేడారంలో మంత్రి సీతక్క
- పనుల పురోగతి పరిశీలన
- నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశం



మేడారంలో పనులను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

మేడారం, జనవరి 26: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు, సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క తాడ్వాయి మండలం మేడారంలో శుక్రవారం పర్యటించారు. ఆకస్మికంగా వచ్చి పనుల నాణ్యత ప్రమాణాలు, పురోగతిని తనిఖీ చేశారు. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు జరిగే సమ్మక్క సారలమ్మల మహాజాతరకు వచ్చే భక్తకోటికి సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం రూ.75కోట్లు మంజూరు చేసింది. పలు శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి సీతక్క ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనుల పురోగతిని తిరిగి పరిశీలించారు. ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్, పలు శాఖల అధికారులతో కలిసి పర్యటించిన మంత్రి.. పనులను గడువులోగా పూర్తి చేయాలన్నారు. శాశ్వత, తాత్కాలిక ఏర్పాట్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ఈ నెలాఖరులో పూర్తిచేయాలని సూచించారు. ముందస్తుగా వస్తున్న భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు అందుబాటులో ఉంచాలన్నారు.

ఈసందర్భంగా ఆర్టీసీ బస్టాండ్, పార్కింగ్ స్థలాలు, రహదారుల నిర్మాణ పనులు, హరిత హోటల్ మరమ్మతులు, జంపన్నవాగు ఇసుక చదును, ఊటబావుల పూడికతీత, స్నానఘట్టాలపై బాతింగ్ గార్డ్స్, బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్, కొత్తూరు సమీపంలోని తాత్కాలిక మరుగుదొడ్లు, స్థూపంరోడ్, కన్నెపల్లి గ్రామంలోని సారలమ్మ దేవాలయం పరిసరాలు పరిశీలించారు. పూజారి కాక రంజిత్ దేవాలయ సమీపంలో మరుగుదొడ్లు, తాగునీరు, లైటింగ్ ఏర్పాట్లు చేయాలని కోరారు. వెంటనే అధికారులను మంత్రి ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

అనంతరం మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మేడారం జాతరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.75కోట్లు మంజూరు చేసిందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు కొనసాగుతున్నాయని అన్నారు. ముందస్తుగా వస్తున్న భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ముందస్తు సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల చివరిలోపు జాతర పనులు పూర్తవుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ శ్రీజ, ఈవో రాజేంద్రం, డీపీవో వెంకయ్య, ఇంజనీరింగ్ అధికారులు అజయ్ కుమార్, డీఎస్పీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



గద్దెల వద్ద భక్తుల రద్దీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

జోరుగా ముందస్తు మొక్కులు

మేడారం, జనవరి 26: తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క సారలమ్మలను దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు శుక్రవారం మేడారం తరలివచ్చారు. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజుల పాటు ఆదివాసీల ఆరాధ్య దేవతలు సమ్మక్క సారలమ్మలకు మహా జాతర ఘనంగా జరగనుంది. ముందస్తుగా మొక్కులు చెల్లించుకోవడానికి భక్తులు తల్లుల గద్దెలకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ములుగు జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ మేడారంలో పర్యటించి సౌకర్యాలను పరిశీలించారు. మందస్తుగా వస్తున్న భక్తులకు కలిగే సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు వైద్యసేవలు అందించకుండా టీటీడీ కల్యాణ మండపంలోని వైద్య శిబిరం మూసివుండడంతో అదనపు కలెక్టర్ శ్రీజ, జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్యకు ఫోన్‌చేసి కారణాలు అడిగారు. బుధ, గురు, ఆదివారాల్లో వైద్యసేవలు అందిస్తున్నామని డీఎంహెచ్‌వో సమాధానం చెప్పడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులు అధికంగా మేడారం వచ్చారని, వారికి ఉచిత వైద్య సేవలు వెంటనే కల్పించాలని ఆదేశించారు. అనంతరం గంట వ్యవధిలో వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. కాగా, మేడారం మహాజాతరకు తరలివచ్చే భక్తులకు సౌకర్యాల్లో భాగంగా జంపన్నవాగు జంట వంతెనలకు ఇరువైపులా రైలింగ్ పనులు అర్‌అండ్‌బీ శాఖ అధికారులు శుక్రవారం ప్రారంభించారు. భక్తులు వాగులోకి తొంగి చూస్తూ పడిపోకుండా ఎత్తుగా నిర్మిస్తున్నారు.

ఉత్సవ విగ్రహాలుగా 'వేదికలు'

- నిర్వహణ లేక నిరుపయోగంగా రైతు వేదికలు
- 18 నెలలుగా మంజూరుకాని నిధులు
- అసాంఘిక శక్తులకు అడ్డాలుగా మారుతున్న వైనం
- కొన్నిటిపైనే దృష్టి సారించిన కొత్త ప్రభుత్వం
- దృశ్య, శ్రవణ కేంద్రాలుగా మార్పునకు చర్యలు

7



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

గుడుంబాను అడ్డుకుంటే కేసులు పెడతారా?

ఎక్సైజ్ అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్

హనుమకొండక్రైం, జనవరి 26: ఎక్సైజ్‌శాఖలో విధుల్లో భాగంగా తాము ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని గుడుంబాను నియంత్రించేందుకు కట్టుదిట్టం చేస్తే తమ విధులకు ఆటంకం కలిగించడంతోపాటు తమసిబ్బందిపైనే పోలీసు కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రొహిబిషన్ అండర్ ఎక్సైజ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి శ్రీనివాస్ ప్రశ్నించారు. గీసుగొండ మండలం జాన్‌పాక గ్రామానికి చెందిన తేజావత్ బుజ్జి చేసిన ఆరోపణలపై శుక్రవారం హనుమకొండ ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తేజావత్ బుజ్జిపై దాడి చేసినట్టు చేసిన ఆరోపణల్లో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. గుడుంబాను విక్రయించకూడదని హెచ్చరించినందుకు కక్షగట్టి తన ఇన్‌స్పెక్టర్ రమేష్‌చందర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయడం సరైంది కాదని అన్నారు. దీనిపై పోలీసులు మరో మారు పునరాలోచించాలని అన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రామకృష్ణ, చంద్రమోహన్, రమేష్‌చందర్, శశికుమారి పాల్గొన్నారు.

సరస్వతీ బ్యారేజి కరకట్ట నిర్మించండి

చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్

మహదేవపూర్, జనవరి 26: కాళేశ్వరం ప్రాజెక్టులోని సరస్వతీ బ్యారేజి వెనక వైపుకు కరకట్ట నిర్మించాలని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ సూచించారు. శుక్రవారం చెన్నూరు నియోజక వర్గానికి సంబంధించిన రైతులతో కలిసి ఆయన సరస్వతీ బ్యారేజిని సందర్శించారు. బ్యారేజిని నిర్మించినప్పటి నుండి ఐదు సంవత్సరాలుగా తమ భూములు ముంపుకు గురవుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రైతులతో కలిసి ఆయన సరస్వతీ బ్యారేజి వద్దకు చేరుకొని గోదావరి పరివాహక ప్రాంతాలను సందర్శించారు. బ్యారేజి వెనుకవైపుకు సుమారు వెయ్యి ఎకరాల భూమి ముంపుకు గురవుతుందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి, అక్కడే ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్‌సి వెంకటేశ్వర్లుకు తెలియజేశారు. తమ భూములు ముంపుకు గురికాకుండా చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఏ చర్యలు తీసుకున్నారంటూ ఎమ్మెల్యే వివేక్ ఈఎన్‌సిని ప్రశ్నించగా తాము బ్యారేజి వెనకవైపుకు 5.7 కిలోమీటర్ల మేర కరకట్ట నిర్మించేందుకు ప్రపోజల్ పంపించామని, అయితే అప్పుడున్న ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో ఆ పనులు మొదలుకాలేదని వివరించారు. దీనికోసం 132 కోట్లు అవసరమవుతాయని వివరించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ తాను సంబంధిత మంత్రితో, అధికారులతో మాట్లాడతానని, పనులు ప్రారంభమయ్యేలా చూడాలని ఈఎన్‌సికి సూచించారు.



మ్యాపు ద్వారా ఎమ్మెల్యే వివేక్‌కు వివరిస్తున్న ఈఎన్‌సీ



కోడిగుడ్లు పంపిణీ చేస్తున్న ప్రదీప్‌రావు

నూతన విధానాలతో పౌల్ట్రీ రంగాన్ని ముందుకు తీసుకెళ్తా..

నెక్ వరంగల్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

సుబేదారి, జనవరి 26: నూతన విధానాలతో పౌల్ట్రీ రంగాన్ని ముందుకు తీసుకెళ్తానని నెక్ వరంగల్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. పౌల్ట్రీ పితామహుడు స్వర్గీయ డాక్టర్ బీవీ రావు 28వ వర్ధంతిని హనుమకొండ హంటర్‌రోడ్‌లోని నెక్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందుగా అసోసియేషన్ అధ్యక్షుడు మార్తినేని ధర్మారావు జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఆధ్వర్యంలో బీవీ రావు స్మారకార్థం కోడిగుడ్లను పంపిణీ చేశారు. నెక్ అభివృద్ధికి బీవీరావు ఎంతో కృషి చేశారని ఆయన ఆశయాలను కొనసాగిస్తామని ఈ సందర్భంగా ప్రదీప్‌రావు అన్నారు. ఈ కార్యక్రమంలో నెక్ వరంగల్ లోకల్ కమిటీ చైర్మన్ ఆవుల చంద్రయ్య, వైస్ చైర్మన్ దండ కరుణాకర్‌రెడ్డి, నెక్ జోనల్ కమిటీ మెంబర్లు టి. సుబ్రహ్మణ్యం, బి.శ్రీనివాస్‌రెడ్డి, అసోసియేషన్ ఉపాధ్యక్షులు జి.రమణారెడ్డి, కోశాధికారి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన స్పార్కిల్

హసన్‌పర్తి, జనవరి 26 : మండలంలోని అనంతసాగర్ వద్ద గల ఎస్సార్ యూనివర్సిటీలో శుక్రవారం రాత్రి జరిగిన సాంస్కృతిక సంబరం స్పార్కిల్-24 అలరించింది. ప్రముఖ సినీ గాయకుడు రామ్ మిరియాల పాటలతో ప్రేక్షకులను మైమరిపించారు. చెమ్కిల అంగిలేసీ ఓ వదినే.., పొట్టిపిల్లా..పొట్టి పిల్లా.., ఓ మాయా మాయా ఓరి మాయారే.., చిట్టీ నీన వ్వంటే లక్ష్మీ పటాసు..వంటి పాటలతో ఉర్రూతలూగించారు. మరో సినీ గాయని సింధూజ శ్రీనివాస్, పాడుతా తీయగా ఫేం శ్రీనివాస భరద్వాజల సినీ గీతాలతో ఉత్తేజపరిచారు. వీరి పాటలకు విద్యార్థులు డ్యాన్స్‌లు చేస్తూ కళాశాల ప్రాంగణం అంతా దుమ్ములేపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పౌరాణిక నాటకం ద్రౌపది వస్త్రాభరణం అకట్టుకుంది. జానపద గీతాల నృత్యాలతో ఉత్సాహపరిచారు. అనంతరం యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎనగందుల వరదారెడ్డి వివిధ ఈవెంట్లలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. మూడు రోజుల పాటు జరిగిన స్పార్కిల్ వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్లు రాజేశ్వర్‌రావు, వినూత్న, శ్రీకర్‌రెడ్డి, డీన్ ఏవీవీ సుధాకర్, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.



పాటలు పాడుతున్న రామ్ మిర్యాల

బల్దియాలో గణతంత్ర వేడుకలు



గణతంత్ర వేడుకల్లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 26: వరంగల్ మహానగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలో జరిగిన వేడుకల్లో కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. నగర ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, కార్యక్రమాల గురించి రిజ్వాన్ తెలియచేశారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన బల్దియా ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందచేశారు. ఇటీవలే బల్దియా ఉద్యోగులకు నిర్వహించిన క్రీడల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీం మసూద్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖలో..

హనుమకొండ క్రైం: 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను వరంగల్ కమిషనరేట్ పరిధిలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంతో పాటు నగరంలోని పలు పోలీసు స్టేషన్‌లు, ఎక్సైజ్ కార్యాలయాలు, డీఐజీ కార్యాలయంలో స్థానిక పోలీసు అధికారులు త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించి దేశభక్తిని చాటుకున్నారు. అనంతరం అక్కడి పోలీసు అధికారులు సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు, పిల్లలకు స్వీట్లు పంచారు. తోటి సిబ్బందికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుని దేశభక్తిని చాటుకున్నారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయం వద్ద సీపీ అంబర్ కిశోర్ ఝా శుక్రవారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాతీయ గీతాన్ని సిబ్బందితో కలిసి ఆలపించారు. అనంతరం సేవా, ఉత్కృష్ట పతకాలను పొందిన పోలీసు సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. సిబ్బందికి పతకాలను సీపీ చేతుల మీదుగా అందించారు. పోలీసు సిబ్బంది పిల్లలకు స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ ఐపీఎస్ శుభం నాగ్, అదనపు డీసీపీలు రాగ్యానాయక్, సంజీవయ్యతో పాటు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు పరిపాలనా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

కేయూలో...

కేయూ క్యాంపస్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కేయూ పరిపాలన భవనం ఎదుట వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వివేచన 19 వాల్యూ 1వ సంచికను ఆవిష్కరించారు. ఎన్‌సీసీ క్యాడెట్ల గౌరవ వందనం స్వీకరించారు.



కమిషనరేట్ కార్యాలయంలో జాతీయ జెండాకు నమస్కరిస్తున్న సీపీ, పోలీసు అధికారులు



కేయూలో ప్రసంగిస్తున్న వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్



పట్టుకున్న మద్యాన్ని చూపిస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

బెల్టుషాపుపై టాస్క్‌ఫోర్స్ దాడులు

హనుమకొండ క్రైం, జనవరి 26: మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలోని శాకరాసికుంటలో ఓ ఇంటిపై వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో రూ.1.65లక్షల విలువగల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. శాకరాసికుంటకు చెందిన ఎనగందుల రాజు కొంతకాలంగా తన ఇంటినే అడ్డాగా చేసుకుని అక్రమ మద్యం విక్రయిస్తున్నట్టు పక్కా సమాచారం అందింది. దీంతో స్థానిక పోలీసులతో కలిసి మూకుమ్మడిగా దాడులు చేసి అక్రమమద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రాజు పోలీసులను చూసి పరారయ్యాడు. ఈ దాడులలో టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు. పట్టుకున్న మద్యాన్ని మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత



నిందితుడి అరెస్టు చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

కాజీపేట, జనవరి 26: కాజీపేట రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్ పోలీసుల తనిఖీలో 16 కిలోల ఎండు గంజాయి పట్టుబడింది. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కాజీపేట రైల్వే స్టేషన్‌లో శుక్రవారం గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు చేపట్టగా ఒడిస్సాకు చెందిన సూర్యనారాయణ అనే వ్యక్తి 16 కిలోల ఎండు గంజాయితో పట్టుబడ్డారు. అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి



మృతుడు సురేష్ (ఫైల్)

నర్సింహులపేట, జనవరి26: ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బొజ్జన్నపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై జి.సతీష్ తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ మండలం సింగారం గ్రామానికి చెందిన చెరుకు సురేష్ (25) నర్సింహులపేట మండలం బొజ్జన్నపేట నుంచి ట్రాక్టర్‌లో మొరం సింగారానికి తరలిస్తుండగా, క్లచ్ విరిగిపోయింది. దీంతో ట్రాక్టర్ ఇంజన్ పైకిలేచి డ్రైవర్ సురేష్‌కు తీవ్రగాయాలుకావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



నిరుపయోగంగా ఉన్న నడికూడలోని రైతు వేదిక

ఉత్సవ విగ్రహాలుగా వేదికలు

- 18 నెలలుగా రాని నిర్వహణ నిధులు
- నిరుపయోగంగా రైతు వేదికలు
- అసాంఘిక శక్తులకు అడ్డాలుగా మారుతున్న వైనం
- కొన్నిటిపైనే దృష్టి సారించిన కొత్త ప్రభుత్వం
- దృశ్య శ్రవణ కేంద్రాలుగా మార్పునకు చర్యలు

హనుమకొండ, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన రైతు వేదికలు నిరుపయోగంగా తయారయ్యాయి. ఈ భవనాల నిర్మాణం పూర్తయినా అధికారులు వీటిని పూర్తి స్థాయిలో వినియోగించడం లేదు. చాలాచోట్ల భవనాలకు తాళాలు వేసి కనిపిస్తున్నాయి. పలుచోట్ల మరికొన్ని చోట్ల మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం లేదన్న సాకుతో వాటిని నిరుపయోగంగా ఉంచుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మొదట్లో ఈ రైతు వేదికలపై దృష్టి సారించింది. వీటిలో కొన్నిటిని ఎంపిక చేసి వీటిని రైతులకు శిక్షణ ఇవ్వడానికి దృశ్య, శ్రవణ కేంద్రాలుగా మార్చాలని నిర్ణయించింది. కానీ ఇంకా పూర్తిగా కార్యరూపం దాల్చలేదు.

"రైతు వేదికల పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు. కొత్త ప్రభుత్వం వీటిని ఏం చేస్తుందనేది కూడా తెలియడం లేదు. గత ప్రభుత్వం వీటిని అట్టహాసంగా ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణ విషయంలో పట్టించుకోక పోవడంతో అవి అన్నీ నిరుపయోగంగా మారాయి. రైతు వేదికల నిర్వహణకు నిధులు ఇవ్వడం నిలిపివేయడంతో వాటి ఆలనాపాలనా చూసే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో అసాంఘిక శక్తులకు అడ్డాలుగా మారాయి. దాదాపు 18 నెలలుగా నిధులు మంజూరు కాకపోవడంతో ఏం చేయాలో తెలియక పాట్లు పడుతున్నామని ఏఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత అయినా వీటిని పట్టించుకుంటుందని రైతులు భావించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతు వేదికల పరిస్థితిపై ప్రత్యేక కథనం."

ఆర్భాటంగా..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతీ ఐదువేల ఎకరాలకు ఒక క్లస్టర్‌గా ఆరు జిల్లాలు - హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో మొత్తం 515 రైతు వేదికలను నిర్మించారు. ఇందుకు రూ.113కోట్లను వెచ్చించారు. ఒక్కో రైతు వేదికకు ప్రభుత్వం రూ.22 లక్షలను ఖర్చు చేశారు. ఈ మొత్తంలో రూ.10లక్షలను ఉపాధి హామీ పథకం నిధుల కింద సమకూర్చగా, మిగతా రూ.12లక్షలను రాష్ట్రప్రభుత్వం విడుదల చేసింది. రైతు వేదికలలో ఏఈవో, రైతు వేదిక కోఆర్డినేటర్లకు ఒక్కొక్కటి చొప్పున చాంబర్, 200 మంది రైతులు కూర్చునేందుకు వీలుగా సమావేశ మందిరం, రిసెప్షన్, రెండు మరుగుదొడ్లు నిర్మించేలా డిజైన్ చేశారు. ఒక్కో వేదిక కోసం కనీసం అర ఎకరం, భూమి లభ్యత ఉన్న చోట ఎకరం ప్రభుత్వం కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన రైతు వేదిక తొలి భవనాన్ని జనగామ జిల్లా కొడకండ్లలో 2020 అక్టోబర్ 31న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అట్టహాసంగా ప్రారంభించారు.

నిర్వహణ భారం

రైతు వేదికల ప్రారంభ సమయంలో ప్రభుత్వం నెలకు రూ.9వేల చొప్పున విడుదల చేయడంతో నిర్వహణ సవ్యంగా సాగింది. ప్రభుత్వం ఇచ్చిన ఈ రూ.9వేలలో పరిశుభ్రతో కోసం రూ.3వేలు, శిక్షణ ఖర్చుల కింద రూ.2,500, స్టేషనరీకి రూ.వెయ్యి, విద్యుత్‌చార్జీల కోసం రూ.వెయ్యి మరమ్మతులకు రూ.వెయ్యి, తాగునీటికి రూ.500 ఖర్చు చేసేవారు. అయితే గతంలో వేదికలను శుభ్రం చేసేందుకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వారు సైతం వేతనాలు ఇవ్వకపోవడంతో పనులకు రావడం లేదు. పలుచోట్ల ఏఈవోలే కొంత మొత్తాన్ని భరిస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో నెలకు రెండుసార్లు పంచాయతీ సిబ్బందితో పనులు చేయిస్తున్నారు. నిర్వహణకు నిధులు ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో నిరుపయోగంగా ఉన్నాయి.

అసాంఘిక శక్తులకు అడ్డా..

రైతు వేదికల వద్ద భద్రత లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు, మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. రాత్రివేళ కనీసం కాపలాదారులు లేక వాటి భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఇక్కడ సమావేశాల నిర్వహణ కోసం ఫర్నిచర్‌ను ఏర్పాటు చేశారు. భద్రత లేకపోవడంతో ఎప్పుడేమి జరుగుతోందనని ఏఈవోలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రతీ నెలా నిధులు కేటాయించడంతోపాటు కాపలాదారులను నియమించాల్సిన అసవరం ఉంది.

దృశ్య శ్రవణ కేంద్రాలు

బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన రైతు వేదికల్లో కొన్నిటిని వాడుకలోకి తీసుకురావాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించుకున్నది. ఎంపిక చేసిన కొన్ని వేదికలను వ్యవసాయంలో రైతులకు శిక్షణ ఇవ్వడానికి దృశ్య, శ్రవణ కేంద్రాలు తీర్చిదిద్దాలని భావించింది. ప్రయోగాత్మకంగా మొదట రాష్ట్రవ్యాప్తంగా 32 రైతు వేదికలను ఇందుకోసం ఎంపిక చేసింది. ఇందులో పరకాల వ్యవసాయ మార్కెట్ సమీపంలో ఉన్న రైతు వేదిక ఒకటి. కానీ తర్వాత నియోజకవర్గానికి ఒకటి చొప్పున వినియోగంలోకి తీసుకురావాలని నిర్ణయించింది. దీనితో పరివేల్పులలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి పరివేల్పుల లో ఉన్న రైతు వేదికను ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపారు. దీనిపై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పందన రాలేదు. పరకాల రైతు వేదికకు దృశ్య, శ్రవణ పరకరాలు మాత్రం వచ్చాయి. సంక్రాంతి పండుగ రోజున అంటే ఈనెల 15న ఈ కేంద్రాలకు ప్రారంభోత్సవం జరుగాల్సి ఉండింది. ఎందుకో ఆ కార్యక్రమం వాయిదా పడింది.

మిగతా వాటి పరిస్థితి ఏమిటి?

కొన్నిటి రైతు వేదికలను మాత్రమే దృశ్య, శ్రవణ కేంద్రాలుగా మార్చితే మిగతావాటి పరిస్థితి ఏమిటన్నది ప్రశ్న. తర్వాతకాలంలో వీటిని కూడా దృశ్య శ్రవణ కేంద్రాలుగా మార్చుతుందా? లేక ఇంతటితోనే సరిపెట్టుకుంటుందా? అన్నదానిపై స్పష్టత లేదు. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతమైతేనే మిగతా రైతు వేదికలను కొత్త ప్రభుత్వం పట్టించుకునేట్టు కనిపిస్తుంది. లేదంటే వాటి పరిస్థితి అయోమయమే. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రైతు వేదికలను వినియోగంలోకి తీసుకురావాలని రైతులు, ఏఈవోలు కోరుతున్నారు. సీజన్లలో రైతులకు పంటలపై తగిన శిక్షణ ఇవ్వడానికి వీలుగా కనీసం నిర్వహణ ఖర్చులైన ఇవ్వాలని వారు కోరుతున్నారు. రైతు వేదికల్లో కనీసం ఒక స్వీపరును, వాచ్‌మెన్ అయినా నియమించాలని కోరుతున్నారు. లేకుంటే అవి క్రమంగా నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకునే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందులోని వస్తువులు దొంగలపాలయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.



కాలిన గాయాలతో సతీష్

యజమాని తిట్టాడని ఆత్మహత్యాయత్నం

మేడారం, జనవరి 26: యజమాని తిట్టాడని పెట్రోల్ పోసుకొని యువకుడు నిప్పంటించుకున్న ఘటన తాడ్వాయి మండలం మేడారంలో వనదేవతల గద్దెల ముఖద్వారం ఎదుట శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఊరుగొండకు చెందిన మేడిపల్లి సతీష్ అనే యువకుడు గత కొన్ని రోజులుగా వరంగల్ జిల్లా కరీమాబాద్‌లోని ఆర్ముఖ బార్‌లో పని చేస్తున్నాడు. శుక్రవారం మేడారం వనదేవతల దర్శనానికి బార్ యజమాని, సతీష్‌తో పాటుగా సహ పనివారిని తీసుకువచ్చారు. వనదేవతల దర్శనం అనంతరం భోజనాల సమయంలో యజమాని మందలించడంతో సమ్మక్క సారలమ్మల దేవస్థానం ప్రధాన ద్వారం ఎదుట పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. స్థానికులు మంటలు ఆర్పి ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా సతీష్ శరీరం 80 శాతం కాలిపోయిందని డాక్టర్లు తెలిపారు. విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

డ్రెయినేజీలోకి దూసుకెళ్లిన ప్రైవేట్ పాఠశాల బస్సు



డ్రెయినేజీలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

వెంకటాపూర్ (రామప్ప), జనవరి 26: ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు సైడ్ డ్రెయినేజీలోకి దూసుకెళ్లిన సంఘటన మండలంలోని రామాంజాపూర్ గ్రామంలో శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే...భూపాలపల్లి జిల్లా గణపురం మండలకేంద్రానికి చెందిన నారాయణ హైస్కూల్‌కు చెందిన బస్సు 20మంది విద్యార్థులను ఎక్కించుకుని మండలకేంద్రం వైపు ప్రయాణమైంది. ఈక్రమంలో బస్సు నడుపుతున్న డ్రైవర్ మద్యం మత్తులో ఉండడంతో రామాంజాపూర్‌కు చేరుకోగానే అదుపుతప్పి సైడ్ డ్రెయినేజీలోకి దూసుకెళ్లి పల్టీలు కొట్టబోయి ఆగిపోయింది. డ్రైవర్ మద్యంమత్తులో ఉండడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. కాగా, ఈసంఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



ఐటీడీఏ ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న పీవో అంకిత్

గిరిజనుల అభివృద్ధే ఐటీడీఏ ధ్యేయం

గణతంత్ర దినోత్సవంలో ప్రాజెక్టు అధికారి అంకిత్

ఏటూరునాగారం రూరల్, జనవరి 26: ఐటీడీఏ పరిధిలోని గిరిజనులకు విద్య, వైద్యం, ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తూ వారికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంతో ఐటీడీఏ కృషి చేస్తోందని ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ అంకిత్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో 75వ గణతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఐటీడీఏ జరిగిన వేడుకల్లో ఐటీడీఏ పీవో పాల్గొని పోలీసులచే గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా పీవో మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లో జీవిస్తున్న గిరిజనులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని రకాల కార్యక్రమాలను సకాలంలో అమలు చేస్తూ వారి అభ్యున్నతికి పాటు పడుతున్నట్లు పీవో తెలిపారు. వచ్చే నెలలో జరగనున్న మేడారం మహాజాతరను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని, 21శాఖల ద్వారా రూ. 75కోట్లతో మేడారంలో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు పీవో తెలిపారు.

విద్యా విభాగం

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో మొత్తం 25,572 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, పదో తరగతి చదువుతున్న విద్యార్థుల పట్ల ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేశామని, రానున్న వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులను సంసిద్ధం చేస్తున్నామని పీవో తెలిపారు.

వైద్య విభాగం

ఐటీడీఏ పరిధిలో ఒక జిల్లా ఆస్పత్రి, మూడు సామాజిక ఆస్పత్రులు, 22ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 122 ఉప ఆరోగ్య కేంద్రాలున్నాయని, వానాకాలంలో దోమల వల్ల వ్యాధులు ప్రబలే అవకాశమున్నా 174 ఏజెన్సీ గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాల్లో దోమ తెరల పంపిణీతోపాటు దోమల మందును పిచికారి చేసి రోగాలను అరికట్టామన్నారు. ఎంసీహెచ్ ఎపిడమిక్ స్కీం ద్వారా ఏప్రిల్ 2023 నుంచి డిసెంబరు 2023 వరకు 1473 మెడికల్ క్యాంపులు నిర్వహించి 69,492 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పీవో తెలిపారు. మూడు ఉచిత అంబులెన్స్ పథకం ద్వారా ఇప్పటీ వరకు 3,973మందికి ఉచితంగా వైద్యసేవలందించమన్నారు. 22 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బాలింతలను గుర్తించి వారికి న్యూట్రీషన్‌కిట్లను ఉచితంగా పంపిణీ చేశామన్నారు.

ఇంజనీరింగ్ విభాగం

ఎడ్యుకేషనల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఆర్టిక్ 275 కింద గిరిజన భవనాలు, బీటీ రోడ్లు, పాఠశాలల మరమ్మతులకు రూ.528.44 కోట్లు నిధులు కేటాయించగా ఇందులో 1,055 పనులు పూర్తయ్యాయని, 104పనులు పురోగతిలో ఉన్నట్లు పీవో తెలిపారు. అదేవిధంగా ఐటీడీఏపరిధిలో 117 అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణాలకుగాను రూ.500కోట్లు మంజూరు చేశామన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ కింద 44సబ్ సెంటర్ల భవనాల నిర్మాణాలకు రూ.704లక్షలు మంజూరైనట్లు వివరించారు. ఇందులో 35పనులు పూర్తి కాగా 9పనులు పురోగతిలో ఉన్నట్లు పీవో తెలిపారు.

ట్రైకార్

ఉమ్మడి వరంగల్ జిల్లాకు 2020-21, 2022 సంవత్సరానికిగాను 6,761 యూనిట్ల సబ్సిడీ మంజూరు అయ్యాయని, వాటిని మండలాల వారీగా విభజించి మండల అభివృద్ధి అధికారులకు పంపించి ఆన్‌లైన్‌లో పరిశీలించి ఇప్పటివరకు 3,318 యూనిట్లు మంజూరు చేశామన్నారు. సబ్సిడీ డబ్బులు త్వరలో విడుదల చేయనున్నట్లు పీవో వెల్లడించారు. అదేవిధంగా ఎంఎస్ఎంఈ పథకం ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 3 ఇటుకల తయారీ యూనిట్లు, 4సెంట్రింగ్ యూనిట్లు, 4 కాంక్రీట్ మిక్స్, ఫుడ్ ట్రాక్ యూనిట్లు గిరిజనులకు మంజూరు చేశామని పీవో తెలిపారు.

గిరిజన మత్స్య పారిశ్రామిక

గిరిజన రైతులకు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన మత్స్య పారిశ్రామిక సొసైటీలను ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 15 ఏజెన్సీ మండలాల్లో 814 చెరువులు ఉండగా 101 సొసైటీల రిజిస్ట్రేషన్ జరిగిందని, సొసైటీలకు రూ.కోటి70లక్షల 88వేల చేపపిల్లలను అందించామన్నారు. అదేవిధంగా ప్రధానమంత్రి మత్స్య సంపద పథకం ద్వారా 7చేపల చెరువులు నిర్మించేందుకు అనుమతి మంజూరు చేశామని, 3యూనిట్లకుగాను రూ.14.8లక్షల సబ్సిడీని గిరిజనులకు విడుదల చేశామన్నారు. అదేవిధంగా గిరిజన మత్స్యకారులకు 37 బైక్‌లు, 2 ఆటోలను మంజూరు చేశామన్నారు.

గిరి వికాసం

గిరివికాసం పథకం ద్వారా గిరిజన రైతుల పొలాల్లో నీటి వసతుల కల్పన కోసం గిరి వికాసం పథకాన్ని అమలు చేస్తున్నామని, ఇందుకోసం గిరిజన రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించామని, ఇప్పటివరకు 3,018 దరఖాస్తులను స్వీకరించామని తెలిపారు. దీనికిగాను రూ.954.98లక్షల నిధులను మంజూరు చేశామన్నారు. అదేవిధంగా గిరిజన సహాయనిధి పథకం కింద 476 మందికి రూ.51.17లక్షల నిధులను అందజేశామన్నారు. గిరిజనులు ఆర్థికంగా సామాజికంగా స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం ఎంతో తోడ్పాటునందిస్తోందని పీవో వెల్లడించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలని పీవో పిలుపునిచ్చారు. కాగా, ఐటీడీఏలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమంలో ఏపీవో వసంతరావు, ఏవో దామోదరస్వామి, ఎస్ వో రాజ్ కుమార్, డీడీ పోచం, ఈఈ హేమలత, మేనేజర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జెండా పండుగలో ప్రొటోకాల్ రగడ

- బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల తోపులాట
- పోలీసుల చొరవతో సద్దుమణిగిన గొడవ
- ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జెండా ఎగురవేసిన హైస్కూల్ హెచ్ఎం




జెండా కర్రను గుంజుకుంటున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు

తొర్రూరు, జనవరి 26 : జాతీయ జెండాను ఎగురవేసేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య ప్రొటోకాల్ రగడ శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా డివిజన్ కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వంద అడుగుల జాతీయ జెండా వద్ద గణతంత్ర దినోత్సవ సందర్భంగా జెండా ఎగురవేసేందుకు జెండా కమిటీ నిర్వాహకులు ఎంపీపీ అంజయ్యను ఆహ్వానించారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో అధికారులు మాత్రమే జెండా ఆవిష్కరణ చేయాలని, బీఆర్ఎస్ నాయకులు చేయవద్దని కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టడంతో ఇరువురి మధ్య వాగ్వావాదం చోటుచేసుకుంది. ఏర్పాటు చేసిన జెండాను తొలగించి కర్రను ఒకరికొకరు గుంజుకోవడం చేశారు. జాతీయ జెండా ఏర్పాటు కోసం నిర్వహణ కమిటీ రూ.20 లక్షల నిధులతో ఫెన్సింగ్, గార్డెనింగ్, సీసీకెమెరాల ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశామని, మేమే జెండా ఎగురవేయాలని, ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ అధికారులే జెండా ఆవిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు గొడవకు దిగారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జరుగుతున్న జెండా వేడుకలకు అధికారులు ఎమ్మెల్యేను, ఇతర ప్రభుత్వ అధికారులను పిలవకుండా ప్రొటోకాల్ పాటించలేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. వంద అడుగుల జెండాను ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేసుకుని నిర్వహిస్తుంటే ప్రజా ప్రతినిధులను, అధికారులను పిలవాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ఇరు వర్గాలను హెచ్చరించారు. జెండా ఎగురవేయకుండా ఆపడం సరికాదని ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం జెల్ల లక్ష్మినారాయణతో జెండా ఆవిష్కరణ చేపట్టారు. సంఘటనా స్థలానికి సీఐ సత్యనారాయణ, ఎస్సై జగదీష్, ఆర్డీవో నర్సింహ రావు, ఇతర అధికారులు వచ్చి పరిస్థితిని సమీక్షించారు.

ఒకే ప్రాంగణంలో రెండు జెండాలు

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్ఎం లక్ష్మినారాయణ గణతంత్ర దినోత్సవ వేడుకల జెండా ఆవిష్కరించారు. అదే పాఠశాల ఆవరణలో ఉన్న వంద అడుగుల జాతీయ జెండా వద్ద ఏర్పాటు చేసిన మరో జెండాను కూడా హెచ్ఎం లక్ష్మి నారాయణ ఆవిష్కరించారు. ఒకే ప్రాంగణంలో రెండు జెండాల ఆవిష్కరణపై హెచ్ఎం లక్ష్మి నారాయణను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జెండా ఆవిష్కరించానని తెలిపారు.



జెండాను ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ రవిందర్‌రావు

డీసీసీబీ కార్యాలయంలో రిపబ్లిక్ డే వేడుకలు

హనుమకొండ టౌన్, జనవరి 26: 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను హనుమకొండలోని డీసీసీబీ హెడ్ ఆఫీస్‌లో ఘనంగా నిర్వహించారు. చైర్మన్ మార్నేని రవిందర్ రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్లు జగన్‌మోహన్‌రావు, రవిరాజ, నరేందర్, సీఈవో ఎండి.వజీర్ సుల్తాన్, డీజీఎం కురువ నాయక్, ఏజీఎం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సీపీ చేతుల మీదుగా ఉత్కృష్ట సేవాపతకాన్ని స్వీకరిస్తున్న రమేష్

ఒంటేరు రమేష్‌కు ఉత్కృష్ట సేవాపతకం

సీపీ అంబర్ కిశోర్ ఝా చేతుల మీదుగా స్వీకరణ

హనుమకొండ క్రైం, జనవరి 26: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఎస్‌బీ (స్పెషల్ బ్రాంచి)లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఒంటేరు రమేష్‌కు పోలీసు శాఖలో ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన ఉత్కృష్ట సేవా పతకం లభించింది. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసినకాలంలో స్థానిక ప్రజలకు విశేష సేవలను అందించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిషలు కృషి చేసిందుకు కాగాను ఉత్కృష్ట సేవా పతకం లభించింది. శుక్రవారం వరంగల్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా, హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్‌ల చేతుల మీదుగా పతకాన్ని స్వీకరించారు. తనకు ఉత్కృష్ట సేవాపతకం రావడం చాలా ఆనందంగా ఉందని, తన సేవలను గుర్తించిన పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు రమేష్ తెలిపారు. రమేష్‌కు ఎస్‌బీ విభాగం అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న కిరణ్ కుమార్

రాష్ట్రస్థాయి ఉత్తమ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా కిరణ్‌కుమార్

హనుమకొండ అర్బన్, జనవరి 26: ఔషధ నియంత్రణ శాఖ హనుమకొండ జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జన్ను కిరణ్ కుమార్ రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఔషధ నియంత్రణ శాఖ డైరెక్టర్ జనరల్ కమల్ హాసన్‌రెడ్డి చేతులమీదుగా ఉత్తమ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అవార్డును కిరణ్ కుమార్ అందుకున్నారు. విధి నిర్వహణలో కచ్చితత్వమే అవార్డు తెచ్చిపెట్టిందని పలువురు కెమిస్టులు ప్రశంసించారు.



అవార్డులు అందుకుంటున్న సిబ్బంది

జైలు సిబ్బందికి అవార్డులు

హనుమకొండ రూరల్, జనవరి 26: వరంగల్ కేంద్ర కారాగారం నుంచి ముగ్గురు అధికారులు గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో ప్రత్యేక అవార్డులను అందుకున్నారు. కేంద్ర కారాగార డీజీ సౌమ్యామిశ్రా వారికి అవార్డులను ప్రదానం చేశారు. అవార్డులు అందుకున్న వారిలో పరావస్తు వెంకటేశ్వరస్వామికి ఎక్సలెన్స్ సర్వీస్ కింద రూ.5వేల క్యాష్ రివార్డు, డిప్యూటీ జైలర్ శెంకేసి వెంకటేశ్వర్లు ఔట్‌స్టాండింగ్ ఫెర్మామెన్స్ కింద, హెడ్‌వార్డర్ మెట్టు చంద్రమౌళి, జూనియర్ అసిస్టెంట్ టి.ప్రతిభారాణి అందుకున్నారు.



రైల్వే క్రీడల విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఎంఈ

కాజీపేట, జనవరి 26: కాజీపేట రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి నిర్వహించిన క్రికెట్ క్రీడా పోటీల విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు.. రైల్వే కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ఈ బహుమతుల ప్రదానంలో ముఖ్య అతిథిగా సీనియర్ డీఈఈ ఆర్.ప్రశాంత్ కృష్ణసాయి, డీఎంఈ ఎ.స్వరాజ్ కుమార్, మజ్దూర్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్‌లు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. క్రికెట్ ఫైనల్‌లో గెలిచిన డీజిల్ షెడ్ ఇనిస్టిట్యూట్ జట్టుకు ట్రోఫీ, రన్నర్‌గా నిలిచిన ఆర్పీఎఫ్ జట్టుకు సైతం ట్రోఫీ అందజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే డాక్టర్ ఐ.నిరంజన్, రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య, కోశాధికారి జి.రాజేశ్వర్ రావు తోపాటు ఇనిస్టిట్యూట్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గణతంత్ర దినోత్సవం

హనుమకొండ రూరల్, జనవరి 26: 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ప్రభుత్వ, ప్రయివేట్, వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థల్లో శుక్రవారం జాతీయ జెండాలను ఆవిష్కరించి వందనం సమర్పించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, మహేందర్‌జీ, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, కలెక్టరేట్‌లోని అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

- హనుమకొండ సిటీ : హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియచేశారు. అలాగే హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, సిరిసిల్ల రాజయ్య, అజీజ్‌ఖాన్‌తో పాటు కార్పొరేటర్లు తోట వెంకన్న, పోతుల శ్రీమాన్, వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
- హనుమకొండ టౌన్ : హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించా రు. ఈ వేడుకల్లో జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, నేతలు మర్రి యాదవరెడ్డి, వాసుదేవరెడ్డి, పులి రజనీకాంత్, రవిందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.
- హంటర్‌రోడ్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో సంఘం కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు.
- టీఎన్‌జీవో భవన్‌లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు.
- హనుమకొండ బాలసముద్రంలోని మనోవికాస విద్యాలయ ఫర్ స్పెషల్ చిల్డ్రన్ సెంటర్‌లో శుక్రవారం గణతంత్ర వేడుకలు నిర్వహించారు. జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి మేన శ్రీను, మెప్మా పీడీ భద్రునాయక్ చిన్నారులను అభినందించి బహుమతులను అందజేశారు.
- గణతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం హనుమకొండ కేయూసీ రోడ్‌లోని ఏకశిల హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ నాయకుల చిత్రపటాలకు ప్రిన్సిపాల్ బేతి శైలజారెడ్డి పూలమాలలు వేసి అనంతరం జాతీయ జెండారు ఆవిష్కరించారు. చిన్నారులు వివిధ జాతీయ నాయకుల వేషాధారణతో ముస్తాబైన తీరు అందరిని అలరించింది. ఈ కార్యక్రమంలో ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి, డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బేతి శైలజారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- హనుమకొండ(ఆంధ్రజ్యోతి): వరంగల్ హంటర్ రోడ్డులోని వరంగల్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌లో శుక్రవారం ఘనతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. వరంగల్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట సంపత్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఇదే అసోసియేషన్ కార్యాలయలో హనుమకొండ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యలో కూడా గణతంత్ర వేడుకలు జరిగాయి. హనుమకొండ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రబెల్లి వెంకటేశ్వర్‌రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. వరంగల్ జానపద గిరిజన విజ్ఞానపీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పీఠాధిపతి ఆచార్య భూక్యా బాబురావు జాతీయ జెండాను ఆవిష్కరించి, మాట్లాడారు.


కలెక్టరేట్‌లో జాతీయజెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఇతర జిల్లా అధికారులు


డీసీసీ భవన్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో పశ్చిమ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని


బీజేపీ జిల్లా కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న రావు పద్మ


వర్సిటీ ప్రాంగణంలో జెండాను ఎగురవేస్తున్న భూక్యా బాబురావు

- హనుమకొండ క్రైం: కొత్తూరుజెండాలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డివిజన్ కార్పొరేటర్ పోతుల శ్రీమాన్ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రాజయ్య, గణేష్‌కుమార్, శ్రవన్, కరుణశ్రీ, శ్రవంతి, రాకేశ్, సురేందర్ పాల్గొన్నారు.
- మడికొండ: గ్రేటర్ వరంగల్ 45, 46, 64 డివిజన్ల పరిధిలో గణతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మడికొండ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ గుజ్జేటి వేణు త్రివర్ణ పతాకాన్ని ఎగురువేశారు.
- సుబేదారి: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాంనగర్‌లోని పెన్షనర్స్ కార్యాలయంలో పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఇ.నర్సింహారెడ్డి జాతీయ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరై పెన్షనర్ల నూతన సంవత్సర డైరీ ఆవిష్కరించారు.


వేడుకల్లో పాల్గొన్న వినయభాస్కర్

- వడ్డెపల్లి: 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని పాత గ్రామ పంచాయతీ, మహిళా సంఘం కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం స్థానిక కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్ జాతీయ జెండాను ఎగరవేశారు. హనుమకొండ సుబేదారిలోని తెలంగాణ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు ఎండి సాబీర్, ప్రధాన కార్యదర్శి మోరె రాజేష్, గౌరవ అధ్యక్షుడు చిర్ర వెంకటస్వామి గౌడ్, కంజెర్ల సతీష్ త్రివర్ణ పతాకాన్ని ఎగరవేశారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని బోడ అనయ్ డిన్న ఆధ్వర్యంలో వరంగల్ పోచమ్మ మైదాన్ నుంచి హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వరకు జాతీయ జెండాలతో భారీ పాదయాత్ర, ర్యాలీని నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగరవేశారు. 58వ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలో తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్ బాస్కర్, కార్పొరేటర్ ఇమ్మడి లోహిత రాజు, రాఘవేంద్ర నగర్ ఫేస్ -2లో కాలనీ అధ్యక్షుడు కొత్త కనకయ్య జాతీయ జెండాను ఎగరవేశారు.
- హనుమకొండ నయీంనగర్ ప్రాంతంలోని మోషన్ కాలేజీలో కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ మహనీయులైన డాక్టర్ బీఆర్. అంబేద్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ చిర్ర గణేష్ గౌడ్, కోట అధ్యాపకులు శుభం, కుమార మంగళం, అనూప్‌కపూర్, సాహిల్ కాత్యా, కళాశాల సిబ్బంది రామకృష్ణ, మురళి, తాళ్లపల్లి రమేష్‌గౌడ్, శశిధర్, భాగ్యలక్ష్మి, ప్రియాంక, ధరణి, అరుణ, శిల్ప తదితరులు పాల్గొన్నారు.
- నయీంనగర్: హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో శుక్రవారం ఘనంగా గణతంత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి హాజరై జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు.
- ధర్మసాగర్: గణతంత్ర దినోత్సవ వేడుకలు ధర్మసాగర్, వేలేరు మండలాలో ఘనంగ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దపెండ్యాల ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో మాజీ వీసీ వేణుగోపాల్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించారు. ధర్మసాగర్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సదానందం, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కవిత, పీఎస్‌లో సీఐ శ్రీధర్‌రావు, ఆరోగ్య కేంద్రంలో గోపినాధ్, ఏవో కార్యాలయంలో పద్మ జాతీయ జెండాను ఎగరవేశారు. వేలేరు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ కోమి జాతీయ జెండాను ఎగరవేశారు.
- ఐనవోలు: గణతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. ఎంపీపీ మార్నేని మధుమతి, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎస్సై అనిల్‌కుమార్, ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, నందనం సొసైటీ వైస్ చైర్మన్ టి. చందర్‌రావు, పీహెచ్‌సీ డాక్టర్ శ్రీనివాస్‌లతో పాటు ఆయా శాఖల అధికారులు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో హెచ్‌ఎంలు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కార్యాలయాల ఎదుట జెండాలను ఆవిష్కరించి గణతంత్ర వేడుకల సందేశాన్ని అందజేశారు.
- కాజీపేట: కాజీపేటలో శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బావుసింగ్ జెండా ఆవిష్కరించారు. 62వ డివిజన్‌లోని పలు కాలనీలలో స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, 63వ డివిజ్‌లో స్థానిక కార్పొరేటర్ విజయ శ్రీ రజాలీ, 47వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ సంకు నర్సింగరావు జెండా ఆవిష్కరించారు. బాపూజీనగర్‌లో టీడీపీ వరంగల్ పార్లమెంట్ అధ్యక్షుడు అర్షనపల్లి విద్యాసాగర్ రావు పాల్గొని జెండా ఆవిష్కరించారు. నిట్‌లో నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి జెండా ఆవిష్కరించారు. రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్‌లో సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ జెండా ఆవిష్కరించారు. రైల్వే ఓబీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్‌లో సీనియర్ కార్మిక నాయకుడు కె. రాజేందర్ జెండా ఆవిష్కరించారు. ఆటోడ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చౌరస్తాలో జరిగిన జెండా ఆవిష్కరణలో ట్రాఫిక్ సీఐ సుజాత జెండా ఆవిష్కరించారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన జెండా ఆవిష్కరణలో క్లబ్ అధ్యక్షుడు వెనిశెట్టి రఘు, పాల్గొని జెండా ఆవిష్కరించారు.

ఆకట్టుకున్న ఆటపాట..



వడ్డెపల్లి, జనవరి 26 : గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం రాత్రి విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ... సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనడం అభినందనీయమని అన్నారు. వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయని అన్నారు. కార్యక్రమంలో వరంగల్ మహానగర పాలక సంస్థ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, మహేందర్‌జీ, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సౌరం ప్రవీణ్‌కుమార్, కాజీపేట ట్రాఫిక్ ఎస్సై రావెల్ల రామారావుతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో

మడికొండ, జనవరి 26 : మడికొండలోని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బ్రాంచి మేనేజర్ వర్ధినేని రఘుపతిరావు మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందన సమర్పణ చేశారు. వివిధ విభాగాల హెచ్‌వోడీలు, సిబ్బంది, మాస్టార్జీ స్కూల్ విద్యార్థులతో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ బైరి అజయ్, అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్ ఎమ్డీ షరీఫ్, షెడ్యూలింగ్ ఆఫీసర్ కాయల వేణయ్య, అకౌంటెంట్ సాయిని వెంకటేష్, స్టోర్ ఇన్‌చార్జి గుండెబోయిన రవి, ఎడిటోరియల్ అసిస్టెంట్ పబ్బ రాజేందర్, కార్యాలయ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


జాతీయ జెండా ఎగురవేసి వందన సమర్పణ చేస్తున్న బ్రాంచి మేనేజర్ రఘుపతిరావు

రూ.239.81 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం..

మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్

ఐనవోలు, జనవరి 26: వర్ధన్నపేట పట్టణం పదేళ్లకు ముందు ఎలా ఉంది? మునిసిపాలిటీగా మారాక ఇప్పుడు ఎలా ఉందో ప్రజలు గమనిస్తున్నారని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ అన్నారు. ఐనవోలు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వర్ధన్నపేట మునిసిపాలిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం జరిగింది. మాజీ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. వర్ధన్నపేట నూతన మునిసిపాలిటీగా ఏర్పడిన తర్వాత రూ.239.81కోట్ల ప్రత్యేక నిధులు తీసుకవచ్చి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలపడమే కాకుండా ప్రతీ గడపగడపకూ సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషిచేశామన్నారు. దురదృష్టవశాత్తు ఓటమి చెందామని, ప్రజా తీర్పును గౌరవిస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటం చెద్దామని పిలుపునిచ్చారు. ఓటమికి కుంగిపోవాల్సిన అవసరం లేదని, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేయడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు ఎటువంటి కష్టం వచ్చినా నిత్యం అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, మునిసిపాలిటీలో అభివృద్ధి పనులను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మునిసిపల్ చైర్మన్ అరుణ, వైస్ చైర్మన్ కొమాళ్ల ఎలేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్లు నాయకులు తుమ్మల యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో వాహనాల ర్యాలీ

సుబేదారి, జనవరి 26: నాలుగు కార్మిక కోడ్‌లను (నల్ల చట్టాలను)రద్దు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్ నుంచి కలెక్టరేట్ వరకు ట్రాక్టర్, ద్విచక్ర వాహన ర్యాలీ తీశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, ఈ చట్టాలు రద్దు చేసే వరకు పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని సీఐటీయూ నాయకులు అన్నారు. ఈ ర్యాలీలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చుక్కయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు టి.ఉప్పలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సారంపెల్లి వాసుదేవరెడ్డి, సీఐటీయూ నాయకులు చక్రపాణి, వెంకట్, లింగయ్య, సారంగపాణి, అశోక్, రవితోపాటు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాల అందజేత

హనుమకొండ రూరల్, జనవరి 26: జిల్లాలో వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల ఉత్తమ సేవలను గుర్తించి గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులను అందజేశారు.


కలెక్టర్ సిక్తా పట్నాయక్, సీపీ అంబర్ కిశోర్‌ఝా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఇండస్ట్రీస్ జీఎం హరిప్రసాద్


అబ్దుల్ హై డీఈవో | నాగేశ్వర్‌రావు కో ఆపరేటివ్ ఆఫీసర్ | సత్యనారాయణరెడ్డి సీపీవో | గుజ్జ రాజు డీడీ ట్రెజరీ


ఎల్.రమేశ్ ఆర్డీవో | పి.సురేశ్‌బాబు డిప్యూటీ ఈఈ ఆర్‌అండ్‌బీ | ఐవి. శ్రీనివాసరావు, ఉత్తమ సామాజికవేత్త | కె.సత్యనారాయణ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ | కె.సూర్యనారాయణ నాయబ్ తహసీల్దార్ | టి.గౌరవిశంకర్ సూపరింటెండెంట్ | ఎవిఎన్‌వి.ప్రసాద్‌రావు సూపరింటెండెంట్


డి.రామకృష్ణ నాయబ్ తహసీల్దార్ | రాజేష్, సీసీ | మురళీకృష్ణ, సీసీ | వేణు, ఫొటో గ్రాఫర్ | రామస్వామి రికార్డు అసిస్టెంట్ | యాకూబ్‌పాషా ఆఫీస్ సబార్డినేట్ | రాజేంద్ర ప్రసాద్ ఆర్ఐ


యాకూబ్‌పాషా జమేదార్ | మల్లయ్య అటెండర్ | కృష్ణ ఆర్ఐ | సంగి చైతన్య సోషల్ వర్కర్ | బాలాజీ 108 | చైతన్య, 108 | పి.శ్రీనివాస్, డీఆర్‌డీపీ

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

5వ పేజీ తరువాయి

రూ.16.93కోట్ల పనిదినాల లక్ష్యానికిగాను 16.93 లక్షల పనిదినాలు కల్పించినట్టు కలెక్టర్ తెలిపారు. ఇందుకుగాను రూ.56.17కోట్లు ఖర్చు చేసినట్టు చెప్పారు. 2023-24 సంవత్సరానికి స్త్రీనిధి పథకం ద్వారా 1,271 మహిళా స్వయం సహాయక సంఘాలలోని 3,096 సభ్యులకు ఇప్పటి వరకు రూ.26.48కోట్ల రుణ సహాయం అందించినట్టు తెలిపారు. 2023-24 సంవత్సరానికి 8,625 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.400కోట్లు లక్ష్యంకాగా, 3,377 ఎస్‌హెచ్‌జీలకు రూ.248కోట్లను బ్యాంకు లింకేజీ రూపంలో ఇప్పటి వరకు అందచేసినట్టు తెలిపారు. పట్టణ పరిధిలోని 1,567 ఎస్‌హెచ్‌జీలకు 2023-24 సంవత్సరంలో రూ.148.35కోట్లను వివిధ బ్యాంకుల ద్వారా రుణాలను అందించినట్టు చెప్పారు.

కుడా

కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) పరిధిలోని ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు 2014 నుంచి 2024 వరకు రూ.230కోట్లను వెచ్చించినట్టు తెలిపారు. ఈ సంవత్సరం రూ.38కోట్లతో భద్రకాళి మాడవీధులు, రూ.74.50 కోట్లతో వరంగల్ బస్టాండ్ పునర్నిర్మాణం, రూ.50కోట్లతో నాయుడు పెట్రోల్ బంక్ నుంచి ఏనుమాముల మార్కెట్ వరకు ఇన్నర్ రోడ్డు నిర్మాణం, ఉనికిచెర్లలో 135 ఎకరాల్లో మోడల్ లేఅవుట్ అభివృద్ధి నిర్మాణాలకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కాళోజీ కళాక్షేత్రం పనులు ముగింపు దశకు చేరుకున్నాయని తెలిపారు. వరంగల్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సాధారణ నిధుల కింద 2014 నుంచి రూ.402తో రూ.3,814 పనులు పూర్తికాగా, 89 పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని, స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద రూ.50కోట్లతో 244 పనులు మంజూరు కాగా, 37 పనులు పూర్తి అయ్యాయని, మిగతావి పురోగతిలో ఉన్నాయని కలెక్టర్ వివరించారు. స్మార్ట్‌సిటీ పథకం కింద రూ.750కోట్లతో 77 పనులు చేపట్టినట్టు చెప్పారు. జిల్లాలో ఆర్‌అండ్‌బీ పరిధిలో రూ.615కోట్లతో 81 రోడ్డు పనులు, 3 ఆర్‌ఓబీలు, 7 భవన నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు.

పర్యాటకం

భీమదేవరపల్లి మండలం వంగరలో రూ.11కోట్లతో దివంగత మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు విజ్ఞాన వేదిక అభివృద్ధి పనులు చివరి దశలో ఉన్నాయని, భద్రకాళి వద్ద రూ.1.25కోట్లతో అన్నదాన సత్రం, షాపింగ్ కాంప్లెక్స్ రూఫ్ వర్క్ పూర్తయిందని, రూ.4కోట్లతో కొత్తకొండలో హరిత హోటల్ నిర్మాణం జరిగిందని తెలిపారు.

దివ్యాంగ విద్యార్థికి వీల్‌చైర్ అందజేత

హనుమకొండ రూరల్, జనవరి 26: విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొండపర్తి గ్రామానికి చెందిన ఏకే రిత్విక్‌రెడ్డి అనే దివ్యాంగ విద్యార్థి సౌకర్యార్థం శుక్రవారం ధీరా లయన్స్‌క్లబ్ సభ్యులు కేశిరెడ్డి మాధవి వీల్‌చైర్, ఫౌండేషన్ తరుపున రూ.3వేల ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్ల మహేందర్ మాట్లాడుతూ.. దివ్యాంగుల చట్టం 2016 ప్రకారం ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గురిజాల తిరుపతిరెడ్డి, కె.నరేందర్, రాజేశ్వరి, సురేందర్, అనిత, శ్రీనివాసులు, వాణీరాణి, శృతి, స్వరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శోభా యాత్ర

వడ్డెపల్లి, జనవరి 26: వరంగల్, హనుమకొండ జిల్లాల ధర్మసమాజ్ పార్టీ నేతల ఆధ్వర్యంలో శుక్రవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ మహానగర పాలక సంస్థ నుంచి హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గల భారత రాజ్యాంగ స్తూపం వరకు శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ హనుమకొండ, వరంగల్ జిల్లాల నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

ఐనవోలు, జనవరి 26 : ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మార్నేని ఉదయబానురావు క్రీడా విజేతలకు రూ.10 వేల విలువచేసే షీల్డులు, బహుమతులు అందజేసి దాతృత్వాన్ని చాటారు. వెంకటాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దాత పిండి రవీందర్ విద్యార్థులకు క్రికెట్ కిట్, షటిల్ కిట్, క్యారం సెట్, చెస్ బోర్డులను విరాళంగా అందజేశారు. క్రీడల్లో రాణించిన 8 మంది విద్యార్థులకు రూ. వేయి చొప్పున నగదు బహుమతిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు జన్ను కుమారస్వామి, గొర్రె రేణుక, ఉప సర్పంచ్ సతీష్, హెచ్‌ఎంలు వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బర్మాకు మనకు ఉన్న సారూప్యత ఏవి ఎటి? ఆహారం. ఈ సమాధానం విని చాలా మంది ఆశ్చర్యపోతారు. కానీ బర్మాలో కూడా మనలాగే వెల్లుల్లి, అల్లం, ఎండుమెరపకాయల వంటివి లేకుండా వంట పూర్తి కాదు. ఇంకో ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే- బర్మాలో శాఖాహారుల సంఖ్య చాలా ఎక్కువ. దోసెలు, సమోసాల వంటివి అక్కడ కూడా మనకు లభ్యమవుతాయి. మన ఆహారానికి ఇంత దగ్గరగా ఉన్న కొన్ని బర్మా వంటలు ఎలా వండుకోవాలో చూద్దాం.



బర్మాలో కూడా మన వంటే!

వంటిల్లు



స్పైసీ కుకుంబర్ సలాడ్

కావాల్సిన పదార్థాలు: బర్మా బర్మాస్ చిల్లి గార్లిక్ ఆయిల్- 4 టేబుల్ స్పూన్, బర్మాస్ బర్మాస్ బలచౌంగ్ (క్రంచీ స్పైయిస్ బ్లెండ్)- 2 టేబుల్ స్పూన్, ఇంగ్లీష్ కుకుంబర్స్- 150 గ్రాములు, చక్కెర- 2 టీ స్పూన్లు, రైస్ వెనిగర్- 1.5 టేబుల్ స్పూన్, ఉప్పు- రుచికి తగినంత, నువ్వులు- 2 టీ స్పూన్స్ (వేయించాలి)

తయారీ విధానం: కుకుంబర్స్(కీరాదోసకాయలు) తోలు తీసి మందంగా గుండ్రని ముక్కలు కట్ చేసుకోవాలి. బౌల్‌లో నీళ్ల వేసి ఉప్పు, చక్కెర వేయాలి. ఇందులో దోసకాయల్ని ఐదు నిముషాల పాటు నానబెట్టాలి. ఆ తర్వాత నీళ్లను తీసేయాలి. బౌల్‌లోని కుకుంబర్ ముక్కల్లోకి బర్మాస్ చిల్లీ గార్లిక్, నూనె, రైస్ వెనిగర్ వేసిన తర్వాత వేయించిన నువ్వులు వేసి కలపాలి. బాగా కలిపితే కుకుంబర్ ముక్కలకు మిశ్రమం పడుతుంది. ఈ బౌల్‌మీద ప్లేట్ ఉంచి కొద్దిసేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. ఫ్రిజ్‌లోంచి తీసిన తర్వాత బర్మాస్ బలచౌంగ్ కలపాలి. ఈ స్పైసీ చిల్డ్ కుకుంబర్‌ను సైడ్ డిష్‌గా తినాలి.

స్టిర్ ఫ్రై వెజిటెబుల్స్ ఇన్ మలబార్ సాస్

కావాల్సిన పదార్థాలు: నీళ్లు- 2 టేబుల్ స్పూన్లు, నూనె- అర టేబుల్ స్పూన్, ఎండు మిరపకాయలు- 2 (నూనెలో వేయించాలి), తరిగిన వెల్లుల్లి ముక్కలు- అర టీస్పూన్, బేబీ కార్న్- 1 కప్పు, క్యారెట్ ముక్కలు- 1 కప్పు, ఆస్పరగస్- 1 కప్పు, బ్రొకోలీ- 1 కప్పు, బాక్ చాయ్- 1 కప్పు, బర్మా బర్మాస్ మలార్ స్టిర్ ఫ్రై సాస్- 1 టేబుల్ స్పూన్

తయారీ విధానం: కూరగాయ ముక్కల్ని శుభ్రం చేసిన తర్వాత మంచి నీళ్లలో రెండు నిముషాల పాటు ఉడకబెట్టాలి. ఆ తర్వాత నీళ్లను పారబోసి.. కూరగాయ ముక్కల్ని పక్కన ఉంచుకోవాలి. వెంటనే ప్యాన్‌ను హీట్ చేసి మిరపకాయలు, తరిగిన వెల్లుల్లి ముక్కలను వేయాలి. వెల్లుల్లి రంగు మరేంత వరకూ గరిటెతో కదుపుతుండాలి. ఇందులోకి మలార్ సాస్ వేసిన తర్వాత ప్యాన్ అంతా కలిసేట్లు రెండు టేబుల్ స్పూన్ల నీళ్లను చిలకరించాలి. ఇందులో ఉడకబెట్టిన కూరగాయముక్కల్ని వేశాక.. మలార్ సాస్ వేసి కలపాలి. నిముషం పాటు హైఫ్లేమ్‌లో ఉంచి ప్యాన్‌ను ముందుకు వెనకకు కదపాలి. చివరగా దీన్ని బౌల్‌లో వేసుకుని.. అన్నంతో తింటే రుచిగా ఉంటుంది.

టాంగీ మలార్ స్పాగెట్టి

కావాల్సిన పదార్థాలు: స్పాగెట్టి- 100 గ్రాములు (ఇటాలియన్ పాస్తా నూడిల్స్ ఇవి. గోధుమలతో తయారు చేస్తారు), తురివిన చీజ్- 2 టేబుల్ స్పూన్లు, వెల్లుల్లి- 2 రెబ్బలు (సన్నగా తరగాలి), తరిగిన పుట్టగొడుగుల మిశ్రమం- 50 గ్రాములు, నూనె- 1 టేబుల్ స్పూన్
(గార్నిష్ కోసం- ఆలివ్ ఆయిల్‌తో పాటు ప్రాసెస్డ్ చీజ్ తీసుకోవాలి)

తయారీ విధానం: స్పాగెట్టిని ఉప్పునీళ్లలో ఉడికించాలి. నాలుగు టేబుల్ స్పూన్లు నీళ్ల మిగిలి ఉండగా స్పాగెట్టిని తీసేయాలి. ఆ నీళ్లను పక్కన ఉంచుకోవాలి. ప్యాన్‌లో నూనెను వేడిచేసి తరిగిన వెల్లుల్లి ముక్కలతో పాటు పుట్టగొడుగు ముక్కలను వేసి కలపాలి. హైఫ్లేమ్‌లో ప్యాన్‌ను ముందుకు వెనకకు కదుపుతూ రెండు నిముషాల పాటు కలపాలి. ఇందులోకి బర్మా బర్మాస్ మలార్ స్టిర్ ఫ్రై సాస్ వేసుకోవటంతో పాటు మిగిలిన స్పాగెట్టి నీళ్లను పోయాలి. నిముషం పాటు కుక్ చేశాక స్పాగెట్టిని వేయాలి. మిశ్రమం అంతా స్పాగెట్టికి పట్టిన తర్వాత మంటను కట్టేయాలి. తురిమిన చీజ్‌ను చల్లుకుని తినాలి. అవసరం అనుకుంటే కాస్త ఆలివ్ ఆయిల్‌ను చల్లుకున్నా పర్వా లేదు. రుచికంగా ఉంటుంది ఈ టాంగీ మలార్ స్పాగెట్టి.

అంకుల్ మాంగ్ నూడిల్స్

కావాల్సిన పదార్థాలు:
గోధుమ, బియ్యంతో చేసిన నూడిల్స్-200 గ్రాములు, పోక్ చాయ్- 4 టేబుల్ స్పూన్లు, బర్మా బర్మాస్ మౌంగ్ చిల్లీ గార్లిక్ పేస్ట్- 5 టేబుల్ స్పూన్లు, రెడ్ క్యాబేజీ- అర కప్పు, తరిగిన ఫ్రెంచ్ బీన్స్- 4 టేబుల్ స్పూన్లు, తరిగిన క్యారెట్ ముక్కలు- 3 టేబుల్ స్పూన్లు, సిల్కెన్ తోఫు- 30 గ్రాములు, ఇంపోర్టెడ్ తారో- 2 టేబుల్ స్పూన్లు, గ్రీన్ టమోటా- 3 టేబుల్ స్పూన్లు, ఉల్లిపాయ ముక్కలు- 3 టేబుల్ స్పూన్లు, ఆస్పరాగస్- 3 టేబుల్ స్పూన్లు, చింతపండు రసం- 2 టేబుల్ స్పూన్లు, బ్లాక్ పెప్పర్- 2 టీస్పూన్లు, ఉప్పు- రుచికి తగినంత, చక్కెర- రుచికి తగినంత, వెజిటెబుల్ స్టాక్- అరకప్పు
గార్నిష్ కోసం- స్ప్రింగ్ ఆనియన్, ఫ్రైడ్ గార్లిక్

తయారీ విధానం:
నూడిల్స్‌ను ఉడకబెట్టి పక్కన ఉంచుకోవాలి. కూరగాయలన్నీ మందంగా కట్ చేసుకోవాలి. తోఫును వేలంత పొడవులో కట్ చేసుకుని బ్రౌన్ రంగు వచ్చేంత వరకూ డీప్ ఫ్రై చేసుకోవాలి. కూరగాయ ముక్కల్ని మెత్తగా అయ్యేంత వరకూ ఉడికించాలి. ఒక ప్యాన్ తీసుకుని వేడయ్యాక సగం వెజిటెబుల్ స్టాక్ వేసి బర్మా బర్మాస్ మౌంగ్ చిల్లీ పేస్ట్ వేసి బాగా కలపాలి. ఇందులో కొద్దిగా చింతపండు రసం వేశాక గోధుమ నూడిల్స్ వేసి.. మంటను హైహీట్‌లో ఉంచి కలపాలి. ఈ నూడిల్స్‌ను బౌల్‌లో వేసి చల్లబరచాలి. అదే ప్యాన్‌లో మిగిలిన విజిటెబుల్ స్టాక్‌ను తీసుకుని ఇందులో బర్మా బర్మాస్ చిల్లి పేస్ట్ వేసి కరిగిన తర్వాత మిగిలిన చింతపండు రసం వేసి నిముషం తర్వాత ఉడికిన కూరగాయ ముక్కల్ని వేసి కలిపితే సాస్ వాటికి అంటుకుంటుంది. ఇందులో నూడిల్స్‌తో పాటు మిగిలినవన్నీ వేసి కలిపిన తర్వాత ఇందులోకి ఫ్రైడ్ గార్లిక్ ముక్కలతో పాటు స్ప్రింగ్ ఆనియన్స్ వేసి కలపాలి.

వా పొటాటో

కావాల్సిన పదార్థాలు:
నూనె- 50 గ్రాములు, బంగాళదుంపలు- 350 గ్రాములు, వెల్లుల్లి- 2 టీస్పూన్లు, పచ్చి మిరపకాయల పేస్ట్- 3 టేబుల్ స్పూన్లు, రెడ్ చిల్లీ సాస్- 2 టేబుల్ స్పూన్లు, కాఫిర్ లైమ్ లీవ్స్- 2, చింతపండు రసం- అరకప్పు, సీజనింగ్ పౌడర్- 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు- రుచికి సరిపడినంత, చక్కెర- రుచికి తగినంత, పసుపు- కొద్దిగా, కార్న్‌ఫ్లోర్- కొద్దిగా, స్ప్రింగ్ ఆనియన్- 3 టేబుల్ స్పూన్లు, బర్మా బర్మాస్ బలచౌంగ్- 4 టేబుల్ స్పూన్లు (మార్కెట్లో దొరుకుతుంది. దీన్ని ఎండిన రొయ్యలతో చేస్తారు).

తయారీ విధానం:
బంగాళాదుంపలను శుభ్రంగా కడిగిన తర్వాత వేలంత పొడవుతో కట్ చేసుకోవాలి. దీన్ని పసుపు నీళ్లలో వేసి కొద్దిసేపు ఉంచిన తర్వాత నీళ్లను తీసేసి ఫ్రిజ్‌లో ఉంచుకోవాలి. ఆ తర్వాత ఒక బౌల్‌లో బంగాళాదుంప ముక్కల్ని తీసుకుని ఇందులోకి కొద్దిగా నూనె వేయటంతో పాటు కార్న్‌ఫ్లోర్ చల్లుకోవాలి. ఆ తర్వాత ప్యాన్‌లో నూనె వేసిన తర్వాత బంగాళాదుంప ముక్కలను బంగారు రంగు వచ్చేంత వరకూ ఫ్రై చేసుకోవాలి. మిగిలిన నూనెను వేరే బౌల్‌లోకి వంచుకోవాలి. అదే ప్యాన్‌లో కొద్దిగా నూనె వేసి కాఫిర్ లైమ్ ఆకులు వేయాలి. పచ్చిమిర్చి పేస్ట్ వేసి కలపాలి. అందులోకి చింతపండు రసం వేసిన తర్వాత సీజనింగ్ పౌడర్ చల్లాలి. ఆ తర్వాత బంగాళాదుంప ముక్కల్ని వేసి, రెడ్ చిల్లీ సాస్ వేసి కలపాలి. తరిగిన స్ప్రింగ్ ఆనియన్స్ వేశాక బర్మా బర్మాస్ బలచౌంగ్ వేసిన తర్వాత బంగాళాదుంపలకు పట్టేట్లు కలపాలి. వా పొటాటో రెడీ. దీన్ని ప్లేట్‌లోకి వేసి స్ప్రింగ్ ఆనియన్స్‌తో గార్నిష్ చేసుకుని తినాలి.

క్రెడిట్
బర్మాబర్మా
నాలెడ్జ్ సిటీ, హైటెక్‌సిటీ,
హైదరాబాద్

పొలమే ప్రయోగశాల

చెల్లమ్మాళ్ చదివింది ఆరో తరగతే. కానీ వ్యవసాయంలో శాస్త్రవేత్తల్ని సైతం ఆకట్టుకొనే ప్రయోగాలు చేశారు. సేంద్రియంగా కొబ్బరి సాగులో, పంటల యాజమాన్యంలో ఆమెది అయిదు దశాబ్దాల అపారమైన అనుభవం ఈ ఏడాది 'పద్మశ్రీ' పురస్కారానికి ఎంపికైన చెల్లమ్మాళ్ వందలాది రైతులకు స్ఫూర్తిప్రదాత.



దక్షిణ అండమాన్ ప్రాంతంలో 'కామాచ్చి చెల్లమ్మాళ్' అంటే ఎవరన్నట్టు చూస్తారు. కానీ 'నారియల్ అమ్మ' అనగానే వెంటనే గుర్తుపట్టేస్తారు. రంగచంగ్ గ్రామానికి చెందిన అరవయ్యేడేళ్ళ చెల్లమ్మాళ్ జీవితం మొత్తం కొబ్బరి తోటలతోనే పెనవేసుకుపోయింది. ఇక సాగు అనుభవం అయిదు దశాబ్దాలకు పైనే. మొదట్లో పంటకు చీడపీడలు, సరైన దిగుబడి లేకపోవడం వల్ల ఆమె ఎన్నో కష్టనష్టాలకు గురయ్యారు. భూమి సారం తగ్గిపోవడానికీ, వ్యవసాయ ఖర్చులు పెరిగిపోవడానికీ కారణం రసాయనాల వాడకమేనని గ్రహించారు. "రసాయనాల వాడకం వల్ల మట్టిలో సారం తగ్గిపోతుంది. అది మన ఆరోగ్యాల మీద కూడా ప్రభావం చూపిస్తుంది. మట్టిలో కోల్పోయిన పోషకాల్ని భర్తీ చెయ్యడం చాలా కష్టం. కాబట్టి రైతులందరూ సేంద్రియ సాగువైపు మళ్ళాలి" అంటారామె. మాటలకే పరిమితం కాకుండా... తన పది ఎకరాల పొలంలో వివిధ ప్రయోగాలను ఆమె చేపట్టారు. వర్షాకాలం తరువాత పొడిగా ఉండే వాతావరణంలో... మట్టిలో తేమ నిలవడం కష్టం. ఈ సమస్యను అధిగమించడానికి కొబ్బరాకులు, కొబ్బరి పీచును కుళ్ళబెట్టి, ఇతర ఆకులతో పాటు మట్టిని కప్పి ఉంచడం మొదలుపెట్టారు. మట్టిలో తేమ క్షీణించిపోకుండా నిలవడంతో పాటు కలుపు మొక్కల నివారణకు కూడా అది ఎంతో ఉపకరించింది. చీడపీడల నివారణకు వాడే హానికరమైన రసాయనాలకు స్వస్తి చెప్పి... వివిధ సేంద్రియ పదార్థాలతో 'ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజిమెంట్' వ్యూహాన్ని అమలు చేశారు. మరోవైపు అంతర పంటల పెంపకాన్ని చేపట్టారు. "ఒకప్పుడు కేవలం కొబ్బరి మాత్రమే సాగు చేసేదాన్ని. కొన్నిసార్లు దిగుబడి తగ్గడం, మార్కెట్‌లో ధరలు పడిపోవడం వల్ల నష్టపోవాల్సి వచ్చేది. అందుకే... ఒకే పంట మీద ఆధారపడకూడదనుకున్నాను. కొబ్బరితో పాటు దాదాపు 460 తాటి చెట్లు పెంచుతున్నాను. అరటి, వేరు శెనగ, పైనాపిల్, మిర్చి, కంద, చిలగడ దుంపలు, ఆకుకూరలు, పువ్వులు... అలా రకరకాల పంటలు వేశాను" అని వివరించారామె. ప్రస్తుతం ఏటా 27 వేలకు పైగా కొబ్బరికాయల దిగుబడి వస్తోంది.



> "నేను మారుమూల పల్లె టూర్లో నివసిస్తున్నాను. నాకు 'పద్మశ్రీ' పురస్కారం వచ్చిందని ఎవరో చెప్పినప్పుడు... ఎంతో సామాన్యురాలినైన నాకు అంత ప్రతిష్ఠాత్మకమైన అవార్డు ఎలా ఇస్తారనుకున్నాను. నన్ను ఆట పట్టిస్తున్నారనుకున్నాను. తరువాత అండమాన్ అధికారి ఒకరు అది నిజమేనని చెప్పారు. ఇప్పుడు నా నోట మాటలు రావడం లేదు"

చెల్లమ్మాల్ చేసిన కొత్త ప్రయోగాలు, ఆచరించిన వినూత్న పద్ధతులు మంచి ఫలితాలు ఇవ్వడంతో పాటు తోటి రైతులకు స్ఫూర్తిగానూ నిలిచాయి. సుమారు 150 మందికి పైగా రైతులు ఈ పద్ధతులు అనుసరించేలా చేశారామె. ఆమె ప్రభావంతో... వారందరూ సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గుచూపారు. అలాగే రకరకాల పంటలు పండిస్తున్నారు. "ఇలా చేయడం వల్ల ఏడాది పొడుగునా ఆదాయం ఉంటుంది. ఒక పంట దెబ్బ తిన్నా... మరొకటి ఆదుకుంటుంది" అంటారు చెల్లమ్మాళ్. వివిధ ప్రాంతాలకు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆమె సాగు విధానాల్ని పరిశీలించి అభినందించారు. గతంలో కొబ్బరి అభివృద్ధి బోర్డుతో సహా పలు సంస్థల నుంచి పురస్కారాలు అందుకున్న ఆమెకు కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ'ని ప్రకటించింది. "నేను మారుమూల పల్లెటూర్లో నివసిస్తున్నాను. నాకు 'పద్మశ్రీ' పురస్కారం వచ్చిందని ఎవరో చెప్పినప్పుడు... ఎంతో సామాన్యురాలినైన నాకు అంత ప్రతిష్ఠాత్మకమైన అవార్డు ఎలా ఇస్తారనుకున్నాను. నన్ను ఆట పట్టిస్తున్నారనుకున్నాను. తరువాత అండమాన్ అధికారి ఒకరు అది నిజమేనని చెప్పారు. ఇప్పుడు నా నోట మాటలు రావడం లేదు" అంటూ స్పందించారామె.

చెల్లమ్మాళ్‌కు వ్యవసాయంలో ఆమె కుమారుడు రామచంద్రన్ సాయం చేస్తున్నారు. తన తల్లికి వచ్చిన ఈ పురస్కారం తమకు మరిన్ని ప్రయోగాలు చెయ్యడానికి స్ఫూర్తినిస్తోందని ఆయన చెబుతున్నారు. "ఇప్పుడు ఆగ్రో-టూరిజం'ను ప్రమోట్ చెయ్యడానికి ప్రణాళికలు వేస్తున్నాం. మా పొలంలో రకరకాల పంటలు వేస్తున్నాం. సుగంధ ద్రవ్యాల్ని సాగు చేస్తున్నాం. ఫిష్ ఫార్మింగ్ కూడా ఉంది. కాబట్టి ఇక్కడ ఆగ్రో-టూరిజానికి మంచి అవకాశం ఉంది. అది స్థానికుల్నీ, విద్యార్థుల్నీ మాత్రమే కాదు... పర్యాటకుల్ని కూడా ఆకర్షిస్తుందని మేం భావిస్తున్నాం" అని ఆ తల్లి కొడుకులు చెబుతున్నారు. చెల్లమ్మాళ్ మునుపటి ప్రయోగాల మాదిరిగానే ఈ ఆగ్రో టూరిజం ఆలోచన కూడా మరింతమంది రైతులను ఆ బాటలో మళ్ళిస్తుందనడంలో సందేహం లేదు.

నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/dJq1yit లో చదవండి.

నిమ్మ రసంతో షడ్రసాలు

క్షేమ కుతూహలం

విభావితం శుభ్రసితా మరీచైరేలారజో భావనయాతి రుచ్యమ్!
జీవాతవేతన్య భోక్తుర్లంబీర బీజం కేసర మార్దయన్తి!!

నిమ్మకాయ మనకు కూరగాయే. నిమ్మపండు ఫలాలకు సంబంధించిందైతే, నిమ్మకాయలు, ఆకులు, వేర్లు కూడా ఔషధాలే. ఆయుర్వేదంలో నిమ్మ రసాన్ని లోహాల్లో విష దోషాలు హరించేందుకు, శుద్ధి కోసం ఉపయోగిస్తారు. లోహ విషాలనే హరించే నిమ్మకి శరీరంలో విష దోషాల్ని హరిస్తుంది. నిమ్మ ఇమ్యూనిటీ బూస్టర్ కూడా.

దీని వృక్ష నామం 'సిట్రస్ మెడికా'. అరబ్బీ పదం 'లేమూన్', పర్షియన్ 'లైమూన్', ఇటాలియన్ 'లైమోన్', ఫ్రెంచ్ 'లైమొన్'... ఇంగ్లీషు 'లెమన్'గా మారింది. ఆహారానికి రుచినిచ్చి, జిడ్డు తొలగించే గుణాలు దీని ప్రసిద్ధికి కారణమయ్యాయి. మన ఆహారంలో తీపి, పులుపు, ఉప్పు, కారం, వగరు, చేదు... ఈ ఆరు రుచులూ ఉంటేనే అది షడ్రసోపేతమైన భోజనం అవుతుంది. పుల్లని పదార్థంలో కెల్లా శక్తిదాయకమైంది నిమ్మపండు. దీనికి 'తీక్షణ' అనే గుణం ఉంది కాబట్టి అది వేగంగా శరీర ధాతువుల్లోకి చొచ్చుకుపోయి పని చేస్తుంది. ఉష్ణ స్వభావం కలది కాబట్టి, కఫాన్ని అంతం చేయగలుగుతుంది. జిడ్డుని తొలగించే గుణంవల్ల ఇది కొవ్వుని తగ్గించి స్థూలకాయానికి విరుగుడుగా పని చేస్తుంది. చింతపండుకన్నా మెరుగైన పుల్లని ద్రవ్యం ఇది.

నిమ్మ రసంలో కొద్దిగా ఉప్పు కలిపి, ఆ రసాన్ని పుక్కిలిస్తూ ఉంటే నోరు శుభ్రం అవుతుంది. నోటి దుర్వాసన, నాలుక మీద జిగురు పేరుకోవటం తగ్గుతాయి. తీవ్రమైన ఎసిడిటీ ఉన్న వారికి తప్ప నిమ్మ రసం అందరికీ జీర్ణశక్తిని పెంచేదిగా ఉంటుంది. ఎన్ని నీళ్ల తాగినా దప్పిక తీరక పోవటానికి నూనె పదార్థాలు, తీపి పదార్థాలు అతిగా తీసుకోవటం ఓ కారణం కావచ్చు. నిమ్మరసం తాగితే దప్పిక తీరుతుంది. అజీర్తివల్ల కలిగే కడుపు నొప్పిని తగ్గిస్తుంది.

దగ్గు, జలుబు, గొంతులో పుండు లాంటివి వేడివల్ల గానీ కఫంవల్ల గానీ వస్తుంటే... పంచదార కలిసిన నిమ్మ రసాన్ని తాగితే వెంటనే ఉపశమనం లభిస్తుంది. గొంతు లోపల ఉండే మృదువైన మ్యూకస్ పొరని ఇది పదిలపరుస్తుంది. వాంతి వికారాల్ని తగ్గిస్తుంది. నోట్లో నీళ్లూరటం ఆగుతుంది. కడుపులో, గొంతులో, ఊపిరితిత్తుల్లో దాగిన కఫాన్ని వెళ్లగొడుతుంది.

అజీర్తి వలన ఆహారం సరిగా పక్వం కాక, ఏర్పడే దోషాన్ని 'ఆమం' అంటారు. ఇది విష (టాక్సిన్) దోషం! ఈ విష దోషమే కీళ్లలో చేరి కీళ్లవాతాన్ని (రుమాటిజం) కలిగిస్తుంది. నిమ్మరసం ఆమాన్ని జయిస్తుంది కాబట్టి, కీళ్లవాత రోగులకు మేలు చేస్తుంది. వాతాన్ని తగ్గించే గుణం కూడా దీనికి ఉంది. అకారణంగా వచ్చే గుండె నొప్పిని కూడా తగ్గిస్తుంది.

రాత్రి ఒక గ్లాసు పెరుగుని చిలికి, మూడు గ్లాసుల నీళ్ల కలిపి... ఫ్రిజ్‌లో కాకుండా బయటే ఉంచి, ఉదయాన్నే ఆ మజ్జిగలో నిమ్మ రసం, నూరిన అల్లం కలిపి తాగితే జీర్ణకోశానికి మేలు కలుగుతుంది. విరేచనం ఫ్రీగా అవుతుంది. శరీరంలోని విషదోషాలను హరించగలుగుతుంది. శరీరానికి బలాన్నిస్తుంది. ఇనుము లాంటి ఖనిజాలు వంటపట్టేలా చేస్తుంది. చర్మానికి మంచి వర్ణాన్నిస్తుంది. గోరువెచ్చని నీళ్లలో నిమ్మరసం స్థూలకాయానికి చేసుకోగలిగే గృహ చికిత్స.

పచ్చి నిమ్మకాయ రసం ఎక్కువ పుల్లగా ఉండి పైత్యాన్ని పెంచుతుంది. బాగా పండిన నిమ్మపండు రసం మూడు దోషాలనూ హరిస్తుంది. రక్త నాళాలలో కొవ్వుని తగ్గిస్తుంది. గుండెకు, మెదడుకు రక్త సరఫరానీ పెంచుతుంది. కేన్సర్ ఏ అవయవంలో వచ్చినా నిమ్మ రసాన్ని ఆహార పానీయాల్లో కలిపి తీసుకుంటూ ఉంటే దానికి వాడే మందులు బాగా పని చేస్తాయి.

ఎండిన నిమ్మ డొప్పల్ని మంటలో వేసి, భస్మం చేసి, చిటికెడంత భస్మాన్ని తేనెతో కలిపి తీసుకుంటే విరేచనాలు తగ్గుతాయి.

టంకణ భస్మం ఆయుర్వేద షాపుల్లో దొరుకుతుంది. పావు చెంచా భస్మాన్ని తీసుకుని, రెండు మూడు చుక్కలు నిమ్మరసం కలిపి పేస్టులా చేసి, పులిపిడికాయల మీద పెడితే చిన్నవిగా ఉన్నవి త్వరగా రాలిపోతాయి. మామూలు చర్మం మీద ఎక్కువ తగలనీయకండి.

నిమ్మ రసంతో పానీయం: నిమ్మ రసంలో తగినన్ని గోరువెచ్చని నీళ్ల కలిపి, తగినంత చక్కెర, మిరియాలు, ఏలకుల పొడి వేసుకుని తాగితే అజీర్తిని పోగొడుతుంది. కొవ్వుని కరిగిస్తుంది. చర్మానికి పోషణ నిస్తుంది. గుండెకు బలాన్నిస్తుంది. వేసవికాలానికి అనుకూలంగా ఉంటుంది. వడకొట్టనీకుండా చేస్తుంది. చలికాలంలో శరీరానికి తగిన వేడినిస్తుంది. సర్వకాలాలకూ అనువైనది.

నిమ్మ పప్పు: కందిపప్పు, పెసరపప్పు, మినప్పప్పు, శనగపప్పు, మసూర కందిపప్పు... ఈ ఐదింటినీ విడివిడిగా వేగించి, అన్నిటినీ సమానంగా కలిపి ఉడికించి, చల్లారిన తరువాత అందులో తగినంత ఉప్పు, నిమ్మరసం కలపాలి. దానికి ఇంగువ తాలింపు పెడితే నిమ్మ పప్పు చాలా కమ్మగా ఉంటుంది. బలకరమైన ఔషధం. ఈ పప్పన్నంలో ఆరు రుచులూ ఉంటాయి.

నిమ్మకాయ ఊరగాయ: నిమ్మకాయల్ని చిన్న ముక్కలుగా తరిగి పసుపు, ఉప్పు, కలిపి మూడు రోజులు ఊరనివ్వాలి. అందులోనే సన్నగా తరిగిన అల్లం ముక్కలు కూడా కలుపుకోవచ్చు. అందులో తగినంత కారం, కొద్దిగా మెంతి పిండి కలిపి ఓ సీసాలో భద్రపరచండి. ఈ నిమ్మ ఊరుగాయని మొదటి ముద్దగా తింటే అజీర్తి, భుక్తాయాసం రాకుండా ఉంటాయి.

నిమ్మ పచ్చడి: బాండీలో కొద్దిగా నూనె తీసుకుని తాలింపు గింజలు, తగినన్ని ఎండు మిరపకాయలు వేగించి మిక్సీ పట్టిన పొడిలో నిమ్మ రసం చేర్చి, కొత్తిమీర కలుపుకోవాలి. ఈ నిమ్మ పచ్చడి ఆరోగ్యదాయకమైంది. అన్నంలోకి మంచి ఆదరువు ఇది. టిఫిన్లలో ఒక చట్నీగా దీన్ని తింటే ఇడ్లీ, దోశ, బజ్జీల్లాంటివి తేలికగా అరుగుతాయి.

నిమ్మ పులిహోర: చింతపండుకు బదులుగా నిమ్మ రసం పోసి తయారు చేసిన పులిహోర చాలా రుచిగా ఉంటుంది. చిటికెడంత ఆవపిండి, మెంతి పిండి కూడా కలిపి, కొంచెం ఊరాక తింటే మరింత రుచిగా ఉంటుంది. ఆరు రుచుల్నీ కలిగి ఉంటుంది.

నిమ్మ తొక్కలతో జామ్: నిమ్మరసం పిండేశాక ఆ డొప్పల్ని పారేయకుండా సన్నగా కత్తిరించి, కొద్ది నీళ్లలో మగ్గనిచ్చి, ఆ ముక్కలకు సరిపడిన పంచదార వేసి తీగపాకం పట్టి జామ్ తయారు చేస్తారు. ఇది చపాతీ, పూరీ, రోటీల్లో నంజుకోవటానికి బావుంటుంది.

ఆరు రుచుల స్వీటు: నిమ్మ, నారింజ లేదా కమలాకాయల తొక్కలు తీసుకుని తగినంత అల్లం కలిపి, మెత్తగా అయ్యేలా ఉడికించి, ముద్దలా చేసి, ఈ ముద్దని గోధుమ పిండితో పూరీ ఒత్తి, దాని మధ్య ఉంచి మూసేసి బంతిలా చేసి దాన్ని నూనెలో వేగించాలి. దాన్ని పంచదార లేదా బెల్లం పాకంలో ముంచి అరనివ్వాలి. ఇది ఆరు రుచులతో పరిమళభరితంగా ఉండే మంచి స్వీటు.

• గంగరాజు అరుణాదేవి



ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శనివారం • 27 జనవరి 2024
cinema@andhrajyothy.com



విభిన్న కోణాల్లో మాస్ మహారాజా

గణతంత్రదినోత్సవ సందర్భంగా రవితేజ నటించిన రెండు సినిమాలకు చెందిన ప్రమోషన్స్ విడుదలయ్యాయి. ఈ రెండు సినిమాల్లో ఒకటి హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'మిస్టర్ బచ్చన్'కాగా, రెండోది కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొంది, ఫిబ్రవరి 9న విడుదల కానున్న 'ఈగల్'. ఈ రెండు సినిమాలకూ నిర్మాత ఒకరే కావడం విశేషం. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్ ఈ చిత్రాలను నిరిస్తున్నారు. ఇక 'మిస్టర్ బచ్చన్' విషయానికొస్తే.. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేయగా, ఆ పోస్టర్‌లో రవితేజా బ్లూ షర్ట్, బ్యాగీ ప్యాంట్లో వింటేజ్ లుక్‌లో కనిపిస్తున్నారు. రవితేజతో పాటు ఆ పోస్టర్‌లో కనిపిస్తున్న బిల్డింగులు, కార్లు ఎయిటీస్, నైన్‌టీస్ నాటి వాతావరణాన్ని తలపిస్తున్నాయి. 'నామ్ తో సునా హోగా' అనే ట్యాగ్‌తో రూపొందుతోన్న 'మిస్టర్ బచ్చన్'లో భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. షూటింగ్ ప్రస్తుతం కారంపూడిలో జరుగుతోంది. మిక్కీ జె.మేయర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అయనంక బోస్. 'ఈగల్' విషయానికొస్తే.. దావ్‌జాంద్ స్వరపరిచిన 'ఈగల్స్ ఆన్ హిస్ వే..' అంటూ సాగే పాటను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో రవితేజ పోషిస్తున్న సహదేవ్ పాత్ర వైల్డ్ నేచర్‌ని పాట రాసిన ఛార్జినా మాధ్యూ సాహిత్యం అద్దంపడుతోంది. తనే స్వయంగా ఆలపించడం విశేషం. ఈ పాట విజువల్స్ రవితేజ కిల్లర్ అవతార్‌ని చూపిస్తున్నాయి. రవితేజ విభిన్నకోణాలున్న పాత్రను ఇందులో పోషించారని దర్శకుడు చెబుతున్నారు. అనుపమ పరమేశ్వరన్, కావ్య థాపర్ కథానాయికలుగా నటించిన ఈ చిత్రంలో నవదీప్, మధుబాల కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఎలా ఊహించారో అలాగే చూపించారు..

'నా కెరీర్‌లో ఇంత త్వరగా ఇంతటి గొప్ప పాత్ర దొరుకుతుందని నేను ఊహించలేదు. థ్యాంక్యూ అరుణ్‌మాథేశ్వరన్ సార్.' అంటూ ఆనందం వెలిబుచ్చారు ప్రియాంక అరుళ్‌మోహన్. ఇటీవలే విడుదలైన 'కెప్టెన్ మిల్లర్'లో వేల్‌మతి పాత్రలో అద్భుతంగా నటించారు ప్రియాంక. స్వతహాగా అందగత్తె అయిన తను, ఇందులో డీగ్లామరైజ్డ్ పాత్ర పోషించారు. ఈ పాత్రకు వస్తున్న స్పందనపై ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ప్రియాంక మాట్లాడారు. 'ఈ కథ విన్నప్పుడు.. ఈ పాత్రకు నేను కరెక్ట్ అని మీకెలా అనిపించింది? అనడిగాను. కథ రాస్తున్నప్పుడే ఆ పాత్రలో నిన్నే ఊహించానని షాకింగ్ ఆన్సరిచ్చారు అరుణ్. ఆయన ఎలా అయితే ఊహించారో.. అలాగే నన్ను చూపించారు. తెరపై నన్ను నేను చూసుకొని షాక్‌లో ఉండిపోయాను. ఈ సినిమా వల్ల అమ్మానాన్నల అభినందనలందుకున్నాను. నాజీవితంలో ఇంతకు మించి ఆనందం మరొకటి ఉండదు. కమర్షియల్‌గా ఆలోచించకుండా కథ అడిగింది చేసుకుంటూ వెళ్లారు అరుణ్. అందుకే.. సినిమాలా కాకుండ జీవితాన్ని చూస్తున్నట్టుంది. ధనుష్ సార్ లాంటి గొప్ప నటుడితో చేస్తే ఎవరైనా గొప్పగా చేస్తారు' అన్నారు ప్రియాంక అరుళ్‌మోహన్.



పద్మవిభూషణుడిపై అభినందనల కుంభవృష్టి కురిసింది. అభిమానులు, ఆత్మబంధువులతో మెగా నివాసం కిటకిటలాడింది. సినీ రాజకీయ ప్రముఖులతోపాటు బంధు, మిత్ర, సపరివారమంతా అభినందన చందనాలతో మెగాస్టార్‌ని అభిషేకించింది. భారతరత్నకు ఒక్కడుగు దూరంలోనే ఉన్న అంజనీపుత్రుడు ఆనందాతిశయాలతో కళకళలాడిపోయారు. తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అగ్రనిర్మాత దిల్‌రాజుతో సహా మెగా నివాసానికి వచ్చి చిరంజీవికి శుభాభినందనలు అందించారు. నేరుగా వందలాది మంది ఆయన్ను అభినందిస్తే.. మీడియా, సాంఘికమాధ్యమాల ద్వారా లక్షలాదిమంది మెగాస్టార్‌కి జేజేలు పలికారు.



అభినందనల వెల్లువలో తడిసి ముద్దయిన అంజనీపుత్రుడు

విశ్వంభరతో విజయ పరంపర కొనసాగించాలి

కేంద్రం ప్రకటించిన పద్మ అవార్డులకు ఎంపికైన వారికి సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మెగాస్టార్ చిరంజీవి పద్మవిభూషణ్ అవార్డుకు ఎంపిక కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని చిరంజీవి నివాసానికి నిర్మాత దిల్ రాజుతో కలిసి వెళ్లి శాలువాతో సన్మానించారు. అనంతరం మెగాస్టార్‌తో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పునాదిరాళ్లు సినిమాతో చిరంజీవి తన ప్రస్థానాన్ని ప్రారంభించారని, త్వరలో విడుదల కాబోయే విశ్వంభరతో విజయ పరంపర కొనసాగిస్తారన్నారు. రక్తదానం, నేత్రదానం ద్వారా కోట్లాది మంది గుండెల్లో మెగాస్టార్ చిరస్థాయిగా నిలిచిపోయారని ప్రశంసించారు.

నాకు దక్కిన ప్రతి గౌరవం అభిమానులదే

- చిరంజీవి

దేశంలోనే రెండో అత్యున్నత పురస్కారానికి నేను ఎంపికయ్యానని తెలిసినప్పుడు ఏం మాట్లాడాలో, ఎలా స్పందించాలో అర్థంకాలేదు. షాక్‌లో ఉండిపోయాను. నిజంగా చెప్పలేనంత ఆనందంగా ఉంది. ఈ గౌరవానికి కారణం నా అభిమానులే. ఒక తల్లి కడుపున పుట్టకపోయినా.. నన్ను అన్నలా, బిడ్డలా, సొంత మనిషిగా భావించే కోట్లాది మంది అభిమానులు నాకు ఉండటం నా పూర్వజన్మ సుకృతం. నీడలా నాతో నడిచే కోట్లాది అభిమానుల ప్రేమ, ఆదరణ.. నా సినీకుటుంబం అండదండలు ఈ రోజు నన్ను ఈ స్థాయిలో నిలబెట్టాయి. నాకు దక్కిన ప్రతి గౌరవం వారిదే. 45ఏళ్ల సినీ ప్రయాణంలో విభిన్నమైన పాత్రల ద్వారా వినోదం పంచడానికి శాయశక్తులా ప్రయత్నిస్తూనే ఉన్నాను. నన్ను ఈ స్థాయిలో నిలబెట్టిన సమాజం కోసం ఎంతోకొంత చేయాలనే తాపత్రయం నాకెప్పుడూ ఉంటూనేవుంది. అందుకే సేవ చేసి రుణం తీర్చుకుంటున్నాను. వాళ్లిస్తున్న దానితో పోలిస్తే నేను చేస్తున్నది గోరంతే. ఈ నిజం ప్రతిక్షణం నాకు గుర్తొస్తూనేవుంటుంది. అదే నన్ను బాధ్యతగా ముందుకు నడిపిస్తూవుంది. ఇంతటి ప్రతిష్టాత్మకమైన పురస్కారానికి నన్ను ఎంపికచేసిన భారతప్రభుత్వానికీ, ప్రధాని నరేంద్రమోడీగారికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను.



బాలరాముడి దర్శనానంతరం మీరు పద్మవిభూషణుడవ్వడం చాలా ఆనందంగా ఉంది. మీ విషయంలో నేనెప్పుడూ గర్వపడుతూనేవుంటా

- కె.రాఘవేంద్రరావు

కంగ్రాట్యులేషన్స్ చిరంజీవి భాయ్. మీకు పద్మవిభూషణ్ రావడం చాలా ఆనందంగా ఉంది.

- మలయాళ అగ్రనటుడు మమ్ముట్టి

శుభాభినందనలు మిత్రమా. నీ కృషికి తగిన గౌరవం ఇది. ఈ అవార్డు నువ్వు అందుకోవడం మనందరికీ గర్వకారణం..

- డా.మోహన్‌బాబు

'పునాదిరాళ్లు' సినిమాతో నటుడిగా తొలి అడుగు వేసిన ఓ సామాన్యుడు. అసామాన్యుడిగా ఎదగడమే కాక, దేశంలోనే రెండో అత్యుత్తమ పురస్కారానికి ఎంపికయ్యారు. పద్మవిభూషణుడైనందుకు హృదయపూర్వక శుభాకాంక్షలు సార్. మీ ప్రయాణం ఎన్నో తరాలకు స్ఫూర్తిదాయకం..

- ఎస్.ఎస్.రాజమౌళి

ఇక నుంచి 'పద్మవిభూషణ్' మెగాస్టార్ చిరంజీవి. కంగ్రాట్స్ అన్నయ్యా.. మిమ్మల్ని ఎప్పుడూ ప్రేమిస్తూనేవుంటాం..

- రవితేజ

చిరంజీవిగారిని పద్మవిభూషణ్ పురస్కారానికి ఎంపికచేశారన్న అద్భుతమైన వార్తతో నిద్రలేచా. తెలుగు సినిమా గర్వపడాల్సిన క్షణాలివి.. కంగ్రాట్స్ సార్..

-మంచు విష్ణు.

మా పట్ల ఆప్యాయత, దయ ఉన్నందుకు.. మనసుకు హత్తుకునే పాత్రలతో మమ్మల్ని రంజిపజేస్తున్నందుకు.. మా మెగాస్టార్‌గా నిలిచినందుకు ధన్యవాదాలు సార్. ఇక నుంచి మీరు పద్మవిభూషణ్ చిరంజీవి.

- అడవి శేషు

సినిమా, సేవ.. ఈ రెండు రంగాలపై మీరు వేసిన ముద్ర చిరస్థాయిగా నిలిచుండిపోతుంది. ఓ తరానికి స్ఫూర్తిదాయకం అయినందుకు.. కొత్త తరానికి మార్గం సుగమం చేసినందుకు ధన్యవాదాలు సార్. దేశంలోనే రెండో అత్యున్నత పురస్కారానికి మీరు ఎంపిక కావడం పట్ల మనస్ఫూర్తిగా ఆనందాభినందనలు తెలియజేస్తున్నాసార్. కంగ్రాట్స్ మెగాస్టార్

-హీరో శ్రీవిష్ణు

తండ్రిగా మీ పాత్ర ఓ అద్భుతం

భారతీయ సినిమాపై ముద్ర.. అసంఖ్యాక అభిమానులను ప్రేరేపించడంలో మీపాత్ర అనితరసాధ్యమైనది. ఓ బాధ్యతగల పౌరునిగా నన్ను తీర్చిదిద్దడంలో తండ్రిగా మీ పాత్ర ఓ అద్భుతం. పవిత్రమైన నాదేశ నిష్కళంక పౌరులు మీరు. విఎమ్మల్ని ఈ స్థాయిలో గుర్తించిన భారతప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

- రామ్‌చరణ్

155 సినిమాలు.. లెక్కకు మించి సేవాకార్యక్రమాలు.. నిజంగా నిరంతరశ్రామికుడు మీరు. మీ కృషి, మీ అంకితభావం ఎన్నో తరాలకు మార్గదర్శకం. మా జనరేషన్‌కి మీరే ప్రేరణ సార్. మెనీ మెనీ కంగ్రాట్యులేషన్స్ టు మెగాస్టార్ చిరంజీవి..

- హీరోయిన్ సంయుక్త మీనన్

మెగా ఎవరెస్ట్ కీర్తికిరీటంలో మరో కలికితురాయి వచ్చి చేరింది. నా మనసు ఆనందంతో నిండిపోయింది.. కంగ్రాట్స్ మెగాస్టార్..

- దర్శకుడు సంపత్ నంది



గీతా ఆర్ట్స్‌లో మరోసారి బోయపాటి

కొన్ని కాంబినేషన్స్ గురించి వినగానే బ్లాక్‌బస్టర్ హిట్ ఖాయం అనిపిస్తుంది. అచ్చం అలాంటి కాంబినేషనే దర్శకుడు బోయపాటి శ్రీను, అగ్ర నిర్మాత, గీతా ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్‌లది. వీరిద్దరి కలయికలో అల్లు అర్జున్ హీరోగా 2016లో 'సరైనోడు' చిత్రం వచ్చిన సంగతి విదితమే. మాసివ్ బ్లాక్‌బస్టర్‌గా ఆ చిత్రం నిలిచి అత్యధిక వసూళ్లు సాధించింది. ఇప్పుడు మళ్లీ బోయపాటి దర్శకత్వంలోనే మరో చిత్ర నిర్మాణానికి శ్రీకారం చుట్టారు అరవింద్. అయితే ఇందులో హీరో ఎవరన్నది త్వరలో ప్రకటిస్తారు. వైవిధ్యమైన వాణిజ్య కథాంశాలను అత్యున్నత నిర్మాణ విలువలతో నిర్మించి ఎన్నో విజయాలు సొంతం చేసుకున్న అల్లు అరవింద్ మరో హిట్ సినిమా తీయాలనే తపనతో ఈ చిత్ర నిర్మాణ సన్నాహాలు ప్రారంభించారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన మరికొన్ని వివరాలు తెలియజేస్తామని దర్శకనిర్మాతలు చెప్పారు.

దోచుకోవడానికి వస్తున్న నితిన్

'డబ్బు చాలా చెడ్డది. రూపాయి రూపాయి నువ్ ఏం చేస్తావ్ అంటే అన్నదమ్ముల మధ్య, అక్క చెల్లెళ్ల మధ్య చిచ్చు పెడతాను అంటది. అన్నట్లే చేసింది. దేశమంత కుటుంబం నాది. ఆస్తులున్నోళ్లంతా నా అన్నదమ్ములు, ఆభరణాలేసుకున్నోళ్లంతా నా అక్కా చెల్లెళ్లు. అవసరం కొద్దీ వాళ్ల జేబుల్లో చేతులు పెడితే, ఫ్యామిలీ మెంబర్ అని కూడా చూడకుండా నా మీద కేసులు పెడుతున్నారు. అయినా నేను హర్ట్ అవడం లేదు. ఎందుకంటే అయినవాళ్ల దగ్గర డబ్బులు తీయడం నా హక్కు. మై బేసిక్ రైట్. బికాజ్ ఇండియా ఈజ్ మై కంట్రీ. ఆల్ ఇండియన్స్ ఆర్ మై బ్రదర్స్ అండ్ సిస్టర్స్..' ఈ హ్యూమరెస్ డైలాగ్ చెబుతున్నది ఎవరో తెలుసా.. నితిన్. వెంకీ కుడుముల దర్శక



త్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న భారీ చిత్రంలో నితిన్ ఇలా దొంగ పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాకు 'రాబిన్‌హుడ్' అనే టైటిల్ పెట్టినట్లు దర్శకనిర్మాతలు వెల్లడించారు. ఈ సందర్భంగా గ్లింప్స్‌ను కూడా విడుదల చేశారు. నితిన్, వెంకీ కుడుముల కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. ఈ సినిమాలో నితిన్ గెటప్, నటన ఎంటర్‌టైనింగ్ గా ఉంటాయని దర్శకుడు చెప్పారు. సరికొత్త పాత్రలో ఆయన్ని ప్రజెంట్ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, సినిమాటోగ్రఫీ: సాయి శ్రీరామ్, ఎడిటింగ్: ప్రవీణ్ పూడి, కళ: రామ్ కుమార్, నిర్మాతలు: నవీన్ యర్నేని, వై.రవిశంకర్.

వేసవిలో వస్తున్న టిల్లు



సిద్ధు జొన్నలగడ్డ తన 'డీజే టిల్లు' సినిమాతో ప్రేక్షకుల్ని అలరించారు. 'వీడి స్టైలే వేరు' అనిపించుకున్నారు. మంచి వసూళ్లు సాధించిన ఈ చిత్రం కల్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఆ సినిమాకు సీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్' రూపుదిద్దుకుంది. ఇందులో సిద్ధు సరసన అనుపమ పరమేశ్వరన్ నటిస్తున్నారు. టిల్లుగా సిద్ధు మరోసారి చేసే సందడి కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సంగీత దర్శకుడు రామ్ మిరియాల స్వరపరిచిన 'టికెట్టే కొనకుండా', 'రాధిక' వంటి పాటలు ఇప్పటికే సంగీత ప్రియులను అలరిస్తున్నాయి. వాస్తవానికి ఈ చిత్రం ఫిబ్రవరి 9న విడుదల కావాలి. అయితే అనుకోని పరిస్థితులు కారణంగా విడుదలను వాయిదా వేస్తున్నామనీ, వేసవి సందర్భంగా మార్చి 29న రిలీజ్ చేస్తున్నట్లు నిర్మాత నాగవంశీ చెప్పారు. మల్లిక్ రామ్ దర్శకుడు. ఈ చిత్రానికి సాయిప్రకాశ్ సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్ శాఖలను నిర్వహిస్తున్నారు.

విభిన్న ప్రేమకథ



మణికందన్, శ్రీగౌరీ ప్రియ, కన్న రవి కీలక పాత్రలు పోషించిన చిత్రం 'ట్రూ లవర్'. ఓ విభిన్న ప్రేమకథగా దర్శకుడు ప్రభురామ్ వ్యాస్ చిత్రాన్ని రూపొందించారు. ఈ చిత్రాన్ని దర్శకుడు మారుతి, నిర్మాత ఎస్.కె.ఎన్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా 'ట్రూ లవర్' ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో గాయాలతో ఉన్న హీరో ఏదో ఆలోచిస్తూ ఎమోషనల్‌గా కనిపించారు. 'ప్రేమికుల రోజున ఈ లవర్‌ను మరిచిపోకండి' అంటూ ఇచ్చిన కాప్షన్ ఆసక్తికరంగా ఉంది. ఒక ఇంటెన్స్ లవ్‌స్టోరీని చూపిస్తామనే భరోసాను మేకర్స్ ఇస్తున్నట్లు ఫస్ట్ లుక్ పోస్టర్ డిజైన్ చేశారు. త్వరలోనే 'ట్రూ లవర్' విడుదల తేదీని ప్రకటిస్తారు. తెలుగు చిత్రానికి వెన్నెల కిశోర్ మాటలు రాశారు. సంగీతం: సీన్ రోల్డన్. సినిమాటోగ్రఫీ: శ్రేయాస్ కృష్ణ. ఎడిటింగ్: భరత్ విక్రమన్.

సినిమాను ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లాలి



నూతన నటుడు కృష్ణవంశీ హీరోగా పరిచయమవుతున్న ప్రేమకథా చిత్రం 'అలనాటి రామచంద్రుడు'. మోక్ష హీరోయిన్‌గా నటిస్తున్నారు. చిలుకూరి ఆకాశ్ రెడ్డి దర్శకత్వంలో హైమవతి, శ్రీరామ్ జడపోలు ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత దిల్ రాజు ముఖ్య అతిథిగా హాజరై టీజర్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'మొన్న అయోధ్యలో రాముల వారి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ జరిగింది. ఈ రోజు 'అలనాటి రామచంద్రుడు' టీజర్ బయటికి వచ్చింది. యాదృచ్ఛికంగా ఈ సినిమా టైటిల్‌తో అది చక్కగా కుదిరింది. దర్శకుడు, నిర్మాత .. ఇలా అందరూ కొత్త టీమ్‌తో చేస్తున్న ఈ ప్రయత్నం అభినందనీయం. ఈ రోజుల్లో సినిమా తీయడం కంటే దాన్ని థియేటర్‌కు తీసుకెళ్లడం గొప్ప విషయం. యూనిట్ అంతా దాని గురించి వర్క్ చేయాలి. సినిమా బాగా ఆడాలని కోరుకుంటున్నా' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'మా సినిమాలో హీరో తన ప్రేమను వ్యక్తం చేయడానికి ఓ నిర్ణయం తీసుకుంటాడు. అప్పుడు అతను ఎదుర్కొన్న సమస్యలు ఏమిటి, తనప్రేమను ఎలా పొందాడు అన్నది చిత్ర కథ. హీరో వంశీ ఈ కథకు పూర్తి న్యాయం చేశాడు. మోక్ష ధరణి పాత్రలో ఒదిగి పోయింది. ఈ సినిమా ఒక ఎమోషనల్ రైడ్. ప్రేక్షకులు సినిమా చూసి హాయిగా నవ్వుకుంటూ బయటకి వస్తారు' అని తెలిపారు. నిర్మాతల్లో ఒకరైన శ్రీరామ్ జడపోలు మాట్లాడుతూ 'చిన్నప్పటి నుంచి సినిమాలంటే చాలా ఇష్టం. ఇది మా తొలి చిత్రం. ఇలాంటివి ఎన్నో తీయాలని బలంగా అనుకుని నిర్మాణం మొదలుపెట్టాం. మంచి కంటెంట్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం.' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో హీరో కృష్ణవంశీ, హీరోయిన్ మోక్ష తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
వరంగల్ ● శనివారం 27 జనవరి 2024

మన చేతుల్లోకి..

భారత్ తొలి ఇన్నింగ్స్ 421/7

ఇంగ్లండ్‌కిక కష్టాలే!

రాహుల్, జడేజా హాఫ్ సెంచరీలు
ప్రస్తుత ఆధిక్యం 175.. తొలి టెస్టు




కేఎల్ రాహుల్ (86)



జడేజా (81 బ్యాటింగ్)

హైదరాబాద్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో భారత ఆధిపత్యం కొనసాగుతోంది. రెండో రోజు ఆటలోనూ పర్యాటక జట్టు ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయింది. ఆ జట్టు బౌలర్లను అలవోకగా ఎదుర్కొంటూ కేఎల్ రాహుల్ (86), జడేజా (81 బ్యాటింగ్), అర్ధసెంచరీలతో జట్టు భారీ స్కోరుకు దోహదపడ్డారు. దీంతో ప్రస్తుతం రోహిత్ సేన 175 పరుగుల స్పష్టమైన ఆధిక్యంతో దూసుకెళ్తోంది. శుక్రవారం ఆట ముగిసే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 110 ఓవర్లలో 7 వికెట్లకు 421 పరుగులు చేసింది. క్రీజులో జడ్డూతో పాటు అక్షర్ పటేల్ (35 బ్యాటింగ్) ఉన్నాడు. ఓవర్‌నైట్ బ్యాటర్ యశస్వీ జైస్వాల్ (80) మరో నాలుగు పరుగులే చేసి అవుటవగా, భరత్ (41), శ్రేయాస్ (35) పర్వాలేదనిపించారు. మూడో రోజు వీలైనంత వేగంగా ఆడి 250+ ఆధిక్యం సాధించగలిగితే ప్రత్యర్థిపై పూర్తి పట్టు సాధించినట్టే. హార్ట్‌లీ, రూట్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.

నాలుగో బంతికే జైస్వాల్ అవుట్: వేగవంతమైన ఆటతీరుతో సెంచరీ సాధించేలా కనిపించిన జైస్వాల్ తొలి ఓవర్‌లోనే వెనుదిరిగాడు. స్పిన్నర్ రూట్‌తో రెండో రోజు బౌలింగ్‌ను ఆరంభించిన కెప్టెన్ స్టోక్స్ ఫలితం సాధించాడు. భారీ షాట్‌కు వెళ్లిన జైస్వాల్.. రూట్‌కే రిటర్న్ క్యాచ్ ఇచ్చాడు. అదే ఓవర్‌లో రాహుల్ క్యాచ్‌ను కీపర్ ఫోక్స్ అందుకోలేకపోయాడు. అనంతరం హార్ట్‌లీ ఓవర్‌లో వరుస ఫోర్లతో ఆకట్టుకున్నాడు. కాసేపటికే గిల్ (23) అనవసర షాట్‌కు వెళ్లి వికెట్ సమర్పించుకున్నాడు. అటు ఉడ్ ఓవర్‌లో రాహుల్ మూడు ఫోర్లతో జోరు తగ్గకుండా చూశాడు. శ్రేయా‌స్‌కు పేసర్ ఉడ్‌తో చెక్ పెట్టాలని చూసినా అతను ఓపిగ్గా ఎదుర్కొన్నాడు. అలాగే రాహుల్‌కు చక్కగా సహకరించడంతో ఓవరాల్‌గా ఈ సెషన్‌లో భారత్‌దే పైచేయి కనిపించింది.

కీలక భాగస్వామ్యాలు: లంచ్ బ్రేక్ తర్వాత ఆరంభంలోనే శ్రేయాస్ వికెట్‌ను స్పిన్నర్ రెహాన్ పడగొట్టడంతో నాలుగో వికెట్‌కు రాహుల్-శ్రేయాస్ 64 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ ఆ తర్వాత రాహుల్‌కు జడేజా జత కలవడంతో పరుగుల వేగం తగ్గలేదు. రెహాన్‌ను లక్ష్యంగా చేసుకున్న రాహుల్ 55వ ఓవర్‌లో రెండు ఫోర్లు, 57వ ఓవర్‌లో రెండు సిక్సర్లతో జట్టు స్కోరును 250కి చేర్చాడు. అటు జడ్డూ కూడా భారీ షాట్లతో చెలరేగాడు. అయితే ఆత్మవిశ్వాసంతో ఆడుతున్న రాహుల్‌ను హార్ట్‌లీ దెబ్బతీశాడు. ఐదో వికెట్‌కు ఈ ఇద్దరు 65 పరుగుల భాగస్వామ్యం అందించారు. ఆ తర్వాత జడేజా, భరత్ ఆచితూచి ఆడడంతో టీ విరామానికి ముందు 11 ఓవర్లలో ఒక్క ఫోర్ మాత్రమే నమోదైంది.

భారీ ఆధిక్యం దిశగా..: ఆఖరి సెషన్‌లో జడ్డూతో కలిసి భరత్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఇద్దరూ అనవసర షాట్లకు వెళ్లకుండా ఆధిక్యం పెంచే పనిలో పడ్డారు. అటు జడ్డూ అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా.. భరత్ కూడా కెరీర్‌లో తొలి హాఫ్ సెంచరీ చేస్తాడనిపించింది. కానీ మరోసారి బౌలింగ్‌కు వచ్చిన జో రూట్.. భరత్‌ను అవుట్ చేయడంతో ఆరో వికెట్‌కు 68 పరుగుల భాగస్వామ్యానికి చెక్ పడింది. ఆ వెంటనే అశ్విన్ (1) రనౌట్ అయినా.. అక్షర్ తన బ్యాటింగ్ నైపుణ్యంతో జడేజాతో కలిసి చక్కటి ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. రెండో రోజు ఆఖరి ఓవర్‌లో అక్షర్ వరుసగా 4,6,4తో అదరగొట్టడంతో ఎనిమిదో వికెట్‌కు అజేయంగా 63 పరుగులు జత చేరాయి.

ఒకే ఎండ్‌లో ఇద్దరూ..

బ్యాటింగ్‌కు చక్కగా సహకరిస్తున్న పిచ్‌పై అశ్విన్ ఒక్క పరుగు వద్దే దురదృష్టవశాత్తు రనౌట్ కావాల్సి వచ్చింది. 91వ ఓవర్‌లో కవర్స్ వైపు షాట్ ఆడి అశ్విన్ సింగిల్ కోసం వెళ్లాడు. అయితే నాన్‌స్ట్రయికర్ ఎండ్ నుంచి జడేజా సగం దూరం వెళ్లి.. వెనక్కి వచ్చాడు. అశ్విన్ కూడా అదే వైపునకు రావడంతో, అటు హార్ట్‌లీ నుంచి త్రో అందుకున్న కీపర్ ఫోక్స్ వికెట్లను గిరాటేశాడు. దీంతో అసహనంతో అశ్విన్ క్రీజును వీడాడు.

స్కోరుబోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 64.3 ఓవర్లలో 246 ఆలౌట్.

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి అండ్ బి) రూట్ 80; రోహిత్ (సి) స్టోక్స్ (బి) లీచ్ 24; గిల్ (సి) డకెట్ (బి) హార్ట్‌లీ 23; రాహుల్ (సి) రెహాన్ (బి) హార్ట్‌లీ 86; శ్రేయాస్ (సి) హార్ట్‌లీ (బి) రెహాన్ 35; జడేజా (బ్యాటింగ్) 81; భరత్ (ఎల్బీ) రూట్ 41; అశ్విన్ (రనౌట్) 1; అక్షర్ (బ్యాటింగ్) 35; **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 110 ఓవర్లలో 421/7; వికెట్ల పతనం:** 1-80, 2-123, 3-159, 4-223, 5-288, 6-356, 7-358; **బౌలింగ్:** ఉడ్ 13-0-43-0; హార్ట్‌లీ 25-0-131-2; లీచ్ 25-6-54-1; రెహాన్ 23-3-105-1; రూట్ 24-2-77-2.

విహారి, రికీ శతక మోత

రాయ్‌పూర్: హనుమ విహారి (119 నాటౌట్), కెప్టెన్ రికీ భుయ్ (120) శతకాల మోత మోగించారు. శుక్రవారం ఛత్తీస్‌గఢ్‌తో ఆరంభమైన రంజీ మ్యాచ్‌లో టాస్ కోల్పోయి బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర 6.4 ఓవర్లలో 41 పరుగులకే మూడు వికెట్లు నష్టపోయి కష్టాల్లో పడింది. ఈ దశలో జత కలిసిన విహారి-రికీ జోడీ ద్విశతక (231) భాగస్వామ్యాన్ని నెలకొల్పి, ఆంధ్ర ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టింది. దీంతో తొలి రోజు ఆట ముగిసేసరికి ఆంధ్ర 90 ఓవర్లలో 277/4 స్కోరు చేసింది. క్రీజులో విహారితో పాటు కరణ్ షిండే (3) ఉన్నారు.

కిరణ్ కూడా అవుట్

జకార్తా: ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత్ తరపున బరిలో మిగిలిన కిరణ్ జార్జ్ పోరాటం కూడా ముగిసింది. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో ప్రపంచ చాంపియన్ కున్లావత్ వితిసార్న్ (థాయ్‌లాండ్) 21-14, 21-6తో కిరణ్‌ను ఓడించాడు. స్టార్ షట్లర్లు ప్రణయ్, శ్రీకాంత్, లక్ష్యసేన్ ఇప్పటికే టోర్నీ నుంచి నిష్క్రమించిన సంగతి తెలిసిందే.

ఆసీస్ 289/9

విండీస్‌కు స్వల్ప ఆధిక్యం

బ్రిస్బేన్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టెస్టులో వెస్టిండీస్ 35 పరుగుల స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతోంది. శుక్రవారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 7.3 ఓవర్లలో వికెట్ నష్టానికి 13 పరుగులు చేసింది. అంతకుముందు విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 311 పరుగులు చేసింది. సింక్లెయిర్ (50) అర్ధసెంచరీ సాధించాడు. స్టార్క్‌కు నాలుగు వికెట్లు దక్కాయి. అనంతరం ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌ను 289/9 వద్ద డిక్లేర్ చేసింది. గాయంతో హాజెల్‌వుడ్ బ్యాటింగ్ చేయలేదు. జోసెఫ్‌కు నాలుగు, రోచ్‌కు మూడు వికెట్లు దక్కాయి.

షోయబ్ మాలిక్‌పై ఫిక్సింగ్ ఆరోపణలు

ఢాకా: పాకిస్థాన్ వెటరన్ ఆల్‌రౌండర్ షోయబ్ మాలిక్ మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణల్లో ఇరుక్కున్నాడు. బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ (బీపీఎల్)లో ఫార్చ్యూన్ బరిషల్ ఆటగాడైన మాలిక్ ఈనెల 22న ఖుల్నా టైగర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఒకే ఓవర్‌లో మూడు నోబాల్స్ వేయడం సందేహాలకు తావిచ్చింది. ఆ ఓవర్‌లో తను 18 రన్స్ ఇచ్చుకున్నాడు. అటు జట్టు కూడా ఓటమిపాలైంది. అలాగే అర్ధంతరంగా తను దుబాయ్‌కు వెళ్లిపోయాడు. ఓ ఆఫ్ స్పిన్నర్ ఇన్ని నోబాల్స్ వేయడాన్ని తీవ్రంగా పరిగణించిన ఫ్రాంచైజీ యాజమాన్యం మాలిక్‌తో ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్టు ఓ క్రీడా విలేఖరి ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. అయితే షోయబ్ మాత్రం ఈ కథనాలను తోసిపుచ్చాడు.



పైరేట్స్ అదుర్స్

పట్నా: ప్రొ కబడ్డీ లీగ్‌లో పట్నా పైరేట్స్ అద్భుత ప్రదర్శన చేసింది. శుక్రవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో స్థానిక జట్టు పట్నా 44-28తో బెంగాల్ వారియర్స్‌పై భారీ విజయాన్ని నమోదు చేసింది. మన్‌జీత్, నితిన్ రైడింగ్‌లో చెరో పది పాయింట్లు సాధించి పట్నా గెలుపులో కీలకపాత్ర పోషించారు. మరో మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 44-35తో యు ముంబాను ఓడించింది.

తన్మయ్..ఫాస్టెస్ట్ ట్రిపుల్



తన్మయ్ అగర్వాల్ (160 బంతుల్లో 323 బ్యాటింగ్)

147 బంతుల్లోనే బాదేసిన హైదరాబాద్ ఆటగాడు
రంజీలో రికార్డుల మోత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రంజీ ట్రోఫీలో హైదరాబాద్ ఆటగాడు తన్మయ్ అగర్వాల్ శివాలెత్తాడు. శుక్రవారం సొంతగడ్డపై అరుణాచల్‌ప్రదేశ్‌తో ఆరంభమైన రంజీ ప్లేట్ గ్రూప్ పోరులో తన్మయ్ పరుగుల సునామీ సృష్టించాడు. క్రికెట్ చరిత్రలోనే వేగవంతమైన ట్రిపుల్ సెంచరీ (33 ఫోర్లు, 21 సిక్సర్లతో 160 బంతుల్లో 323 బ్యాటింగ్) బాది సరికొత్త రికార్డు సృష్టించాడు. టీ20 మ్యాచ్ తరహాలో చెలరేగుతూ 147 బంతుల్లోనే 300 పరుగులు పూర్తిచేసి ఈ అరుదైన ఘనత అందుకున్నాడు. ఈ క్రమంలో 2017లో సౌతాఫ్రికా దేశవాళీ క్రికెట్‌లో బోర్డర్ జట్టు ఆటగాడు మార్కో మరైస్ (191 బంతుల్లో ట్రిపుల్ సెంచరీ) నెలకొల్పిన ఫాస్టెస్ట్ ట్రిపుల్ రికార్డును తన్మయ్ బద్దలు కొట్టాడు. ఇక, ఒకేరోజు 300పైగా పరుగులు చేయడం, ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీ (119 బంతుల్లో) చేసిన తొలి భారత ఆటగాడిగా తన్మయ్ మరో రెండు రికార్డులు నెలకొల్పాడు. గతంలో రవిశాస్త్రి (123 బంతుల్లో) పేరిటవున్న ఫాస్టెస్ట్ డబుల్ రికార్డు కనుమరుగైంది. కాగా, అరుణాచల్‌తో మ్యాచ్‌లో తన్మయ్‌కు తోడుగా కెప్టెన్ రాహుల్ సింగ్ (185) సెంచరీతో కదం తొక్కడంతో తొలిరోజు ఆట ముగిసేసరికి హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 48 ఓవర్లలో వికెట్ నష్టానికి 529 రన్స్ చేసింది. తన్మయ్, రాహుల్ తొలి వికెట్‌కు 449 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పడం విశేషం. క్రీజులో తన్మయ్, అభిరథ్ రెడ్డి (19) ఉన్నారు. అరుణాచల్ తొలి ఇన్నింగ్స్‌లో 172 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ బౌలర్లు మిలింద్, కార్తికేయ చెరో 3, తనయ్ 2 వికెట్లు తీశారు.

ఆస్ట్రేలియన్ ఓపెన్

జొకోవిచ్‌కు ఝలకిచ్చాడు



సిన్నర్

జొకోవిచ్

చాంపియన్‌ను చిత్తుచేసిన సిన్నర్
ఫైనల్లో మెద్వెదేవ్‌తో అమీతుమీ

మెల్‌బోర్న్: చిరకాల ప్రత్యర్థి నడాల్ టోర్నీలోనే లేడు.. తనకు పోటీ ఇస్తాడనుకున్న యువ కెరటం అల్కారజ్ వెనుదిరిగాడు.. ఇంకేం, అతనిదే ఆస్ట్రేలియన్ ఓపెన్.. పైగా, ఇక్కడ సెమీస్ చేరిన పదిసార్లూ టైటిల్ కొట్టిన ఘన చరిత్ర తనది.. ఇలా, ఎన్నో సానుకూలతలతో కోర్టులోకి అడుగుపెట్టిన డిఫెండింగ్ చాంపియన్ నొవాక్ జొకోవిచ్‌కు ఊహించని రీతిలో షాకిచ్చాడు ఇటలీ కుర్రాడు జానిక్ సిన్నర్. రికార్డుస్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ వేటలోవున్న ప్రపంచ నెంబర్‌వన్ జొకో 33 మ్యాచ్‌ల జైత్రయాత్రకు బ్రేక్‌వేస్తూ నాలుగోసీడ్ సిన్నర్ తొలిసారి ఓ మేజర్ టోర్నీలో ఫైనల్‌కు దూసుకెళ్లాడు. శుక్రవారం ఇక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో 22 ఏళ్ల సిన్నర్ 6-1, 6-2, 6-7(6), 6-3తో 36 ఏళ్ల జొకోవిచ్‌ను చిత్తుచేశాడు. నిరుడు వింబుల్డన్ సెమీస్ చేరడమే గ్రాండ్‌స్లామ్‌లో సిన్నర్ అత్యుత్తమ ప్రదర్శన. అంతేకాదు.. ఆనాడు సెమీస్‌లో జొకో చేతిలోనే ఎదురైన ఓటమికి తాజా గెలుపుతో ప్రతీకారం తీర్చుకున్నట్టయింది. 3 గంటలా 22 నిమిషాల పాటు సాగిన పోరులో మూడోసెట్ మినహా ఏ దశలోనూ సిన్నర్‌కు జొకో పోటీ ఇవ్వలేకపోయాడు. 4 డబుల్‌ఫాల్ట్స్ చేసిన జొకో.. 54 అనవసర తప్పిదాలకు పాల్పడి మూల్యం చెల్లించుకున్నాడు. జొకో 7 ఏస్‌లు, 32 విన్నర్లు సంధించగా.. సిన్నర్ 9 ఏస్‌లు, 31 విన్నర్లతో బెంబేలెత్తించాడు. 2018లో నాలుగో రౌండ్ ఓటమి తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఇప్పటిదాకా ఆడిన ప్రతిసారీ జొకో చాంపియన్‌గా నిలిచాడు. కానీ, ఈసారి సిన్నర్ చేతిలో ఓటమితో జొకో జైత్రయాత్రకు బ్రేక్ పడింది. ఆదివారం జరిగే ఫైనల్లో రష్యా స్టార్ డానిల్ మెద్వెదేవ్‌తో సిన్నర్ తలపడనున్నాడు. మరో సెమీస్‌లో మూడో సీడ్ మెద్వెదేవ్ 5-7, 3-6, 7-6 (4), 7-6 (5), 6-3తో ఆరోసీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)పై గెలుపొందాడు. కాగా, జొకోవిచ్ (2008) తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్ ఆడనున్న పిన్న వయసు ఆటగాడిగా సిన్నర్ రికార్డులకెక్కనున్నాడు.

మహిళల సింగిల్స్ ఫైనల్ నేడు
సబలెంకా × కిన్వెన్ జెంగ్ — మధ్యాహ్నం 2 గం. నుంచి
పురుషుల డబుల్స్ టైటిల్ పోరు
రోహన్ బోపన్న/ఎబ్డెన్ — మధ్యాహ్నం 3.15 నుంచి
ప్రత్యక్ష ప్రసారం సోనీ నెట్‌వర్క్‌లో

బిజినెస్

పాలసీదారుల ప్రయోజనాలే ముఖ్యం

» బలవంతంగా పాలసీలు అంటగట్టొద్దు
» ఐఆర్‌డీఏఐ చీఫ్ దేబాశిష్ పాండా



హైదరాబాద్: బీమా కంపెనీల అనైతిక విధానాలపై భారత బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) చైర్మన్ దేబాశిష్ పాండా మరోసారి అసంతృప్తి వ్యక్తం చేశారు. పాలసీదారుల ప్రయోజనాలే పరమావధిగా పని చేయాలని కంపెనీలను కోరారు. బీమా పాలసీల విక్రయంలో అనైతిక విధానాలను కట్టిపెట్టి, నిబంధనలకు కట్టుబడి పని చేయాలన్నారు. హైదరాబాద్‌లో జరిగిన బీమా మంథన్ సదస్సులో పాండా ఈ వ్యాఖ్యలు చేశారు. బీమా కంపెనీల సీఈఓలు, పలువురు పరిశ్రమ ప్రముఖులు ఈ సదస్సుకు హాజరయ్యారు. బీమా పాలసీల మార్కెటింగ్, తప్పుడు హామీలు లేదా బలవంతంగా పాలసీల విక్రయం, క్లెయిమ్‌ల సత్వర పరిష్కారం వంటి అనేక అంశాలు ఈ సదస్సులో చర్చకు వచ్చాయి. అన్ని వర్గాలకు అందుబాటు ధరల్లో బీమా పాలసీల అంశమూ ఈ సదస్సులో చర్చకు వచ్చింది.

టీసీఎస్‌తో డీల్‌కు ఆక్స్‌ఫర్డ్ గుడ్‌బై

న్యూఢిల్లీ: విద్యార్థుల ప్రవేశ పరీక్షల కోసం గత ఏడాది టీసీఎస్‌తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ రద్దు చేసుకుంది. ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ పరీక్షల్లో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నట్టు విద్యార్థులు, టీచర్ల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ఈ చర్య తీసుకుంది. బ్రిటన్‌లోని 30 కాలేజీల్లో అండర్ గ్రాడ్యుయేట్, పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ఏటా ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తుంది. ఈ టెస్టుల నిర్వహణ కాంట్రాక్టును ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ఈ ఏడాది నుంచి టీసీఎస్ అనుబంధ సంస్థ టీసీఎస్ అయాన్‌కు అప్పగించింది. అయితే తొలి ఏడాదే పలు సాంకేతిక సమస్యలు ఎదురైనట్టు విద్యార్థులు, టీచర్లు ఫిర్యాదు చేశారు. దీంతో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ఏకంగా ఈ కాంట్రాక్టును రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది.

భారత్‌లో తొలి ఏఐ యూనికార్న్ కృత్రిమ్

న్యూఢిల్లీ: ఓలా గ్రూప్‌నకు చెందిన కృత్రిమ మేధ (ఏఐ) స్టార్టప్ కృత్రిమ్ తాజాగా 100 కోట్ల డాలర్ల క్లబ్‌లోకి చేరింది. తద్వారా దేశంలో తొలి ఏఐ యూనికార్న్ సంస్థగా అవతరించింది. కనీసం 100 కోట్ల డాలర్ల మార్కెట్ విలువను కలిగిన స్టార్టప్‌లను యూనికార్న్‌లుగా పిలుస్తారు. తొలి రౌండ్ నిధుల సమీకరణలో భాగంగా మ్యాట్రిక్స్ పార్ట్‌నర్స్ సహా పలు ఇన్వెస్టర్ల నుంచి కృత్రిమ్ 5 కోట్ల డాలర్లు సమీకరించింది. ఆ సందర్భంగా కంపెనీ మార్కెట్ విలువను వంద కోట్ల డాలర్లుగా లెక్కించారు. కృత్రిమ్ పూర్తి ఏఐ కంప్యూటింగ్ స్టాక్‌ను అభివృద్ధి చేస్తోంది. దేశంలో ఇదే తొలి పూర్తి ఏఐ కంప్యూటింగ్ స్టాక్ కానుంది. దేశంలోని అన్ని భాషల కోసం చాట్‌జీపీటీ లాంటి జనరేటివ్ అప్లికేషన్లను రూపొందిస్తోంది.

ఈ-కామర్స్ మార్కెట్లో ఫ్లిప్‌కార్ట్ నం.1



ఈ ప్లాట్‌ఫామ్‌దే 48% మార్కెట్ వాటా

» వేగంగా వృద్ధి చెందుతున్న పోర్టల్ మీషో
» వెల్లడించిన అలియన్స్ బెర్న్‌స్టీన్ నివేదిక

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2022-23) నాటికి వాల్‌మార్ట్ గ్రూప్‌నకు చెందిన ఫ్లిప్‌కార్ట్ 48 శాతం మార్కెట్ వాటాతో భారత ఈ-కామర్స్ రంగంలో అగ్రగామి సంస్థగా నిలిచిందని అలియన్స్ బెర్న్‌స్టీన్ తాజా నివేదిక వెల్లడించింది. అలాగే, సాఫ్ట్‌బ్యాంక్ పెట్టుబడులు కలిగిన మీషో దేశంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆన్‌లైన్ కామర్స్ పోర్టల్ అని రిపోర్టు తెలిపింది. ఈ నివేదిక ప్రకారం.. ఫ్లిప్‌కార్ట్ వినియోగదారులు వార్షిక ప్రాతిపదికన 21 శాతం వృద్ధి చెందగా.. మీషో యూజర్ బేస్ 32 శాతం పుంజుకుంది. అమెజాన్ కస్టమర్ల వృద్ధి 13 శాతానికి పరిమితమైంది. ఇతర పోర్టళ్లతో పోలిస్తే అమెజాన్ కొంత ప్రీమియం ఉత్పత్తులను ఆఫర్ చేస్తుండటం ఇందుకు కారణం. మరిన్ని విషయాలు..

ఫ్లిప్‌కార్ట్ ఇండస్ట్రీ కంటే వేగంగా వృద్ధి చెందుతోంది. ఈ ప్లాట్‌ఫామ్‌లో మొబైల్స్ (50 శాతం), వస్త్రాలే (30 శాతం) అత్యధికంగా అమ్ముడవుతున్న కేటగిరీలు. ఈ సంస్థ ఆన్‌లైన్ స్మార్ట్‌ఫోన్ విభాగంలో 48 శాతం, ఫ్యాషన్ విభాగంలో 60 శాతం మార్కెట్ వాటా కలిగి ఉంది.

నెలకు సగటున 12 కోట్ల మంది యాక్టివ్ యూజర్లతో మీషో వేగంగా వృద్ధి చెందుతున్న పోర్టల్‌గా నిలిచింది. ద్వితీయ, చిన్న నగరాలపై దృష్టి సారించడం, జీరో కమీషన్ మోడల్ మీషో వినియోగదారుల శరవేగ వృద్ధికి దోహదపడుతోంది.

గడిచిన ఏడాదికాలంలో మీషో ఆర్డర్లు 43 శాతం వృద్ధి చెందగా.. రెవెన్యూ 54 శాతం పెరిగింది. రిపీట్ కస్టమర్ల రేటు 80 శాతంగా ఉంది.

నీల్సన్ మీడియా అధ్యయనం ప్రకారం.. అమెజాన్ ఇండియా ప్రాధాన్యమైన ఆన్‌లైన్ కామర్స్ బ్రాండ్‌గా ఉంది.

ఫ్యాషన్ ఈ-కామర్స్ విభాగంలో రిలయన్స్ అజియో కస్టమర్లను వేగంగా పెంచుకోగలుగుతోంది. నెలవారీ యాక్టివ్ యూజర్ల పరంగా ఈ పోర్టల్ 30 శాతం మార్కెట్ వాటా కలిగి ఉంది. అయితే, ఈ విభాగంలో యాక్టివ్ యూజర్ల పరంగా 50 శాతానికి పైగా మార్కెట్ వాటాతో ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన మింత్రా అగ్రగామి పోర్టల్‌గా కొనసాగుతోంది.

ఆన్‌లైన్‌లో కిరాణా సరుకుల విక్రయ (ఈ-గ్రాసరీ) ప్లాట్‌ఫామ్స్ విషయానికొస్తే.. బ్లింకిట్ 40 శాతం మార్కెట్ వాటాతో అగ్రగామిగా ఉంది. ఇన్‌స్టామార్ట్ 37-39 శాతం, జెప్టో 20 శాతం మార్కెట్ వాటా కలిగి ఉన్నాయి.

భారత్‌లో ఎయిర్‌బస్ హెలికాప్టర్ల తయారీ కేంద్రం

» టాటా గ్రూప్ సంస్థ టీఏఎస్ఎల్‌తో ఒప్పందం
» హెచ్125 హెలికాప్టర్ల తయారీ



ముంబై: భారత్‌లో హెలికాప్టర్ల తయారీ కోసం ఫైనల్ అసెంబ్లీ లైన్ (ఎఫ్ఏఎల్)ను ఏర్పాటు చేసేందుకు టాటా గ్రూప్‌తో ఫ్రాన్స్‌కు చెందిన విమాన తయారీ దిగ్గజం ఎయిర్‌బస్ జట్టు కట్టింది. ఒప్పందంలో భాగంగా టాటా గ్రూప్ అనుబంధ సంస్థ సంస్థ టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్), ఎయిర్‌బస్ హెలికాప్టర్స్ సంయుక్తంగా ఈ హెలికాప్టర్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నాయి. దేశీయంగా తయారీ సామర్థ్యాలను మరింతగా విస్తరించేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని ఇరు సంస్థలు పేర్కొన్నాయి. కాగా ఎయిర్‌బస్ ఇప్పటికే గుజరాత్‌లోని వడోదరలో సీ295 మిలిటరీ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తోంది. తాజాగా పౌర అవసరాల కోసం హెచ్125 హెలికాప్టర్ల తయారీ కోసం ఫైనల్ అసెంబ్లీ లైన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. భారత్ సహా పొరుగు దేశాలకు ఈ హెలికాప్టర్లను ఇక్కడి నుంచి ఎగుమతి చేయనున్నారు. భారత్‌లో ఎయిర్‌బస్ ఏర్పాటు చేస్తున్న రెండో ప్లాంట్ ఇది. అంతేకాకుండా ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమం కింద దేశీయంగా ప్రైవేట్ రంగంలో ఏర్పాటు అవుతున్న తొలి హెలికాప్టర్ తయారీ కేంద్రం కూడా ఇదే. ఈ ప్లాంట్‌ను రెండేళ్లలో పూర్తి చేసి 2026 నాటికి తొలి మేడిన్ ఇండియా హెచ్125 హెలికాప్టర్ డెలివరీలను ప్రారంభించాలని టీఏఎస్ఎల్, ఎయిర్‌బస్ భావిస్తున్నాయి. అయితే ఈ హెలికాప్టర్ తయారీ కేంద్రాన్ని ఎక్కడ ఏర్పాటు చేసేది తర్వాత నిర్ణయించనున్నారు.

కాగా ఈ ప్లాంట్ పెట్టుబడుల వివరాలను కూడా ఇరు కంపెనీలు వెల్లడించలేదు. మేడిన్ ఇండియా సివిల్ హెలికాప్టర్ తయారీ ద్వారా సరికొత్త భారత్ ఆవిష్కృతం అవటమే కాకుండా దేశీయంగా హెలికాప్టర్ మార్కెట్లో ఉన్న అవకాశాలను దక్కించుకునే అవకాశం లభిస్తుందని ఎయిర్‌బస్ సీఈఓ గులియమ్ ఫౌరీ అన్నారు. భారత్‌లో ఏరోస్పేస్ ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేయటానికి ఎయిర్‌బస్ కట్టుబడి ఉందని చెప్పటానికి ఇది ఒక నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ రంగంలో తొలి హెలికాప్టర్ అసెంబ్లింగ్ కేంద్రాన్ని టాటా గ్రూప్ ఏర్పాటు చేస్తుండటం ఎంతో సంతోషాన్ని ఇస్తోందని టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ అన్నారు.

హైదరాబాద్‌లో ఓలా ఈ-బైక్ ట్యాక్సీ సేవలు



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ద్వారా వాహనాల బుకింగ్ సేవలందించే ఓలా మొబిలిటీ.. ఢిల్లీ, హైదరాబాద్‌లో ఈ-బైక్ ట్యాక్సీ సర్వీసును ప్రారంభిస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. గత ఏడాది సెప్టెంబరులోనే కంపెనీ పైలట్ ప్రాజెక్టుగా ఈ సర్వీసును బెంగళూరులో ప్రారంభించింది. ఈ సేవలందించేందుకు వచ్చే రెండు నెలల్లో మూడు నగరాల్లో 10,000 ఎలక్ట్రిక్ టూవీలర్లను అందుబాటులోకి తేనున్నట్లు ఓలా మొబిలిటీ వెల్లడించింది. తద్వారా దేశంలో అతిపెద్ద ఈవీ టూ వీలర్ రెంటల్ నెట్‌వర్క్‌గా అవతరించనుంది. అంతేకాదు, ఈ ఏడాది చివరినాటికి ఈ-బైక్ ట్యాక్సీ సర్వీసును దేశవ్యాప్తంగా విస్తరింపజేయాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. 5 కిలోమీటర్ల ప్రయాణానికి రూ.25 ప్రారంభ రుసుముతో ఓలా ఈ-బైక్ సర్వీసును ఆఫర్ చేస్తోంది. 10 కిలోమీటర్లకు రూ.50, 15 కిలోమీటర్లకు రూ.75 చెల్లించాల్సి ఉంటుంది.

‘జీ’తో డిస్నీ స్టార్ అమీతుమీ!

రూ.11,650 కోట్ల డీల్ నుంచి తప్పుకున్న జీ గ్రూప్
న్యాయస్థానంలో తేల్చుకునే యోచనలో డిస్నీ స్టార్

న్యూఢిల్లీ: జీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో న్యాయ పోరాటానికి డిస్నీ స్టార్ సిద్ధమవుతోంది. భారత్‌లో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌ల టీవీ ప్రసారం కోసం గతంలో కుదుర్చుకున్న 140 కోట్ల డాలర్ల (దాదాపు రూ.11,650 కోట్లు) విలువైన సబ్-లైసెన్సింగ్ అగ్రిమెంట్ నుంచి జీ గ్రూప్ తప్పుకున్న నేపథ్యంలో డిస్నీ స్టార్ ఈ దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిసింది. అగ్రిమెంట్ నుంచి తప్పుకున్నందుకు నష్టపరిహారం చెల్లించాలంటూ ఆర్బిట్రేషన్ కోర్టును ఆశ్రయించే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఈ అగ్రిమెంట్‌లో భాగంగా సోనీకి తొలి విడతగా 20 కోట్ల డాలర్ల చెల్లింపుల్లో విఫలమైన జీ.. ఒప్పందంపై ముందుకెళ్లలేమని ఈ వారంలోనే చేతులెత్తేసింది. ఈ పరిణామం జీ గ్రూప్ ప్రస్తుత ఇబ్బందులను మరింత పెంచనుంది. ఎందుకంటే, జీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో రెండేళ్ల క్రితం కుదుర్చుకున్న విలీన ఒప్పందాన్ని రద్దు చేసుకున్న సోనీ గ్రూప్.. ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించడంతో పాటు మధ్యవర్తిత్వం కోరిన నేపథ్యంలో బ్రేకప్ ఫీజు కింద 9 కోట్ల డాలర్లు (రూ.747 కోట్లు) చెల్లించాలని డిమాండ్ చేసింది. ఇందుకు సంబంధించి సోనీ గ్రూప్ సింగపూర్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్‌లో పిటిషన్ కూడా దాఖలు చేసింది.

టెక్ దిగ్గజాల కొలువుల కోత

మైక్రోసాఫ్ట్‌లో 1,900 మంది ఔట్

న్యూయార్క్: అమెరికాలో కొలువుల కోత కొనసాగుతోంది. టెక్ దిగ్గజాలు వరుస పెట్టి ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ కంపెనీ తన గేమింగ్ డివిజన్‌లో 1,900 మందిని ఇంటికి పంపిస్తున్నట్టు ప్రకటించింది. గేమింగ్ డివిజన్‌లో ఉన్న మొత్తం 22,000 మంది ఉద్యోగుల్లో ఇది 8 శాతానికి సమానం.

సేల్స్‌ఫోర్స్‌లో 700 మంది: క్లౌడ్ ఆధారిత సాఫ్ట్‌వేర్ సేవలు అందించే ‘సేల్స్‌ఫోర్స్’ మరోసారి ఉద్యోగాల కోతకు దిగింది. దాదాపు 700 మందిని తీసివేస్తున్నట్టు తెలిపింది. కంపెనీ మొత్తం ఉద్యోగుల్లో ఇది దాదాపు ఒక శాతానికి సమానం. ఖర్చులు తగ్గింపు పేరుతో గత ఏడాది కూడా సేల్స్‌ఫోర్స్ 8,000 మందిని ఇంటికి పంపించింది. అది చాలదన్నట్టు ఈ సంవత్సరం మళ్లీ కొత్తగా మరో 700 మందిపై వేటు వేస్తోంది.

లెవిస్ స్ట్రాస్‌లోనూ: ప్రముఖ దుస్తుల కంపెనీ లెవిస్ స్ట్రాస్ కూడా కొలువుల కోతకు దిగింది. వ్యాపార పునర్ వ్యవస్థీకరణలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తన ఉద్యోగుల్లో 10 నుంచి 15 శాతం మందిని తీసివేస్తున్నట్టు ప్రకటించింది. ఈ సంవత్సరం కూడా మార్కెట్ పరిస్థితులు అంత అనుకూలంగా లేకపోవడంతో ఈ చర్య తీసుకున్నట్టు తెలిపింది. ఈ ఏడాది జూన్‌లోగా ఈ కోతలు అమలు చేయనున్నట్టు ప్రకటించింది.

స్విగ్గీలో 400 మంది ఔట్: మన దేశానికి చెందిన స్విగ్గీ కూడా కొలువుల కోతలకు సిద్ధమైంది. టెక్నాలజీ, కాల్ సెంటర్, కార్పొరేట్ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగుల్లో 350 నుంచి 400 మందిని ఇంటికి పంపించేందుకు సిద్ధమైంది. వచ్చే కొద్ది వారాల్లోనే ఈ కోతలు ఉంటాయని సమాచారం.

అదానీ గ్రూప్‌లోకి మరో 6 జెట్ విమానాలు

» రూ.300 కోట్లకు కొనుగోలు

ముంబై: అపర కుబేరుడు గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ తన టాప్ ఎగ్జిక్యూటివ్‌ల ప్రయాణ సౌలభ్యం కోసం మరో 6 బిజినెస్ జెట్ విమానాలను రూ.300 కోట్లకు కొనుగోలు చేయనుంది. స్విట్జర్లాండ్‌కు చెందిన పిలాటస్ ఎయిర్‌క్రాఫ్ట్ కంపెనీ నుంచి పిలాటస్ పీసీ-24 మోడల్‌కు చెందిన ఆరు జెట్ విమానాల కోసం గ్రూప్ ఇప్పటికే ఆర్డర్ చేసినట్లు తెలిసింది. తద్వారా గ్రూప్ నెట్‌వర్క్‌లోని బిజినెస్ జెట్ విమానాల సంఖ్య 12కు చేరుకోనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



26వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	540
27 జనవరి		విశాఖపట్నం	565
చిత్తూరు	573	వరంగల్	542
గోదావరి	540	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	గోదావరి	111
వరంగల్	107	విజయవాడ	111
కరీంనగర్	107	గుంటూరు	112
మహబూబ్‌నగర్	107	ఒంగోలు	112
కర్నూలు	107	చిత్తూరు	115
విశాఖపట్నం	108		


తమ్మినేని వీరభద్రంతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

స్పీకర్ గడ్డం ప్రసాద్, తమ్మినేనికి సీఎం పరామర్శ

హైదరాబాద్ సిటీ, హిమాయత్‌నగర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన స్పీకర్ గడ్డం ప్రసాద్ చికిత్స అనంతరం రెండ్రోజుల క్రితం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. దీంతో హైదర్‌గూడ, కొత్త ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని స్పీకర్ నివాసానికి శుక్రవారం ఉదయం స్వయంగా వెళ్లిన సీఎం ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పూర్తిగా కోలుకున్నానని స్పీకర్ గడ్డం ప్రసాద్ ముఖ్యమంత్రికి చెప్పారు. అనంతరం, గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి వెళ్లిన ముఖ్యమంత్రి కొద్దిరోజులుగా అక్కడ చికిత్స పొందుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను పరామర్శించారు. త్వరగా కోలుకుని ప్రజా క్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు. ఆ సమయంలో వారి మధ్య పలు రాజకీయ అంశాలు చర్చకు వచ్చాయి. ఇటీవల తాను ఇచ్చిన వినతి పత్రంలోని సమస్యల పరిష్కారం అంశాన్ని తమ్మినేని ప్రస్తావించగా.. వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని సీఎం చెప్పారు. ఏఐజీ ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి.. తమ్మినేని ఆరోగ్య పరిస్థితిని సీఎంకు తెలియజేశారు.

ఇదే ఒరవడి కొనసాగాలి



» రేవంత్ పాలనపై జానారెడ్డి

హైదరాబాద్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నెల రోజుల పాలన చూస్తుంటే సంతోషంగా ఉందని, ప్రజాపాలన ఒరవడితో ముందుకు వెళుతోందని మాజీ మంత్రి జానారెడ్డి కితాబునిచ్చారు. ఈ ప్రభుత్వం.. ప్రజల మధ్య ఉందన్న భావన కలుగుతోందన్నారు. మేధావులు, ప్రజాసంఘాలు, పార్టీల సలహాలు తీసుకుంటూ ఇదే ఒరవడిని కొనసాగించాలని శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గత పరిస్థితులను వివరిస్తూ.. సమస్యలను అధిగవింంచే ప్రయత్నం చేస్తోందని, ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేందుకు కసరత్తు చేస్తోందని కొనియాడారు. ఈ ప్రజాపాలనలో తనవంతు పాత్ర నిర్వహిస్తానన్నారు. తన అనుభవం, సలహాలను ప్రభుత్వానికి ఇవ్వడానికి ఎప్పుడూ సిద్ధమేనని చెప్పారు. అప్పులు, విద్యుత్తు కొనుగోళ్లు భవిష్యత్తులో ప్రమాదకరంగా మారతాయని తాను ఆనాడు చెప్పింది నేడు నిజమైందన్నారు. కాగా, రాష్ట్రంలో 50 రోజుల కాంగ్రెస్ పాలన పట్ల మహిళల్లో విశ్వాసం పెరిగిందని సినీనటి, కాంగ్రెస్ నేత దివ్యవాణి అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు ప్రయోజనం పొందుతున్నారని పేర్కొన్నారు.

రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు

» ప్రొఫెసర్ కోదండరాం



హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): టీజేఎస్ నేతలు చేసిన సేవ వల్లే ప్రభుత్వం తనను ఎమ్మెల్సీగా చేసిందని ఆ పార్టీ అధినేత ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఎమ్మెల్సీని చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి మాట ఇచ్చి నిలబెట్టుకున్నారని తెలిపారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కోదండరాం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ సహా చాలా మంది రాజ్యాంగం మార్చాలంటున్నారని, చైనా, సింగపూర్‌లలో ఉన్న నియంతృత్వ పాలన ఉండాలని చూస్తున్నారన్నారు. తెలంగాణ ఉద్యమం అంతా రాజ్యాంగ విలువల ప్రకారమే జరిగిందని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 లేకుంటే చిన్న రాష్ట్రాలకు స్వేచ్ఛ ఉండేది కాదన్నారు. రాష్ట్రంలో ఆశించిన మార్పుల కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. కాగా, ఎమ్మెల్సీగా నియమితులైన కోదండరాంను డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ, అసోసియేట్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, పులి సైదులు, తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మోదీని గద్దె దించాలి.. దేశాన్ని కాపాడాలి

» వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

న్యూఢిల్లీ, జనవరి 26(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశవ్యాప్తంగా రైతాంగానికి తీవ్రనష్టం కలిగించే విధానాలను తీసుకుందని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ఆరోపించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాతో నడుస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించి మోదీ ఫాసిస్టు విధానాలకు చరమగీతం పాడాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర నూతన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా 2021 జనవరి 26న రైతులు నిర్వహించిన 'మార్చ్ టూ పార్లమెంట్' సందర్భంగా మోదీ ప్రభుత్వం అణచివేత చర్యలకు పాల్పడిందని నిరసన వ్యక్తం చేస్తూ శుక్రవారం ఢిల్లీ సరిహద్దులలో రైతులు, కార్మికులు ట్రాక్టర్ పరేడ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా బి.వెంకట్ మాట్లాడుతూ.. మోదీ తన విధానాలతో వ్యవసాయాన్ని వినాశనంవైపు తీసుకెళుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలి: కడియం

» తీన్మార్ మల్లన్న చోటా నయీమ్: పల్లా

జనగామ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): తమిళిసై లాంటి గవర్నర్‌ను చూశాక గవర్నర్ వ్యవస్థపై నమ్మకం పోయిందని, ఇలాంటి తరుణంలో గవర్నర్ వ్యవస్థను రద్దు చేయడమే మంచిదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జనగామలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ విలువలను కాపాడాలన్న విషయాన్ని మరిచిపోయి బీజేపీ ప్రతినిధిలాగా గవర్నర్ తమిళిసై మాట్లాడుతున్నారని విమర్శించారు. రాజ్యాంగం పట్ల కనీస అవగాహన, పరిజ్ఞానం లేని తమిళిసై లాంటి వారిని గవర్నర్‌గా తీసుకొస్తే పరిస్థితి ఇలాగే ఉంటుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం, గవర్నర్ మధ్య విభేదాలు సహజమని, వాటిని రచ్చకెక్కించొద్దనే ఇంగితజ్ఞానం గవర్నర్‌కు లేదని మండిపడ్డారు. గత ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను గవర్నర్ వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. పోలీసులు, ఇంటెలిజెన్స్ విభాగం కలిసి తీన్మార్ మల్లన్న అనే చోటా నయీమ్‌ను తయారు చేశారని విమర్శించారు. తీన్మార్ మల్లన్న ఘట్కేసర్, మేడ్చల్ ప్రాంతాల్లో గూండాలను పంపించి వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. చోటా నయీమ్‌తో కుమ్మక్కు అయి ప్రజలను పీడించడం మంచిది కాదని పోలీసులు, ఇంటలిజెన్స్ అధికారులకు హితవు పలికారు. తనపై ఎన్ని కేసులు పెట్టినా భయపడే వ్యక్తిని కాదని అన్నారు.

ఎంపీ టికెట్ కోసం రూ.15 కోట్లు అడిగారు

» డీకే అరుణపై వంశీచంద్‌రెడ్డి ఆరోపణ

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున మహబూబ్‌నగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు మాజీ మంత్రి, ప్రస్తుత బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ రూ.15 కోట్లు అడిగారని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి ఆరోపించారు. గాంధీభవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తనను డీకే అరుణ డబ్బులు అడిగిన విషయమై ప్రమాణం చేసేందుకు తాను సిద్ధమన్నారు. ఈ నెల 28న ఉదయం 11 గంటలకు మహబూబ్‌నగర్‌లోని టీచర్స్ కాలనీలో ఉన్న రామమందిరానికి ప్రమాణం చేసేందుకు వస్తానని చెప్పారు. రాముడిపై భక్తి ఉన్నది తనకా, డీకే అరుణకా అన్నది తేలిపోతుందన్నారు. అవకాశవాద రాజకీయాలకు మారుపేరు డీకే అరుణ అని విమర్శించారు. తాను డబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తినే అయితే డీకే అరుణలా బంగ్లాలు కట్టుకునే వాడినని ఆయన పేర్కొన్నారు.

కాళేశ్వరంపై చెరో దారి!

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టారు. అందులో 30 శాతం పనులు కూడా పూర్తయ్యాయి. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక బీఆర్‌ఎస్ ప్రభుత్వం రీ ఇంజనీరింగ్ పేరుతో ఏకంగా రూ.1,27,872 కోట్లతో కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని చేపట్టింది.

గ్రావిటీ ప్రాజెక్టును పక్కన పెట్టి కాళేశ్వరం..

ప్రాణహిత-చేవెళ్లలో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం చేపట్టి, గ్రావిటీతో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటిని తరలించడానికి అవకాశం ఉండగా.. గత ప్రభుత్వం గ్రావిటీ ప్రాజెక్టును పక్కనపెట్టింది. రీ ఇంజనీరింగ్ పేరుతో మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టి, అక్కడి నుంచి అన్నారం, అన్నారం నుంచి సుందిళ్లకు, సుందిళ్ల నుంచి ఎల్లంపల్లికి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని తరలించాలని నిర్ణయించింది. అయితే దీనివల్ల నీటి తరలింపు వ్యయం భారీగా పెరిగిందని నిపుణులు, పలువురు ఇంజనీర్లు బహిరంగంగానే అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా.. తగిన అవసరం లేకున్నా కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో ఏకంగా రూ.33,459 కోట్లతో అదనపు టీఎంసీని చేపట్టారన్న విమర్శలు కూడా వచ్చాయి. తాజాగా కాళేశ్వరంలోని అన్ని ప్యాకేజీల్లోనూ అవినీతి చోటుచేసుకుందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రాజెక్టులోని అన్ని కాంపోనెంట్లను కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా(కాగ్) కూడా జల్లెడ పట్టి, కాళేశ్వరం ఆర్థికంగా కూడా అంతగా ఉపయోగం లేని ప్రాజెక్టుగా తేల్చి చెప్పింది. కాగ్‌లాగే కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్ని కాంపోనెంట్లపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో సమగ్రంగా విచారణ జరిపించి.. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. కానీ, అమాత్యుడి ఆలోచన మాత్రం మరో విధంగా ఉందని సమాచారం. ఈ మేరకు ఎవరి ఆలోచనకు తగ్గట్లుగా వారు విచారణపై ఆదేశాలిచ్చినట్లు తెలిసింది. మరోవైపు ప్రాజెక్టు నిర్మాణ లోపాలపై ఏడాదిన్నరగా విచారణ జరుపుతున్న కాగ్.. 2023 మార్చిలో ఓసారి, ఆ తర్వాత ప్రభుత్వ వివరణ అనంతరం అక్టోబరులో ఇంకోసారి ముసాయిదా నివేదికను అందించింది. ఆ రెండు నివేదికలను సమగ్రంగా పరిశీలించినా పూర్తి వివరాలు వెల్లడవుతాయంటున్నారు.

ప్రాథమిక నివేదిక ఇచ్చినా లోతుగా వెళ్లాల్సిందే!

కాళేశ్వరం ప్రాజెక్టులోని కుంగుబాటుకు గురైన మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ వ్యయం రూ.3625.82 కోట్లు. కాళేశ్వరంలోని హెడ్‌వర్క్స్‌లుగా పేరున్న మూడు బ్యారేజీల (మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల) వ్యయాలు కలిపితే రూ.7,516 కోట్లు. మొత్తం ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయమైతే రూ.1,27,872 కోట్లు. ఇందులో ఇప్పటిదాకా రూ.93,872 కోట్ల దాకా వెచ్చించారు. ఈ నేపథ్యంలో కనీసం 4నెలలపాటైనా ప్రాజెక్టుపై విచారణ జరిగితేనే.. లోపాలన్నీ బయటపడతాయని సీఎం భావిస్తున్నారు. మంత్రి మాత్రం మేడిగడ్డకే విచారణను పరిమితం చేసి, 20 రోజుల్లోనే నివేదికను ఇవ్వాలని అంటున్నట్లు సమాచారం. ఒకవేళ 20 రోజుల్లో ప్రాథమిక నివేదిక ఇచ్చినా.. ఆ తర్వాత అన్ని అంశాలపై మరింత లోతుగా విచారణ కొనసాగించాలని సీఎంవో వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇదిలా ఉండగా 2022 జూలై వరదలకు మేడిగడ్డ(కన్నెపల్లి) పంప్‌హౌస్ దెబ్బతిని.. ఏకంగా రూ.500 కోట్లకు పైనే నష్టం వాటిల్లింది. ఇప్పటికీ అదనపు టీఎంసీకి చెందిన ఐదు మోటార్లు అందుబాటులోకి రాలేదు. అయితే మేడిగడ్డ, అన్నారం పంప్‌హౌస్‌లను పూర్తి రిజర్వాయర్ లెవల్ (ఎఫ్‌ఆర్‌ఎల్)కు దిగువనే కట్టారని విమర్శలు వచ్చాయి. మళ్లీ పంప్‌హౌస్‌లు మునుగుతాయని, నష్టం తప్పదని ఎత్తిపోతల పథకాల సలహాదారు పెంటారెడ్డి బహిరంగంగానే వ్యాఖ్యానించారు.

త్వరలోనే ప్రజల్లోకి వస్తా

రాష్ట్రం కోసం పోరాడేది బీఆర్‌ఎస్సే.. ప్రజల్లో మార్పు కనిపిస్తోంది: కేసీఆర్


బీఆర్‌ఎస్ పీపీ సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్, చిత్రంలో కేకే

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): 'క్షేత్రస్థాయిలో బీఆర్‌ఎస్ బలంగా ఉంది. అధికారంలో ఉన్నా.. లేకున్నా.. రాష్ట్ర హక్కుల కోసం పనిచేసేది బీఆర్‌ఎస్ మాత్రమే. ప్రజల్లో కొంత మార్పు కనిపిస్తోంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోరాటం బలంగా చేయాల్సిన అవసరం ఉంది. తెలంగాణ ప్రజల ఆశలన్నీ బీఆర్‌ఎస్ ఎంపీలపైనే ఉన్నాయి. ఎవరితో సంబంధం లేకుండా గట్టిగా పోరాడుదాం. పూర్తిగా కోలుకొని త్వరలోనే నేను ప్రజల ముందుకు వస్తాను. సాగునీటి ప్రాజెక్టులను కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ)కు అప్పగిస్తే తెలంగాణకు తీవ్ర నష్టం. ఆపరేషన్ మాన్యువల్ ప్రొటోకాల్ లేకుండా ప్రాజెక్టులు ఎలా తీసుకుంటారు?" అని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం శుక్రవారం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్ అధ్యక్షతన జరిగింది. కాగా కేసీఆర్‌కు ఇటీవల తుంటి మార్పిడి శస్త్ర చికిత్స జరిగిన విషయం తెలిసిందే. చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకున్న ఆయన ప్రస్తుతం పార్టీ కార్యక్రమాలపై దృష్టి పెట్టారు. సర్జరీ అనంతరం తొలిసారిగా బీఆర్‌ఎస్ ఎంపీలు, నేతలతో సమావేశమయ్యారు. పార్లమెంటు ఉభయ సమావేశాల్లో ఎంపీలు అనుసరించాల్సిన వ్యూహం, చర్చించాల్సిన అంశాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర హక్కులు, ప్రయోజనాల కోసం పోరాడాలని సూచించారు. తెలంగాణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలు, బిల్లులపైనా పార్లమెంటులో గళం విప్పాలని ఎంపీలకు నిర్దేశించారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం పదేళ్ల గడువు ముగియనుందని.. ఈ నేపథ్యంలో తెలంగాణకు దక్కాల్సిన వాటి గురించి ప్రశ్నించాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయడం, పామాయిల్ ధరలు పడిపోయిన అంశం తదితరాలను కూడా సభలో ప్రస్తావించాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగిస్తూ సంతకాలు పెట్టడం సరికాదన్నారు. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు కృష్ణా బోర్డు పరిధిలోకి వెళితే.. సాగునీరు, తాగునీటికి తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని, పార్లమెంటు వేదికగా ఈ అంశాన్ని తీవ్రంగా ఖండించాలన్నారు. పార్లమెంటు సమావేశాల్లో రాష్ట్రం కోసం గట్టిగా కొట్లాడాలని పార్టీ ఎంపీలకు కేసీఆర్ సూచించారు. ఈ సమావేశంలో రాజ్యసభ, లోకసభ పార్లమెంటరీపార్టీ నేతలు కె.కేశవరావు, నామా నాగేశ్వర్ రావుతోపాటు పార్టీ ఎంపీలు పాల్గొన్నారు. కాగా లోక్‌సభ ఎన్నికలకోసం ఓ వైపు సన్నద్ధతను వేగవంతం చేస్తూనే.. మరోవైపు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై బీఆర్‌ఎస్ దృష్టి సారించింది. పార్లమెంటు సమావేశాలు పూర్తయ్యాక మరోసారి భేటీ అయి అభ్యర్థుల ఎంపికపై మాట్లాడుకుందామని ఎంపీలతో కేసీఆర్ అన్నట్లు సమాచారం.

రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటంలో సర్కార్ విఫలం: హరీశ్

రాష్ట్ర ప్రయోజనాలు కాపాడడంలో కాంగ్రెస్ సర్కారు ఘోరంగా విఫలం అయ్యిందని, తెలంగాణ నీటి సమస్యపై బీఆర్‌ఎస్ ఎంపీలు కేంద్ర జలవనరుల శాఖ మంత్రిని కలుస్తారని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు తెలిపారు. శుక్రవారం ఎర్రవల్లిలో బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలోనూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తెలంగాణకు అన్యాయం చేశాయని, సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను పునరుద్ధరిస్తామని గతంలో అమిత్‌షా ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు. బీసీ జన గణన, రాష్ట్ర విభజన హామీలకు సంబంధించిన అంశాలపై బీఆర్‌ఎస్ ఎంపీలు పార్లమెంటులో గట్టిగా గొంతు వినిపిస్తారన్నారు. కృష్ణా బోర్డుకు ప్రాజెక్టులు అప్పగించడం సరికాదన్నారు. కృష్ణా జలాల్లో రాష్ట్ర వాటా తేలకుండా బోర్డుకు ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు పూటకో మాట మాట్లాడుతున్నారని, ప్రచారంలో అబద్ధాలు, పాలనలో అసహనం కనిపిస్తోందని ఆయన విమర్శించారు.

పూలే విగ్రహం ఏర్పాటు కోసం పోస్టు కార్డు ఉద్యమం

» పూలేకు భారతరత్న ఇవ్వాలి: కవిత



హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఆవరణలో బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి జ్యోతి రావుపూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ.. గ్రామీణ ప్రాంతాల నుంచి పోస్టు కార్డు ఉద్యమం చేపట్టనున్నట్లు భారత్ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జాగృతి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూలే విగ్రహం ఏర్పాటుకోసం అన్ని జిల్లాల్లో, యూనివర్సిటీల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామని, ధర్నాచౌక్ వద్ద మహాధర్నా చేపడతామని, తేదీలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ప్రతి గ్రామం నుంచి 10-15 పోస్టు కార్డులు పంపించాలని పలువురు సూచించారని చెప్పారు. ఏప్రిల్ 11లోపు విగ్రహం ఏర్పాటు చేయాలని, తమ ప్రయత్నానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశిస్తున్నామని ఆమె తెలిపారు. కాగా కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ.. పూలేకు భారతరత్న ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఓబీసీల కోసం మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, త్వరితగతిన బీసీ జనగణన చేపట్టాలని కోరారు. మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు కోటా కల్పించాలని, బీసీ రిజర్వేషన్ బిల్లును తీసుకురావడానికి కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని తీర్మానించినట్లు కవిత వెల్లడించారు. సమావేశంలో పద్మశాలి సంఘం నాయకుడు శివశంకర్, ప్రొఫెసర్ తాటికొండ రాజయ్య, ఓయూ జేఏసీ నేత రాజారామ్‌యాదవ్, సీపీఐ నేత బాలమల్లేశ్, సాహిత్య అకాడమీ మాజీ ఛైర్మన్ జూలూరి గౌరీశంకర్, బీఎస్పీ నాయకురాలు అనితారెడ్డి పాల్గొన్నారు.

డిక్షనరీలు వెతికి మరీ తిట్టగలం

» మిమ్మల్ని చవటలు, వెధవలు అనగలం

» విలువల్లేని రాజకీయాలు చేస్తున్నది మీరు

» కేటీఆర్, హరీశ్‌రావుపై జగ్గారెడ్డి ఫైర్


గాంధీభవన్‌లో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): " మా కాంగ్రెస్ పార్టీవాళ్లను తిడితే డిక్షనరీ వెతికి మరీ విమ్మల్ని తిడతాం. మిమ్మల్నీ చవటలు, పనికిమాలిన వెధవలనీ మేం అనగలం" అంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావుపై టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి మండి పడ్డారు. కోదండరాంను బీఆర్‌ఎస్ వాళ్లు అవమానిస్తే.. తాము ఎమ్మెల్సీ పదవికి ఇచ్చి గౌరవించామని చెప్పారు. "గవర్నర్‌ను మీరు అవమానిస్తే.. మేం గౌరవించాం" అని అన్నారు. గాంధీభవన్‌లో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర విభజన కోసం పని చేసింది కాంగ్రెస్ పార్టీ అని, ఉద్యమంలో కేసీఆర్ ఒక పావుగా మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తమ ఎంపీలు చేసిన పోరాటం అంతా ఇంతా కాదన్నారు. తెలంగాణ ఉద్యమంలో కోదండరాం భీష్ముడి పాత్ర పోషించారన్నారు. ఆయన గురించి మాట్లాడే అర్హత కేటీఆర్, హరీశ్‌కు ఉందా అని జగ్గారెడ్డి నిలదీశారు. "ఉద్యమ సమయంలో మీరు కోదండరాంను దేవుని లెక్క చూశారు. ఆయన ఇంటికి కేసీఆర్ చాలా సార్లు పోయాడు కూడా. అదే కేసీఆర్ సీఎం అయ్యాక. 9 ఏళ్లలో కోదండరాంకు ఎప్పుడైనా అపాయింట్‌మెంట్ ఇచ్చారా? 9 ఏళ్లలో కోదండరాం గురించి నోరు మెదపని కేటీఆర్.. ఇప్పుడు ఆయన్ని తాము ఎమ్మెల్సీని చేస్తే రాద్ధాంతం చేస్తున్నారు" అని విమర్శించారు. విలువలతో రాజకీయాలు చేస్తున్నది తామైతే.. విలువలు లేకుండా రాజకీయాలు చేస్తున్నది కేటీఆర్ అని విమర్శించారు. "మంత్రి పొన్నం ప్రభాకర్ బట్టలు ఇప్పుతానని కేటీఆర్ మాట్లాడుతున్నడు. అంతటి తీస్మార్‌ఖానా కేటీఆర్? ఆయన కెపాసిటీ ఎంత? మాకు రావా మాటలు? గౌరవం పోగొట్టు కోవద్దు!" అంటూ జగ్గారెడ్డి హెచ్చరించారు. "కేటీఆర్, హరీశ్‌రావును చవటలు అంటే వారికి బాధ అనిపించదా? వారిని పనికిమాలిన వెధవలంటే బాగుంటుందా? ఇలాంటి మాటలు వారు మానుకోవాలి" అని హితవు పలికారు. బీజేపీ, కాంగ్రెస్‌ది ఫెవికాల్ బంధం అంటే పిచ్చోడు కూడా నమ్మబోడన్నారు. "బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి బండి సంజయ్‌ని తీసేసింది కేసీఆర్ చెప్పినందుకు కాదా? కవిత రేపే జైలుకు పోతదన్నరు. కానీ ఎందుకు అరెస్టు కాలేదు? దీన్ని బట్టి ఫెవికాల్ బంధం బీజేపీ, బీఆర్‌ఎస్‌దని అర్థం కావడంలేదా?" అని ప్రశ్నించారు. రాష్ట్ర బడ్జెట్‌ను ఖాళీ చేసి ఎన్నికల్లో ఖర్చు చేశారన్నారు. సంగారెడ్డిలో పోలింగ్ ముందు రోజు హరీశ్‌రావు రూ.25 కోట్లు ఖర్చు చేశారని, ఆ డబ్బులు ఆయనకు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. హరీశ్ దగ్గర కాళేశ్వరం డబ్బులు ఉన్నాయని, రూ.4వేలకోట్లు ఆయన జమ చేశారని ఆరోపించారు. సంగారెడ్డిలో తాను ఓడిన తర్వాత అంతా సానుభూతి చూపుతున్నారని, పేషంట్ ఆసుపత్రిలో అడ్మిట్ అయితే ఫోన్లు చేసి పేషంట్ ఎట్లున్నడని అడిగినట్లుగ తన కథ ఉన్నదన్నారు.

కవితకు మానవత్వం లేదు

» ప్రతీ దాన్ని రాజకీయం చేయొద్దు


» ఆత్మహత్య కేసులో నిందితుడైన సర్పంచ్‌ను అరెస్టు చేస్తే కక్ష ఏముంది?

» కాంగ్రెస్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల టౌన్, జనవరి 26: ప్రతీ దాన్ని రాజకీయ కోణంలో చూడటమే తప్ప బీఆర్‌ఎస్ నాయకురాలు కవితకు మానవత్వం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగిత్యాలలో ఇటీవల పర్యటించిన కవిత వాస్తవాలు తెలుసుకోకుండా కాంగ్రెస్‌పై అసత్య ఆరోపణలు చేశారన్నారు. "రాష్ట్రంలో కాంగ్రెస్ రాజ్యం ఉందా... ఖాకీల రాజ్యం ఉందా" అంటూ కవిత మాట్లాడటాన్ని ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. జగిత్యాల జిల్లాలోని హబ్సీపూర్ గ్రామంలో మూడు నెలల క్రితం ఓ యువకుడి ఆత్మహత్య ఘటనకు సంబంధించి పరారీలో ఉన్న బీఆర్‌ఎస్ సర్పంచ్‌ను అరెస్టు చేస్తే అందులో కాంగ్రెస్ కక్ష ఏముందని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు తమ పార్టీ నేతపై కక్షపూరితంగా అక్రమ కేసులు పెట్టించారంటూ కవిత చేసిన ఆరోపణలు పూర్తిగా అసత్యమన్నారు. "బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు సదరు సర్పంచ్ గ్రామంలోనే ఉంటూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నప్పటికీ పోలీసులు అరెస్టు చేయలేదు. ఇదేనా బీఆర్‌ఎస్ ఫ్రెండ్లీ పోలీస్ విధానం" అని జీవన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ప్రతీదాన్ని రాజకీయ కోణంలో చూడకుండా మానవీయ కోణంలో ఆలోచించాలని కవితకు హితవు పలికారు. "బీఆర్‌ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, యాదాద్రి పవర్ ప్లాంట్ ఇలా ఎన్నో అవినీతి వ్యవహారాలను వెలికితీసి మాట్లాడటం తప్పా" అని జీవన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 40 రోజుల్లోనే బీఆర్‌ఎస్ నాయకులు ఎందుకు ఇంతలా ఉలిక్కిపడుతున్నారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ బాగోతాలు రానున్న రోజుల్లో ఇంకా బయటకు వస్తాయన్నారు.

కనకపు సింహాసనమున శునకము

(మొదటిపేజీ తరువాయి)


గణతంత్ర వేడుకల్లో ప్రొ. జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కేటీఆర్, చిత్రంలో పాడి కౌశిక్, పొన్నాల తదితరులు

చేసుకోనని పేర్కొన్నారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా శుక్రవారం తెలంగాణ భవన్‌లో జాతీయ జెండాను ఎగురవేసిన కేటీఆర్ అనంతరం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్దల అహంకారం, వెకిలి చేష్టలు చూస్తుంటే.. వాళ్లింకా ప్రతిపక్షంలోనే ఉన్నట్లు ప్రవర్తిస్తున్నారని అన్నారు. "మీరింకా అధికారంలో ఉన్నట్లుగా భావిస్తున్నారని మమ్మల్ని విమర్శిస్తున్నారు. వాస్తవంగా చూస్తే.. వాళ్లే ఇంకా ప్రతిపక్షంలోనే ఉన్నామనుకుని, మేము అధికారంలో ఉన్నట్లు మాపై విమర్శలు చేస్తున్నారు. కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చి 45-50 రోజులైంది. ఇంకా గత ప్రభుత్వాన్ని ఆడిపోసుకోవడం ఎందుకు? తిట్టిపోయడం ఎందుకు? మీకు చేవ ఉంటే.. చేతనైతే ప్రజలకు ఇచ్చిన 420 హామీలు నెరవేర్చండి" అని సూచించారు. రాజకీయాల్లోకి వచ్చాక తమకు వ్యక్తిగత దూషణలు, కుసంస్కారులైన వ్యక్తులతో మాటలు పడక తప్పడం లేదన్నారు. ప్రజల దృష్టి మరల్చేందుకు ప్రభుత్వం ఎత్తులు, కుయుక్తులు పన్నుతోందని ఆరోపించారు. నిరంతరం ప్రజలతోనే ఉంటామని, కాంగ్రెస్ 420 హామీలతో పాటు వంద రోజుల్లో అమలు చేస్తామన్న 6 గ్యారెంటీల అమలుపై తమ దృష్టి, ప్రజల దృష్టి మరలకుండా చూసుకుంటామని కేటీఆర్ పేర్కొన్నారు. కాగా, 'కనకపు సింహాసనమున' అనే సుమతీ శతకం, దాన్ని భావాన్ని వివరిస్తూ ఉన్న స్క్రీన్ షాట్‌ను కేటీఆర్ ట్వీట్ కూడా చేశారు.

కాంగ్రెస్- బీజేపీలది విడదీయరాని బంధం

కాంగ్రెస్, బీజేపీ కొట్లాడుకోవద్దు.. బీఆర్‌ఎస్ అంతం చూద్దామని మొన్న బండి సంజయ్ చెప్పారు.. నిన్న గుంపు మేస్త్రీ కూడా ఇదేమాట అన్నారని కేటీఆర్ పేర్కొన్నారు. "ఆ రెండు పార్టీలది విడదీయరాని బంధం. కాంగ్రెస్‌ను బీజేపీ జాకీలు పెట్టి లేపుతూ మద్దతుగా నిలుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలవడం ఇందులో భాగమే. ఢిల్లీలో ఏం మతలబు జరిగిందో ఏమో? వారిద్దరూ కలిసిన గంటకే.. రెండు ఎమ్మెల్సీ స్థానాలకు వేర్వేరుగా ఉప ఎన్నిక జరిగేలా ఉత్తర్వులు వచ్చాయి. ఒకేసారి ఎన్నిక జరిగితే ఒక స్థానం బీఆర్‌ఎస్‌కు మరొకటి కాంగ్రెస్‌కు వచ్చేవని, అలాకాకుండా బీజేపీ, కాంగ్రెస్ కుట్ర రాజకీయాలు చేశాయి" అని ఆరోపించారు. గత ప్రభుత్వం నామినేట్ చేస్తే రాజకీయ సంబంధాలున్నాయని చెప్పి ఎమ్మెల్సీల అభ్యర్థిత్వాలను తిరస్కరించిన గవర్నర్.. ఒక పార్టీకి అధ్యక్షుడిగా ఉన్న కోదండరాంను ఎమ్మెల్సీగా ఎలా ఆమోదించారని కేటీఆర్ ప్రశ్నించారు. ఆయన రాజకీయ నేపథ్యం మీకు కనిపించలేదా? అని నిలదీశారు. ప్రభుత్వం నుంచి లేఖ రాగానే గవర్నర్ తమిళిసై ఆగమేఘాల మీద స్పందించారని, ఈ పక్షపాతాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని పేర్కొన్నారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా.. తెలంగాణ ఉద్యమకారుడు దాసోజు శ్రవణ్, ఎరుకల సామాజిక వర్గానికి చెందిన సత్యనారాయణలను ఉద్దేశపూర్వకంగానే తిరస్కరించారన్నారు. "రాష్ట్ర ప్రజలిచ్చే జీతంతో గవర్నర్ పనిచేస్తున్నారు. మీరు రేవంత్‌రెడ్డికి కాదు.. రాష్ట్ర ప్రజలకు బాధ్యులనే విషయాన్ని విస్మరించొద్దు. ఎమ్మెల్సీల అభ్యర్థిత్వాలపై ఆనాడు కనిపించిన రాజకీయ నేపథ్యం ఈరోజు ఎందుకు కనిపించలేదు. కాంగ్రెస్, బీజేపీకి ఉన్న బంధం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారా?" అని కేటీఆర్ ప్రశ్నించారు.

సర్పంచుల పదవీకాలం పొడిగించండి

సర్పంచుల పదవీ కాలం ఫిబ్రవరి 1తో ముగియనుందని, గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమించాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని కేటీఆర్ కోరారు. మంత్రులు అందుబాటులో లేరు.. మా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అందుబాటులో లేరంటూ సర్పంచులు పూర్తిచేసిన కార్యక్రమాల ప్రారంభాన్ని కూడా ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. ప్రజాపాలన అంటే ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు పాలన చేయాలన్న విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తెలుసుకోవాలన్నారు. కరోనా సమయంలో సర్పంచుల పాలన సమయం రెండేళ్లు పోయిందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని ఆరు నెలలు లేదంటే సంవత్సరం పాటు వారి పదవీ కాలాన్ని పొడిగించాలని కోరారు.

మహమూద్ అలీకి తీవ్ర అస్వస్థత

తెలంగాణ భవన్‌లో గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న మాజీ హోం మంత్రి మహమూద్ అలీ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కళ్లు తిరిగి కిందపడ్డారు. స్పందించిన సిబ్బంది, బీఆర్‌ఎస్ నాయకులు ఆయన్ను పైకి లేపారు. ప్రాథమిక చికిత్స అనంతరం అపోలో ఆస్పత్రికి తరలించారు. మహమూద్ అలీ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.



హైకోర్టు ఆవరణలో జెండా వందనం చేస్తున్న సీజే అలోక్ అరాధే, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె నాగేశ్వర్‌రావు

వందెకరాల్లో నూతన హైకోర్టు

» కొత్త జిల్లాల్లో కోర్టుల నిర్మాణానికి భూకేటాయింపు

» గణతంత్ర వేడుకల్లో హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కేసులు వేగవంతంగా పరిష్కారం కావాలంటే మౌలిక సదుపాయాలు తక్షణావసరమని, ఇందులో భాగంగానే నూతన హైకోర్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రాజేంద్రనగర్‌లో వంద ఎకరాల భూమి కేటాయించిందని చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే చెప్పారు. హైకోర్టులో శుక్రవారం జరిగిన గణతంత్ర వేడుకల్లో ఆయన ప్రసంగిస్తూ కోర్టుల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు జరుగుతున్న కృషిని వెల్లడించారు. కొత్తగా ఏర్పడిన 23 జ్యుడీషియల్ జిల్లాల్లో సైతం ప్రభుత్వం భూములు కేటాయించిందని చెప్పారు. గతంలో హైకోర్టు రూపొందించిన న్యాయ నిర్మాణ్ డాక్యుమెంట్ ప్రకారం నూతన హైకోర్టు, నూతన జిల్లా కోర్టులు నిర్మిస్తామని తెలిపారు. హైకోర్టులో ప్రొసీడింగ్స్ లైవ్ స్ట్రీమింగ్ చేయడంతోపాటు హైబ్రిడ్ మోడ్‌లో సేవలు అందిస్తున్నామని వివరించారు. హనుమకొండ, వరంగల్, జగిత్యాల, కరీంనగర్ వంటి జిల్లాల్లో శుక్రవారం నుంచే ఈ-ఫైలింగ్ సేవలు ప్రారంభించామని ప్రకటించారు. అన్ని జిల్లా కోర్టుల్లో 37 ఈ-సేవా కేంద్రాలను త్వరలో ప్రారంభించబోతున్నామని వెల్లడించారు. సుప్రీంకోర్టు, హైకోర్టుకు సంబంధించిన ముఖ్యమైన తీర్పులను తెలుగు భాషలోకి తర్జుమా చేయించే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.

జడ్జి పదవుల్లో బడుగులకు తీవ్ర అన్యాయం

అంతకుముందు ప్రసంగించిన హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె నాగేశ్వర్‌రావు హైకోర్టు న్యాయమూర్తుల పదవుల్లో వెనుకబడిన, బలహీనవర్గాల న్యాయవాదులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 'బలహీన వర్గాల న్యాయవాదులకు వయస్సు తక్కువ ఉంటే 55 ఏళ్లు రానివ్వండని పదవులు నిరాకరిస్తున్నారు. 55 ఏళ్లు దాటిన తర్వాత ఏజ్‌బార్ అయిందని తిరస్కరిస్తున్నారు. కానీ ఉన్నత వర్గాల న్యాయవాదులకు ఈ విషయాలు ఏవీ అడ్డురావడం లేదు' అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా హైకోర్టు ప్రాంగణంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు చీఫ్ జస్టిస్, న్యాయమూర్తులు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ సునీల్‌గౌడ్, అదనపు ఏజీలు తేరా రజినీకాంత్ రెడ్డి, ఇమ్రాన్‌ఖాన్ పాల్గొన్నారు.

ఆర్టీసీకి త్వరలో 2,375 కొత్త బస్సులు

» ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ వెల్లడి

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కోసం త్వరలో 2,375 కొత్త బస్సులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్(ఎండీ) సజ్జనార్ వెల్లడించారు. కొత్త బస్సులకు అవసరమైన మేర డ్రైవర్లు, కండక్టర్లను కూడా నియమిస్తామన్నారు. ఇటీవలి కాలంలో బస్సుల్లో రద్దీ పెరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆర్టీసీ ప్రధాన కార్యాలయం బస్ భవన్‌లో సజ్జనార్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. కొత్త బస్సుల్లో 1,325 డీజిల్, మరో 1,050 ఎలక్ట్రిక్ బస్సులు ఉంటాయని వివరించారు. కారుణ్య నియామకాల కింద 813 మంది కండక్టర్ల నియామక ప్రక్రియను కూడా ప్రారంభించినట్టు సజ్జనార్ తెలిపారు. మరో 80 మంది ఆర్టీసీ కానిస్టేబుళ్లుగా శిక్షణ పొందుతున్నారని, ఫిబ్రవరి మొదటి వారంలో వారంతా విధుల్లో చేరుతారని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా డిసెంబర్ 9 నుంచి ఇప్పటివరకు 11 కోట్ల మందికి జీరో టికెట్లు ఇచ్చినట్లు సజ్జనార్ చెప్పారు. పథకాన్ని విజయవంతంగా అమలు చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డి, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీని ప్రశంసించారని సంతోషం వ్యక్తం చేశారు. సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా రక్తదాన శిబిరాల్లో అత్యధిక యూనిట్లు సేకరించిన హకీంపేట, చెంగిచర్ల, కంటోన్మెంట్ డిపో మేనేజర్లను సజ్జనార్ ప్రశంసా పత్రాలతో సన్మానించారు.

శరవేగంగా మెట్రో రెండో దశ డీపీఆర్

» హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించిన సవివర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీ శరవేగంగా చేపడుతున్నట్లు హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. ఈ దశ ద్వారా రాజధానిలోని అన్ని వర్గాల ప్రజలకు మెట్రో సౌకర్యం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎన్వీఎస్‌రెడ్డి శుక్రవారం రసూల్‌పురాలోని మెట్రో భవన్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ మెట్రో రెండో దశ విస్తరణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టును అనుసంధానం చేస్తూ 70 కి.మీ.మేర ప్రతిపాదనలు సిద్ధం చేశామని, ట్రాఫిక్ సర్వేలు, డీపీఆర్ తయారీ చురుగ్గా జరుగుతోందని పేర్కొన్నారు.

తెలంగాణ భవన్‌లో గణతంత్ర వేడుకలు

న్యూఢిల్లీ, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 75వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. భవన్ ప్రాంగణంలోని శబరి బ్లాక్ వద్ద రెసిడెంట్ కమిషనర్ డా. గౌరవ్ ఉప్పల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్వాతంత్ర్యం కోసం పోరాటం సాగించిన అమర వీరులకు ఈ సందర్భంగా ఆయన జోహార్లు అర్పించారు. ఆపద సమయంలో రాష్ట్రం వెలుపల ఉండే తెలంగాణ ప్రజలకు తెలంగాణ భవన్ అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని భరోసానిచ్చారు.

పోలీస్ కార్యాలయాల్లో వేడుకలు

పోలీస్ కార్యాలయాల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీజీపీ కార్యాలయంలో అదనపు డీజీపీ (రోడ్డు భద్రత) మహేష్ భగవత్ జాతీయ జెండా ఆవిష్కరించారు. డీఐజీ కో-ఆర్డినేషన్ డా.గజరావు భూపాల్, డీజీపీ కార్యాలయంలోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఇంటెలిజెన్స్ కార్యాలయంలో ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌లో కార్పొరేషన్ ఎండీ ఎం.రమేష్ జాతీయ జెండా ఆవిష్కరించారు. కాగా రాష్ట్ర అటవీ శాఖ ప్రధాన కార్యాలయం అరణ్య భవన్‌లో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్-హెచ్‌వోఎఫ్ఎఫ్) ఆర్ఎం డోబ్రియాల్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. పని తీరులో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన అటవీ శాఖ అధికారులు, సిబ్బందికి ప్రోత్సాహకాలు అందించారు.

ఐఆర్ఆర్ కేసులో బాబుకు బెయిల్‌పై సుప్రీంకు

» ఏపీ ప్రభుత్వ పిటిషన్‌పై ఎల్లుండి విచారణ

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్) ఎలైన్‌మెంట్ కేసులో మాజీ సీఎంకు ఏపీ హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేసింది. ఇది ఈ నెల 29న జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం ముందు విచారణకు రానుంది.

టీడీపీలోకి వీరశివారెడ్డి, కొలికపూడి

అమరావతి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు నేతలు శుక్రవారం టీడీపీలో చేరారు. కడప జిల్లా కమలాపురం మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి, ఏపీ పరిరక్షణ సమితి అధ్యక్షుడు కొలికపూడి శ్రీనివాసరావు, ఆదోనికి చెందిన ఏసీ శ్రీకాంత్‌రెడ్డిలు పార్టీలో చేరగా, వారికి చంద్రబాబు పసుపు కండువాలు వేసి సాదర స్వాగతం పలికారు.

అహంకారం.. నియంతృత్వం చెల్లవ్

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. అహంకారం, నియంతృత్వం చెల్లదనే విస్పష్టమైన తీర్పు ఇచ్చారని ఆమె పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావం తరువాత తొలిసారి.. రాష్ట్రంలో రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమైన పాలన మొదలైందన్నారు. నాంపల్లి పబ్లిక్‌గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, మంత్రులు, ప్రభుత్వ యంత్రాంగానికి గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రసంగించిన ఆమె.. ఏకపక్ష నిర్ణయాలు, నియంత పోకడలు ఎప్పుడూ ప్రజాస్వామ్యానికి శోభనివ్వవన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రజా ప్రభుత్వం ఈ స్పృహతో.. సమాజంలో అన్ని వర్గాలకూ స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు దక్కాలన్న లక్ష్యంతో.. పనిచేస్తోందని చెప్పారు. గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో విధ్వంసానికి గురైన రాజ్యాంగ విలువలు, రాజ్యాంగబద్ధ సంస్థలు, వ్యవస్థలను ఈ ప్రజా ప్రభుత్వంలో ఇప్పుడిప్పుడే పునర్నిర్మించుకుంటున్నామన్నారు. శాసన, కార్యనిర్వాహక వ్యవస్థల్లో రాజ్యాంగబద్ధమైన విలువలు, విధానాలు, పద్ధతులు పునరుద్ధరణకు నోచుకుంటున్నాయని చెప్పడానికి సంతోషిస్తున్నానని వ్యాఖ్యానించారు. పాలకులు రాజ్యాంగస్ఫూర్తికి భిన్నంగా వ్యవహరించినప్పుడు ప్రజలే కార్యోన్ముఖులై తమ పోరాటాలు, తీర్పుల ద్వారా అధికారాన్ని నియంత్రించే శక్తిని రాజ్యాంగం ఇచ్చిందన్నారు. ఆ స్ఫూర్తితోనే, రాజ్యాంగం ఇచ్చిన హక్కుల ద్వారానే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నట్లు గవర్నర్ గుర్తుచేశారు.



పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో మాట్లాడుతున్న గవర్నర్ తమిళి సై

ప్రజల ముఖాల్లో ఆనందం కోసమే..

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన క్షణం నుంచి.. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చే కార్యాచరణ మొదలైందని, ఆరు గ్యారెంటీలలో రెండు ఇప్పటికే అమలు చేశారని గవర్నర్ తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు రవాణా వసతి కల్పించడంతో ఇప్పటి వరకూ 11 కోట్ల మంది ఉచితంగా ప్రయాణాలు చేయడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. మిగిలిన గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేసి ప్రజల మొఖాల్లో ఆనందం చూడటమే ప్రభుత్వ లక్ష్యమని ఆమె చెప్పారు. గత పాలకుల నిర్వాకంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నమై, వ్యవస్థలు గాడితప్పాయని.. ఇప్పుడు అన్నింటినీ సంస్కరించుకుంటూ, సరిదిద్దుకుంటూ ముందుకు వెళుతున్నామని పేర్కొన్నారు. ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణ సరికొత్త అధ్యాయాన్ని లిఖించే దిశగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పట్టుదలతో ముందుకు సాగుతోందన్నారు. ప్రజా ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ప్రజా సంక్షేమమేనని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల కోసం గత ఏడాది డిసెంబరు 28 నుండి ఈ ఏడాది జనవరి 6 వరకు ప్రజల నుంచి 1,25,84,383 దరఖాస్తులు వచ్చినట్టు తమిళిసై వెల్లడించారు. వాటిలో అయిదు గ్యారెంటీల కోసం వచ్చినవి 1,05,91,636 దరఖాస్తులు కాగా, ఇతర అభ్యర్థనలకు సంబంధించి 19,92,747 దరఖాస్తులు అందాయన్నారు.

ఉపాధి, ఉద్యోగాలపై అపోహ వద్దు

గడచిన పదేళ్ల పాలకుల వైఫల్యాల కారణంగా యువతకు ఉపాధి, ఉద్యోగాల విషయంలో పూర్తి నిర్లక్ష్యం జరిగిందని తమిళిసై పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సారథులైన యువత విషయంలో గత ప్రభుత్వం నిర్దయగా, నిర్లక్ష్యంగా వ్యవహరించిందని.. సీఎం రేవంత్ సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టిందని ఆమె తెలిపారు. టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన పూర్తి కాగానే ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ మొదలవుతుందని.. దీనిపై యువత ఎలాంటి అనుమానాలకు ,అపోహలకూ లోను కావాల్సిన పనిలేదన్నారు. ముఖ్యమంత్రి నేతృత్వంలోని బృందం దావోస్‌కు వెళ్లి.. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.40,232 కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు కుదుర్చుకోవడం తెలంగాణ పురోగతికి సంకేతంగా అభివర్ణించారు. రైతుల విషయంలో తన ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందన్నారు. వరంగల్ డిక్లరేషన్ అమలు, 24 గంటల నాణ్యమైన విద్యుత్తు సరఫరా, రైతు భరోసా అమలుకు కసరత్తు జరుగుతోందన్నారు. రూ.2 లక్షల రుణమాఫీకి సంబంధించి బ్యాంకులతో సంప్రదింపులు జరుగుతున్నట్టు తెలిపారు. రైతులకు ఇచ్చిన మాట నూటికి నూరుశాతం నిలబెట్టుకుంటామని తమిళిసై హామీ ఇచ్చారు.

అప్పట్లో ఎంత కష్టమో..

గత ప్రభుత్వం ఏనాడూ సామాన్యులకు అందుబాటులో లేదని.. కష్టమొస్తే ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఉండేదని గవర్నర్ ఆవేదన వ్యక్తం చేశారు. పేదల కన్నీళ్లు తుడిచే నాథుడే లేని పాలన గతంలో చూశామని.. కానీ, ఇప్పుడు తెలంగాణ ప్రజాస్వామ్య పాలనలో ఉందని ఆమె పేర్కొన్నారు. సామాన్యుడు సచివాలయంలోకి వచ్చి సమస్యలు చెప్పుకొనే స్వేచ్ఛ వచ్చిందన్నారు. ప్రజల హక్కులను గౌరవించే పాలన తెలంగాణలో ఉందని చెప్పడానికి గర్విస్తున్నానన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రజాపాలన జరుగుతోందని.. ఇదే స్ఫూర్తి ఇకముందూ కొనసాగాలని ఆకాంక్షించారు. అభివృద్ధిలో తెలంగాణ అత్యున్నత శిఖరాలకు చేరాలని.. సంక్షేమం, ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలని కోరుకుంటున్నారు. ధైర్యం, ఉదారత, వివేకం, ఉత్సాహం ప్రభుత్వానికి ఉండాల్సిన నాలుగు లక్షణాలు అని చెప్పిన తమిళిసై.. 'జై భారత్' అంటూ ప్రసంగాన్ని ముగించారు.





గణతంత్ర వేడుకల్లో జెండావందనం చేస్తున్న గవర్నర్ తమిళి సై; సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మండలి చైర్మన్ గుత్తా తదితరులు



ఏబీఎన్- ఆంధ్రజ్యోతి సంస్థల ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేస్తోన్న సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ. చిత్రంలో ఏబీఎన్ డైరెక్టర్ కె.భాను, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, సిబ్బంది



అమరవీరులకు సీఎం రేవంత్ ఘన నివాళి

అల్వాల్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలంగాణ, ఆంధ్రా సబ్ఏరియా (టాసా) ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అమరవీరుల స్థూపం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు. అక్కడ ఉండే రికార్డులో తన సందేశాన్ని రాశారు. ఈ సందర్భంగా త్రివిధ దళాలకు చెందిన అధికారులు అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు.

ఎట్ హోమ్‌లో నవ్వులే నవ్వులు

» దాదాపు గంటసేపు రాజ్‌భవన్‌లో సీఎం రేవంత్

» కార్యక్రమానికి హాజరైన పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు

» ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించిన గవర్నర్ తమిళిసై

» వేడుకకు దూరంగా ఉన్న బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ రాజ్‌భవన్‌లో శుక్రవారం సాయంత్రం ఇచ్చిన తేనీటి విందు (ఎట్-హోమ్) కార్యక్రమం ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగింది. గవర్నర్ ఆహ్వానం మేరకు.. శుక్రవారం సాయంత్రం 6.20 గంటలకు ఈ కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి చివరిదాకా (దాదాపు గంటసేపు) రాజ్‌భవన్‌లోనే ఉన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు, వివిధ రంగాలకు చెందిన మేధావుల రాకతో రాజ్‌భవన్ పరిసర ప్రాంతాలు సందడిగా కనిపించాయి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవిగుప్త, ఇతర ఉన్నతాధికారులందరూ ఈ కార్యక్రమానికి కుటుంబ సమేతంగా హాజరయ్యారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు మాత్రం దీనికి దూరంగా ఉన్నారు. గవర్నర్ తమిళిసై ఈ కార్యక్రమానికి వచ్చినవారందరి దగ్గరకూ వెళ్లి పేరు పేరునా పలకరించారు. సీఎంతో, మంత్రులతో కొద్దిసేపు విడివిడిగా, సరదాగా ముచ్చటించారు. వచ్చినవారంతా కూడా ఒకరినొకరు చిరునవ్వుతో పలకరించుకుని మాట్లాడుకున్నారు. కొండా సురేఖ అయితే గవర్నర్‌తో సెల్ఫీ తీసుకున్నారు. కాగా, రిపబ్లిక్ డే రోజు జరిగే ఎట్‌హోమ్ కార్యక్రమం.. గత ప్రభుత్వ పాలనలో జరిగినదానికి భిన్నంగా జరిగింది. ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డ మొదట్లో ఈ కార్యక్రమం కొంత సందడిగా సాగినా.. ఆ తర్వాత అధికార పార్టీ ముఖ్యనాయకులు, అధికారులు ఈ వేడకలకు దూరంగా ఉంటూ వచ్చారు. ప్రోటోకాల్ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ అతికొద్ది మంది ఉన్నతాధికారులే వచ్చేవారు. వచ్చిన కొద్దిమందీ మొక్కుబడిగా కొద్దిసేపు అక్కడే ఉండి ఆ తర్వాత వెనుదిరిగేవారు. కానీ ఈసారి అందుకు భిన్నంగా సీఎం, అందుబాటులో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కుటుంబ సమేతంగా వేడుకలో పాల్గొనడంతో సందడి వాతావరణం నెలకొంది. అలాగే.. గతంలో కేవలం ఒక్క బ్లాక్‌లోనే ఎట్ హోమ్ ఏర్పాట్లు జరిగేవి. కానీ ఈ సారి రాజ్‌భవన్ ఆవరణలో మూడు వైపులా ఏర్పాట్లు చేయడంతో ఆ పరిసరాలు మొత్తం వచ్చిన ప్రముఖులతో సందడిగా మారాయి. ఎట్ హోమ్ కార్యక్రమంలో పద్మ పురస్కార విజేతను గవర్నర్, సీఎం రేవంత్ కలిశారు. తెలంగాణ సాయుధ పోరాట యోధులను, వారి కుటుంబ సభ్యులను గవర్నర్ తమిళిసై, సీఎం రేవంత్ రెడ్డి కలిశారు. ఏఐసీసీ నేత రణదీప్ సింగ్ సూర్జేవాలా, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి, ఏసీబీ చీఫ్ సీవీ ఆనంద్, ఫైర్ డీజీ నాగిరెడ్డి, అదనపు డీజీపీ(రోడ్డు భద్రత) మహేష్ భగవత్, 'ఆంధ్రజ్యోతి' సంపాదకుడు కె.శ్రీనివాస్ తమ కుటుంబ సభ్యులతో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. కిన్నెర మొగిలయ్య ఇతరులు తమ ప్రతిభను ప్రదర్శించారు.



ఎట్ హోమ్ కార్యక్రమంలో గవర్నర్, సీఎం రేవంత్, భట్టి తదితరులు



అసెంబ్లీ ఆవరణలో జెండా ఆవిష్కరణ అనంతరం గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

స్వాతంత్ర్య ఉద్యమంలో బీజేపీ పాత్ర ఏంటి?

» టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్ ప్రశ్న

» రాజ్యాంగ విలువలు కాపాడిన పార్టీ కాంగ్రెస్ అని వ్యాఖ్య

» గాంధీభవన్‌లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తొలి గణతంత్ర దినోత్సవాన్ని గాంధీభవన్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించింది. ఈ వేడుకకు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి, మాజీ ఎంపీలు అంజన్‌కుమార్ యాదవ్, వి.హన్మంతరావు తదితరులు హాజరయ్యారు. టీపీసీసీ సంస్థాగత కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో బీజేపీ పాత్ర ఏంటని ప్రశ్నించారు. ఆ ఉద్యమంలో పాలు పంచుకున్నది కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, సామాన్య ప్రజలేనన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఎలాంటి పాత్రలేని బీజేపీ తామే స్వాతంత్ర్యం తెచ్చినట్లుగా మాట్లాడుతోందన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడిన పార్టీ కాంగ్రెస్ అని చెప్పారు. కుటుంబ పాలన, మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాటం చేస్తుందన్నారు.



గాంధీభవన్‌లో నిర్వహించిన వేడుకల్లో భట్టి, మహేశ్‌కుమార్ తదితరులు

మరోసారి దేశానికి సుస్థిర ప్రభుత్వాన్ని ఇవ్వాలి

» కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ, జనవరి 26(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలంతా ఏకమై మరోసారి ఒక సుస్థిరమైన ప్రభుత్వాన్ని దేశానికి ఇవ్వాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గత పదేళ్లుగా ప్రధాని మోదీ నిష్పాక్షికంగా దేశ సమగ్రాభివృద్ధి, సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం పనిచేస్తున్నారని చెప్పారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా కిషన్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం సీఆర్‌పీఎఫ్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడకు వెళ్లినా.. భారత్‌కు దక్కుతున్న గౌరవమే మోదీ పాలనకు నిదర్శనమన్నారు. మరోసారి దేశాభివృద్ధికి పునరంకితం అవుదామని కోరారు. పద్మ అవార్డు గ్రహీతలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రెండో అత్యుత్తమ భారత పౌర పురస్కారమైన 'పద్మ విభూషణ్' దక్కడం పట్ల మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడుకి కేంద్ర సాంస్కృతికశాఖ తరఫున కిషన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు.

బీఆర్ఎస్ అడుగు జాడల్లోనే రేవంత్ పాలన

» బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ విమర్శ

హైదరాబాద్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి పాలన బీఆర్ఎస్ అడుగుజాడల్లో నడుస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. వంశపారంపర్య, మైనారిటీ బుజ్జగింపు రాజకీయాలను ప్రోత్సహించే కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో రాష్ట్ర పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లుగా మారిందన్నారు. కాంగ్రెస్‌కు, బీఆర్ఎస్‌కు ఏమాత్రం తేడా లేదని, ఆ రెండూ ఒకేగూటి పక్షులని ఆయన ఆరోపించారు. గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో లక్ష్మణ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణాలో కూడ డబుల్ ఇంజిన్ సర్కారు వస్తే గుజరాత్, యూపీ తరహా అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. అంబేడ్కర్‌ను రాజకీయంగా అడుగడుగునా అవమానించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని లక్ష్మణ్ దుయ్యబట్టారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మూడో స్థానమే

» ప్రజలు బీఆర్ఎస్‌ను తిరస్కరించారు: బండి సంజయ్

భగత్‌నగర్ (కరీంనగర్), జనవరి 26: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజా తిరస్కరణకు గురైన బీఆర్ఎస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో మూడో స్థానానికి పరిమితమవుతుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ అన్నారు. బీఆర్ఎస్‌ను ప్రజలు ఇప్పటికే రద్దు చేశారని తెలిపారు. కరీంనగర్‌లో ఈ ఆదివారం(28వ తేదీ) జరగనున్న బీజేపీ కార్యకర్తల సమ్మేళనానికి సంబంధించిన ఏర్పాట్లను సంజయ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 28న జరిగే సమ్మేళనానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా వస్తున్నారని తెలిపారు. ఓడిపోయినా పెత్తనం చెలాయించాలని చూస్తే ప్రజలు తిరగబడతారని బీఆర్ఎస్ నేతలను హెచ్చరించారు. గవర్నర్‌ను, వ్యవస్థను కించపరిచిన చరిత్ర కేసీఆర్ కుటుంబానిదేనని విమర్శించారు. రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరించిన బీఆర్ఎస్‌ను ప్రజలు తిరస్కరించారని చెప్పారు. కాగా, 28న తెలంగాణకు విచ్చేయనున్న అమిత్ షా మూడు క్లస్టర్ సమావేశాల్లో పాల్గొంటారని తెలిపారు. ఫిబ్రవరి 5 నుంచి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో గ్రామాల వారీగా పాదయాత్ర చేస్తానని సంజయ్ ప్రకటించారు. కాగా, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) డైరీ, క్యాలెండర్‌ను కరీంనగర్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే పీఆర్సీ అమలు చేయాలని, 317 జీవోపై ప్రభుత్వ వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్, బీజేపీ మధ్యే ప్రధాన పోటీ

» గత ప్రభుత్వ అక్రమాలపై విచారణ: ఉత్తమ్



పాలకవీడు, జనవరి 26: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో 14 ఎంపీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం జాన్‌పహాడ్‌లో సైదులు దర్గా ఉర్సులో రెండో రోజైన శుక్రవారం గంధం ఊరేగింపులో మంత్రి పాల్గొన్నారు. అనంతరం జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ మరింత బలహీనమవుతుందన్నారు. లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయని బీఆర్ఎస్‌కు, కేసీఆర్, కేటీఆర్‌లకు ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. మిషన్ భగీరథ కోసం రూ.40వేల కోట్ల అప్పు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క గ్రామానికి కూడా తాగునీటిని అందించలేదని, కానీ లిఖిత పూర్వకంగా 99శాతం గ్రామాలకు నీటిని అందించామని చెబుతూ ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు 24గంటల ఉచిత కరెంట్ ఇవ్వలేదన్నారు. ప్రతీ పనిలో వేల కోట్ల అప్పులు చేసిన బీఆర్ఎస్ నాయకులు వారి జేబులు నింపుకున్నారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కమీషన్ల కోసమే ప్రాజెక్టులు నిర్మించిందని, కాళేశ్వరం ప్రాజెక్టు ఇందుకు నిదర్శనమన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై విచారణ ప్రారంభించామని, అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు.

రూ. 400 కోట్లతో కోహెడ మార్కెట్ పనులు

» అదనంగా 50 నుంచి 100 ఎకరాల సేకరణ: తుమ్మల



హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కోహెడ పండ్ల మార్కెట్‌ను మొదటి దశలో రూ. 400 కోట్లతో చేపట్టడానికి ప్రతిపాదనలు తయారుచేసినట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లో శుక్రవారం వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కోహెడ మార్కెట్‌కు సంబంధించిన అంశాలను రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్న పండ్లు, కూరగాయల మార్కెట్లను దృష్టిలో ఉంచుకొని కోహెడ మార్కెట్‌ను అభివృద్ధి చేయాలని, అదనంగా 50 ఎకరాల నుంచి 100 ఎకరాల భూసేకరణ చేయాలని అధికారులను తుమ్మల ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ వైపు ఉన్న కోహెడ్ మార్కెట్ స్థలానికి ప్రస్తుతం ఉన్న 33 ఫీట్ల రోడ్డును విస్తరించటానికి ప్రతిపాదనలు తయారుచేయాలని మంత్రి ఆదేశించారు. కాగా, నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఐదు రోజులపాటు నిర్వహించబోతున్న ఆల్‌ఇండియా హార్టికల్చర్, అగ్రికల్చర్ షో పోస్టర్‌ను తుమ్మల నాగేశ్వర్‌రావు శుక్రవారం ఆవిష్కరించారు.

ఈ సారి ఎంసెట్‌లో 100 శాతం సిలబస్

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కరోనా తర్వాత ఎంసెట్‌లో మొదటి సారిగా ఈ ఏడాది నుంచి 100 శాతం సిలబస్‌ను అమలు చేయనున్నారు. కరోనా కారణంగా గతంలో ఇంటర్మీడియట్ విద్యలో 70 శాతం సిలబస్‌ను అమలు పరిచిన విషయం తెలిసిందే. గత ఏడాది కూడా ఎంసెట్‌లో ఫస్ట్ ఇయర్ సిలబస్‌ను 70శాతం, రెండవ సంవత్సరం సిలబస్‌ను 100శాతంను అమలు పరిచారు. ఈ ఏడాది మాత్రం ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్లలో 100శాతం సిలబస్‌ను అమలు చేయాలని నిర్ణయించారు.

ఎస్‌సీఈఆర్‌టీలో డిప్యూటేషన్లు రద్దు

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్‌టీ)లో డిప్యూటేషన్లను రద్దు చేశారు. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ శుక్రవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సంస్థలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ప్రొఫెసర్లు.. మొత్తం 10 మందిని తిరిగి వారి సొంత పోస్టుల్లోకి బదిలీ చేశారు.

రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

» మంత్రి పొంగులేటికి రెడ్డి జేఏసీ విజ్ఞప్తి

బర్కత్‌పుర, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలో భాగంగా వెయ్యి కోట్ల రూపాయలతో రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, నిరుపేద రెడ్డిలను అన్ని విధాలుగా ఆదుకోవాలని రెడ్డి జేఏసీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు నవల్ల సత్యనారాయణరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లా సంజీవరెడ్డిలతో కలిసి రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి శుక్రవారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వం 2018 ఎన్నికలకు ముందు రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు న్యాయం చేస్తుందని ఎంతో ఆశతో ఉన్నామన్నారు. రెడ్డి సామాజిక వర్గంలోని పేద విద్యార్థులకు విదేశీ విద్యా నిధి పథకాన్ని వర్తింపచేయాలని కోరారు.



దేవరకొండ ఉమాదేవిని సత్కరిస్తున్న కెనరాబ్యాంకు ఎండీ, సీఈవో కే సత్యనారాయణ రాజు, ఉన్నతాధికారులు

యువ రెజ్లర్ ఉమాదేవికి కెనరా బ్యాంక్ సన్మానం

» రూ.20 వేల నగదు అందజేత

» వచ్చే ఐదేళ్లు అండగా ఉంటామని ప్రకటన

బెంగళూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువ రెజ్లర్ దేవరకొండ ఉమాదేవిని కెనరా బ్యాంకు ఘనంగా సన్మానించింది. రష్యాలో ఇటీవల జరిగిన రెజ్లింగ్ పోటీల్లో సత్తా చాటిన ఉమాదేవి దేశానికి రజత పతకం అందించారు. బెంగళూరులోని కెనరా బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా బ్యాంకు ఎండీ, సీఈవో కే సత్యనారాయణరాజు రెజ్లర్ ఉమాదేవిని ప్రత్యేకంగా సన్మానించారు. ఆమెకు రూ.20 వేల నగదు, వెండి పళ్లెం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రాజు మాట్లాడుతూ 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వచ్చిన వార్తకు స్పందించి ఉమాదేవి రష్యా వెళ్లేందుకు స్పాన్సర్‌షిప్ చేశామని గుర్తు చేశారు. రష్యాలో జరిగిన పోటీల్లో పతకం సాధించిన ఉమాదేవి తమ నమ్మకాన్ని నిలబెట్టిందని, వచ్చే ఐదేళ్ల పాటు ఆమెకు అన్ని విధాలా ప్రోత్సాహం అందజేస్తామని ప్రకటించారు. ఉమాదేవి రెజ్లింగ్‌తోపాటు చదువులోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఏపీలోని సత్యసాయి జిల్లా భద్రపల్లి మండలం తంగాలకు చెందిన ఉమాదేవి.. తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలో ఫైనలియర్ చదువుతున్నారు. గత ఏడాది నవంబరులో రష్యాలో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్ రెజ్లింగ్ పోటీల్లో 49 కిలోల జూనియర్ విభాగానికి ఎంపికయ్యారు. అయితే, పేదరికం వల్ల ఉమాదేవి రష్యా వెళ్లలేని పరిస్థితిలో ఉందనే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. 'ఆంధ్రజ్యోతి' చొరవతో స్పందించి తనను ప్రోత్సహించిన కెనరా బ్యాంకుకు ఉమాదేవి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

మేళ్లచెర్వు సర్పంచ్ నుంచి 1.99 కోట్లు రికవరీ చేయండి

» సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఆదేశాలు

» సర్పంచ్ అవినీతికి పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో చర్యలు

మేళ్లచెర్వు, జనవరి 26: అక్రమాలకు పాల్పడిన సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు సర్పంచ్ పందిర్లపల్లి శంకర్‌రెడ్డి నుంచి రూ.1.99 కోట్లు రికవరీ చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటరావు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు 45 రోజుల్లో సొమ్మును రికవరీ చేయాలని తహసీల్దార్ జ్యోతిని ఆదేశిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్ ఆ ఉత్తర్వులను సర్పంచ్ పందిర్లపల్లి శంకర్‌రెడ్డికి శుక్రవారం నేరుగా అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. మేళ్లచెర్వు గ్రామపంచాయతీలో 16 వార్డులుండగా.. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన 12 మంది, కాంగ్రెస్ బలపరిచిన నలుగురు వార్డు సభ్యులుగా గెలుపొందారు. సర్పంచ్‌గా పందిర్లపల్లి శంకర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించగా, ఆయన తీరు నచ్చక నలుగురు బీఆర్ఎస్ వార్డు సభ్యులు అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరారు. ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి అధికారంలోకి రావడంతో ఆ పార్టీకి చెందిన 8 మంది వార్డు సభ్యులు.. సర్పంచ్ శంకర్‌రెడ్డి పెద్ద మొత్తంలో అవినీతికి పాల్పడినట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమకు కనీస సమాచారం ఇవ్వకుండా పంచాయతీ నిధులు ఖర్చు చేశారని, నోటీసు బోర్డులో పెట్టకుండా ఏకపక్ష నిర్ణయాలతో అవకతవకలకు పాల్పడ్డారని ఫిర్యాదులో వారు పేర్కొన్నారు. దీంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈనెల 4న డీఎల్‌పీవో సాంబిరెడ్డి ఆధ్వర్యంలో కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, ఇతర ఆడిటర్లతో కూడిన కమిటీ పంచాయతీ రికార్డులను స్వాధీనం చేసుకుంది. రికార్డుల పరిశీలనలో పంచాయతీ సాధారణ నిధుల నుంచి రూ.92.66 లక్షలు, 14, 15వ ఆర్థిక సంవత్సర నిధుల నుంచి రూ.63.30 లక్షలు, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.43.16 లక్షలు.. మొత్తం రూ.1.99 కోట్లు సర్పంచ్ అవకతవకలకు పాల్పడినట్లు నిర్ధారించి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. కాగా, సర్పంచ్ శంకర్‌రెడ్డి వ్యవహారశైలిపై స్థానికులు కూడా అనుమానం వ్యక్తం చేస్తు న్నారు. అప్పటి అధికార బీఆర్ఎస్‌లో ఉండటంతో పాటు ఓ ప్రజాప్రతినిధికి అత్యంత సన్నిహితుడని ప్రచారంతో మౌనం వహించిన వారంతా ఇప్పుడు నోరు విప్పుతున్నారు. మహాశివరాత్రి ఏర్పాట్లకు ఐదేళ్లుగా ప్రతీ ఏటా పంచాయతీ నిధులు రూ.10 లక్షల చొప్పున రూ.50 లక్షల మేర ఖర్చు చేసినట్లు చూపించారని.. జాతర కోసం గతేడాది ప్రభుత్వం కేటాయించిన రూ.50 లక్షల నిధుల ఖర్చుపైనా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అన్ని బిల్లులున్నాయి.. విచారణకు సిద్ధం

శివరాత్రి వేడుకలు, పల్లె ప్రకృతి వనాలకు నిధులను సంబంధిత అధికారుల సూచనల మేరకు ఖర్చు చేశాం. ఇందులో నా ప్రమేయం ఏమీలేదు. అన్నింటికీ బిల్లులున్నాయి. ఏ విచారణకైనా సిద్ధం..

- శంకర్‌రెడ్డి, మేళ్లచెర్వు సర్పంచ్

అంతులేని అ'క్రమబద్ధీకరణ'!

(మొదటి పేజీ తరువాయి)

తహసీల్దార్లు అడ్డగోలుగా 58, 59 జీవో దరఖాస్తులను ఆమోదించారు. శేరిలింగంపల్లి, గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్, అబ్దుల్లాపూర్ మెట్, బాలాపూర్, మహేశ్వరం, కుత్బుల్లాపూర్, మేడ్చల్, మల్కాజిగిరి, ఘట్‌కేసర్, శామీర్‌పేట, కీసర మండలాల్లో ఈ అక్రమాలు ఎక్కువగా జరిగినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. వీటిపై ఇపుడు విచారణ జరుగుతోంది. గండిపేట మండలం గోపన్‌పల్లి సర్వే నంబరు 149, 174, 34, 28తోపాటు ఖాజాగూడలోని సర్వే నంబరు 40, కొండాపూర్‌లోని సర్వే నంబరు 149, రాయదుర్గ్‌లోని సర్వే నంబరు 66/2, 66/3, ఖాజాగూడ చెరువు భూమిలో అక్రమ క్రమబద్ధీకరణ వ్యవహారాలపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. రాజేంద్రనగర్ మండలం బుద్వేల్‌లో 5 ఎకరాలు, బండ్లగూడ జాగీర్, మహేశ్వరం మండలం మంఖాల్‌లోనూ జీవో 58, 59 కింద భారీగా అక్రమాలు జరిగినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది.



అబ్దుల్లాపూర్‌మెట్‌లో తెగబడ్డారు..

అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో ప్రభుత్వ, అసైన్డ్ భూములను నేతలు తెగబడి మింగేశారు. ఒక్క పసుమాముల గ్రామ రెవెన్యూ పరిధిలోనే దాదాపు 26 ఎకరాలు.. అంటే లక్ష గజాలకు పైగా భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవడమే కాకుండా వాటికి ఆమోదం కూడా తెచ్చుకున్నారు. అయితే క్రమబద్ధీకరణ ఫీజు చెల్లించే సమయంలో.. అందులో అసైన్డ్ భూములు కూడా ఉన్నట్లు తెలియడంతో అప్పటి కలెక్టర్ హరీశ్ జోక్యం చేసుకుని రెగ్యులరైజేషన్ ప్రక్రియను నిలిపివేశారు. సర్వే నంబర్లు 444, 264, 106, 386, 102లలో ప్రభుత్వ పట్టా భూములు కలిసి ఉండగా.. అన్ని పార్టీల వారూ భాగస్వాములై వాటిని గోల్‌మాల్ చేశారు. నీకింత.. నాకింత అన్నట్లుగా స్థానిక నేతలు భూములను పంచుకున్నారు. స్థానిక తహసీల్దార్ ఈ దరఖాస్తులన్నింటికీ ఆమోదం కూడా తెలిపారు. బీఆర్ఎస్ ముఖ్యనేత అనుచరుడొకరు తన కుటుంబ సభ్యుల పేరు మీదే దాదాపు 14,600 గజాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారు. అంతేకాకుండా.. సదరు నేతల ఇంట్లో డ్రైవర్లు, పనిమనుషుల పేర్ల మీద కూడా వందల, వేల గజాల స్థలాలను క్రమబద్ధీకరించేందుకు దరఖాస్తు చేసుకున్నారు. చిన్న చిన్న గుడిసెలు వేసి, ప్రహరీ గోడలు నిర్మించి క్రమబద్ధీకరణకు ఓకే చేయించుకున్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వానికి క్రమబద్ధీకరణ రుసుము చెల్లించే సమయంలో స్థానికంగా దుమారం రేగింది. దీంతో కలెక్టర్ హరీశ్ నేరుగా వెళ్లి విచారణ జరిపి తదుపరి పక్రియను నిలిపివేశారు. ఆ సమయంలో ఆయనపై పెద్దల నుంచి ఒత్తిళ్లు కూడా వచ్చాయి. ఆయన జోక్యం చేసుకోకుంటే రూ.వందల కోట్ల విలువైన భూమి పెద్దల పరం అయ్యేది. వాస్తవానికి అసైన్డ్ భూముల్లోని స్థలాలను క్రమబద్ధీకరించేందుకు వీలు లేదు. క్రమబద్ధీకరణ జీవోలో కూడా ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. అయినా.. స్థానిక రెవెన్యూ అధికారులు ఈ అక్రమ క్రమబద్ధీకరణ ఫైళ్లను చకచకా నడిపించారు. హయత్‌నగర్ మండలం భాగ్ హయత్ సర్వే నంబరు 207, 71/1, హస్మగల్ గ్రామాల్లోనూ ఇలాగే అక్రమంగా క్రమబద్ధీకరణ జరిగినట్లు ఫిర్యాదులు ఉన్నాయి.

అక్రమాలను తవ్వుతున్న కొత్త ప్రభుత్వం..

గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున జరిగిన భూ కుంభకోణాలను కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బయటకు తవ్వి తీసే ప్రయత్నం చేస్తోంది. ఇప్పటికే ధరణిలో అక్రమాలకు అడ్డుకట్ట వేసిన ప్రభుత్వం.. గతంలో జరిగిన అక్రమాలపై క్షేత్ర స్థాయి నుంచి సమాచారం సేకరిస్తోంది. అప్పట్లో అక్రమాలకు వంతపాడిన అధికారులను ఇప్పటికే బదిలీ చేసింది. అంతర్గత దర్యాప్తు కూడా చేస్తోంది. దర్యాప్తు నివేదికలను ఇంటెలిజెన్స్, విజిలెన్స్ అధికారులకు పంపించి తెరవెనుక జరిగిన రహస్యాలను కూడా తవ్వుతోంది. గత ప్రభుత్వ హయాంలో రాజకీయ నేతలు, అధికారులు కలిసి చేసిన భూ దందాల జాబితాను అప్పట్లో పనిచేసిన కొందరు అధికారులే స్వయంగా కొత్త ప్రభుత్వానికి ఇచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. నగర శివార్లలో కీలకమైన రెవెన్యూ డివిజన్‌లో పనిచేసిన ఓ అధికారి.. గతంలో అప్పటి ప్రభుత్వం ఎలా చెబితే అలా పనులు చక్కబెట్టారు. ఆయన కూడా ఎంతో కొంత వెనకేసుకున్నారనే ఆరోపణలున్నాయి. సదరు అధికారి ఇపుడు కొత్త ప్రభుత్వంలోని పెద్దలకు దగ్గరయ్యేందుకు.. అప్పట్లో తాము చేసిన భూభాగోతాల వివరాలన్నీ కొత్త ప్రభుత్వానికి చేరవేస్తున్నారు. ఈ జాబితాలో అనేక మంది ప్రముఖుల పేర్లు ఉన్నాయి. ఆయనొక్కరే కాకుండా.. అనేక మంది రెవెన్యూ అధికారులు తాము అప్పటి ప్రభుత్వ పెద్దలు ఏం చెబితే అవి చేశామని, ఆ తప్పుడు నిర్ణయాల వివరాలన్నీ ఇస్తామని, తమ జోలికి రావొద్దని వేడుకుంటున్నట్లు తెలిసింది.

రేపు రాష్ట్రానికి అమిత్‌షా

» కరీంనగర్, మహబూబ్‌నగర్, హైదరాబాద్ సమావేశాలకు హాజరు

» లోక్ సభ ఎన్నికలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

హైదరాబాద్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల శంఖారావాన్ని కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్‌షా పూరించబోతున్నారు. రాష్ట్రంలోని పార్టీ నాయకులతో, కేడర్‌తో ప్రత్యేకంగా సమావేశమై వారికి దిశానిర్దేశం చేయనున్నారు. ఆదివారం రాష్ట్ర పర్యటన సందర్భంగా అమిత్ షా.. కేడర్, ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీలు, మహిళా మేధావులతో ప్రత్యేకంగా సమావేశమవుతారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్ చేరుకోనున్న అమిత్‌షా, మొదట మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసే ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీలతో సమావేశమవుతారు. అనంతరం, అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 2 గంటలకు కరీంనగర్ చేరుకుంటారు. అక్కడ స్థానిక ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో 20వేల మంది కార్యకర్తలతో ఏర్పాటు చేసే సమ్మేళనంలో పాల్గొంటారు. లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతపై కేడర్‌కు దిశానిర్దేశం చేస్తారు. అనంతరం, సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ జేఆర్‌సీ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన మహిళా సమ్మేళనంలో పాల్గొని కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలను వివరించనున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పార్టీ మేనిఫెస్టోలో చేర్చే అంశాలపై వారి అభిప్రాయాలు తీసుకుంటారు. అనంతరం, అమిత్ షా అదేరోజు రాత్రికి ఢిల్లీ బయలుదేరి వెళతారని పార్టీ వర్గాలు తెలిపాయి. నెలరోజుల కిందట తెలంగాణ పర్యటనకు వచ్చిన అమిత్‌షా, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కనీసం 10 ఎంపీ సీట్లు, 35% ఓటుబ్యాంకును సాధించాలని రాష్ట్ర నాయకత్వానికి లక్ష్యంగా నిర్దేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.



బాధ్యతలు స్వీకరిస్తున్న మహేందర్‌రెడ్డి

ఉద్యోగాల భర్తీ రీషెడ్యూల్!

» రూపకల్పన చేస్తున్న టీఎస్‌పీఎస్సీ

» వివరాలను వెల్లడించేందుకు కసరత్తు

» చైర్మన్‌గా మహేందర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

» మరో ముగ్గురు సభ్యులు కూడా..

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): వివిధ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదలై పలు దశల్లో నిలిచిపోయిన నియామక ప్రక్రియను రీషెడ్యూల్ చేయాలని టీఎస్‌పీఎస్సీ భావిస్తోంది. త్వరలోనే ఈ రీ-షెడ్యూల్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించాలని నిర్ణయించింది. టీఎస్‌పీఎస్సీ నూతన చైర్మన్‌గా నియమితులైన మహేందర్‌రెడ్డి, సభ్యులు అనితా రాజేంద్ర, ఎన్.యాదయ్య, రజనీ కుమారి శుక్రవారం తమ బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఉద్యోగాల భర్తీకి సంబంధించి అనుసరించాల్సిన విధానంపై చర్చించినట్టు సమాచారం. నిలిచిపోయిన ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వీలైనంత త్వరగా ప్రారంభించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. అయితే.. ఈ ఉద్యోగాల నియామకాలకు సంబంధించి పూర్తి స్థాయి షెడ్యూల్‌ను ఖరారు చేయాలని భావిస్తున్నారు. పలు పోస్టుల భర్తీ ప్రక్రియ వివిధ దశలో నిలిచిపోయిన విషయం తెలిసిందే. కొన్ని పోస్టులకు సంబంధించిన పరీక్షలను పూర్తిచేయగా, మరికొన్ని పోస్టులకు సంబంధించి ఇంకా పరీక్షలను నిర్వహించ లేదు. పరీక్షలను నిర్వహించిన పోస్టులు, ఇంకా పరీక్షలను నిర్వహించలేని పోస్టులను వేర్వేరు కేటగిరీలుగా భావించి, ఈ షెడ్యూల్‌ను రూపొందించాలని భావిస్తున్నారు. అంటే.. ఇప్పటికే ఆయా పోస్టుల భర్తీకోసం జారీ చేసిన నోటిఫికేషన్లకు సంబంధించి రీ-షెడ్యూల్‌ను జారీ చేయనున్నారు. ఒకవేళ ఆయా గ్రూపు పోస్టుల్లో ఉద్యోగాల సంఖ్యను పెంచాలని భావిస్తే.. అనుబంధ నోటిఫికేషన్లను కూడా జారీ చేయాల్సి ఉంటుంది. దీనిపై ప్రభుత్వ ఉద్దేశం ప్రకారం కమిషన్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సుమారు 8,039 గ్రూప్-4 పోస్టుల భర్తీ కోసం కోసం బోర్డు ఇప్పటికే పరీక్షలను నిర్వహించిన సంగతి తెలిసిందే. 7,62,872 మంది అభ్యర్థులు పరీక్షలను రాయగా.. తుది కీని కూడా విడుదల చేశారు. ఈ ఫలితాల వెల్లడిపై కూడా కమిషన్ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

రాజీవ్ రహదారికి 'రైతుబంధు'!

» ఏళ్లుగా రికార్డుల్లోంచి రోడ్డు భూమిని తొలగించని అధికారులు

» భూనిర్వాసితులకు నష్టపరిహారం విషయంలో లేని స్పష్టత

» భూవిలువ పెరగడంతో ఎక్కువైన సివిల్ కోర్టు కేసులు, కక్షలు

» సవరణ చేస్తే తమ బాధలు తీరతాయంటున్న యజమానులు



సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్‌లోని రాజీవ్ రహదారి

గజ్వేల్, జనవరి 26: రహదారికి రైతుబంధు సాయం! ఇదేంటి రహదారికి రైతుబంధు సాయమేవిటని ఆశ్చర్యపోకండి! ఎందుకంటే 60 ఏళ్ల క్రితం నిర్మాణం ప్రారంభించిన రాజీవ్ రహదారికి తెలంగాణ ప్రభుత్వం నుంచి రైతుబంధు సాయం అందుతోంది. రోడ్డు నిర్మాణానికి సేకరించిన భూములను రికార్డుల నుంచి తొలగించకపోవడమే దీనికి కారణం. తెలంగాణలో ప్రతిష్ఠాత్మకమైన రాజీవ్ రహదారి నిర్మాణం 1960లో చేపట్టారు. హైదరాబాద్ నుంచి సిద్దిపేట, కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల వరకు విస్తరించి ఉన్న ఈ రోడ్డు నిర్మాణంలో భాగంగా సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని ప్రజ్ఞాపూర్, రిమ్మనగూడ, కొడకండ్ల గ్రామాల్లో తీసుకున్న భూమిని ధరణి పోర్టల్ వచ్చినా రికార్డుల్లో నుంచి తొలగించకపోవడం, ప్రస్తుతం భూమి విలువ భారీగా పెరగడంతో నా భూమి రికార్డుల్లో ఉందని, పొజిషన్ చూపించాలంటూ పలువురు దరఖాస్తులు చేసుకుంటున్నారు. ధరణి పోర్టల్‌లో సైతం కొనుగోలుదారుల భూమికి బదులు పూర్వపు భూయజమానుల పేర్లు చేరడంతో పలువురు కోర్టు మెట్లు ఎక్కుతున్నారు.


ఆ భూములు ఇంకా రికార్డుల్లోనే..

సికింద్రాబాద్ పరిధిలోని బొల్లారం నుంచి మంచిర్యాల వరకు 1960వ దశకంలో నిర్మించిన రాజీవ్ రహదారి విస్తరణలో భూమిని కోల్పోయిన యజమానుల పేర్లు పహాణీల నుంచి తొలగించకపోవడం ప్రజ్ఞాపూర్‌లో పెద్ద సమస్యగా మారింది. సర్వే నెంబరు 65, 66, 67, 78, 76, 75, 147, 143, 146, 156, 176, 177, 193, 178, 185, 274, 270, 269, 268, 216, 267, 220, 222, 262, 261, 335, 336, 337, 340, 341, 356, 358లలో దాదాపు 25 నుంచి 30 ఎకరాల భూసేకరణ చేపట్టగా, తాజాగా రోడ్డు విస్తరణ సమయంలో మరో 25 ఎకరాల వరకు రోడ్డుకు సేకరించారు. ఈ సర్వే నెంబర్లలో ఎవరి భూములలో నుంచి రాజీవ్ రహదారి వెళ్లిందో వారి వివరాలను తొలగించకపోవడం, ప్రస్తుతం భూవిలువలు భారీగా పెరగడం, పలువురు ఈ భూముల క్రయవిక్రయాలు జరపడంతో అధికారులకు తొలగించాలంటే కత్తి మీద సాములా మారింది. రాజీవ్ రహదారిపై నూతనంగా నిర్మించిన ప్రజ్ఞాపూర్ బైపాస్‌కు సంబంధించిన భూమిని నేషనల్ ఖాతాలో ఆర్‌అండ్‌బీ రోడ్డుగా నమోదు చేశారు. దీంతో తాజా రోడ్డు రికార్డుల్లోకి ఎక్కితే 60ఏళ్ల కిందట వేసిన రోడ్డు మాత్రం రికార్డుల్లో నమోదు కాలేదు. రాజీవ్ రహదారి నిర్మాణానికి సేకరించిన భూమిని ప్రస్తుతం రికార్డుల్లో నుంచి తొలగించేందుకు అధికారులు జంకుతున్నారు. గతంలో సేకరించిన భూములకు సంబంధించిన రికార్డులు అందుబాటులో ఉన్నా ఆ భూమికి నష్టపరిహారం చెల్లింపు విషయంలో స్పష్టత లేదు. ఇటు భూరికార్డుల్లో నుంచి పేర్లను తొలగించకపోవడంతో రోడ్డు నిర్మాణానికి సేకరించిన భూమి రికార్డులో అలాగే ఉండడంతో క్రయవిక్రయాలు చేస్తున్నారు. దీంతో ప్రస్తుతం పొజిషన్‌లో ఉన్న పట్టాదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీగా ఏర్పడి అభివృద్ధి చెందడంతో ఈ రోడ్డులో భూముల విలువ భారీగా పెరిగింది. భువనగిరి-ప్రజ్ఞాపూర్ రోడ్డులో సైతం భూమి విలువ భారీగా పెరిగింది. ఈ రోడ్డు విస్తరణలో సేకరించిన భూమి వివరాలను సైతం రెవెన్యూ రికార్డుల్లో నుంచి తొలగించకపోవడంతో ఈ రోడ్డులోనూ అదే పరిస్థితి నెలకొన్నది. గతంలో సేకరించిన భూమి వివరాలను ఇప్పటికైనా రికార్డుల్లో నుంచి తొలగించాలని పలువురు కోరుకుంటున్నారు.

సాగర్ పనులకు సీఆర్‌పీఎఫ్ బ్రేక్

» కేఆర్ఎంబీ సమ్మతి లేకుండా అనుమతించబోమని ఆంక్షలు

» మరమ్మతులపై ఆంక్షలు ఏమిటని అధికారుల మండిపాటు..



హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ మరమ్మతు పనులకు సీఆర్‌పీఎఫ్ బ్రేక్ వేసింది. ఏ పనులు చేయాలన్నా విధిగా కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) అనుమతి తీసుకోవాల్సిందేనని, అప్పుడే కట్టపై అనుమతిస్తామని సీఆర్‌పీఎఫ్ యంత్రాంగం తెలంగాణ అధికారులకు తేల్చిచెబుతోంది. ప్రస్తుతం సాగర్‌లో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌కు సంబంధించిన పనులు జరగాల్సి ఉంది. ఇవన్నీ కూడా వర్షాకాలానికి ముందు చేపట్టాల్సినవి. డ్యామ్ సేఫ్టీ చట్టం ప్రకారమే ఈ పనులు జరగాలి. అయితే కీలకమైన ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులను సీఆర్‌పీఎఫ్ అడ్డుకోవడం.. దానికి కృష్ణా బోర్డు వంతపాడటం విమర్శలకు తావిస్తోంది. గతేడాది నవంబరు 29న సాగర్ డ్యామ్ ఏపీ వైపు ఆ రాష్ట్ర యంత్రాంగం భారీగా పోలీసులతో కలిసి, స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. దీనిపై పలు దఫాలుగా కేంద్ర జలశక్తి శాఖ, కేంద్ర హోంశాఖ తెలుగు రాష్ట్రాల అధికారులతో సమావేశమైంది. తాజాగా ఈనెల 17వ తేదీన జరిగిన సమావేశంలో కృష్ణాబోర్డు అనుమతి లేకుండా తెలుగు రాష్ట్రాల అధికారులను సాగర్ కట్టపైకి అనుమతించొద్దని కేంద్రం ఇచ్చిన ఆదేశాలను సీఆర్‌పీఎఫ్ ప్రస్తుతం కఠినంగా అమలు చేస్తోంది. ప్రస్తుతం నాగార్జునసాగర్ తెలంగాణ తాత్కాలిక నిర్వహణలో ఉండగా.. శ్రీశైలం ఏపీ నిర్వహణలో ఉంది. శ్రీశైలం మరమ్మతుల వ్యవహారంలో తెలంగాణ జోక్యం చేసుకోవడం లేదు. అయితే నాగార్జునసాగర్ స్పిల్‌వే ఓగీతోపాటు కుడికాలువ గేట్ల వద్దకు వెళ్లే దారిలో రోడ్డు వేయాల్సి ఉంది. అంతేకాకుండా వర్షాకాలానికి ముందు డ్యామ్‌పై చేపట్టాల్సిన పనులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. ఆయా పనులన్నీ చేపట్టడానికి ఇదే కీలక సమయం. వాస్తవానికి నీటి విడుదలతో ముడిపడి ఉన్న పనులనే సీఆర్‌పీఎఫ్ అడ్డుకోవాల్సి ఉండగా.. రొటీన్‌గా జరగాల్సిన పనులను కూడా అడ్డుకుంటే, రానున్న వర్షాకాలంలో పలు సమస్యలు వస్తాయని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీగా వరద వస్తే... ఆ వరదల సమయంలో గేట్లు పనిచేయకపోతే, దానివల్ల ఉత్పన్నమయ్యే సమస్యలకు కేంద్రం, బోర్డు మాత్రమే బాధ్యత వహించాలని అధికారులు మండిపడుతున్నారు. అయితే ఆయా పనులు చేపట్టడానికి అనుమతి కోరుతూ లేఖ రాస్తే ఆమోదం తెలుపుతామని కృష్ణా బోర్డు చెబుతుండగా... ప్రాజెక్టును నిబంధనల ప్రకారం అప్పగించకుండా ఏ విధంగా పెత్తనం చేస్తున్నారని తెలంగాణ అధికారులు ప్రశ్నిస్తున్నారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.*

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● శనివారం 27 జనవరి 2024
diksuchi@andhrajyothy.com

ఫుట్‌వేర్ డిజైన్ సంస్థలో డిగ్రీ, పీజీ

కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలోని 'ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ)'-బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. బ్యాచిలర్ డిగ్రీలో బీ డిజైన్, బీబీఏ; మాస్టర్ డిగ్రీలో ఎం డిజైన్, ఎంబీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.



దేశవ్యాప్తంగా నిర్వహించే ఆలిండియా సెలెక్షన్ టెస్ట్(ఏఐఎస్‌టీ) 2024 స్కోర్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. హైదరాబాద్, చెన్నై, చింద్వారా, చండీగఢ్, అంకలేశ్వర్, నోయిడా, ఫుర్సత్‌గంజ్, గుణ, జోధ్‌పూర్, పట్నా, కోల్‌కతా, రోహతక్ క్యాంపస్‌లలో ఈ ప్రోగ్రామ్‌లను అందిస్తున్నారు. మొత్తం 2360 సీట్లు ఉన్నాయి.

బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(బీ డిజైన్)

- ఈ ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్, లెదర్-లైఫ్ స్టయిల్-ప్రొడక్ట్ డిజైన్, ఫ్యాషన్ డిజైన్ విభాగాలు ఎంచుకోవచ్చు.
- ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్ విభాగానికి సంబంధించి హైదరాబాద్, నోయిడా క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 80 సీట్లు; మిగిలిన అన్ని క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 60 సీట్లు ఉన్నాయి. లెదర్-లైఫ్ స్టయిల్-ప్రొడక్ట్ డిజైన్ విభాగానికి సంబంధించి హైదరాబాద్, నోయిడా, కోల్‌కతా క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 60 సీట్లు ఉన్నాయి. ఫ్యాషన్ డిజైన్ విభాగానికి సంబంధించి హైదరాబాద్, నోయిడా క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 80 సీట్లు; గుణ మినహా అన్ని క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 60 సీట్లు ఉన్నాయి.

బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(బీబీఏ)

- రిటైల్ అండ్ ఫ్యాషన్ మర్చండైజ్ విభాగంలో ఈ ప్రోగ్రామ్ చేయవచ్చు. దీని వ్యవధి మూడేళ్లు, ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. హైదరాబాద్, నోయిడా, పట్నా, చండీగఢ్ క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 60 సీట్లు ఉన్నాయి.

మాస్టర్ ఆఫ్ డిజైన్(ఎం డిజైన్)

- ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్, ఫ్యాషన్ డిజైన్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.
- ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్ స్పెషలైజేషన్‌కు సంబంధించి చెన్నై, నోయిడా క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 60 సీట్లు; ఫ్యాషన్ డిజైన్ స్పెషలైజేషన్‌కు సంబంధించి హైదరాబాద్, నోయిడా క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 30 సీట్లు ఉన్నాయి.

మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ)

- ఈ ప్రోగ్రామ్ స్పెషలైజేషన్ రిటైల్ అండ్ ఫ్యాషన్ మర్చండైజ్. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. హైదరాబాద్, నోయిడా, పట్నా, చండీగఢ్, చింద్వారా క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 60 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు

- బీ డిజైన్, బీబీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం అయిదు సబ్జెక్టులతో నేషనల్ ఓపెన్ స్కూల్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణులు, పదోతరగతి తరవాత ఏఐసీటీఈ గుర్తింపు పొందిన మూడేళ్ల డిప్లొమా పూర్తిచేసినవారు, ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. 2024 జూలై 1 నాటికి అభ్యర్థుల వయసు 25 ఏళ్లు మించకూడదు.
- ఎం డిజైన్, ఎంబీఏ ప్రోగ్రామ్‌లకు ఏదేని డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి ఏడాది చదువు తున్నవారు కూడా అర్హులే. వీరు 2024 సెప్టెంబరు 30 నాటికి డిగ్రీ సర్టిఫికెట్‌లు సబ్మిట్ చేయాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

ఏఐఎస్‌టీ 2024

- ఇది పేపర్ బేస్డ్ టెస్ట్(పీబీటీ). ప్రశ్నలను ఆంగ్ల మాధ్యమంలో ఇస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు. మొత్తం మార్కులు 200.
- బీ డిజైన్, బీబీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో మొత్తం 150 ప్రశ్నలు ఇస్తారు. అనలిటికల్ ఎబిలిటీ నుంచి 25, జనరల్ అవేర్‌నెస్ నుంచి 35, కాంప్రహెన్షన్ నుంచి 25, గ్రామర్ నుంచి 15 ప్రశ్నలు ఇస్తారు. వీటికి ఒక్కోదానికి ఒక మార్కు ఉంటుంది. బిజినెస్ ఆప్టిట్యూడ్ నుంచి 25, డిజైన్ ఆప్టిట్యూడ్ నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. వీటికి ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు నిర్దేశించారు.
- ఎం డిజైన్, ఎంబీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నిర్వహించే ఎగ్జామ్‌లో మొత్తం 175 ప్రశ్నలు ఇస్తారు. అనలిటికల్ ఎబిలిటీ నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. వీటికి ప్రశ్నకు రెండు మార్కులు నిర్దేశించారు. ఇంగ్లీష్ కాంప్రహెన్షన్&గ్రామర్, జనరల్ నాలెడ్జ్&కరెంట్ అఫైర్స్, మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ & డిజైన్ ఆప్టిట్యూడ్ అంశాల నుంచి ఒక్కోదానిలో 50 ప్రశ్నలు ఇస్తారు. వీటికి ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది.

FDDI

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.300
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 2024 ఏప్రిల్ 20
- **ఎడిటింగ్ విండో ఓపెన్:** 2024 మే 1, 2
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** మే 6 నుంచి
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం
- **ఏఐఎస్‌టీ 2024 తేదీ:** 2024 మే 12న
- **అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** 2024 మే 31న
- **కౌన్సెలింగ్:** జూన్ రెండు, మూడు వారాల్లో
- **ప్రోగ్రామ్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** 2024 జూలై 15
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** 2024 జూలై 29 నుంచి
- **వెబ్‌సైట్:** www.fddiindia.com

రిమైండర్

సంబల్‌పూర్ ఐఐఎంలో పీహెచ్‌డీ

సంబల్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది నాలుగేళ్ల వ్యవధిగల ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. దీనిని గరిష్ఠంగా ఆరేళ్లలో పూర్తి చేయాలి. స్టయిపెండ్ సౌకర్యం ఉంది. జాతీయ పరీక్ష స్కోర్/రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ స్కోర్, అకడమిక్ ప్రతిభ, పర్సనల్ ఇంటర్వ్యూ, అనుభవం, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.



స్టయిపెండ్: ట్యూషన్, కంప్యూటర్, లైబ్రరీ, మెడికల్ ఇన్సూరెన్స్, అలూమ్నీ తదితర ఫీజుల నిమిత్తం కాంప్రహెన్సివ్ ఫెలోషిప్ ఇస్తారు. దీనితోపాటు మొదటి రెండేళ్లు నెలకు రూ.35,000; చివరి రెండేళ్లు నెలకు రూ.40,000 చొప్పున సబ్సిస్టెన్స్ అలవెన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు: ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్, పాలసీ అండ్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ సిస్టం మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని మాస్టర్స్ డిగ్రీ/అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ లేదా ఐఐటీలు/ఐఐఎం సంస్థల నుంచి రెండేళ్ల పీజీ డిప్లొమా పూర్తి చేసి ఉండాలి. డిగ్రీతోపాటు సీఏ/ఐసీడబ్ల్యుఏఐ/సీఎస్ ఉత్తీర్ణులు; కనీసం 6.5 సీజీపీఏతో బీఈ/బీటెక్/బీఆర్క్/బీఎస్సీ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీ స్థాయి నుంచి పీజీ వరకు ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. పీజీ చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారూ అర్హులే. వీరు 2024 జూన్ 30 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. పార్ట్ టైం కోర్సులు, ఈవెనింగ్ కోర్సులు, డిస్టెన్స్ ప్రోగ్రామ్‌లు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు. క్యాట్ (2021/2022/2023) లేదా జీఆర్‌ఈ/గేట్/జీమ్యాట్/జేఆర్‌ఎఫ్ (యూజీసీ/సీఎస్ఐఆర్) వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. లేని పక్షంలో సంస్థ నిర్వహించే రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. అభ్యర్థుల వయసు 2024 జూన్ 1 నాటికి 40 ఏళ్లు మించకూడదు.

- ఐఐఎం సంస్థల నుంచి రెండు/మూడేళ్ల వ్యవధి గల ఫుల్ టైం పీజీడీఎం/పీజీపీ ఉత్తీర్ణులకు; ఐఐటీలు/ఢిల్లీ ఎఫ్ఎంఎస్ సంస్థల నుంచి ఎంబీఏ పూర్తిచేసినవారికి; ఎంబీఏ/పీజీడీఎం/పీజీపీ ఉత్తీర్ణతతోపాటు కనీసం అయిదేళ్ల అనుభవం ఉన్నవారికి పీహెచ్‌డీ మొదటి ఏడాది కోర్సు నుంచి మినహాయింపు ఇస్తారు.
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000+జీఎస్‌టీ
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** మార్చి 31
- **వెబ్‌సైట్:** www.iimsambalpur.ac.in

జాబ్ కార్నర్

రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్‌ఎఫ్‌సీఎల్), రామగుండం ప్లాంట్.. రెగ్యులర్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో నాన్ ఎగ్జిక్యూటివ్‌లు

మొత్తం ఖాళీలు: 39

1. అటెండెంట్ గ్రేడ్-1(మెకానికల్): **15 పోస్టులు**
2. అటెండెంట్ గ్రేడ్-1(ఎలక్ట్రికల్): **15 పోస్టులు**
3. అటెండెంట్ గ్రేడ్-1(ఇన్‌స్ట్రుమెంటేషన్): **9 పోస్టులు**

ట్రేడులు: ఫిట్టర్, డీజిల్ మెకానిక్, మెకానిక్- హెవీ వెహికల్ రిపేర్ అండ్ మెయింటెనెన్స్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంటేషన్ మెకానిక్.

అర్హత: మెట్రిక్యులేషన్, సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణత. ఐటీఐలో జనరల్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు కనీసం 60 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు 55 శాతం మార్కులు సాధించి ఉండాలి.

వయోపరిమితి: 2024 జనవరి 31 నాటికి 18 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీ, అభ్యర్థులకు అయిదేళ్లు; దివ్యాంగులకు పదేళ్లు గరిష్ఠ వయోపరిమితి నిబంధనలో సడలింపు ఉంటుంది.

బేసిక్ పే: నెలకు రూ.21,500 - రూ.52,000

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, స్కిల్(ట్రేడ్), మెడికల్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.200. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఈఎస్ఎం అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, కరీంనగర్, కర్నూలు, నాగ్‌పూర్, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 22

వెబ్‌సైట్: https://www.rfcl.co.in/careers2.php

భారత రాజ్యాంగం - ముఖ్య చట్టాలు

టీఎస్‌పీఎస్సీ/ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ



పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు 'భారత రాజ్యాంగ చారిత్రక నేపథ్యం', 'రాజ్యాంగ పరిషత్' అంశాలను చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. తొలుత రాజ్యాంగంలోని అన్ని అంశాలను అర్థం చేసుకోవాలి. ఆ తరవాత భారత రాజ్యాంగ చారిత్రక నేపథ్యం, రాజ్యాంగ పరిషత్ అనే అంశాలను ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి.

భారత ప్రభుత్వచట్టం - 1935: దీనిని భారత రాజ్యాంగానికి మాతృకగా చెప్పవచ్చు. ఈ చట్టంలో దాదాపు 70 శాతం అంశాలను భారత రాజ్యాంగంలో చేర్చారు. ఈ చట్టంలో పది షెడ్యూల్స్, 321 అధికరణలు ఉన్నాయి.

ముఖ్యాంశాలు

ప్రభుత్వ పాలనా అంశాలను మూడు జాబితాలుగా విభజించారు. వాటిలో

1) కేంద్ర జాబితా - 59 పాలనా అంశాలు
2) రాష్ట్ర జాబితా - 54 పాలనా అంశాలు
3) ఉమ్మడి జాబితా - 36 పాలనా అంశాలు

- అవశిష్ట అధికారాలు గవర్నర్ జనరల్‌కు లభిస్తాయి. రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తిని కల్పించారు.
- కేంద్రంలో ద్వంద్వ పాలన విధానాన్ని ప్రవేశపెట్టారు.(రాష్ట్రాల్లో ద్వంద్వపాలన రద్దు) రాష్ట్రాల్లో ద్వి శాసనసభా విధానాన్ని ప్రవేశపెట్టారు. ఢిల్లీలో ఫెడరల్ కోర్టును ఏర్పాటుచేశారు.
- ముంబై కేంద్రంగా ఆర్‌బిఐ(రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా) ఏర్పాటుచేశారు. అలాగే జాతీయ స్థాయిలో ఫెడరల్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, రాష్ట్రస్థాయిలో ప్రొవెన్షియల్ పబ్లిక్ సర్వీస్ కమిషన్లను ఏర్పాటుచేశారు.
- ఇండియా నుంచి బర్మాను వేరు చేశారు. ఎస్సీలకు, క్రిస్టియన్లకు, యురోపియన్లకు, ఆంగ్లో-ఇండియన్‌లకు, కార్మికులకు ప్రత్యేక నియోజకవర్గాలు కొనసాగించారు. మహిళలకు ఓటుహక్కును కల్పించారు.

విమర్శ

1. ఇది బానిసత్వానికి మరోరూపం, భారతీయులపై బలవంతంగా రుద్దారు. గట్టి బ్రేకులు ఉండి ఇంజన్ లేని యంత్రం లాంటిదని నెహ్రూ అన్నారు.
2. బయటకు ప్రజాస్వామ్య రూపం ఉన్నట్లు కనిపించినా అంతర్గతంగా అంతా శూన్యం. ఇది భారతీయులపై బలవంతంగా రుద్దిన చట్టం అని మదన్ మోహన్ మాలవ్యా పేర్కొన్నారు.
3. ఇది కచ్చితంగా చెడ్డది, పూర్తిగా పిచ్చిది, అయినా అంగీకృతమైందని మహమ్మదాలి జిన్నా పేర్కొన్నారు.
4. ఈ చట్టంతో వైస్రాయ్‌కి ముస్సోలినీ, హిట్లర్‌ను తలపించే నియంత్రణ అధికారాలను కల్పించారు. ఇది పొట్టి మనుషులు కట్టిన అపురూప కట్టడమని విన్‌స్టన్ చర్చిల్ అన్నారు.
5. మన దేశంలో నూతన బానిసత్వానికి నాంది వంటిది అని నెహ్రూ ఉద్ఘాటించారు.
6. భారత ప్రజలపై బ్రిటిష్ ప్రభుత్వం బలవంతంగా రుద్దిన చట్టమని కె.టి.షా చెప్పారు.

ఆగస్టు ప్రతిపాదన-1940: అప్పటి వైస్రాయ్ లిన్‌లిత్ గో 1940 ఆగస్టున కొన్ని ప్రతిపాదనలు చేశారు. వాటిలోని ముఖ్యాంశాలు.

- రెండో ప్రపంచ యుద్ధం తరవాత ఇండియాకి అధినివేశ ప్రతిపత్తి కల్పిస్తారు.
- ప్రాంతీయ ప్రభుత్వాలకు శాసన నిర్మాణ శాఖలు రూపొందించారు.
- ఈ కమిటీ సూచనల మేరకు రాజ్యాంగ నిర్మాణ సభ ఏర్పడింది.

క్రిప్స్ రాయబారం - 1942: రెండో ప్రపంచ యుద్ధంలో బ్రిటిష్ సైన్యాల తరఫున భారత సైన్యాలు పాల్గొనాలి. దానికిగానూ

1. రాజ్యాంగ నిర్మాణసభను ఏర్పాటు చేస్తారు.
2. స్వయం ప్రతిపత్తితో కూడిన పాలనా వ్యవస్థను ఇస్తారు.

- ఈ ప్రతిపాదనలను కాంగ్రెస్ జాతీయ నాయకత్వం తిరస్కరించింది.
- క్రిప్సు రాయబారాన్ని దివాలా తీసిన బ్యాంకు చెక్కు మీద ముందు తేదీ వేసి ఇచ్చినదిగా గాంధీ అభివర్ణించారు.
- క్రిప్సు రాయబారాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ బొంబై సమావేశంలో క్విట్ఇండియా తీర్మానాన్ని చేసింది.

క్విట్ ఇండియా ఉద్యమం-1942: బ్రిటిష్ వారు ఇండియాను వదిలివెళ్లాలని డిమాండ్ చేసింది. ఈ ఉద్యమకాలంలో ఇచ్చిన నినాదాలు..

1. డూ (లేదా) డై (విజయమో వీర స్వర్గమో) - గాంధీ
2. క్విట్ ఇండియా - భారత జాతీయ కాంగ్రెస్
3. డివైడ్ - క్విట్ (విభజించండి - వెళ్లిపోండి) - ముస్లిం లీగ్
4. స్ట్రెంథ్ అవర్ ఫోర్స్ అండ్ క్విట్ (మా బలాన్ని పెంచండి, వెళ్లిపోండి)- స్వదేశీ సంస్థానాలు.

సి.ఆర్.ఫార్ములా - 1944: కాంగ్రెస్, ముస్లిం లీగ్‌ల మధ్య ఐక్యత సాధించడం ద్వారా స్వాతంత్ర్య సిద్ధిని పొందవచ్చుననే ఉద్దేశంతో రాజగోపాలచారి ఈ పథకాన్ని రూపొందించారు.

- స్వాతంత్ర్యానంతరం ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా పాకిస్థాన్ ఏర్పాటు.
- మైనారిటీ ప్రజాభిప్రాయం ద్వారా పాకిస్థాన్ నిర్ణయం జరుగుతుంది.
- దీనిని కాంగ్రెస్, ముస్లింలీగ్‌లు రెండూ విమర్శించాయి.
- రెండో ప్రపంచయుద్ధం అనంతరం బ్రిటన్‌లో జరిగిన ఎన్నికల్లో లేబర్‌పార్టీ నాయకుడైన క్లెమెంట్ అట్లీ బ్రిటిష్ ప్రధాని అయ్యారు. ఈయన బ్రిటన్ పార్లమెంటులో ఇండియాకు స్వాతంత్ర్యం ఇవ్వబోతున్నామని ప్రకటన చేశారు. అట్లీ మంత్రివర్గంలోని ముగ్గురు సభ్యులను భారతదేశానికి పంపించారు. దీనినే మంత్రి త్రయ రాయబారం అంటారు.

వేవెల్ ప్రణాళిక-1945: నాటి గవర్నర్ జనరల్ దీనిని రూపొందించారు. దేశ సార్వభౌమాధికారం, విదేశీ వ్యవహారాలు, కరెన్సీ, రక్షణ వంటి జాతీయ ప్రాముఖ్యమున్న అంశాలపై బ్రిటిష్ ప్రభుత్వానికి అధికారం కల్పించి మిగిలిన అంశాలను భారతీయులకు అధికారం ఇవ్వడం. ఇండియాలో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ ఒక యుద్ధ సలహా మండలిని ఏర్పాటు చేయడం. వైస్రాయ్ కార్యనిర్వాహక వర్గం జాతీయ ప్రభుత్వంగా వ్యవహరిస్తుంది.

సిమ్లా సమావేశం-1945: కాంగ్రెస్, ముస్లింలీగ్‌ల మధ్య సయోధ్యను భూలాభాయ్ దేశాయ్, లియాఖత్ అలీఖాన్ మధ్య సామరస్యం కుదర్చడం దీని లక్ష్యం.

- పాకిస్థాన్ ప్రస్తావన లేదని ముస్లింలీగ్, స్వాతంత్ర్యంపై నిర్మాణాత్మక ప్రతిపాదన లేదని కాంగ్రెస్ ఈ సమావేశాన్ని బహిష్కరించాయి.



వి.చైతన్యదేవ్,
పోటీ పరీక్షల నిపుణులు

చిట్టిఫ్



బుద్ధి హీనులు

అనగనగా ఓ పిసినారి ఉండేవాడు. బాగా ధనికుడు. చిన్న విషయం కూడా పదులసార్లు ఆలోచించేవాడు. ఒక రోజు తన కొడుకును తీసుకుని ఓ సంతకు వెళ్లాడు. అక్కడ ఇద్దరికీ ఏమీ నచ్చలేదు. కొడుక్కు ఏదైనా వస్తువు నచ్చితే అది బాగలేదనేవాడు తండ్రి. ఏదైనా తండ్రికి నచ్చిన వస్తువు కనపడితే 'మనకు పనికి రాదు' అన్నాడు కొడుకు. అలా ఇద్దరూ ఏ వస్తువు కొనకుండా వెళ్తుంటే వారికి ఓ గుర్రాల సంత కనపడింది. ఆ సంతలోకి వెళ్లారు. ఆ రోజు ఎందుకో బలిష్ఠంగా ఉండే నల్లని గుర్రం వారికి నచ్చింది. సొమ్ము ఇచ్చి కొన్నారు. తాడును కూడా అమ్మిన వారితో ఇప్పించుకుని ఇంటికి బయలుదేరారు తండ్రీకొడుకులు.

ఇద్దరూ నడుస్తున్నారు. మాట్లాడుకుంటూ నడుస్తుంటే గుర్రం ఇకిలిస్తోంది. ఓ గుట్ట కనపడింది. ఇక లాభం లేదనుకుని.. ఇద్దరూ గుర్రం ఎక్కారు. ఆ గుర్రం కొంచెం వేగంగా పరిగెత్తి.. గుట్ట దగ్గర మెల్లగా నడిచింది. నీళ్లు, ఆహారం తిన్నదో లేదో అని తెలుసుకోకుండా అలానే గుర్రాన్ని ఉరికెత్తించారు. నోటిలో లాలాజలం కక్కుతూ గుర్రం కష్టంగా నడుస్తోంది. దారిలో ఉండేవాళ్లు కొంతమంది ఇలా అన్నారు.. 'చూడటానికి దున్నల్లా ఉన్నారు. నడవలేరా? పాపం గుర్రం బరువుగా నడుస్తోంది' అన్నారు. వెంటనే ఇద్దరూ కిందకు దిగారు.

అలానే ఇద్దరూ గుర్రం తీసుకుని నడుస్తూ వెళ్తున్నారు. కొద్దిసేపయ్యాక పెద్దాయన గుర్రమెక్కాడు. తన కుమారుడు నడుస్తూ వస్తున్నాడు. కొందరు ఆడవాళ్లు నీళ్లకు పోతున్నారు. పాపం.. పసివాడు నడుస్తుంటే.. ఆయన గుర్రం మీద ఊరేగుతున్నాడు అన్నారు. అది విన్న తండ్రి బాధపడ్డాడు. నేను వద్దు.. నువ్వు గుర్రం ఎక్కు అని కొడుకును ఎక్కించాడు. మరో ఊరిలోకి వెళ్తూనే.. 'చూడటానికి గున్నలా ఉన్నాడు కొడుకు. పాపం ముసలాయన్ని నడిపిస్తున్నాడు. ఈ కాలం పిల్లలంతే. తండ్రి చచ్చినా పర్వాలేదు' అన్నాడు ఓ తెలిసిన చుట్టం. దీంతో వెంటనే కొడుకు కిందకు దిగాడు.

చివరగా ఇద్దరూ నడుస్తూ ఉన్నారు. ఎవరూ గుర్రం ఎక్కలేదు. ఆ ఊరి చివరకు వస్తూనే ఓ వాగు వంతెన దాటుతుండగా బలంగా గుర్రాన్ని నీళ్లలోకి తోశారు. పాపం ఆ గుర్రం నీళ్లలోంచి ఈది వెళ్లిపోయింది. ఈ బుద్ధి హీనులు ఇంటికి వచ్చి గర్వంగా కనిపించారు. అయితే తాము కొన్న గుర్రం ధరను మరిచిపోయి సంతోషించారు.


దారి కనుక్కోండి



7 తేడాలను గుర్తించండి



చుక్కలు కలిపి రంగులు వేయండి



డైలీ సుడోకు - 214

1	7	5			8			
9								
			4	5			6	7
4		3			2		1	
	8						4	
	1		7			3		6
8	5			3	6			
								2
			2			8	5	9

సుడోకు - 213 సమాధానం

5	7	1	2	4	9	3	8	6
2	4	3	5	8	6	7	1	9
8	6	9	7	1	3	4	2	5
1	5	4	6	7	2	9	3	8
7	2	8	3	9	4	6	5	1
9	3	6	8	5	1	2	4	7
6	1	7	4	3	5	8	9	2
3	9	2	1	6	8	5	7	4
4	8	5	9	2	7	1	6	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

ఐఫోన్‌కు అనువైన అయిదు యాప్స్



స్మార్ట్ ఫోన్... స్మార్ట్ వర్క్ ఇప్పటి ట్రెండ్. పెరుగుతున్న సాంకేతికత పనిభారాన్ని తగ్గిస్తే మంచిదే కదా...! అలా అనుకున్నప్పుడు ప్రత్యేకించి ఈ యాప్‌లు ఐఫోన్‌లో ఉంటే పని ఏదైనా సులువుగా పూర్తవుతుందని నిపుణులు చెబుతున్నారు. నోట్స్ తీసుకోవడం నుంచి కంటెంట్ క్రియేషన్, డ్రాఫ్టింగ్ ఈ మెయిల్స్, ఫొటోల ఎడిటింగ్ వరకు అన్నింటికీ అనువైన ఈ యాప్‌లు ఏమిటో చూద్దాం.



పెర్‌ప్లెక్సిటీ: వెబ్ ఇండెక్స్‌లను ఇది ఏఐ మోడల్స్‌తో ఇంటిగ్రేట్ చేస్తుంది. సంప్రదాయ సెర్చ్ ఇంజన్ల మాదిరిగా కాకుండా చాట్‌బోట్‌కు అవకాశం ఉంది. దాంతో నేచురల్ లాంగ్వేజ్‌లో ప్రశ్నలు అడిగి, సమాధానాలను రాబట్టుకోవచ్చు. దీనికోసం ఓపెన్ ఏఐకి చెంది జీపీటీ-3.5 సహకారం ఉంది. కచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తుంది. ఫలితంగా ప్రశ్నకు తగ్గ సమాధానాలను రాబట్టుకునే అస్కారం ఉంటుంది. గూగుల్, మైక్రోసాఫ్ట్‌కు భిన్నంగా ఉంటుంది. లింకులను డిస్‌ప్లే చేయదు. పోటీ ప్రపంచంలో యూనిక్ సమాధానం ఇచ్చే యత్నం చేస్తుంది.

చాట్‌సోనిక్: ఇదో సంభాషణలకు అవకాశం ఇచ్చే ఏఐ చాట్‌బోట్. చాట్ జీపీటీకి ఉన్న పరిమితులను ఇది అవకాశంగా మలుచుకుంది. లేటెస్ట్ డేటా ఆప్షన్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, మెషీన్ లెర్నింగ్, జీపీటీ-4, స్టేబుల్ డిఫ్యూజన్ వంటివన్నీ ఉపయోగించుకుంటుంది. టైప్ ఆఫ్ పర్సనాలిటీ, ఎనేబుల్ మెమెరీ వంటివి కూడా ఎంపిక చేసుకోవచ్చు. మొత్తమ్మీద రియల్ పర్సన్ సమాధానం ఇస్తున్న ఫీలింగ్‌ను కలిగిస్తుంది.

ఒట్టర్: ఏఐ పవర్డ్ వాయిస్ టు టెక్స్ట్ ట్రాన్స్‌క్రిప్షన్ టూల్ ఇది. మాట్లాడే పదాలను టెక్స్ట్‌కు అనువర్తించడం ద్వారా చదువకోవచ్చు, సులువుగా అర్థం చేసుకోవచ్చు. ఏఐ అల్గోరిథమ్ సహాయంతో ఇది టెక్స్ట్‌ని జనరేట్ చేస్తుంది. ఈ యాప్‌ని పలువిధాలుగా అంటే మొబైల్ యాప్ వెర్షన్‌గా కూడా ఉపయోగించుకోవచ్చు. సమావేశాలను రికార్డ్ చేసుకోవచ్చు. ఆడియో, వీడియో రూపంలో అప్‌లోడ్ చేస్తే మాటలు ట్రాన్స్‌క్రైబ్ అవుతాయి. ఒట్టర్ బాట్ ఉపయోగించి ఆడియో రికార్డింగ్, నోట్స్ రాసుకోవడం, యాక్షన్ ఐటెమ్స్ పట్టుకోవడం, సమ్మరీలను జనరేట్ చేయడం వరకు అన్నింటికి ఉపయోగకరంగా ఉంటుంది.

రెమిని: ఏఐ ఫీచర్లను గత ఏడాది జతచేసిన తరవాత ఈ యాప్ ట్రాక్‌లోకి వచ్చింది. ఇదో ఫొటో ఎడిటింగ్ యాప్. దీన్లోని జనరేటివ్ ఏఐ ఫీచర్‌తో ఫొటోలకు ప్రొఫెషనల్ లుకింగ్ తీసుకురావచ్చు. ముఖ్యంగా సీవీ, పోర్ట్ ఫోలియోలు, లింక్డిన్ కోసం ఇది బాగా ఉపయోగపడుతుంది. సెల్ఫీని అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది. మిగిలిన పనంతా యాప్ చూసుకుంటుంది. పాతవి, బ్లర్‌గా ఉన్నవి, స్క్రాచ్ ఫొటోలను కూడా మార్చగలదు. ఫొటోలను హెచ్‌డీలోకి మారుస్తుంది. మొత్తమ్మీద షేర్ చేసుకునేందుకు వీలుగా రూపొందిస్తుంది.

చాట్‌జీపీటీ: దీని గురించి ప్రత్యేకంగా చెప్పాల్సింది ఏమీ ఉండదు. ఇప్పటికే జనాదరణ పొందింది. ఇందులో ఏ ప్రశ్న అడిగినా జవాబు వస్తుంది. ఐఫోన్లలో ఏఐ ఆధారిత చాట్‌బోట్ ఉంటుంది. చాట్‌జీపీటీ సృష్టికర్త ఓపెన్ ఏఐకి చెందిన స్పీచ్ రికగ్నిషన్ సిస్టమ్‌తో వాయిస్ ఇన్‌పుట్‌కు సపోర్ట్ అందిస్తుంది. జీపీటీ-4తో అడ్వాన్స్‌డ్ ఫీచర్ల యాక్సెస్ కూడా ఉంటుంది.

గేమింగ్ యాప్‌లతో అలెర్ట్ ప్లీజ్

గేమింగ్ యాప్స్‌తో జరుగుతున్న మోసాలను గమనించిన కేంద్ర హోంమంత్రిత్వశాఖ దేశంలోని పౌరులకు అలెర్ట్ జారీ చేసింది. డివైజుల్లోని గేమింగ్ యాప్స్‌లో ముఖ్యంగా ఆన్‌లైన్ గేమింగ్ సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించింది. మినిస్ట్రీ సైబర్ వింగ్ 'ద ఇండియన్ సైబర్‌క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ప్రత్యేకించి 'ప్లే స్మార్ట్, ప్లే సేఫ్ - స్టే సెక్యూర్ వైల్ గేమింగ్ ఆన్‌లైన్' అంటూ కాషన్ మెసేజ్‌ని జారీచేసింది. అదే సందర్భంలో ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లను అథెంటిక్ సోర్సులు అంటే గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ స్టోర్ నుంచి మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలి. గేమ్ యాప్ పబ్లిషర్‌ని ఎప్పటికీ చెక్ చేసుకుంటూ ఉండాలి. వెబ్‌సైట్ లెజిటమసీ(చట్టబద్ధత)ను కూడా చెక్ చేసుకోవాలి. సబ్‌స్క్రిప్షన్ విషయంలో డిస్కౌంట్స్ తదితరాలంటూ ఇచ్చే ఆఫర్ల విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలి. అదే సమయంలో వ్యక్తిగత సమాచారాన్ని షేర్ చేసుకోరాదు. ప్లేయర్లను మోసపుచ్చే యత్నాలను స్కామర్లు చేస్తూనే ఉంటారు. వీరి విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలి. అవసరమైనంత వరకే అనుమతులు ఇవ్వాలి. మోసం జరిగినట్టు భావిస్తే, వెంటనే 1930కి డయల్ చేసి ఫిర్యాదు చేయాలి అని ఆ సూచనలో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పేర్కొంది. గత ఏడాది డిసెంబర్ 15 నాటికి 581 గేమింగ్ యాప్‌లను ప్రభుత్వం బ్లాక్ చేసింది. ఇంతకుమునుపే కొన్ని చట్టాలను చేయడమే కాకుండా, పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ తగు చర్యలను సైతం కేంద్ర హోం మంత్రిత్వశాఖ తీసుకుంటున్న విషయం విదితమే.

రిటైల్ ఫుడ్ వేస్టేజీని అరికట్టే 'టూ గుడ్ టు గో' యాప్

వినూత్నం



అటు వినియోగదారులకు చౌకగా అలాగే ఎక్స్‌పైరింగ్ ఐటెమ్స్‌ను సూపర్ మార్కెట్లు తొందరగా అమ్ముకునేందుకు వీలుగా అంటే ఉభయుల ప్రయోజనార్థం ఒక యాప్ వచ్చింది. అదే 'టూ గుడ్ టు గో యాప్'. రిటైల్ ఫుడ్ వేస్టేజీని సైతం దీంతో అరికట్టవచ్చు. ఎనిమిదేళ్ళ క్రితం ఆరంభమైన డానిష్ కంపెనీ ఒకటి ఈ యాప్‌ను తీసుకువచ్చింది. ఎక్స్‌పైరీ డేట్ దగ్గరలో ఉన్న వాటిని వినియోగదారులకు తెలియజేసేందుకు ఉద్దేశించిన ఏఐ ఆధారిత సొల్యూషన్ ఇది. సూపర్ మార్కెట్లకు సహాయపడేందుకు దీన్ని అభివృద్ధిపర్చారు. షార్ట్ కట్‌లో ఈ యాప్ పేరు టీజీటీజీ. ఇంటర్నేషనల్ సూపర్ మార్కెట్ చైన్ స్పార్(ఎస్‌పీఏఆర్)తో దీన్ని ఉనికిలోకి తీసుకు వస్తున్నారు. ఎక్స్‌పైరీ డేట్ అయిపోతున్న వస్తువుల గుర్తింపు, అవసరం ఉన్న వారికి సమాచారం చేరవేత, డిస్కౌంట్ పెంపు వంటి అంశాలను ఏఐతో ఇందులో పరిష్కరిస్తారు. 30 శాతం మేర ఆహార పదార్థాలు వృథా అవుతున్నాయన్నది ఐరాస అంచనా. ఆ వృథా ఎనిమిది నుంచి పది శాతం మేర గ్రీన్‌హౌస్ గ్యాస్ ఎమిషన్స్‌కు కారణమవుతోంది. ఈ నేపథ్యంలో ఒక సొల్యూషన్‌గా ఈ యాప్‌ను టీజీటీజీ అభివృద్ధిపర్చింది.

20 దేశీ భాషలకు ట్రాన్స్‌లేటర్ సపోర్ట్



మైక్రోసాఫ్ట్ ట్రాన్స్‌లేటర్ సపోర్ట్ తాజాగా మరో రెండు భారతీయ భాషలకు అందింది. చత్తీస్‌గఢి, మణిపురి భాషలకు లభించింది. ఈ రెంటితో కలిపి మొత్తం ఇరవై భారతీయ భాషలకు మైక్రోసాఫ్ట్ ట్రాన్స్‌లేటర్ సపోర్ట్ అందించినట్లయింది. తెలుగు, తమిళం సహా 18 భాషలకు ఇంతకుమునుపు నుంచే ఈ సదుపాయం ఉంది. దీంతో దేశంలో 95 శాతం ప్రజానీకానికి ట్రాన్స్‌లేటర్ వెసులుబాటు లభించింది. భారతీయ భాషలకు సంబంధించి తమ నిబద్ధతకు ఇది నిదర్శనమని ఈ సందర్భంలో మైక్రోసాఫ్ట్ పేర్కొంది. అజ్యూర్ ఏఐ ట్రాన్స్‌లేటర్ కేవలం కంప్యూటింగ్ అందుబాటుకే పరిమితం కాదని, మంచి విద్య, గవర్నెన్స్, కమ్యూనికేషన్, ఆర్థిక అభివృద్ధి, సంస్కృతి పరిరక్షణకు కూడా తోడ్పడుతుందని వివరించింది.



మైక్రోసాఫ్ట్ టీమ్స్ సులువుగా కంట్రోల్

మైక్రోసాఫ్ట్ ప్రత్యేకించి మైక్రోసాఫ్ట్ టీమ్స్‌పై వెబ్‌కామ్, ఆడియో కంట్రోల్‌ని యూజర్లు ఇకపై సులువుగా, సమర్థంగా ఉపయోగించుకునే వీలు కల్పించింది. ఈ విషయమై అప్డేట్‌ను మైక్రోసాఫ్ట్ ఒక బ్లాగ్ పోస్ట్‌లో ప్రకటించింది. తాజా అప్డేట్‌తో ఇకపై సమావేశాల్లో ఆడియో, వీడియో సెట్టింగ్‌లను సింగిల్ టచ్‌తో మేనేజ్ చేయవచ్చు. అందుకోసం...

- క్విక్ సెట్టింగ్స్ యాక్సెస్ కోసం డౌన్‌లోడ్ యారోని క్లిక్ చేయాలి. లేదా సమావేశం జరుగుతున్నప్పుడు మీటింగ్ టూల్ బార్‌పై ఉన్న మిక్ బటన్‌ను క్లిక్ చేయాలి.
- మోర్ వీడియో ఆప్షన్ లింక్ లేదా మోర్ ఆడియో ఆప్షన్ లింక్‌ని క్లిక్ చేయాలి.
- మీటింగ్ టూల్‌బార్‌పై మోర్ యాక్షన్స్ బటన్‌ని క్లిక్ చేయడం ద్వారా యాక్సెస్ పొందవచ్చు.
- తదుపరి ఆడియో సెట్టింగ్ లేదంటే వీడియో ఎఫెక్ట్స్ అండ్ సెట్టింగ్స్‌ను ఎంపిక చేసుకోవాలి.

టీమ్స్ పబ్లిక్ ప్రెవ్యూ లేదా మైక్రోసాఫ్ట్ 365 టార్గెటెడ్ రిలీజ్ మెంబర్ అయి ఉంటేనే ఈ యాక్సెస్ లభిస్తుంది. విండోస్ లేదంటే మేక్‌ఓఎస్‌లో క్విక్ సెట్టింగ్స్ ఉపయోగించుకునేందుకు న్యూటీమ్ క్లయింట్ అప్పుడే కాగలుగుతారు. మైక్రోసాఫ్ట్ టీమ్స్ అన్నింటికీ రాబోయే రోజుల్లో ఈ వెసులుబాటు రానుంది.

వాట్సాప్ నుంచి ఫైల్ షేరింగ్ ఫీచర్!



వాట్సాప్ త్వరలో ఫైల్ షేరింగ్ ఫీచర్‌ను పరిచయం చేయనుంది. ఐఫోన్‌లోని ఎయిర్‌డ్రాప్ మాదిరిగా ఇది పని చేయనుంది. గూగుల్ ప్లే స్టోర్‌లో దీన్ని బేటా టెస్టర్లు చూశారని డబ్ల్యుఎబేటాఇన్ఫో వెల్లడించింది. ఈ ఫీచర్‌తో చాలా స్వల్ప వ్యవధిలో ఫైల్స్‌ను వాట్సాప్ యూజర్లు షేర్ చేసుకోగలుగుతారు. ఇది కూడా ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్టెడ్ ఫీచర్‌గానే ఉంటుందని భావిస్తున్నారు. యూజర్ డేటా గుట్టు వెల్లడికాదు. వాట్సాప్‌నకు కూడా యాక్సెస్‌లో ఉండబోదు. అలా యూజర్ ఫైల్ భద్రత విషయంలో రాజీ ఉండదు. అదే సమయంలో చాలా వేగంగా ఫైల్ షేరింగ్‌కూ వీలుచిక్కుతుంది. ఇప్పటి వరకుకు షేరింగ్‌కు సంబంధించి హయ్యర్ స్టోరేజీ ఫైల్స్ ఇమేజ్ అలాగే వీడియో క్వాలిటీలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ కొత్త ఫీచర్‌తో వాటిని అధిగమించవచ్చు. వివిధ నివేదికల ప్రకారం కొత్త విధానంలో 'షేర్ ఫైల్స్ విత్ నియర్‌బై పీపుల్' ఆప్షన్‌ను ఓపెన్ చేసి ఫైల్స్ అందుకోవడం లేదా పంపుకోవడం చేయాలి. అలాగే ఉపయోగించడానికి ముందు డివైజ్‌ను అటూ ఇటూ కదపాల్సి ఉంటుంది. అయితే ఈ ఫీచర్ ఎలా పనిచేస్తుందనే విషయమై అధికారిక వివరణ ఏదీ లేదు. ఇంకా అభివృద్ధి దశలోనే ఉందని సమాచారం కూడా.

డేటా ట్రాకింగ్‌ను బ్లాక్ చేస్తున్న గూగుల్



గూగుల్ పెద్ద ఎత్తున కుకీస్‌ను బ్లాక్ చేస్తోంది. చాలా ఫీచర్లను విడుదల చేయడానికి ముందు ఈ పనిచేస్తోంది. ముప్పయ్‌మిలియన్ల క్రోమ్ యూజర్ల కుకీల పనిపడుతోంది. తద్వారా తన యూజర్లకు సంబంధించిన డేటా ట్రాకింగ్‌ను బ్లాక్ చేస్తోంది. ఇంతా చేస్తే ఇలా బ్లాకింగ్ అయింది గూగుల్ క్రోమ్ యూజర్లలో ఒక శాతానికే పరిమితం. అలాగే ఈ పని కొత్త కూడా కాదు. యాపిల్, మొజిల్లా ఇప్పటికే ఇలాంటి కుకీ-కిల్లర్ ఫీచర్లను జతచేసింది. ఒకరకంగా ఇది ప్రైవసీని పెంచే చర్యలు మొదటిది. వాస్తవానికి ఈ కుకీస్‌తో వివిధ వెబ్‌సైట్స్ యూజర్ ట్రెండ్‌ని తెలుసుకోగలుగుతాయి. అలా వారికి అవసరమైన అన్ని రకాల ప్రకటనలను అందుబాటులో ఉంచుతాయి. అదే సమయంలో యూజర్ లొకేషన్ కూడా ట్రాక్ చేసే వీలుంటుంది. కొత్త ఫీచర్ ఎలా పనిచేస్తుందంటే, 'బ్రౌజ్ విత్ మోర్ ప్రైవసీ' అవసరమా అని గూగుల్ అడుగుతుంది. రెస్పాండ్ అయిన యూజర్ల నుంచి 'పార్టిసిపెంట్స్ ఫర్ ట్రాకింగ్ ప్రొటక్షన్' కోసం ర్యాండమ్‌గా సెలెక్ట్ చేస్తుంది. ఎంపికైతే యూజర్‌ని నోటిఫై చేస్తుంది. యూజర్ కూడా కన్‌ఫర్మ్ చేయాల్సి ఉంటుంది. అప్పుడు ప్రైవసీ అండ్ సెక్యూరిటీ సెక్షన్‌లో కుకీలకు మల్టిపుల్ టోగెల్స్ కనిపిస్తాయి. టర్నింగ్ దెమ్ ఆన్ గుర్తు లేకుంటే గూగుల్ ట్రాకింగ్ పొటెక్షన్ ప్రోగ్రామ్‌లో బాగంగా చేసిందని తెలుసుకోవాలి. వ్యాపార సముదాయాలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు కొన్ని చర్యలు తీసుకుంటున్నట్టు గూగుల్ ఇప్పటికే బ్లాగ్‌లో తెలిపింది.

టీన్స్ సేఫ్టీకి మెటా చర్యలు

మెటా తన పరిధిలోని ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ఉపయోగించే యువత(టీన్స్) సేఫ్టీకి సంబంధించి పలు చర్యలనుతీసుకుంటోంది. అందులో భాగంగా డైరెక్ట్ మెసేజ్ సెట్టింగ్స్‌ను డిఫాల్ట్‌గా కట్టుదిట్టం చేస్తోంది. ప్రధానంగా అమెరికా, బ్రిటన్ తదితరాల్లో దేశాన్ని అనుసరించి 18 నుంచి 16 ఏళ్ళ లోపు పిల్లలకు కాంటాక్ట్ లేదా గ్రూపులో ఉన్న వ్యక్తుల నుంచి మాత్రమే డైరెక్ట్ మెసేజ్‌లు అందుతాయి. అంటే తెలియని వ్యక్తులు పంపే మెసేజ్‌లు వారికి చేరవు. గత ఏడాది మార్చిలోనే సూపర్విజన్ టూల్స్‌ని ఇన్‌స్టాగ్రామ్ జోడించింది. సక్రమంగా లేని ఇమేజ్‌లను టీన్స్ చూడకుండా ఉండేలా కూడా చర్యలను ఈ ఏడాది మొదట్లో ఆరంభించింది. రెండురోజుల నుంచే అపరిచితుల నుంచి మెసేజ్‌లు టీన్స్‌కు అందకుండా ఇన్‌స్టాగ్రామ్ కట్టడి చేసింది. ఇందుకోసం 'పేరెంటల్ సూపర్విజన్ టూల్స్' ద్వారా అప్రూవల్ తప్పనిసరి. ఈ ఫీచర్ విషయంలో మరిన్ని విషయాలను త్వరలో తెలియజేస్తామని మెటా ఈ సందర్భంలో తెలియజేసింది. అలాగే పొగాకు ఉత్పత్తులు, ఆయుధాలు, ఆల్కహాల్, కాంట్రాసెప్షన్, కాస్మొటిక్ ప్రొజీజరర్స్, వెయిట్ లాస్ ప్రోగ్రామ్స్ పై కూడా ఇన్‌స్టాగ్రామ్ ఆంక్షలు విధించింది. ప్రస్తుతం పాశ్చాత్య దేశాల్లో వీటన్నింటి అమలుకు శ్రీకారం చుట్టింది.

క్రోమ్ బ్రౌజర్‌కు ఎఐ పవర్డ్ ఫీచర్లు

క్రోమ్‌కు మూడు జనరేటెడ్ ఏఐ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) ఫీచర్లను అందుబాటులోకి వస్తున్నాయి. వి121 అప్డేట్‌తో రాబోయే రోజుల్లో అందిస్తోంది. మేక్, విండోస్ పీసీలకు క్రోమ్‌తో అందనున్నాయి. సర్కిల్ టు సెర్చ్ సహా పలు ఏఐ జనరేటెడ్ ఫీచరల్లను క్రోమ్‌కు గత వారం తీసుకువచ్చిన విషయం తెలిసిందే. తాజా అప్డేట్ విషయానికి వస్తే.

- మొదటిది ట్యాబ్ అర్గనైజర్. దీంతో క్రోమ్ ఆటోమేటిక్‌గా టాబ్ గ్రూపులను సజెస్ట్, క్రియేట్ చేస్తుంది. బ్రౌజర్‌లో ఓపెన్ అయ్యే అన్ని ట్యాబల ఆధారంగానే ఈ ప్రక్రియ ఉంటుంది. ఒకేసారి పలు టాస్కులను చక్కబెట్టే వ్యక్తులకు ఇది బాగా ఉపయోగపడతుంది. ట్రిప్ ప్లానింగ్, టాపిక్‌పై రీసెర్చ్, షాపింగ్ వంటివి ఒకేసారి చేసుకోవచ్చు. ఇందులో భాగంగానే చేసే పనికి పేరు, ఎమోజీని సూచిస్తుంది. ఫలితంగా మరోసారి అవే కావాలని అనుకున్నప్పుడు వాటని పట్టుకోవడం యూజర్‌కు తేలికగా ఉంటుంది.
- రెండోది పిక్సెల్ 8 సిరీస్‌లో ఇప్పటికే అందుబాటులోకి వచ్చింది. టెక్స్ట్ టు ఇమేజ్ డిఫ్యూజన్ మోడల్ ఇది. కస్టమ్ వాల్ పేపర్‌ను క్రియేట్ చేసుకునేందుకు ఇది వీలు కల్పిస్తుంది. చాలా వేగంగా కస్టమ్ థీమ్స్‌ను జనరేట్ చేసుకోవచ్చు. సబ్జెక్టు, మూడ్, విజువల్ స్టయిల్, కలర్‌ని టైప్ చేస్తే సరిపోతుంది. ఈ విషయంలో బెస్ట్ రిజల్టును గూగుల్ క్రోమ్ అందిస్తుంది.
- మూడోది జనరేటివ్ ఏఐ. అత్యున్నతంగా తీర్చిదిద్దిన మెసేజ్ రూపకల్పనకు ఇది తోడ్పడుతుంది. అలాగే హోటల్ లేదంటే ఒక టూరిస్టు ప్లేస్‌పై రెవ్యూ రాయడంలో సహకరిస్తుంది. వ్యాకరణ దోషాలు, చిన్నపాటి తప్పులు కూడా లేకుండా అంటే ఎర్రర్ ఫ్రీగా రాసుకునేందుకు ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. ఇందుకోసం మొదట టెక్స్ట్ బాక్స్‌పై కుడివైపు క్లిక్ చేయాలి. విజిట్ చేసిన ప్రాంతంపై కూడా అదీ క్రోమ్‌పై క్లిక్ చేయవచ్చు. అక్కడ 'హెల్ప్ మి రైట్'ని సెలెక్ట్ చేసుకోవాలి. కొన్ని పదాలను టైప్ చేయడం మొదాలుపెట్టగానే ఎఐ తోడై తన పని చేసుకుంటుంది. మొత్తమ్మీద ఆర్టికల్ చాలా బాగా వచ్చేందుకు ఈ ఫీచర్ సహాయకారిగా ఉంటుంది.

బెస్ట్ పవర్ బ్యాంక్స్



ఒంటరిగా ఒక్క అడుగు వేయలేని రోజులు. అనుక్షణం కనెక్ట్ అయి ఉండాల్సిందే. ప్రతి నిమిషం అమ్మ తమే. ఈ నేపథ్యంలో డిజిటల్ కనెక్టివిటీకి ఉన్న ప్రాధాన్యం తెలిసిందే. అది సక్రమంగా ఉండాలంటే పవర్ బ్యాకింగ్ కూడా చాలా అవసరమే. ఎక్కడ, ఏ పరిస్థితుల్లో ఉన్న మన డివైజ్‌ని బ్యాటరీకి అనుసంధానం చేసి సేఫ్ ప్లేస్‌లో ఉండొచ్చు. ఈ పరిస్థితుల్లో బెస్ట్ పవర్ బ్యాంక్స్ ఏవంటే...

షావోమీ ఎంఐ పవర్ బ్యాంక్ 3ఐ(20000ఎంఏహెచ్): దీన్లో 20000ఎంఏహెచ్ లిథియం పాలిమర్ బ్యాటరీ, 18 వాట్స్ ఫాస్ట్ పవర్ డెలివరీ చార్జింగ్ కేపబిలిటీతో ఉంది. ట్రిపుల్ పోర్ట్ ఔట్‌పుట్, డ్యూయల్ ఇన్‌పుట్ పోర్ట్స్(మైక్రో - యూఎస్‌బీ/ యూఎస్‌బీ-సి) సౌకర్యం ఉంది. దీంతో వేర్వేరు డివైజ్‌లతో చార్జింగ్‌కు వీలవుతుంది. చార్జింగ్ సమయం సాపేక్షంగా 6.9 గంటలు కాగా యూజర్లకు మూవింగ్‌లో సౌలభ్యంగా ఉంటుంది. అడ్వాన్స్‌డ్ 12-లేయర్ చిప్ ప్రొటెక్షన్, స్మార్ట్ పవర్ మేనేజ్‌మెంట్‌తో బ్యాటరీ సామర్థ్యాన్ని పెంచుతాయి. అలాగే ఈ బ్యాటరీకి షావోమీ ఆరు నెలల గ్యారంటీ కూడా ఇచ్చింది.

షావోమీ ఎంఐ పవర్ బ్యాంక్ (10000ఎంఏహెచ్): ఇది లిథియం ఐయాన్, లిథియం పాలిమర్ బ్యాటరీ ఇది. 22.5 వాట్స్ అల్ట్రా - ఫాస్ట్ చార్జింగ్ సదుపాయం ఉంది. సూపర్ లైట్ వెయిట్, పాకెట్ సైజ్‌లో ఉన్నందున పోర్టబిలిటీ సులువుగా. పవర్ డెలివరీ 3.0. వేగంగా చార్జింగ్‌కు ఇది ఉపయోగపడుతుంది. చార్జింగ్ సమయం ఆరు గంటలు. కెపాసిటీ, సైజ్ మధ్య సమతూకం ఉంటుంది.

స్క్రైజెన్ 20000ఎంఏహెచ్ పవర్ బ్యాంక్: ఇది కూడా 20000ఎంఏహెచ్ పవర్ బ్యాంక్‌తో వచ్చింది. 30 వాట్స్ చార్జింగ్ సామర్థ్యం దీనికి ఉంది. కెపాసిటీ విషయానికి వస్తే, ఐఫోన్ అయిదు రెట్లు అనుకుంటే గెలాక్సీ ఎస్23 మూడు రెట్లు. రెండు యూఎస్‌బీ-సి పోర్టులతో 30 వాట్స్, యూఎస్‌బీ-ఎ తో 22.5 వాట్స్ డెలివర్ అవుతుంది. ఈ బ్యాటరీ పదకొండు సేఫ్టీ టెస్టుల్లో పాసైంది.

అర్బన్ నానో పవర్ బ్యాంక్(10000ఎంఏహెచ్): దీని ఫాస్ట్ చార్జింగ్ సామర్థ్యం 22.5 వాట్స్. కెపాసిటీ, సైజ్ మధ్య సమతూకం ఉంది. ఇండియాలోనే దీని డిజైన్, ఉత్పత్తి జరిగాయి. దీని బరువు 178 గ్రాములు. 3000ఎంఏహెచ్ బ్యాటరీ 2.4 రెట్లు, 4000ఎంఏహెచ్ బ్యాటరీ 1.8 రెట్లు చార్జ్ అవుతుంది. డ్యూయల్ ఇన్‌పుట్ పోర్ట్స్ సపోర్ట్‌తో చార్జింగ్ వేగంగా ఉంటుంది.

అంబ్రేన్ మినీ పవర్ బ్యాంక్(20000ఎంఏహెచ్): లిథియం పాలిమర్ బ్యాటరీ ఇది. 22.5 వాట్స్ ఔట్‌పుట్‌కుతోడు దీని పవర్ డెలివరీ టెక్నాలజీ కారణంగా చార్జింగ్ వేగంగా జరుగుతుంది. ఒకేసారి మూడు డివైజ్‌లకు చార్జింగ్‌కు వీలవుతుంది. మాన్యుఫాక్చరింగ్ డిఫెక్ట్స్‌కు మూడు నెలల వారెంటీ కూడా ఉంది.

